# 1 పూర్వ బాల్యదశ సంరక్షణ విద్య
## నిర్వచనము, స్వభావం మరియు ప్రాముఖ్యత

**Children must be taught how to think, not what to think**

***- Mahatma Gandhi***

పిల్లల మనస్సు కోమలమైనది.
నీలాకాశపు పందిరి కింద
ఎండా - నీడా ఆడుకొనే చోట
వారిని మనసారా ఆడుకోనివ్వండి.
గంతులు వేయనివ్వండి.
ప్రకృతి ఒడి నుంచి వారిని లాక్కోకండి
ఈ సుఖం నుంచి వారిన వేరు చేయకండి.

- రవీంద్రనాథ్ ఠాగూర్

**లక్ష్యాలు :**

1. పూర్వ బాల్యదశ సంరక్షణ విద్య (ECCE) యొక్క స్వభావం,లక్ష్యాలను విద్యార్థులకు తెలియజేయుట.
2. ECCE పై వివిధ విద్యా కమిటీలు మరియు కమీషన్‌ల సూచనలను తెలియజేయుట.
3. పూర్వ ప్రాథమిక విద్య యొక్క ముఖ్యలక్షణాలను తెలియజేయుట.
4. పూర్వబాల్యదశ సంరక్షణ విద్యపై వివిధ తత్వవేత్తల, విద్యావేత్తల యొక్క అభిప్రాయాలను తెలియచేయుట.
5. ప్రభుత్వ, స్వచ్ఛంద మరియు వివిధ యాజమాన్యాల క్రింద ప్రస్తుతం నడుపబడుచున్న ECCE కేంద్రాల నిర్వహణ తీరుపై సమగ్ర పరిశీలన.

**ఉపశీర్షికలు:**

1.1 పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య స్వభావం,తత్వవేత్తలు మరియు వివిధ విద్యా తత్వవేత్తల అభిప్రాయాలు

ఎ) జాన్ డ్యూయి

బి) ఠాగూర్

సి) రూసో

డి) ఫ్రోబెల్

ఇ) మాంటిస్సోరి

ఎఫ్) గాంధీ

1.2 ECCE విద్యాప్రణాళిక నిర్వచనము, లక్ష్యాలు, ప్రాముఖ్యం

1.3 జీవితకాల అభ్యసన మరియు అభివృద్ధిలో ECCE పాత్రను కీలకమైనదిగా గుర్తించుట.

1.4 ECCE ని 8 సంవత్సరముల వయస్సు వరకు పొడిగించుటలోగల ఔచిత్యము.

1.5 పాఠశాల ప్రారంభ అభ్యసనంలో పిల్లలు ఎదుర్కొనే సవాళ్ళు – సంసిద్ధత.

1.6 ప్రభుత్వ, స్వచ్ఛంద మరియు ప్రైవేటు యాజమాన్యంలో ECCE కేంద్రాల నిర్వహణ సమీక్ష, విమర్శనాత్మక పరిశీలన.

**పరిచయం:**

పిల్లల పూర్వ బాల్యదశ అత్యంత కీలకమైనదని, ఈ దశలోని పిల్లలలో అభివృద్ధి వేగంగా ఉండి వారిలో సమగ్ర అభివృద్ధి అత్యధికంగా (సుమారుగా 90 శాతం వరకు) జరుగుతుందని ప్రపంచవ్యాప్తంగా అందరు విద్యావేత్తలు గుర్తించారు. ఒకవేళ ఈ దశలో పిల్లల కుటుంబ పరిస్థితులు లేదా మరే ఇతర కారణాల వల్ల పరిసరాలతో సక్రమంగా ప్రేరేపించబడకపోతే వారిలోని పెరుగుదల కూడా అంతే వేగంగా తగ్గుతుందని నిరూపించబడింది. అందుకే పూర్వబాల్యదశ లోని పిల్లలకు ఆటలు, పాటలు, సృజనాత్మక కృత్యాలు మొదలైన కార్యక్రమాల ద్వారా పరిసరాలతో సహసంబంధం కల్పించి వారిని పాఠశాల విద్యకు సన్నద్ధులను చేయాలి. అంతేకాకుండా జీవితాంత అభ్యసనమునకు పూర్వబాల్య దశ సంరక్షణ మరియు విద్య ద్వారా వీలు కల్గించగలగాలి. సమీకృత కార్యక్రమాల ద్వారా పిల్లల్లో గర్భస్థస్థాయి నుండి 6 సం॥ల వయస్సు వరకు పిల్లల సమగ్ర అభివృద్ధి కొరకు ఉద్దేశించబడిన కార్యక్రమమే పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య (ECCE). ఈ దశ అత్యంత కీలకమైనది. ఈ కాలాన్ని పిల్లలు Survival and thriving in life గా పరిగణిస్తాము (జీవించటం మరియు పెరగటం). పిల్లల ఆలోచనలను అర్థం చేసుకొనటానికి వారికి ఆటలు, పాటలు, ఫజిల్స్, గణిత ప్రాథమిక భావనలను పరిచయం చేయడానికి ECCE ద్వారానే వీలవుతుంది. పిల్లల్లో శారీరక, మానసిక పెరుగుదల వేగంగా ఉండడం వల్ల వారిలోని అంతర్గత శక్తులను వెలికితీయడానికి అవసరమైన శ్రద్ధ కనబరిస్తే అది వారి భవిష్యత్తు మీద మంచి ప్రభావం చూపిస్తుందని విద్యావేత్తలు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

***భారత 11వ ప్రణాళిక సంఘం ఈ దశను పిల్లల జీవితాంత అభివృద్ధికి పునాది దశగా పేర్కొని ఈ దశలో ప్రతి పిల్లవానికి పూర్వబాల్యదశ విద్యను అందించాలని తెలిపింది.***

గర్భస్థ స్థాయినుంచి పిల్లలకు 6 సం॥ల వయస్సు వచ్చువరకు ఉండే దశ పూర్వబాల్యదశ. పిల్లల సంపూర్ణ అభ్యసనము మరియు అభివృద్ధికి ఈ దశలోనే పునాది ఏర్పడుతుంది. ఇంకా చెప్పాలంటే ఈ దశలోని పిల్లల్లో జ్ఞానాత్మక (cognitive), భౌతిక, సాంఘిక, భావోద్వేగ నైపుణ్యాలలో ఏర్పడే పునాది వారు జీవితాంతం అభ్యసనం సాధించటానికి ఉపయోగపడుతుంది.

> *If the superstructure is not to totter the foundation must be laid well.*
> *ఆకాశహర్మ్యాలు కదలకుండా ఉండాలంటే నిర్మాణపు పునాదులు గట్టిగా వేయాలి.*
> **– *Commenius lougage***

ఈ దశలో వికాసం ఎంతో వేగంగా ఉంటుంది. అందుకే పిల్లల పూర్తి సామర్థ్యాలను వెలికి తీసి వికసింపచేయడానికి అవసరమైన ప్రేరణ కలిగించే పరిసరాలను అందించి వారి భావి జీవిత సమగ్ర అభివృద్ధికి వీలు కలిగించేలా చర్యలు, కార్యక్రమాలు ఉండాలి. అందుకు పూర్వబాల్యదశ సంరక్షణ విద్య అవకాశాలు కల్పిస్తుంది. ECCE కల్పించే అవకాశాలను మరియు దాని తాత్వికతను తెలుసుకోవాలంటే దాని స్వభావాన్ని తెలుసుకోవాలి.

3D5Y1J

## 1.1 ECCE స్వభావము(Nature of ECCE):

ఈ దశలో రెండు ప్రధానాంశాలున్నాయి. అవి (1) సంరక్షణ, (2) విద్య 'సంరక్షణ' అనేది సమగ్రమైనది. ఇందులో పౌష్టికారాహారం, రోగనిరోధక టీకా, సురక్షిత భద్రత, ఆరోగ్య అలవాట్లు ఉంటాయి.

'విద్య' అనే రెండవ భాగంలో 3 సం॥ల నుంచి 6 సం॥ల వయస్సు వరకు వివిధ కృత్యాలద్వారా అభ్యసన ఉంటుంది.

### i) National Curriculum Framework - 2005 (NCF 2005)

ECCE విద్యాప్రణాళికలో ఆటలు, కృత్యాలకు ప్రాధాన్యత ఉండాలని పేర్కొంది.

### ii) National Plan of Action for Children 2005

పిల్లలకు 3సం॥ల వయస్సు నిండువరకు రక్షణ మరియు జాగ్రత్తలు తీసుకుంటూ అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని, 3 సం॥ల నుండి 6 సం॥ల వయస్సు వరకు రక్షణ, అభివృద్ధితోపాటు అభ్యసనమునకు అవకాశాలు కల్పించాలని తెలిపింది.

iii) **బాలల హక్కులు**

- జీవించే హక్కు (జీవించడం, ఆరోగ్యం, పౌష్టికాహారం, పేరు, జాతీయతను పొందిఉండే హక్కు)
- అభివృద్ధి చెందే హక్కు (విద్యా హక్కు, సంరక్షణ, విశ్రాంతి, ఉల్లాసంగా ఉండే హక్కు)
- రక్షణ పొందే హక్కు (వంచన, హీనత, నిర్లక్ష్యాల నుంచి రక్షణ పొందే హక్కు)
- పాల్గొనే హక్కు (భావాలను వ్యక్తపరచడం, సమాచారం పొందడం, ఆలోచించడం, మతపరంగా పాల్గొనే హక్కు

3SNT2V

పిల్లల అభివృద్ధి మరియు అభ్యసనములు అనేవి సమీకృతంగా జరుగుతాయనే ప్రాథమిక సూత్రం ఆధారంగా ECCE రూపొందించబడింది.

**పిల్లల అభివృద్ధి మరియు అభ్యసనములు సమీకృతంగా జరుగుతాయనే దానిని నీవు ఏకీభవిస్తావా?**


1. ECCE కార్యక్రమము పుట్టుక నుండి 6 సం॥ల వయస్సు వచ్చు వరకు కొనసాగుతుంది.
2. ఇది విద్యార్థి కేంద్రీకృతమైనది. ఆటలు / కృత్యాలకు ప్రాధాన్యత ఎక్కువ.
3. అంతర్గత శక్తులను వెలికితీయడానికి అవసరమైన అవకాశాలను కల్పిస్తే అది వారి భవిష్యత్తుమీద మంచి ప్రభావం చూపిస్తుంది.
4. ఇది పిల్లల సమగ్ర అభివృద్ధికి ఉద్దేశించబడింది. ఇందులో ఆరోగ్య రక్షణ, రోగ నిరోధకశక్తి పెంపుదల, పౌష్టికాహారం, ఆరోగ్య అలవాట్లు మరియు విద్య అందించబడతాయి.
5. పిల్లలు పరిసరాలచే ప్రేరేపించబడుతూ వారిలో భాష, భావోద్వేగం, భౌతిక మరియు సాంఘిక అభివృద్ధికి వీలు కలుగుతుంది.
6. పిల్లల స్వయం నియంత్రణ మరియు అంతర్గత క్రమశిక్షణను పెంపొందించేదిగా ఉంటుంది.
7. పరిసరాలతో సంబంధాలను, సామూహిక పనుల్లో భాగస్వామ్యాలను మరియు ఎదురయ్యే సమస్యలను సులువుగా పరిష్కరించటానికి దోహదపడుతుంది.

**"పిల్లలు మాట్లాడకుండా, కదలకుండా ఉండలేరు. వారు ఎప్పుడూ కదలడానికి, మాట్లాడడానికి ప్రయత్నిస్తూ ఉంటారు."** **– ప్లేటో**

ప్రాథమికంగా పిల్లలు ఎంతో ఉత్సుకతతో ఉంటారు.


అందుకు వివిధ రకాల ప్రయత్నాలు నిర్వహించడం ద్వారా వారిలోని సృజనాత్మకతను వెలికి తీయగలము.

ECCE లో అమలవుతున్న వివిధ రకాల కార్యక్రమాల ద్వారా దాని స్వభావాన్ని క్రింది విధంగా వివరించగలము.




**పూర్వ బాల్యదశ సంరక్షణ విద్య**

**ECCE స్వభావం**




ఎంతోమంది విద్యా తత్వవేత్తలు ECCE గురించి ఎంతో కృషి చేసారు. వారి అభిప్రాయాలను, భావాలను పరిశీలిద్దాం.

## ECCE స్వభావం – తాత్విక ఆధారాలు (Nature and Philosophy of ECCE)

### 1.1.1 రూసో (జీన్ జాక్వస్ రూసో) (1712–1778):

**పరిచయం:**

రూసో జెనీవాలో జూన్ 28న జన్మించాడు. ఫ్రెంచ్ దేశంలో రాజకీయ తత్వవేత్తగా, విద్యావేత్తగా పేరు సంపాదించాడు. ఇతని యొక్క విద్యా తత్వాన్ని 'Naturalism'(సహజత్వం) గా పిలుస్తారు. విద్యపై అతడు రాసిన "ఎమిలి" అనే పుస్తకం ప్లాటో రచించిన "రిపబ్లిక్" తర్వాత ఎంతో ప్రాముఖ్యతను సంపాదించింది. సమాజంలోని అన్ని రుగ్మతలకు, బాధలకు ముఖ్యకారణం ప్రకృతిని విస్మరించడమే. అందుకే ఇతడు 'Return to Nature' అనేదే మానవులను వీటి నుండి రక్షించగలదని పేర్కొన్నాడు. రూసో అభిప్రాయంలో విద్య అంటే పిల్లల అవయవాలు

మరియు శక్తులు సహజసిద్ధంగా వృద్ధిచెందడమే. అందుకే పిల్లల యొక్క సహజ అవసరాలను గుర్తించకుండా వారికి ఉపయుక్తమైన విద్యను అందించలేము.

## రూసో – పూర్వ ప్రాథమిక విద్య

రూసో తన గ్రంథమైన ఎమిలిలో పూర్వ ప్రాథమిక విద్యపై తన అభిప్రాయాలను వ్యక్తపరిచాడు. ఎమిలోని 5 భాగాలలో 3 భాగాలు బాల్యదశ (Childhood) గురించే చర్చించాడు. మొదటిభాగంలో శిశువిద్య, రెండవభాగంలో బాల్యదశ, 3వ భాగంలో పూర్వ కౌమారదశ (Pre Adolscence) 4వ భాగంలో కౌమారదశ (Adolscence), 5వ భాగంలో బాలికల విద్యపై చర్చించాడు.

i) **విద్యాతత్వం :**

దేవుడు అన్నింటిని మంచిగా సృష్టించాడు. "సేద్యం ద్వారా మొక్కలు సంరక్షించబడి పెరుగుతాయి, అలాగే విద్య ద్వారా మానవుడు అభివృద్ధిని సాధిస్తాడు". సాంప్రదాయ విద్యావిధానానికి రూసో పూర్తిగా వ్యతిరేకి. శిశువులోని అంతర్గత శక్తులను అభివృద్ధి పరచడమే విద్య. విద్య జీవితాంతం జరిగే నిరంతర ప్రక్రియ. విద్యార్థి ప్రకృతితో, పరిసరాలతో సంబంధం పెంచుకుంటాడు. తనకు తానుగా తన గురించి తెలుసుకుంటాడు. ఇంద్రియాలు, అవయవాలు, నైపుణ్యంగా పనిచేయడానికి విద్య సహకరిస్తుంది. శిశువుని సహజసిద్ధంగా పెంచాలి. అప్పుడే స్వతసిద్ధమైన పెరుగుదల, సహజమైన విజ్ఞానం అతడికి లభిస్తాయి.

ii) **విద్య:**

శిశువులోని అంతర్గత శక్తులను అభివృద్ధిపరచడమే విద్య. అనగా ప్రకృతిసిద్ధమైన వ్యక్తిని ప్రకృతిలోనే పెంపొందిచాలన్నదే రూసో ఆశయం.

iii) **రూసో విద్యాలక్ష్యాలు:**

1. శారీరక అభివృద్ధి జరిగేలా
2. ఇంద్రియాలకు శిక్షణ ఇచ్చేదిగా
3. సహజాతాలకు అనుగుణంగా
4. పరిసరాలపై అవగాహన పెంచేదిగా
5. సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక విలువల సముపార్జన జరిగేదిగా విద్యాలక్ష్యాలుండాలి.

రూసో తన పూర్వ ప్రాథమిక విద్యలో క్రీడాపద్ధతికి, ప్రయోగాలకు, ఇంద్రియాలకు శిక్షణ ఇచ్చేదిగా, శిశు కేంద్రీకృత విద్య అన్వేషణ పద్ధతిలో ఉండాలని పేర్కొన్నారు.

రూసో తన 'Emile' గ్రంథంలో విద్యావిధానం ఇలా ఉండాలని చెప్పాడు.

1. కృత్యాధారంగా ఉండాలి.
2. సాంప్రదాయ పద్ధతులకు దూరంగా ఉంటూ, పిల్లలకు సహజసిద్ధమైన పరిసరాలలో అవసరమైన అవకాశాలు కల్పిస్తూ ఉండాలి.
3. చేయడం ద్వారా అభ్యసనం (Learning by doing) కు ప్రాధాన్యతను ఇవ్వాలి.
4. పూర్వ ప్రాథమిక విద్యలో విషయావగాహనకు ప్రాధాన్యతనివ్వాలి.

పూర్వ బాల్యదశ విద్యలో పిల్లలు శారీరక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూనే వారి పంచేంద్రియాలకు పనికల్పించేలా పరిసరాలలో సహసంబంధాన్ని ఏర్పరచాలి. పూర్తి స్వేచ్ఛా వాతావరణంలో వ్యక్తిగత, సామూహిక కృత్యాల ద్వారా ఒకవైపు విలువలను నేర్పుతూనే మరియొక వైపు విభిన్న విషయాలపట్ల అవకాశాలను పూర్వ బాల్యదశలో పిల్లల్లో కల్పించాలని రూసో భావించాడు.

iv) **విద్యా ప్రణాళిక:**

శిశువు మానసిక పరిస్థితిని అనుసరించి జరగాలి. వారి అవసరాలను అభిరుచులకూ అనుగుణంగా అతణ్ణి ప్రకృతితో సమన్వయపరుస్తూ జరగాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థి మానసికస్థితి ఆధారంగా పాఠ్యప్రణాళిక ఉండాలనుకున్నారు. దీన్ని నాలుగు దశలుగా విభజించారు.

1) శైశవ దశ, 2) బాల్యం, 3) కౌమారదశ 4) యవ్వనదశ

v) **బోధనా పద్ధతి:**

1. వ్యక్తిగత బోధనకు ప్రాముఖ్యతను ఇచ్చాడు.
2. పనిచేయడం ద్వారా నేర్చుకోవడం.
3. ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకోవడం మంచిదన్నాడు.

### 1.1.2 ఫ్రెడరిక్ ఆగస్ట్ ఫ్రోబెల్ (1782–1852)

**పరిచయం:**

ఫ్రోబెల్ కిండర్‌గార్టెన్ పాఠశాల సృష్టికర్త. తన విద్యావిధానంలో విద్యాపరమైన ఆట వస్తువులను ఫ్రోబెల్ బహుమతులుగా (Frobel Gifts) అభివృద్ధి చేసాడు. ఇతడు జర్మనీ దేశంలో జన్మించాడు.

1805వ సంవత్సరంలో జర్మనీలో ఒక పాఠశాలలో పనిచేస్తూ జాన్ హెన్రిక్ ఫెస్టాలజీ గ్రంథాలను చదివి అతనిపట్ల ఆకర్షితుడయ్యాడు. తర్వాత ఫెస్టాలజీతో కలసి స్విట్జర్లాండ్‌లో పని చేశాడు. ఆ సమయంలోనే విద్యపై తనకున్న ఆలోచనలను ఫెస్టాలజీతో కలసి పంచుకున్నాడు.

1816 లో ఫ్రోబెల్ కిండర్‌గార్టెన్ పాఠశాలను స్థాపించి 'Play and Artwork' నిర్వహిస్తూ అందరి మన్ననలను పొందాడు. 1826వ సంవత్సరంలో 'The Education of the Man'అనే పుస్తకాన్ని ప్రచురించి దానిలో పూర్వప్రాథమిక విద్య గురించి చర్చించాడు.

1837వ సంవత్సరంలో 'Care playing and activity' అనే విద్యాసంస్థను తన ఆలోచనలకు అనుగుణంగా స్థాపించి అందరిచే గుర్తించబడ్డాడు.

**ఫ్రోబెల్ – పూర్వ ప్రాథమిక విద్య:**

ఫ్రోబెల్ తయారుచేసిన విద్యాపరమైన ఆటవస్తువులే ఫ్రోబెల్ గిఫ్ట్‌లుగా పిలువబడ్డాయి. పాటలు పాడడం, నృత్యాలు, మొక్కల పెంపకం, కృత్యాల నిర్వహణ, ఆటలు ఇతని కిండర్‌గార్టెన్‌లో కనిపిస్తాయి.

**i) ఫ్రోబెల్ విద్యాతత్వం:**

జీవిత పరిణామప్రక్రియలో సంపూర్ణతను సాధించటానికి ఉన్న అవకాశాలలో విద్య ఒకటి. ఇది క్రియాత్మకమైన

సాధనము. ప్రతి మానవుడు కొన్ని ప్రత్యేకతలను కల్గిఉంటాడు. అందువల్ల ఒకేవిధమైన బోధనావైఖరి అందరికీ ఆమోదయోగ్యం కాదు. సంపూర్ణమైన అభివృద్ధి కావాలంటే అనుకరణ లేనటువంటి సహజమైన స్వయంక్రియాశీలత కావాలి. వ్యక్తి అభివృద్ధిచెందాలంటే అతడిలో శారీరక, నైతిక విద్యారీతులతో కూడిన స్వభావాన్ని మనం గుర్తించగలగాలి.

మనసు, శరీరం, ఆత్మ వేర్వేరు కాదు, ఇవి మూడు ఒకటే. వీటి అభివృద్ధి విద్య ద్వారానే జరుగుతుంది.

**ii) విద్య:** సంపూర్ణ వికాసాన్ని సాధించడమే విద్య. విద్య వికాస సాధనంగా వుండాలి.

**iii) ఫ్రోబెల్ విద్యాలక్ష్యాలు:**

1. బాలల విద్య అభివృద్ధికి మూలం కావాలి. వ్యక్తి జీవితాన్ని విస్తృతపరచడానికి, ప్రకృతితో అతడి సంబంధాన్ని గ్రహించడానికి, సాంఘిక క్రియాశీలతకు విద్య మూలం కావాలి.
2. నిజమైన అభ్యసనకు ఆటలే ప్రధానం.
3. ఫ్రోబెల్ కిండర్‌గార్టెన్ పాఠశాల మొట్టమొదటిగా వ్యవస్థీకరించబడిన పూర్వబాల్యదశ విద్యాసంస్థ. కిండర్‌గార్టెన్‌లో ఫ్రోబెల్ జీవిత మరియు ఆధ్యాత్మిక సంబంధంతో అభ్యసనమును కొనసాగించాడు.
4. 'Childhood' అనేది కౌమారదశను తయారుచేయడానికి ఉండే దశకాదు. బాల్యదశ ఎంతో విలువైనది. అది ఒక ప్రత్యేకతను కల్గి ఉండే దశ.
5. 'Childhood' దశలో ఆటలు మరియు కృత్యాలకు ప్రాధాన్యత ఉండాలి.
6. స్వేచ్ఛా వాతావరణంలో పిల్లలకు విద్యాబోధన జరగాలి. స్వేచ్ఛ అంటే మానవుడు తనకు తాను తయారు చేసుకున్న సూత్రాలకు కట్టుబడి ఉండడమే.
7. పూర్వ బాల్య దశలో పాటలు, ఆటలు, అనుకరణల ద్వారా పిల్లలో భావ నిర్మాణం జరగాలి.
8. ఉపాధ్యాయుడు పిల్లలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తూ, వారికి సంరక్షణ మరియు భద్రత కల్పిస్తూ ప్రకృతిసూత్రాల ఆధారంగా వారి అభివృద్ధికి సహకరించాలి.
9. ఫ్రోబెల్ మాటలతో 'The True method of Education' బాలలలోని అన్ని అవయవాల సమిష్టి కృషి ద్వారానే సాధ్యమౌతుంది.

**iv) విద్యాప్రణాళిక**

ఫ్రోబెల్ కిండర్‌గార్టెన్‌లో విద్యావ్యాసంగానికి అవసరమైన విద్య ప్రణాళికను రూపొందించాడు. ఇతని విద్యా ప్రణాళికలో అంశాలు:

- సామాన్య విజ్ఞాన శాస్త్రాలు, గణితం
- భాషా సాహిత్యం.
- మతం, మతబోధన
- కళ, కళలకు సంబంధించిన వస్తువులు

విద్యార్థి ఏయే అంశాలలో ప్రావీణ్యం సాధించాలనేది కాకుండా ఆ అంశాల బోధన వలన సంపూర్ణ మానవుడిగా అభివృద్ధి సాధించాలన్నదే కిండర్‌గార్టెన్ ప్రధాన లక్ష్యమని ఫ్రోబెల్ భావించాడు.

**v) బోధనా పద్ధతులు:**

ఆట ఆసరాగా చేసుకొని విద్యాబోధన జరపాలని భావించారు. క్రీడలు వారిలోని భావాలను ఆలోచనలను రేకెత్తిస్తాయి. అందువల్ల క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

Frobel ఒక ఆధ్యాత్మిక వాది అంతకు మంచి ఆదర్శవాది కూడా. అతని దృష్టిలో ప్రపంచంలోని అన్ని వస్తువులకు విషయాలకు మూలం భగవంతుడే. మన కంటికి కనిపించే వస్తువులు వేరువేరుగా ఉన్నప్పటికీ వాటిలో విషయం ఒక్కటే. అందుకే అతడు తన విద్యాప్రణాళికలో భాష, కళలు, పరిసరాలతోపాటుగా మత బోధనకు కూడా కిండర్ గార్డెన్‌లో ప్రాధాన్యమిస్తాడు. కిండర్‌గార్డెన్‌ను ప్రోబెల్ సమాజానికి ఒక నమూనాగా పేర్కొన్నాడు. ఇక్కడ ప్రతి పిల్లవాడు తన వ్యక్తిత్వాన్ని తానే నిర్మించుకుంటాడు. పిల్లల సాంఘిక అభివృద్ధికి ఇక్కడే పునాది ఏర్పడుతుంది. కిండర్ గార్డెన్‌లో పిల్లలకు కల్పించబడుతున్న స్వేచ్ఛ, భావవ్యక్తీకరణకు పాల్గొనేలా చేయడం, ఆటలకు పాటలకు అవకాశం ఇవ్వడం మొదలైన అంశాల వల్ల పిల్లల్లో పూర్వ బాల్యదశ నుంచి అభివృద్ధిని సాధించవచ్చునని ప్రోబెల్ భావించాడు.

### 1.1.3 మేరియా మాంటిస్సోరి (1870-1952)

**పరిచయం:**

ఈమె ఇటలీ దేశస్థురాలు. ఈమె వృత్తి రీత్యా డాక్టర్. యూనివర్సిటీ నందు మాంటిస్సోరి మానసిక విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నప్పుడు ఎంతో మంది పిల్లల్లో అభ్యసన దుర్బలత్వం ఉండడాన్ని గమనించారు. వారితో ఏర్పడిన సాన్నిహిత్యం ద్వారా తాను చేసిన వివిధ అధ్యయనాల ఫలితంగా వీరి దుర్బలత్వమునకు విద్యే ప్రధాన చికిత్స అని గుర్తించారు. విద్యపై రూసో వెలిబుచ్చిన అభిప్రాయాలను ఈమె ఖండించారు. తన విద్యావిధానంలో పెస్టాలజీ & ప్రోబెల్ విద్యాలక్ష్యాలను, తత్వాలను అనుకరించారు.

ఇంద్రియాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల మానసిక బుద్ధి మాంద్యం ఏర్పడుతుందని ప్రత్యేకశిక్షణ ద్వారా ఇంద్రియాలకు ప్రేరణ కల్గించి చైతన్యవంతం చేయవచ్చునీ అలాగే సాధారణ పిల్లలకు కూడా ఇదే పద్ధతిని వర్తింపచేయడం ద్వారా వారిలో మరింత వికాసం కల్గించవచ్చని మాంటిస్సోరి నిరూపించారు.

మాంటిస్సోరి 1939లో ఇండియా వచ్చి మద్రాస్‌లో ఎడ్యుకేషన్ ఫర్ పీస్ అనే కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈమె కృషికి ఫలితంగా నోబెల్ శాంతి బహుమతి ఈమెను వరించింది.

**i) విద్యాతత్వం :**

- పిల్లలు సహజసిద్ధంగా అభ్యాసకులు
- వారు ఇంద్రియాల ద్వారానే నేర్చుకుంటారు.ఇందుకు వారికి స్వేచ్ఛ అవసరం
- ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా మాత్రమే ఉండాలి.
- ప్రతి పిల్లవాని అభిరుచులు, అభ్యసనరీతులు వారిలోని సహజాతాలను ఉపాధ్యాయుడు అంచనా వేయగలగాలి.
- తరగతి గదిని పరిసరాలకు, వారి అభ్యసనకు, మారుతున్న వారి అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుడు తయారు చేయాలి.

**ii) విద్య:**

స్వేచ్ఛ, స్వీయ శిక్షణ ద్వారా వికాసాన్ని సాధించడమే విద్య.

iii) **మాంటిస్సోరి విద్యాసూత్రాలు:**

- స్వయంగా, వ్యక్తిగతంగా ఇతరుల ప్రమేయం లేకుండా తమంతట తాముగా పిల్లలు వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునే అవకాశం కల్పించాలి.
- ఇంద్రియాలకు సరియైన శిక్షణ లేకపోతే పిల్లలు దుర్భల మనస్కులవుతారు.
- పిల్లలు సహజసిద్ధంగా అభ్యసనంకు అవసరమైన శక్తులు కల్గి ఉంటారు వారి మానసిక వికాసాన్ని అనుసరించి బోధన జరగాలి.
- స్వయం శిక్షణ ద్వారా శిశువు వికసిస్తుంది. ఫలితంగా ఎదురయ్యే ఇబ్బందులను సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కరించుకోగల్గుతాడు.
- వ్యక్తిగత శిక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. శిశువులోని సహజాతాలను, శక్తులను సంపూర్ణంగా అభివృద్ధి పరచుటకు ఉపాధ్యాయుడు మార్గదర్శకుడు కావాలి.
- పిల్లలు అనుకరణ ద్వారానే నేర్చుకుంటారు. ఇందులో వారి విజయాలు, అపజయాలు కూడా ఉండవచ్చు.

మాంటిస్సోరి అభిప్రాయంలో పిల్లల యొక్క విద్య కంటే మించిన విషయం ఇంకొకటి లేదు. అదే మనముందున్న పెద్ద సమస్య. ప్రభుత్వాలు, సమాజం పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాల్సిన అవసరం ఉంది. "The child's soul which is pure and very sensitive requires our most delicate care" ఆమె దృష్టిలో పిల్లలు దేవుళ్ళు వారి పాఠశాల దేవాలయం. దేవాలయం యొక్క పవిత్రతే పిల్లల బాల్యదశ మాంటిస్సోరి తన విద్యా విధానంలో ప్రతిపిల్లవాడిని ప్రత్యేక దృష్టితో చూసింది. పిల్లల్లో ఉండే శారీరక, మానసిక పరమైన విభేదాలే ఇందుకు కారణం.

పూర్వ బాల్యదశ విద్యావిధానంలో అప్పటివరకు ఉన్న సాంప్రదాయ బోధనా పద్ధతులను పక్కనబెట్టి, పరిశీలనలకు అవకాశం కల్పించి ఒక నూతన ఒరవడిని మాంటిస్సోరి విద్యావిధానం తీసుకొని వచ్చింది.

**విద్యాలక్ష్యాలు**

1. **జ్ఞానేంద్రియ పద్ధతి:** విద్య, స్పర్శ, దృష్టి, శ్రవణం అనే మూడు ఇంద్రియ శిక్షణ ద్వారా జరుగుతుంది. చూడటం, తాకడం, వినడం ద్వారా గ్రహించాలి. విద్య వివిధ రకాలైన ఆటవస్తువులు, ఆటలు, వ్యాపకాల ద్వారా వీరికి లభిస్తుంది.
2. **చలన విద్య:** నడవడం, కూర్చోవడం, పరికెత్తడం, వస్తువులను వత్తడం, కాగితాలను కత్తిరించడం, బొమ్మలను ఆకృతిలో పేర్చడం, చిన్న చిన్న వస్తువుల బరువులను మోయడం లాంటి కృత్యాల ద్వారా చలన నైపుణ్యాలను అభివృద్ధిపరచడం
3. **విద్యా విషయాల అభ్యసనం:** దోష రహితంగా ఏదైనా విషయాన్ని పఠించడం, రాయడం, చేయడం, వినడంలాంటి కృత్యాలను అనుసరించడం.

**iv) విద్యాప్రణాళిక**

- చదవడం కంటే, లేఖనం ముందు నేర్పాలని భావిస్తారు. ఎందుకంటే లేఖనాన్ని క్రీడల ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. చిన్న చిన్న రేఖలను గీయడం ద్వారా అక్షరాలను నేర్చుకుంటారు. ఇక్కడ రాయడం ఒక శిక్షణ.
- రంగు రంగు బొమ్మలు, చిత్రాలు, బోర్డులు, క్రీడా వస్తువులు మొదలైన అంశాల ద్వారా జ్ఞానేంద్రియ

విద్యా కృత్యాలు అనుసరించడం.

- విద్యావిషయాల బోధనలో ఉచ్ఛారణను సవరించడం, లేఖనం, పఠనం అనుసరించడం, దశాంశ పద్ధతి, సంఖ్యామాన పరిచయం కోసం ఎరుపు, నీలం కడ్డీలను ఉపయోగించడం.

ఉపాధ్యాయుడు ఒక డాక్టర్ లాగా, ఒక సైంటిస్ట్‌గా, ఒక మతప్రబోధకుడుగా ఉండాలి. డాక్టర్‌గా విద్యార్థికి ఓపికగా బోధన చేయాలి. సైంటిస్ట్‌గా ఓపికగా ఫలితాల కొరకు వేచిఉండాలి.క్రొత్త క్రొత్త ప్రయోగాలు చేస్తూ ఉండాలి. ఒక మత ప్రబోధకుడిగా పిల్లలకు సేవ చేయాలి.

**– మాంటిస్సోరి.**

**మాంటిస్సోరి ప్రచురణలు**

- The Discovery of Child
- The Education of New Child
- The Secreate of childhood
- Reconstruction in Education
- The Montessory method
- Absorbent mind

6CB67I

**Normalisation**

Montessory observed in Children from 3 to 6 years old. It is the Psychological state which she termed as Normalisation. In this period children have spontanious discipline, continuous and happy work, social sentiments & sympathy for others.

### v) మాంటిస్సోరి బోధనా పద్ధతి:

మాంటిస్సోరి బోధనా పద్ధతులలో 3 రకాలైన అభ్యసన ప్రక్రియలుంటాయి.

1. నిత్యజీవితానికి సంబంధించినవి: గదులు ఊడ్చడం,తుడవడం,దుస్తులు శుభ్రపరచడం,వ్యక్తిగత పరిశ్రుభ్రత.
2. ఇంద్రియ శిక్షణకు సంబంధించినవి. పరిమాణం, ఆకారం, బరువు,తేలిక, చల్లని, వేడి, రంగులు గుర్తించుట.
3. బోధనోపకరణకు సంబంధించినవి : గణిత భావనలు, భాషా జ్ఞానంలను బోధనోపకరణాలను వినియోగించి అవగాహన కల్పించడం.

### 1.1.4 మహాత్మగాంధీ : ( 1869 – 1948)

**పరిచయం:**

బేసిక్ విద్యావిధానం (నయాతాలిమ్), గాంధీ విద్యాతత్వానికి దర్పణం. మోహన్‌దాస్‌కరమ్ చంద్ గాంధీ 1869వ సం॥లో అక్టోబర్ 2 న పోర్‌బందర్‌లో జన్మించాడు. ఇతడు మహాతత్వవేత్త. గాంధీ జీవితాన్ని దర్శించిన తీరు, వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఎందరో తత్వవేత్తల దృష్టిని ఆకర్షించాయి.

**గాంధీ పూర్వప్రాథమిక విద్య**

గాంధీ పూర్వప్రాథమిక విద్య 7 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఉద్దేశించబడినది. 1945వ సం॥లో మహారాష్ట్రలోని సేవాగ్రామ్ నందు Pre Basic విద్యావిధానాన్ని ప్రారంభించారు. గాంధీ అభిప్రాయంలో

- గృహం విద్యార్థికి మొట్టమొదటి విద్యాకేంద్రం.
- ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు పిల్లల అభ్యసన విషయంలో సహకరించుకోవాలి.
- ఇది వ్యయభరితంగా ఉండరాదు. ఎక్కువమంది పిల్లలకు అందుబాటులో ఉండాలి.
- పిల్లలు ఆటల ద్వారా నేర్చుకోవాలి. వారిలో సృజనాత్మకతను పెంపొందించాలి.
- పిల్లల్లో స్వయంసామర్థ్యం (Self efficience) పెంచాలి.

**i) గాంధీ విద్యాతత్వం**

గాంధీ అభిప్రాయంలో సమాజ పునర్నిర్మాణానికి విద్య ముఖ్య ప్రాతిపాదిక. విద్యార్థులలో నైతిక, సాంఘిక, రాజకీయ ప్రగతి జరగాలంటే విద్యావ్యవస్థ సమర్థవంతంగా ఉండాలి.

**ii) గాంధీ విద్య:**

విద్య అంటే వ్యక్తులలోని శారీరక, సామాజిక, ఆధ్యాత్మికతల సమాహారమైన అత్యున్నత అంశాలను సమీకృతంగా వెలికితీయడమే. విద్య శిశుకేంద్రితంగా వుండాలి.

మంచి విద్య అంటే పిల్లల్లో ఆధ్యాత్మికంగా, ప్రజ్ఞావంతంగా, శారీరకంగా ప్రేరణ కల్గించేదే **– గాంధీ**

- **శారీరక అభివృద్ధి :** శారీరక పెరుగుదల సక్రమంగా ఉన్న వ్యక్తిలో మనస్సు కూడా సక్రమంగా అభివృద్ధి చెందుతుంది. పూర్వ ప్రాథమిక విద్య విద్యాప్రణాళికలో క్రీడలు, కృత్యాలు, నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు.
- **ప్రజ్ఞాభివృద్ధి :** విద్యా కార్యక్రమాలలో అనుభవాలకు, చేతి వృత్తులకు ప్రాధాన్యత ఇచ్చుట ద్వారా వారి ప్రజ్ఞాభివృద్ధికి పూర్వప్రాథమిక విద్య వీలు కల్పిస్తుంది.

**iii) విద్యాలక్ష్యాలు**

**స్వయం పోషక లక్ష్యం:** వృత్తి విద్యకు ప్రాముఖ్యతనివ్వడం, ఆర్థిక ప్రగతి ద్వారా స్వయంపోషకత్వం సాధించడం

**సాంస్కృతిక లక్ష్యం:** విద్య యొక్క ముఖ్యమైన ప్రకార్యం సాంస్కృతిక పరిరక్షణ. సంస్కృతిని విస్మరించిన వ్యక్తి సమాజానికి పెద్ద శాపమవుతాడు.

**శీలనిర్మాణం:** తనలోని శారీరక , మానసిక శక్తులను తన చుట్టూ ఉన్నవారికి అంగీకారం అయ్యేలా తనను తాను తయారు చేసుకోవడం నైపుణ్యాలు, అలవాట్లు , ప్రవర్తనా వైఖరులతోపాటు నైతిక,ఆధ్యాత్మికత కల్గి ఉండటమే శీలం.

గాంధీ తన విద్యాప్రణాళికను ఈ పిల్లలు తమ పనులను తామే చేసుకునేలా రూపొందించాడు. సొంతంగా పిల్లల్లో ఆత్మస్థైర్యంను పెంపొందించడంతోపాటు ఇతరుల కష్టానికి విలువ ఇచ్చే తత్వం అలవడుతుంది. వారిలో ఇతరులపై

ఆధారపడటం తగ్గిపోతుంది. పూర్వప్రాథమిక స్థాయినుంచే ప్రతి పిల్లవానికి విధిగా శారీరక శ్రమను కలిగించే పనులను వారితో చేయిస్తూ వారిలో స్వయం సామర్థ్యాలను పెంపొందించేలా కృషి జరగాలి.

**సర్వతోముఖాభివృద్ధి:** పిల్లల " Head , Hand, Heart" లు అభివృద్ధి చెందడం

**పౌరసత్వ శిక్షణ :** తమ హక్కులను, బాధ్యతలను, సమస్యలను తెలుసుకోగలిగేలా విద్యా విధానము ఉండాలి. ఇతరులకు సహాయపడగలిగేలా ఉండాలి.

**iv) గాంధీ విద్యాప్రణాళిక**

పిల్లలకు తమ దేశాన్ని గురించి, తమ జీవిత విధానాలకు సంబంధించిన భౌతిక, సామాజిక పరిసరాల గురించి అవగాహన కల్గించాలి. అందుకు తగిన విధంగా విద్యాప్రణాళిక ఉండాలి.

**మాతృభాష :** మాతృభాష బోధన ద్వారా పిల్లలకు అవగాహన సామర్థ్యం పెంచవచ్చని, సంస్కృతి, సాంప్రదాయ పరిజ్ఞానం అలవరచవచ్చునని గాంధీ అభిప్రాయపడ్డాడు.

**సామాజిక శాస్త్రాలు:** వివిధ కాలాలలో జరిగిన విషయాలు, సంస్కృతి అభివృద్ధి , ప్రభుత్వ విధానాలు,సాంఘిక, భౌతిక పరిసరాలు మొదలైన వాటిని గురించి అవగాహనను సామాజిక శాస్త్రాల ద్వారా కల్గించాలి.

**చిత్రలేఖనం, సంగీతం:** వీటి ద్వారా పిల్లల్లో మానసిక ఉల్లాసానికి వీలు కల్పించాలి.

**సామాన్యశాస్త్రం :** ప్రకృతి అధ్యయనం, జంతుశాస్త్రం, శరీర శాస్త్రం, రసాయనశాస్త్రం, ఆరోగ్యశాస్త్రాల అధ్యయనాలు విద్యావిధానంలో ఉండాలి.

**వృత్తి విద్య :** పిల్లలు ఏదో ఒక వృత్తిని నేర్చుకునేలా ఒక విద్యా విధానం ఉండాలి. తద్వారా స్వయంపోషకతత్వం ఏర్పడి దేశ ఆర్థిక ప్రగతికి వీలు ఏర్పడుతుంది.

**v) గాంధీ బోధనలు**

సత్యం, అహింస, ప్రేమ, బ్రహ్మచర్యం, నిరాడంబరత (Simplicity), దైవంపై (మీద) నమ్మకం. గాంధీ పూర్వ బేసిక్ విద్యావిధానం 4 దశలలో ఉంటుంది.

1. గర్భస్థ శిశువు నంచి పుట్టుక వరకు
2. పుట్టుక నుండి 2.5 సం॥ల వరకు
3. 2.5సం॥ నుండి 4 సం॥ వరకు
4. 4 సం॥ నుండి 7 సం॥ వరకు

గాంధి అభిప్రాయంలో జ్ఞానం మరియు పని ఈ రెండింటిని విడదీయలేము. ఉత్పాదకతను ఇచ్చే పనుల ద్వారా పిల్లలు నేర్చుకొనేలా వీలుకల్పించాలి. చేయడం ద్వారా నేర్చుకోవడం, చేతి పనిని కేంద్రంగా చేసుకొని బూధన జరగాలి. ఉపన్యాస పద్ధతి ప్రశ్నించడం మొదలైన వాటిని కూడా బోధనా ప్రక్రియలుగా అంగీకరించారు.

మొదటి రెండు దశలలో శిశు అభ్యసనకు తల్లి కీలకభూమిక పోషిస్తుంది. తల్లులకు అవగాహన కల్పించడం ద్వారా పిల్లల్లో ఆరోగ్యం, అలవాట్లు, భద్రత కల్పించడం జరుగుతుంది.

3వ దశలో సామూహిక ఆటల ద్వారా పూర్తి స్వేచ్ఛను కల్పిస్తూ స్వయం కృత్యాల నిర్వహణను ప్రోత్సహిస్తారు.

4వ దశలో శుభ్రత, మొక్కల పెంపకం,బరువులను,పొడవులను కొలవడం, బొమ్మలు గీయడం, రంగులు వేయడం నేర్పబడతాయి.

ఉపాధ్యాయుడు అన్ని దశలలో పిల్లల ఇష్టాఇష్టాలను గమనిస్తూ వారికి సహకరించాలి.

**గాంధీ రచనలు**

My Experiements with Truth, Basic Education, Towards New Education, True Education, India of my dream.

### 1.1.5 రవీంద్రనాథ్ ఠాగూర్ (1861–1941)

**పరిచయం:**

రవీంద్రనాథ్ ఠాగూర్ 1861లో కలకత్తాలో జన్మించాడు. ఇతడు స్వతహాగా ఒక కవి. ఇంకా తత్వవేత్త, నాటకకర్త, ఉపాధ్యాయుడు, వ్యాసరచయిత మరియు పెయింటర్. ఇతని జీవితతత్వంలో దేశభక్తి, ప్రకృతివాదం, వ్యక్తివాదం, భావవాదం, మానవతావాదం, అంతర్జాతీయత మరియు ఆధ్యాత్మికతలు ఇమిడి ఉంటాయి.

ఠాగూర్ రాసిన గీతాంజలి అనే గ్రంథానికి 1913 లో నోబెల్ బహుమతి లభించింది. ఇతడు మొట్టమొదటి యురోపియనేతర నోబెల్ బహుమతి గ్రహీత. విభిన్న రంగాలలో ఠాగూర్ చేస్తున్న కృషికి గాను బ్రిటీష్ గవర్నమెంట్ 1915 లో 'నైట్' అనే బిరుదునిచ్చింది.

1919 సం॥లో జలియన్‌వాలాబాగ్‌ని నిరసిస్తూ ఠాగూర్ తన నైట్ బిరుదును త్యజించారు. ప్రకృతిని ఆరాధించి, ప్రేమించి , ప్రకృతినే ప్రబోధ శక్తిగా కీర్తించి ఒక ఆదర్శవాదిగా, కర్మయోగిగా,ఋషిగా ఎందరికో మార్గదర్శకుడై గురుదేవునిగా కీర్తి పొందారు.

**i) ఠాగూర్ జీవిత తత్వం**

**ప్రకృతివాదం :** ప్రకృతిలోని ప్రత్యక్ష స్వరూపాలు, పరమాత్మ ప్రతిరూపాలని ఈయన విశ్వసించారు. ఇతని అభిప్రాయంలో ప్రకృతి వికాసమే మానవ వికాసానికి హేతువు. వినగల చెవులు,ఆస్వాదించదగ్గ కళ్ళు మనకుంటే ప్రకృతి అనంత విషయాలను మనకందిస్తుందని ఠాగూర్ విశ్వాసం. ఇతర ప్రకృతి వివాదంలోని అంశాలు.

- వ్యక్తివాదం
- మానవతావాదం
- ఆధ్యాత్మికవాదం
- అంతర్జాతీయత

**స్వీయ వ్యక్తీకరణ:** ఒక వ్యక్తి సంపూర్ణవ్యక్తిగా రూపొందాలంటే విద్య కీలకమైనది. విద్య ద్వారా ఇంద్రియజ్ఞానాన్ని మేదస్సును, సృజనాత్మకతను పెంపొందించవచ్చు. బాల్యదశలోనే కళలు, నృత్తులు, సంగీతం, నాటకీకరణం, చిత్రలేఖనంలను విద్యలో అంతర్భాగం చేయాలి.

**సమన్వయ వైఖరి:** దేవుడు, మనుష్యుల మధ్య సమన్వయంతో శాంతియుత ప్రపంచం ఏర్పడుతుంది.

**స్వేచ్ఛ:** మానసిక, భావసంబంధ, సామాజికపరమైన స్వేచ్ఛ ఉండడం ద్వారా శిశువులో మానసికశక్తుల వికాసానికి అవకాశం లభిస్తుంది. "బిడ్డను స్వేచ్ఛగా ఆడనివ్వాలి, ఆలోచింపనివ్వాలి, పాడనివ్వాలి అప్పుడే చక్కటి విద్యాభ్యాసం పూర్వబాల్యదశ నుండే జరుగుతుందని" ఠాగూర్ విశ్వసించాడు.

**ప్రకృతి-మానవ సంబంధాలు:** ప్రకృతి మానవుడికి గొప్ప గురువు. సమాజ పరిసరాలు దగ్గరగా ఉన్నప్పుడే విద్య ఉపయోగకరంగా ఉంటుంది. తరగతి గదులకు పరిమితమైన విద్య నిస్సారమైనది, కృత్రిమమైనది.

**అంతర్జాతీయత:** ప్రపంచంలోని వ్యక్తులందరూ పరస్పరం సదవగాహనతో ప్రేమ, నమ్మకాలతో ఉన్నప్పుడే ప్రపంచ శాంతి లభిస్తుంది. మానవజాతి సోదర భావాన్ని అలవర్చుకోవాలి. అలాగే విద్యావిధానంలో దేశీయ మరియు విదేశీయ విలువల విలీనం చేసుకోవాలి.

**ii) విద్య:**

పిల్లలకు అభ్యసనము అనునవి ఆనందకరమైన అభ్యసన అనుభవము, వారి వ్యక్తిగత అభిరుచులకు, అవసరాలకు సంతృప్తిపరిచేలా వుండాలి

**iii) ఠాగూర్ విద్యా లక్ష్యాలు:**

**1. ప్రజ్ఞాభివృద్ధి:** సృజనాత్మక ఆలోచన, స్వయంఅధ్యయనం ఉన్నప్పుడు మాత్రమే విద్యార్థులు నేర్చుకోగల్గుతారు. అవసరమైన విజ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడానికి సహకరించేదే విద్య.

**2. శారీరకాభివృద్ధి:** అన్ని రకాల వాతావరణ పరిస్థితులకు సర్దుబాటు కాగల శరీర సామర్థ్యం పెంపొందించేటట్లుగా విద్యా కార్యక్రమాలుండాలి.

**3. నైతిక ఆధ్యాత్మికాభివృద్ధి:** విద్యార్థులలో పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం కంటే నైతిక, ఆధ్యాత్మికాభివృద్ధి ఎంతో ముఖ్యమైనది. అన్ని రకాల బంధనాల నుంచి విముక్తి పొంది స్వేచ్ఛగా అభ్యసించుటకు నైతిక, ఆధ్యాత్మికాభివృద్ధి అవసరం, అందుకు తగిన విధంగా విద్యాలక్ష్యం ఉండాలి.

### 4. అంర్జాతీయ అవగాహన విశ్వమానవ సౌభ్రాతృత్వం (Service to man is service to God ):

వ్యక్తి పరమార్ధము మానవజాతి ఐక్యత. ఇందుకు విద్య ప్రధాన లక్ష్యంగా ఉండాలి. మానవతావాదాన్ని విద్య ద్వారానే సాధించగలము.

1901 డిశంబర్ 22 న శాంతినికేతన్‌ను కలకత్తా నగరంలో ఠాగూర్ స్థాపించారు. తర్వాత దీనిని బ్రహ్మచర్యాశ్రమంగా పిలిచేవారు. తిరిగి దీనిని విశ్వభారతిగా పేరుమార్చారు. దీని ముఖ్య అర్ధం మరియు ఉద్దేశం. “ Where the World makes a home in a nest”

**ఠాగూర్ పాఠశాల ముఖ్య లక్షణాలు:**

1. సహజ పరిసరాలలో నెలకొల్పాలి.
2. ప్రకృతి సహజ అందం ప్రతిబింబించేదిగా ఉండాలి.
3. ప్రాచీన కాలంలో ఉన్న తపోవనమును తలపించాలి.
4. స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలి.
5. మాతృభాషలోనే బోధన జరగాలి. అందుబాటులో పుస్తకాలు ఉండాలి.
6. జాతి, మత, వర్గం లేకుండా ఉండాలి.

7. విద్యాప్రణాళికలో కళలు, సంగీతం - చిత్రలేఖనం అంతర్భాగం కావాలి.
8. విద్యార్థులకు వారి అభీష్టాలకు అనుగుణంగా అవకాశం కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి సహకరించాలి.

**iv) విద్యాప్రణాళిక**

సాంప్రదాయ విద్యావిధానానికి విరుద్ధంగా, విద్యావ్యాసంగానికి కావలసిన పూర్తి అనుభవాలు విద్యార్థికి పాఠ్యప్రణాళికలో ఏర్పాటుచేశాడు. విద్య ప్రజాజీవనానికి అనువుగా, నిత్యజీవన విధానాలు, సమాజంలో కట్టుబాట్లు అన్ని విద్యార్థి అనుభవాల ద్వారా అవగాహన కావాలి. పౌరశిక్షణకు అవసరమైన స్వయంపాలన, సామాజిక సేవలు మొదలైన సహపాఠ్య పాఠ్యక్రమకాలుంచేలా, చరిత్ర, భౌగోళికశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, గణితం వీటితోపాటు చిత్రలేఖనం, నాటక ప్రదర్శనలు, విహారయాత్రలు సంగీతం కూడా పాఠ్యప్రణాళికలో పొందుపరచాలని సూచించాడు.

**v) బోధనా పద్ధతి:**

స్వీయ అధ్యయనం పరిసరాలను ప్రతిబింబించే విధంగా విద్య వుండాలి. తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాలకు విద్యార్థిని ప్రోత్సహిస్తూ నడిపింపగలిగేదే అసలైన బోధన.

ఠాగూర్ తన విద్యాప్రణాళికలో అనుభవాల ద్వారా నిత్యజీవన విధానాలు,సమాజంలోని కట్టుబాట్లపై అవగాహన కల్పించేలా విద్యాప్రణాళికను తయారుచేసాడు. పౌరసత్వ శిక్షణకు అవసరమైన స్వయంపాలన, సామాజిక సేవలు, చిత్రేఖనం, విహారయాత్రలు, సంగీతం, నృత్యంలాంటి సహపాఠ్య కార్యక్రమాలను విద్యాప్రణాళికలో పొందుపరిచాడు.

**1.1.6 జాన్‌డ్యూయి (1859-1952)**

**పరిచయం:**

20వ శతాబ్దంలోని ఒక విద్యా మరియు గొప్ప తత్త్వవేత్త జాన్‌డ్యూయి. నిత్యజీవితంలో సంబంధం ఉన్న వ్యవహారిక సత్తావాదాన్ని చెప్పిన విద్యాతత్వవేత్త జాన్‌డ్యూయి. ఇతడు ఒక మానసిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త, విద్యావేత్త, విమర్శకుడు మరియు రాజకీయ వేత్త. మానవుని సంక్షేమానికి ఉపకరించే జ్ఞానం పురాతన సాంప్రదాయాలను విస్మరించి, నూతన ఆలోచనా విధానము ద్వారా విద్యా సమస్యలకు పరిష్కారాన్ని తన వ్యవహారిక సత్తావాదం ద్వారా అందించారు.

**i) జాన్‌డ్యూయీ విద్యాతత్వం**

వ్యవహారిక సత్తావాదం వీరి విద్యాతత్వం. జాన్‌డ్యూయీ ప్రకారం విద్య, జీవితం ఈ రెండు పరస్పర సంబంధాన్ని కలిగివుంటాయి. ఈ రెండు వేరువేరుగా కాకుండా పాఠశాల కృత్యాలు, శిశువు తన సాంఘీక పరిసరాలలో నిర్వహించే కృత్యాలకు పరస్పర సంబంధం కలిగివుండాలి. పిల్లలు చేయడం ద్వారా నేర్చుకుంటారు. తన సాంఘిక పరిసరంలో నిరంతరం జరిపే ప్రతిచర్యలు, వారి వికాసానికి దోహదపడతాయి.

**ii) జాన్‌డ్యూయీ విద్య**

జాన్‌డ్యూయి ప్రయోగాత్మకమైన, ప్రయోజనాత్మకమైన విద్యావిధానానికి ప్రాముఖ్యతనిచ్చారు. మానవుడు సంఘజీవి. నిత్యజీవితంలో అతనికి సాంఘికంగా,మానసికంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుంటూ జ్ఞానాన్ని పొందుతున్నాడు.

సమాజంలో వస్తున్న మార్పులు, అవసరాలకు అనుగుణంగా, పరిసరాలకు తగిన విధంగా మార్పులు చేసుకోవడానికి విద్య సహకరిస్తుంది.

**iii) జాన్ డ్యూయీ విద్యాలక్ష్యాలు:**

- విద్యార్థుల జీవిత మరియు సామాజిక అవసరాలు తీర్చే విధంగా విద్య ఉండాలి.
- భౌతిక, నైతిక, సౌందర్యాత్మక కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థులలో నూతన విలువలు సృష్టించగలగాలి.
- సమాజపరమైన సమస్యలకు సమాధానాన్ని అందించేదిగా విద్య ఉండాలి.
- విద్యార్థి సమాజానికనుగుణంగా మార్పు పొందుటకు కావాల్సిన అనుభవాన్ని అందించగలగాలి.
- విద్యార్థి సమర్థుడిగా, స్వతంత్రుడిగా జీవించుటకు వీలు కల్పించేదిగా ఉండాలి.
- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి.

**iv) జాన్ డ్యూయీ విద్యాప్రణాళిక:**

- జీవితానికి అవసరమైన, ఉపయోగకరమైన పాఠ్యాంశాలుండాలి.
- తరగతిగది , క్రీడా మైదానము, గ్రంథాలయము, ప్రయోగశాల మొదలైన వాటితో పొందే అనుభవాలతో పాఠ్యప్రణాళిక ముడిపడి ఉండాలి.
- విద్యార్థుల ప్రజ్ఞాశక్తుల అభివృద్ధికి వీలుగా పాఠ్యాంశాలు సమగ్ర విధానంతో రూపొందించాలి.
- అనుభవం ద్వారా విద్యను పొందుటకు విద్యా కార్యక్రమాలు రూపొందించాలి.
- ప్రకృతి అధ్యయనం, చేతి పని,వ్యవసాయం,గృహ విజ్ఞానం లాంటివి బోధనలో ఉండాలి.
- సమగ్రసూత్రాన్ని పాటించి పాఠ్యాంశాలను రూపొందించాలి.
- విద్యార్థి ఎల్లప్పుడూ ప్రయోజనకరమైన. సృజనాత్మకమైన, సమస్యాత్మకమైన కార్యక్రమాలలో నిమగ్నం అయ్యేటట్లు చర్యలుండాలి, అప్పుడే విద్యార్థి తనకెదురయ్యే సమస్యలను తనకు తానే పరిష్కరించుకోగలడు. ఈ ప్రక్రియ ద్వారా విద్యార్థులలోని అంతర్గత మరియు బాహ్యశక్తులు అభ్యసనమునకు తోడ్పడతాయి.
- జాన్‌డ్యూయి విద్యా విదానంలో ప్రాజెక్ట్ పని కీలకమైనది. పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలను తామే పరిష్కరించుకొనేలా చేస్తారు.
- విద్యార్థులు నిరంతరం ఏదో ఒక పని చేస్తున్నప్పుడే వారిలో చైతన్యం కలిగి క్రొత్త విషయాలను అనుభవాలను పొందగల్గుతారు.
- ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకుడిగా ఉండాలి, సమాజం పట్ల, వ్యక్తిపట్ల సమగ్ర అవగాహన కలిగినవాడై తన విద్యార్థులకు పూర్తి స్వేచ్ఛనిస్తూ వారిని ప్రోత్సహిస్తూ ఉండాలి.

**v) బోధన పద్ధతి**

చేయడం ద్వారా బాగా నేర్చుకుంటారు. చిన్న పిల్లల్లో పరిశోధించాలన్న జిజ్ఞాస ఎక్కువగా వుంటుంది. స్వతహాగా చేసి, నేర్చుకోవడం ద్వారా వారిలో వున్న పరిశోధన జిజ్ఞాస సంతృప్తి చెందుతుంది.

## 1.2 ECCE విద్యాప్రణాళిక నిర్వచనము, లక్ష్యాలు, ప్రాముఖ్యం

### (Definition and Objectives of Holistic ECCE curriculum - Significance of early years)

### 1.2.1 పూర్వబాల్య దశ విద్యాప్రణాళిక

**పరిచయం:**

వివిధ విద్యాతత్వవేత్తలు పూర్వ బాల్యదశ విద్యను గుర్తించారు. ఈ దశలో విద్యాప్రణాళిక కృత్యాధారమైనదిగా ఉండాలని, పిల్లల అవసరాలకు తగినట్లుగా వారి వయస్సుకు అనుగుణంగా, ఉత్సాహభరితమైనదిగా అభ్యసనం కల్పించే విధంగా ఉండాలని పేర్కొన్నారు. పూర్వ బాల్యదశ సంరక్షణ విద్యా ప్రణాళిక 0 నుండి 6 సం॥ల వయస్సు పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని వివిధ కమిటీలు సూచనలు చేశాయి.

**విద్యాప్రణాళిక – వివిధ కమిటీలు – సిఫారసులు**

**i) కొఠారి కమీషన్ ( 1964–66)**

ఆటలు, పాటలు, శారీరక శ్రమ కల్గించే కృత్యాలు, శిక్షణలు, చేతిపనులు, చిత్రలేఖనం, స్వీయ ఆరోగ్య లక్షణంకు ఈ విద్యాప్రణాళికలో ప్రాధాన్యం ఉండాలి.

**ii) జాతీయ విద్యా విధానం (1986) (National Policy of Education (1986)):**

పూర్వ ప్రాథమిక బాల్యదశ విద్య శిశుకేంద్రీకృతంగా ఉండాలి. పిల్లల వ్యక్తిత్వ వికాసం జరిగేవిధంగా వారు ప్రాథమిక విద్యను కొనసాగించుటకు వీలుగా ఈ ప్రణాళిక ఉండాలి. అలాగే పని చేసే మహిళలు నిరభ్యంతరంగా భద్రతా భావంతో తమ పిల్లలను పూర్వప్రాథమిక విద్యా కేంద్రాలకు పంపే విధముగా ఉండాలి.

**iii) యశ్‌పాల్ కమిటి (1997)**

యశ్‌పాల్ కమిటి తన భారంలేని విద్య (లెర్నింగ్ విత్‌అవుట్ బర్డెన్) రిపోర్ట్ నందు పిల్లలపై ఏ రకమైన శిక్షలు, ఒత్తిడి లేకుండా నియత విద్యకు అవకాశంలేని విద్యాప్రణాళిక ఉండాలని పేర్కొంది. పరీక్షలు నిర్వహించడం, మార్కులు, గ్రేడులు వేయడం పూర్తిగా నిషేధించింది.

**iv) ఎన్.సి.ఇ.ఆర్.టి (1996)**

పూర్వ బాల్యదశ సంరక్షణ విద్యా ప్రణాళిక సమగ్రమైనదిగా ఉండాలి. విద్యార్థి కేంద్రీకృతంగా ఉండి వివిధ రకాల అనుభవాల ద్వారా అభ్యసనము కొనసాగించేలా ఉండాలి. పిల్లలకు భద్రత కల్పిస్తూ వారిలో భాష, జ్ఞానసంబంధ విషయాలు, సృజనాత్మకతను పెంపొందించేదిగా, సాంఘిక భావోద్వేగాలను కాంక్షించేదిగా విద్యాప్రణాళిక ఉండాలి.

**v) ఎన్.సి.ఎఫ్ (2005)**

1. ఈ దశను అత్యంతకీలకమైన దశగా పేర్కొంది.కాబట్టి ఈ దశలో తగు విధమైన విద్యాప్రణాళిక ఉండాలి.
2. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండాలి.
3. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి అనుకూలంగా ఉండాలి.
4. పిల్లల అవసరాలను తీర్చేవిధంగా భౌతిక వనరులు ఉండాలి.

5. పిల్లలపై పర్యవేక్షణ ప్రోత్సాహకరంగా ఉండాలి.

**vi) పూర్వ బాల్యదశ మరియు విద్య జాతీయ విద్యాప్రణాళికా చట్రం (2013) (NECCE-NCF-2013)**

దీనిని స్త్రీ శిశు సంక్షేమ శాఖ (మినిస్ట్రి ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలెప్‌మెంట్) రూపొందించింది.

**ఎన్.ఇ.సి.సి.ఇ. విద్యాప్రణాళిక:**

1. పంచేంద్రియ అభివృద్ధి
2. శారీరక,మానసిక అభివృద్ధి
3. భాషాభివృద్ధి
4. జ్ఞాన అభివృద్ధి
5. కళలు, సంస్కృతి, నైతికత, సృజనాత్మకత మరియు అభివృద్ధి
6. సాంఘిక, భావోద్వేగ అభివృద్ధికి పూర్వబాల్య సంరక్షణ విద్యాప్రణాళిక వీలుకల్పించేదిగా ఉండాలని పేర్కొంది.

### 1.2.2 ECCE విద్యాలక్ష్యాలు – వివిధ కమిటీల సూచనలు

**1) భారత విద్యా కమీషన్ 1964 – 66**

పిల్లలలో మంచి శరీర సౌష్టవం, కండరాల సమన్వయము, చలన నైపుణ్యాలను అభివృద్ధిపరచడం, వ్యక్తీకరించడం, అవగాహన చేసుకోవడం, అంగీకరించడం, ఉద్వేగాలను మరియు భావాలను అదుపులో ఉంచుకోవడం.

**2) మిస్‌గ్రేస్ ఓవెన్**

పిల్లలకు నిరంతరం వైద్య పర్యవేక్షణతో ఆరోగ్యకరమైన , ఆనందదాయకమైన, క్రమమైన జీవితాన్ని అందించడం.

వివిధ ఆసక్తులు, నైపుణ్యాలభివృద్ధికి అవకాశాలు కల్పించడం ద్వారా సంపూర్ణ మూర్తిమత్వ వికాసాన్ని సాధిస్తారు.

**3) Sargent Report 1944**

ECCE ని 0 నుండి 6సం။ల వయస్సు వరకు కొనసాగించాలని, వారికవసరమైన ఆరోగ్య, పౌష్టికాహారం, సంరక్షణలను అందిస్తూ సాంప్రదాయ బోధనకు బదులుగా వారిలో సాంఘిక అవసరాన్ని పెంచాలని సూచనలు చేసింది. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో 45వ నిబంధన ప్రకారం పిల్లలకు 6 సంవత్సరాల వయస్సు వచ్చేవరకు సంరక్షణ మరియు విద్య కొనసాగించాలని పేర్కొంది.

**4) NPE- 1988 (New Policy on Education)**

పిల్లలకు ఆరోగ్య మరియు పౌష్టిక ఆహారం ద్వారా మరియు సంరక్షణ అభ్యసనంల ద్వారా పిల్లల్లో మానసిక, భౌతిక, సాంఘిక, భావోద్వేగ రంగాలలో వృద్ధిని సాధించగలమని పేర్కొంది.


**5) శ్రీమతి బి.తారాభాయ్ (Child Care Committe 1963-1964)**

ఆటస్థలం (Play ground), కృత్యాలు, చేతిపనులు నిర్వహించడం ద్వారా, పరిసరాల అనుసంధానం ద్వారా పిల్లల్లో సమగ్రాభివృద్ధిని సాధించడం.

**6) Indian Education Committe (1964-1966)**

- పిల్లల్లో మంచి అలవాట్లను, నైపుణ్యాలను అభివృద్ధి పరచి వారిలో వ్యక్తిగత, సాంఘిక నియమాలను అలవరచుట.
- అనువైన పరిసరాలను కల్పిస్తూ వారి పంచేంద్రియాల అభివృద్ధికి సహకరించడం.
- ఇతరులను అర్థం చేసుకోవడం, అంగీకరించడం, తమ వ్యక్తిగత భావనలను, ఉద్వేగాలను అదుపులో ఉంచుకొనేటట్లు చేయడం.
- పరిసరాల అనుసంధానం ద్వారా పిల్లలు తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకొనేలా చేయడం.

**పూర్వబాల్యదశ విద్యా సంరక్షణలో గుణాత్మకమైన విద్యను సాధించుటకు వ్యూహాలు**




**1.2.3 వివిధ కమిటీ సిఫారసుల మేరకు పూర్వబాల్యదశ విద్యా లక్ష్యాలు**

- పిల్లలందరిని సమాన దృష్టితో చూస్తూ వారికి సురక్షితమైన భద్రతను, అవకాశాలు కల్పించాలి.
- పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా, మంచి ఆహారపు అలవాట్లను నేర్పడం ద్వారా వారి భౌతిక, మానసిక వికాసానికి వీలు కల్పించడం.
- పిల్లల్లో సంభాషణ నైపుణ్యాన్ని పెంపొందించడం. వారిలో వివేకవంతమైన జిజ్ఞాసను ప్రేరేపిస్తూ వారి చుట్టూ ఉన్న పరిసరాలను అర్థం చేసుకునే అవకాశాలను కల్పించటం.
- పరిసరాలతో సమన్వయ పరచడం, పరిశీలింప చేయడం, ప్రయోగాలు చేయడం ద్వారా వారిలో విషయావగాహనను కలుగచేయడం.
- పూర్వప్రాథమిక విద్యాకేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలకు పిల్లలు సులభంగా చేరేటట్లు చూడడం.
- పిల్లలలో సమగ్రమైన అభివృద్ధిని కల్పించడం. ఏది తప్పు? ఏది ఒప్పు? అనే విషయాలను వివేచనతో తెలుసుకునేలా చేయడం.
- పిల్లల్లో సాంఘిక, మానసిక, భావోద్వేగ నైపుణ్యాలను వృద్ధిచేయడం ద్వారా వారిలో సృజనాత్మక అభ్యసనానికి వీలు కల్పించడం.
- ఆరోగ్య అలవాట్లు , భాషాభివృద్ధి,నైతిక,సాంఘీక విలువలు పెంపొందించడం.

- అభ్యసన సామర్థ్యాలను అభివృద్ధి చేయడం.
- పిల్లల్లో మూర్తిమత్వం వికాసం ఏర్పరచి సాంఘిక జీవితానుభవాన్ని, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడం.
- వివిధ ఆసక్తులు, నైపుణ్యాల అభివృద్ధికి అవకాశాలు కల్పించడం.
- వారి పరిసరాలకు గృహ వాతావరణానికి మధ్య సహసంబందాన్ని కల్పించటం.
- వివిధ రకాల కృత్యాల నిర్వహణ ద్వారా వారిలో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించటం.
- పిల్లల్లో శారీరక చలన కండరాలను అభివృద్ధి చేయడం.
- పిల్లలో సామాజిక, భావోద్వేగ వికాసం కలుగచేయడం.
- భాషాభివృద్ధిని కలుగచేయడం.
- గ్రహణశక్తి, మేదాశక్తిని పెంపొందించడం.
- వికాసాన్ని కల్గించడం.
- పంచేంద్రియాల వికాసం అనగా చూపు, వినికిడి, స్పర్శ, వాసన, రుచిల వికాసం కల్గించడం.
- వర్గీకరణ నైపుణ్యాన్ని కల్గించడం.
- సమస్యలకు హేతుబద్ధమైన పరిష్కారం కల్గించడం.
- సృజనాత్మక వ్యక్తీకరణ మొదలైనవి ECCE ముఖ్య లక్ష్యాలుగా చెప్పవచ్చు.

## 1.3 ECCE ప్రాముఖ్యత (Significance of ECCE)

**పరిచయం:**

**i) వలసలు**

ముఖ్యంగా మనదేశంలాంటి దేశాలలో సమిష్టి కుటుంబాల విఛ్ఛిన్నత కారణంగా సూక్ష్మకుటుంబాలు ఏర్పాటవుతున్నాయి. పారిశ్రామికీకరణము, పట్టణీకరణము, వ్యవస్థీకరణము, వ్యవసాయేతర రంగాల వృద్ధి వల్ల ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలసలు వెళ్ళవలసి వస్తుంది.

**ii) వ్యవసాయాధారితం**

గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం వేకువనే వెళ్ళవలసి వస్తుంది. ఈ నేపధ్యంలో తప్పనిసరిగా వారి పిల్లలకు సంరక్షణ బాధ్యత అందిచాల్సిన అవసరం ఏర్పడుతుంది. పిల్లలను భవిష్యత్ జీవితానికి, వారిలో భౌతిక, శారీరక, భావోద్వేగ, నైతిక, సాంఘికపరమైన అభివృద్ధిని సాధించడానికి ఇతర పిల్లలతో వ్యక్తిగత సర్దుబాటు చేసుకోవడానికి కావల్సిన వాతావరణాన్ని ECCE కల్పిస్తుంది.

**iii) తల్లిదండ్రుల అవగాహన లేమి**

పూర్వ బాల్యదశ అత్యంత కీలకమైన దశ. ఈ దశలో అభివృద్ధి రేటు చాలా వేగంగా ఉంటుంది. మన దేశంలోని చాలా కుటుంబాలు వారివారి పిల్లల అభివృద్ధికి కావల్సిన ప్రేరణ కల్గించే పరిసరాలను కల్పించలేని పరిస్థితులు ఉన్నాయి. ఇందుకు పేదరికం ఒక కారణం అయితే తల్లిదండ్రులు అవగాహన రాహిత్యం మరొక కారణం.

**iv) వికాస వాతావరణం కల్పించడం**

పూర్వ బాల్యదశలో ప్రేరణాత్మక పరిస్థితులను కల్పించి వారు స్వతంత్రంగా, స్వేచ్ఛగా వ్యవహరించడానికి, సమగ్రాభివృద్ధికి, ఇతర పిల్లలతో వ్యక్తిగత సర్దుబాట్లు చేసుకోవడానికి పూర్వబాల్యదశ సంరక్షణవిద్య కావాల్సిన వాతావరణాన్ని కల్పిస్తుంది.

**బెంజిమెన్ బ్లూమ్స్ : పిల్లలో 50 శాతం భౌతికాభివృద్ధి వారి మొదటి 4 సంవత్సరాల కాలంలోనే చోటు చేసుకుంటుంది.**

**పూర్వబాల్యదశ సంరక్షణవిద్య ప్రాముఖ్యత:**

1. **కీలకదశ:** పిల్లలు శారీరక, భౌతిక, సాంఘిక, భావోద్వేగ పరంగా అభివృద్ధి చెందడంలో పూర్వబాల్యదశ సంరక్షణవిద్య అధిక ప్రభావం చూపుతుంది.
2. **గుర్తించడం:** పూర్వ బాల్యదశ సంరక్షణ విద్యాకేంద్రాలలో పిల్లల అంగవైకల్యం, బుద్ధిమాంద్యం గుర్తించబడతాయి. ప్రాథమిక స్థాయిలోనే గుర్తించడం ద్వారా ఈ లోపాలను నివారించుటకు సరిచేయడానికి వీలవుతుంది.
3. **అనుసంధానించడం:** పూర్వబాల్యదశ సంరక్షణ విద్య ప్రాథమిక పాఠశాలలతో కలుపుతుంది. ఈ దశలో నేర్చుకున్న పిల్లవాడ్ని పరిసరాల విజ్ఞానం, గణిత భావనలు, స్వేచ్ఛాయుత సంభాషణలు, క్రమబద్ధమైన ఆలోచన, వికాసం, వర్గీకరణ నైపుణ్యాలు, పంచేంద్రియాల వికాసం, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, ప్రాథమిక పాఠశాల విద్య ప్రవేశానికి ఇబ్బంది లేకుండా చేస్తాయి. ప్రాథమిక పాఠశాల సంసిద్ధతకు ఇవి దోహదపడతాయి. పిల్లలందరూ సహజసిద్ధంగా అభ్యసనం కొరకు ఉన్ముఖీకరించబడతారు. నేర్చుకోవడానికి కావల్సిన శక్తులు అందరికీ సమానంగా ఉంటాయి. ఆటల ద్వారా, వస్తువులను విషయాలను పరిశీలించడం ద్వారా, వల్లె వేయడం ద్వారా, పరిసరాలతో ప్రత్యక్ష అనుభవాలను ఏర్పరచుకోవడం ద్వారా పిల్లలు స్వయంగా జ్ఞాన నిర్మాణం గావించుకుంటారు. పిల్లల అభివృద్ధి, అభ్యసనమునకు కారకమయ్యే వివిధ అంశాలు ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి.
4. ప్రాథమిక విద్యాభ్యాసానికి
5. సార్వత్రిక ప్రాథమిక విద్యాలక్ష్య సాధనకు (నమోదు / నిలకడ / కొనసాగింపు) మార్గం
6. విద్యార్థి కేంద్రీకృత, స్వీయ అభ్యసనానికి పునాది
7. స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ, ఆరోగ్యపు అలవాట్లు, సర్దుబాట్లు
8. బాలికల చదువుకు దోహదకారిగా చేస్తుంది.

### 1.3.1 **జీవితకాల అభ్యసనము మరియు వికాసంలో** ECCE **ప్రాముఖ్యత**

Signaficance of ECCE for lifelong learning and Development

పూర్వ బాల్య దశపై జరిగిన వివిధ అధ్యయనాల ప్రకారం మొదటి 5 సంవత్సరాలలోనే మెదడుకు సంబంధించి 90 శాతం వృద్ధి పిల్లలలో జరుగుతుందని తేలింది. ఈ దశలో పిల్లల్లో పెరుగుదల అతి వేగంగా, చురుకుగా ఉంటుంది. ఈ కాలంలో పిల్లలకు పరిసరాలతో కల్పించే అనుభవాలు వారు భవిష్యత్తులో నేర్చుకునే అంశాన్ని నిర్ణయిస్తుందని చెప్పటంలో సందేహం లేదు.

పూర్వబాల్య దశ నుండి ప్రాథమిక విద్య దశకు ఏరకమైన ఇబ్బందులు లేకుండా జరుగుటకు పూర్వప్రాథమిక విద్య ద్వారానే వీలవుతుంది. ఈ దశలో నేర్చుకున్న జ్ఞానము, భాషలు, సాంఘిక, భావోద్వేగ నైపుణ్యాల ద్వారా ప్రాథమిక పాఠశాల దశను కొనసాగించుటకు వీలవుతుంది.

**గుణాత్మకమైన పూర్వబాల్యదశ విద్య దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగి ఉండి దానిపై పెట్టిన పెట్టుబడుల ద్వారా ఎక్కువ ఫలితాలను పొందటానికి వీలు కల్పిస్తుంది. – లారెన్స్ సెవన్‌హట్**

పూర్వబాల్యదశ సంరక్షణ విద్య ద్వారా జరిగే క్రిందిరకమైన మార్పుల వల్ల పిల్లల జీవితాంత విద్యకు పునాది వేయుటకు మరియు భవిష్యత్తులో విద్యను విజయవంతంగా కొనసాగించుటకు తోడ్పడుతుంది.

**ఎ) శారీరకాభివృద్ధి :** పూర్వ బాల్య దశ సంరక్షణ విద్యలో ఇచ్చే శారీరక శిక్షణా కార్యక్రమాల వల్ల ఆనందదాయకమైన కృత్యాలు ఏర్పరచడం వల్ల శారీరకాభివృద్ధి గణనీయంగా పెరుగుతుంది. సమీకృత ఆహారాన్ని ఈ దశలో అందించడం ద్వారా ఆరోగ్యకరమైన బాలలను తయారు చేయటానికి వీలవుతుంది.

**బి) భౌతికాభివృద్ధి :** ప్రేరణాత్మక పరిసరాలు,ఆహ్లాదకరమైన బోధన పద్ధతుల వల్ల పిల్లల్లో భౌతికాభివృద్ధి జరుగుతుంది.

**సి) సామాజిక, నైతికాభివృద్ధి:** సమన్వయము, సహకారము, ఇచ్చిపుచ్చుకోవడం, గౌరవించడం మొదలైన వాటి వల్ల ప్రజాస్వామ్యక, సాంఘికరణలు వృద్ధి చెందుతాయి.

**డి) మానసికాభివృద్ధి :** స్వేచ్ఛ, స్వతంత్ర్యము, పరిసరాలను అనువుగా తీర్చిదిద్దడం వల్ల పిల్లలలో మానసికాభివృద్ధి జరుగుతుంది.

బాలల సమగ్ర వికాసానికి పూర్వ బాల్యదశ పునాది ఏర్పరిచేదశ. ఇది జీవితకాల అభ్యసనానికి, అర్థవంతమైన సంపూర్ణ జీవన విధానానికి తోడ్పడుతుంది.

**RTE 2009 :( Section 11 of the RTE Act)**

With a view to prepare children above the age of 3 years for elementary education and to provide Early Childhood Care & Education for all children untill they complete the age of 6 years. The appropriate Government may make necessary arrangements for providing free pre school education for such children.

**Profile of the Child in India**

**ఆధారపత్రం 2006 Position Paper on ECCE, NCERT 2016**

1. బాలల సంఖ్య 0 నుండి 6 సం॥ల వారు 156 మిలియన్లు. ప్రతి సంవత్సరం 25 మిలియన్లు పుడుతున్నారు.
2. వీరిలో 1/3 వంతు మంది తక్కువ బరువుతో పుడుతున్నారు.
3. వీరిలో 42శాతం మందికి మాత్రమే రోగ నిరోధక టీకాలు అందిస్తున్నాం
4. పౌష్టికాహారం లోపం గల పిల్లలు 47 శాతం మంది ఉన్నారు.(2 సంవత్సరాలలో వారు)
5. 0 నుండి 6 సం॥ల పిల్లల్లో 5శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు.
6. ప్రతి 1000 మందిలో 70 మంది వివిధ కారణాలతో మరణిస్తున్నారు.
7. మొత్తం 0 నుంచి 6 సం॥ల పిల్లలలో సుమారు 20 మిలియన్లు వారు మాత్రమే పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వపరంగా పొందుతున్నారు.

8. ప్రపంచంలో అతి ఎక్కువ పిల్లల జనాభా కల్గిన దేశం భారతదేశం.
9. 60 .......... పిల్లలు పేదరికంలో ఉన్నారు.
10. ICDS ద్వారా పేదరికంలోని 19.4 ........... పిల్లలకు మాత్రమే పూర్వప్రాథమిక విద్యను అందిస్తున్నాము.

## 1.4 ECCE ని 8 సంవత్సరములు పొడిగించుటలో ఔచిత్యము

## (Rational for extending ECCE to 8 years for smooth transition)

NECCECF-2013 (National Early Childhood care & Education Curriculam and framework) ECCE ని 6 సం॥ల వరకు కొనసాగించాలని పేర్కొంటుంది. అయితే పిల్లలకు 8 సం॥ల వయస్సు వచ్చేవరకు వారిలో మార్పులు 6 సంవత్సరముల వయస్సు పిల్లల్లో వచ్చే మార్పులను పోలి ఉంటాయి. వీటిలో ముఖ్యంగా జ్ఞానాత్మక, మానసిక, సాంఘిక రంగాలలో వచ్చే మార్పులు 6 సంవత్సరముల వయస్సు పిల్లల్లో ఉన్న విధంగానే 6 నుంచి 8 సంవత్సరముల వయస్సు పిల్లల్లో ఉండడం వల్ల వీరికి అదేవిధమైన సంరక్షణ మరియు విద్య కొనసాగించాల్సిన అవసరం ఉంది.

6RU18U

### ECCE ని 8 సంవత్సరముల పొడిగింపు – సహేతుక కారణాలు

**1) పెరుగుదల– వికాసాంశాలు:**

6 సంవత్సరముల వయస్సు పిల్లలో వచ్చే మార్పులు 6–8 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలలో వచ్చే మార్పులు ఒకే విధముగా ఉండడం.

**2) వికాసాంశాల కొనసాగింపు:**

ప్రాథమిక పాఠశాలలకు సన్నద్ధులను 6 సం॥ వయస్సు నిండగానే ఒకేసారిగా కాకుండా ఒక క్రమపద్ధతిలో తీసుకురావటానికి అనుగుణంగా వారిని తయారుచేయాల్సిరావడం. ఈ దశలో వికాసాంశాల కొనసాగింపు ఒకే తీరులో వుండటం.

**3) విద్యా ప్రణాళిక – పాఠ్యాంశాలు:**

Pre School నుండి Primary School లో చేరుటకు మరియు వారు Primary School లో కొనసాగుటకు 6 నుండి 8 సంవత్సరముల వయస్సులో కూడా అందుకు కావల్సిన విద్యాప్రణాళికలను సమీకృతం చేయాల్సిన అవసరం ఉండడం. విద్యాప్రణాళిక, ఒక దానితో ఒకటి అనుగుణ్యత కలిగివుండటం.

**4) అభ్యసన మూల్యాంకన విధానం:**

పూర్వబాల్యదశ నందు పిల్లలకు ఎక్కడ కూడా సాధారణంగా నిర్వహించే పరీక్షలలో మార్కులు / గ్రేడులు ఇచ్చే పద్ధతి లేకపోవడం, పిల్లలు 6 సం॥ వయస్సు నిండిన వెంటనే అంటే 6 నుంచి 8 సం॥ల వయస్సు కాలంలో ఒకేసారి పరీక్షలు వ్రాయించి వారికి గ్రేడులు, మార్కులు ఇవ్వడం వలన పిల్లలు ఈ పద్ధతికి అలవాటు పడడం లేదు. ఫలితంగా వారి అభ్యసన వేగము తగ్గవచ్చు. అందువల్ల 6 నుండి 8సం॥ల వయస్సు వరకు ECCE ని విస్తృతపరచి ఒక క్రమపద్ధతిలో వారిని Primary School కు సంసిద్ధులను చేయవచ్చు.

**5) వికాసాల పునాది:**

పూర్వబాల్యదశలో అవసరమైన సంరక్షణ, ఆరోగ్యం, ప్రేరణను కల్పించే సాంఘిక, ఉద్వేగ పరిసరాలు, ఉద్దీపనలు, శిశువు ఉత్తర వికాసానికి తోడ్పడుతూ వుండటం.

## 1.5 పాఠశాల సంసిద్ధత మరియు తొలి అభ్యసనంలో పిల్లలు

## (Early Learning Challenges in School and Concept of School Readiness)

### 1.5.0. సంసిద్ధత (Concept of Shool Readiness):

**పరిచయం:**

పూర్వ ప్రాథమిక విద్యానంతరం ప్రాథమిక విద్యకు సంసిద్ధం కూడా చేయాలి. అందులో భాగంగా టీచరు కింది విధంగా ఈ సంసిద్ధత కృత్యాలను చేయవలసి ఉంటుంది.

**ఉద్దేశ్యం:**

1. పూర్వ పఠన, లేఖన, గణిత నైపుణ్యాలను గుర్తించడం.
2. పిల్లలను పాఠశాలవైపుకు మళ్ళించే సంసిద్ధతను కలిగించడం.

**విధానం:**

1. ముందుగా విద్యార్థులకు వారి ఇంటి వాతావరణాన్ని తరగతి గదిలో, పాఠశాలలో కలిగించాలి.
2. ముద్దు ముద్దుగా మాట్లాడుతూ వారిలో అభద్రత భావాన్ని పోగొట్టాలి.
3. వారికి తెలిసిన అంశాలలోనే మొదట అభ్యసనాన్ని కలిగించాలి.
4. దానికి తగిన చిత్రపటాలు, నమూనాలు, ఉదాహరణలను చూపించాలి.
5. గణిత భావాంశాలకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

ఉదా: దృశ్య భేదాలు, శ్రవణ – దృశ్య సంబంధాలు, కుడి – ఎడమ క్రమం, ఆరోహణ – అవరోహణ క్రమం మొదలైన కృత్యాలలో పఠన, లేఖన, గణితాంశాలలో సంసిద్ధతను కల్పించాలి.

### 1.5.1. తొలి అభ్యసనంలో పిల్లలు ఎదుర్కొనే సవాళ్ళు (Early learning challenges)

**1. అందుబాటు:** మన దేశంలో ఎక్కువ శాతం ECCE కేంద్రాలు ప్రైవేటుసెక్టారులో ఎక్కువగా ఉండడం వలన పేదవారికి అందుబాటులో లేవు. ఆర్థికస్థోమత లేనివారు కావడం కారణంగా ఎక్కువ మొత్తంలో ఫీజులు చెల్లించి పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్చలేకపోతున్నారు. ప్రభుత్వపరంగా నిర్వహించే ECCE కేంద్రాలు సుమారుగా 20 మిలియన్ల బాలికలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నాయి.

**2. వివిధ యాజమాన్యాల నిర్వహణ – నిర్వహణ విధానం:** ECCE కేంద్రాలను ప్రభుత్వ, ఎన్.జి.ఒ., ప్రైవేటు రంగాలలో నిర్వహిస్తున్నప్పటికీ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేకపోవడం వలన అనుకున్న స్థాయిలో పిల్లలకు గుణాత్మకమైన అభ్యసనను అందించలేకపోతున్నాం.

**3. పర్యవేక్షణ:** సరియైన పర్యవేక్షణ లేకపోవడం వలన వివిధ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ECCE కేంద్రాలలో పూర్వబాల్యదశ విద్యాప్రణాళికలు అమలు కావడం లేదు. అక్కడ ఉన్న పరిసరాలు కూడా ఆనందదాయక అభ్యసన (Joyful Learning) కు అనుకూలంగా ఉండడం లేదు. పూర్వప్రాథమిక విద్యకు పరిమితమైన ప్రాధాన్యత ఇవ్వడం.

**4. మాతృభాష–గృహ భాష :** మాతృభాషకు / గృహ భాషకు ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వలన పిల్లలు ECCE కేంద్రాలలో ఇంటిదగ్గర ఉపయోగించే భాష ఒక రకంగా ఉండి, ఇక్కడ ఉపయోగించే భాష మరొక విధంగా ఉండడం వలన అయోమయానికి లోనవుతున్నారు.

**5. శిక్షణ–ఉపాధ్యాయుల కొరత:** ECCE విద్యాకేంద్రాలలో శిక్షణపొందని ఉపాధ్యాయుల వలన 3 నుండి 6 సం॥ల వయస్సు పిల్లలను సాధారణ పాఠశాలల పిల్లలుగా భావించి చదవడం, రాయడం, గణిత భావనలు నేర్పించడం ద్వారా, వాటికే ప్రాధాన్యత ఇవ్వడం వలన వారిని ఒత్తిడికి గురిచేస్తున్నారు. పూర్తిగా సరిపోని శిక్షణ, వృత్తి నైపుణ్యాలు వుండటం.

**6. అభ్యసన వాతావరణం:** పరిసరాలతో సహసంబంధం కల్పించి, ఆట, పాట, మాట, కథ, సృజనాత్మకతలకు అవకాశం కల్పించకుండా నియమనిబంధనలు, Time table, శిక్షణలు అమలుచేయడం ద్వారా పిల్లల స్వేచ్ఛను హరిస్తూ వారు పాఠశాల అంటేనే భయపడేటట్లు చేస్తున్నారు.

**7. తల్లిదండ్రులు – అవగాహన:** పిల్లల తల్లిదండ్రులు కూడా పూర్వబాల్యదశ విద్యపై సరైన అవగాహన లేకపోవడం వలన ECCE నిర్వహణ సాధారణ పాఠశాలల నిర్వహణ మాదిరిగా నిర్వహించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు.

**8. పర్యవేక్షణ – నిర్వహణ విధానం:** పూర్వబాల్యదశ సంరక్షణ విద్యాకేంద్రాలు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉండగా ఆయా శాఖల మధ్య కొరవడిన సమన్వయం వలన వీటి నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. సరియైన పర్యవేక్షణ, శిక్షణ, ప్రణాళిక లేకపోవడం.

**ప్రత్యామ్నాయం – చక్కదిద్దే ఏర్పాటు:**

1. పూర్వబాల్యదశ సంరక్షణ విద్యాకేంద్రాల నిర్వహణలో ఇబ్బంది ఉన్నప్పటికీ ఒక క్రమబద్ధమైన విద్యాప్రణాళిక మరియు దాని అమలుకు ఉన్న శాఖల మధ్య సమన్వయంతో పాటు సమాజ భాగస్వామ్యం మరియు తల్లిదండ్రుల తోడ్పాటుల ద్వారా వాటిని అధిగమించి అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు.
2. అలాగే ప్రభుత్వరంగంలో, Private రంగంలో, NGOs ల ద్వారా నిర్వహిస్తున్న ECCE కేంద్రాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవడం
3. పిల్లల మాతృభాష/ గృహ భాషలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం.
4. వారికి పౌష్ఠికాహారాన్ని అందిస్తూ శారీరక, మానసిక రంగాలలో ఉన్నతస్థితిని చేరుకునేలా చేసే అవకాశం మొదలైనవి పూర్వప్రాథమిక విద్య సవాళ్ళను పరిష్కరించడానికి దోహదపడతాయి.


### 1.5.2 శిశువులను ప్రాథమిక పాఠశాల ప్రవేశానికి అనుసంధానంగా పూర్వ ప్రాథమిక విద్య (Linkage of ECCE and Primary School for child Admission)

1. పూర్వ ప్రాథమిక పాఠశాలలో ప్రవేశించక ముందు విద్యార్థి ఇంటి దగ్గర తల్లి ద్వారా, కుటుంబసభ్యుల ద్వారా, పరిసరాలలోని పిల్లలు, వ్యక్తుల ద్వారా, మాస్ మీడియా ద్వారా భాషను, పరిసరాల విజ్ఞానాన్ని, గణిత భావాల జ్ఞానాన్ని అసంకల్పితంగానే సంపాదిస్తాడు. కొన్ని సందర్భాలలో కొద్దిపాటి శిక్షణ ద్వారా నేర్చుకొంటాడు. ఇలా గృహంలో, పరిసరాలలో నేర్చుకొన్న విద్య విద్యార్థిని పూర్వ ప్రాథమిక పాఠశాలలకు సమన్వయపరచి కలుపుతుంది.

2. పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి సులభమైన అంశాలు నేర్పుతారు. ఇవి కూడా ప్రాథమిక పాఠశాల విద్యకు అనుసంధానం అయ్యేటట్లుగా తయారుచేస్తారు.

| పూర్వ ప్రాథమిక పాఠశాలలో నేర్చుకొనే అంశాలు | ప్రాథమిక పాఠశాలలో నేర్చుకొనే అంశాలు |
|---|---|
| **భాష:** సులభమైన గేయాలు, పాటలు స్వేచ్ఛా సంభాషణలు. స్వేచ్ఛాయుత పాత్రపోషణ బొమ్మలను చూసి పేర్లు చెప్పడంలో శిక్షణ, స్వేచ్ఛగా గీతలు గీస్తారు. | అనుబంధమైన పొడవాటి గేయాలు, పాటలు, నిర్దేశిత సంభాషణలు, నాటకాలు బొమ్మలను వాటి పేర్లను జతపరచడం. అక్షరాలు, పదాలు నేర్చుకొంటారు. |
| **గణితం:** పెద్ద – చిన్న; పొడవు – పొట్టి; బరువు – తేలిక మొదలైన గణిత భావనలు కొంత శిక్షణ ద్వారా నేర్పిస్తారు. | ఈ భావనల ద్వారా గణిత భావనలు, సంజ్ఞా రూపంలో క్రమబద్ధంగా నేర్చుకొంటారు. |
| **పరిసరాల విజ్ఞానం:** కుటుంబం, జంతువులు, ఇళ్ళు, పళ్ళు, కూరగాయలు, మొక్కలు మొదలైన అంశాలు పరిచయం చేయడం | వీటి ద్వారా పరిసరాల విజ్ఞానం పద్ధతిలో బోధన అభ్యసనం జరుగుతుంది. |

3. ఈ విధంగా విద్యార్థి గృహంలో, పరిసరాలలో నేర్చుకొన్న విద్య పూర్వ ప్రాథమిక విద్యకు ఉపయోగపడుతుంది. అదే విధంగా శిశు విద్యలో నేర్చుకొన్న విషయ పరిజ్ఞానం విద్యార్థిని ప్రాథమిక పాఠశాల విద్యకు సన్నద్ధం చేస్తుంది. దీన్నే మనం కింది చిత్రం ద్వారా సూక్ష్మంగా అర్థం చేసుకోగలం.




### 1.5.3 పాఠశాల సంసిద్ధతలో పూర్వ పాఠశాల ప్రాముఖ్యం: (Significance ECCE School Readiness)

పిల్లలు గృహవాతావరణానికి బాగా అలవాటుపడి ఉంటారు. కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలతో మెలుగుతూ ఉంటారు. ఇంటిలోని వస్తువులతో, తల్లిదండ్రులు కనిపెట్టిన ఆటబొమ్మలతో ఆడుకుంటూ, ఇంటిలోను, బయట తిరుగుతో స్వేచ్ఛ, భద్రత గల వాతావరణంలో పెరుగుతుంటారు. వీధిలోని సమవయస్కులతో సహవాసంచేస్తూ, సంభాషించుకుంటూ, పాటలు పాడుకుంటూ, వారితో ఆటలాడుకుంటూ ఉంటారు. ఇటువంటి ప్రేమపూర్వక, స్నేహ వాతావరణం నుంచి కొన్ని నిబంధనలకు, క్రమశిక్షణకు ఆలవాలమైన నియత పాఠశాలలకు రావడానికి పిల్లలు ఇష్టపడరు.

ప్రాథమిక పాఠశాలల్లో గృహవాతావరణానికి భిన్నంగా కొత్తవారు దర్శనమిస్తారు. రకరకాల వాతావరణాల నుంచి వచ్చిన పిల్లలు, రకరకాల మనస్తత్వంగల పిల్లలు పాఠశాలలో కనిపిస్తారు. పిల్లలు అపరిచితుడైన ఉపాధ్యాయుడిని చూస్తారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు ఉపయోగించే కుర్చీ, మేజా బెంచీలు కొంతమంది పిల్లలకు కొత్త. ఇంటిలో కనబడని వస్తువులు ఎన్నో పాఠశాలలో దర్శనమిస్తాయి. పాఠశాల ఆటస్థలం కూడా కొత్తదనాన్ని కలిగిస్తుంది.

కొన్ని పాఠశాలలు గ్రామానికి దూరంగా ఉండటం, చుట్టుపక్కల ఇండ్లు లేకపోవడం, పాఠశాలకు ఒంటరిగా నడవాల్సిరావడం పిల్లలకు అభద్రతా భావాన్ని కలిగించే అంశాలే.

పాఠశాలకు వేళకు సరిగ్గా హాజరుకావడం నియమిత సమయాల్లోనే తరగతిగది నుంచి బయటికి రావడం, ఉపాధ్యాయుడు చెప్పే కృత్యాలు చేయడం కదలకుండా బుద్ధిగా కూర్చుని గంటల తరబడి పాఠాలను వినడం పిల్లవాడికి ఆసక్తిలేని అంశాలే.

కాబట్టి పిల్లలను ప్రాథమిక పాఠశాలకు రప్పించడానికి, పాఠశాల వాతావరణానికి అలవాటు చేయడానికి సంసిద్ధతా కార్యక్రమం అవసరమవుతుంది.

పూర్వ ప్రాథమిక విద్య ప్రప్రథమంగా పాఠశాలలో చేరే మొదటితరం అభ్యాసకులకు ఎంతో తోడ్పడుతుంది. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనందువల్ల వారి గృహాలలో విద్యా చైతన్యం లేనందువల్ల వారి పిల్లలు భాష, గణితం మొదలయిన విద్యా విషయాలలో వెనుకబడి ఉంటారు. వీరు నేరుగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశిస్తే విద్యావంతుల కుటుంబాల నుంచి వచ్చిన ఇతర పిల్లలతోపాటు సమానంగా అభివృద్ధిని సాధించలేరు. పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాలు ముఖ్యంగా మొదటితరం అభ్యాసకులను ప్రాథమిక పాఠశాలకు సన్నద్ధం చేస్తాయి.

కొంతమంది పిల్లల మాతృభాష రాష్ట్రం ఆమోదించిన భాషగా ఉండకపోవచ్చు. వీరు ప్రాథమిక పాఠశాలల్లో నేరుగా ప్రవేశిస్తే పాఠశాలల్లోని బోధనా భాషకు త్వరితంగా ఆకర్షితులు కాలేరు. ఇతర పిల్లలకంటే వెనుకబడిపోతారు. ఇటువంటి పిల్లలు కూడా ప్రథమంగా పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలలో అభ్యసించడం అవసరం.

ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల పరిస్థితులను గమనిస్తే ఒకటవ తరగతిలో చేరిన పిల్లలందరూ ప్రాథమిక విద్య ముగిసే వరకు కొనసాగడంలేదు. దాదాపు 35 శాతం మంది పిల్లలు ఒకటవ తరగతిలోనే మధ్యంతరంగా పాఠశాల నుంచి విరమించుకుంటున్నారు. ఇలా జరపడానికి ముఖ్య కారణం పిల్లలు తమ గృహ జీవితం నుంచి విద్యాభ్యాసానికి ఆవశ్యకమైన సంసిద్ధతను పొందకుండానే అమాంతం ఒకటవ తరగతిలో చేరిపోవడం నేరుగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశించిన పిల్లలు పాఠశాల వాతావరణానికీ, పాఠ్యప్రణాళిక వల్ల ఏర్పడే ఒత్తిడులకూ, సర్దుబాటు చేసుకోవడమే.

### 1.5.4 ECCE పాఠశాల సంసిద్ధత (School Readiness):

గృహ వాతావరణానికి అలవాటు పడి స్వేచ్ఛగా ఆటలాడుతూ ప్రేమపూర్వక వాతావరణంలో పెరుగుతూ ఒక్క సారిగా పాఠశాలలకు రావడాన్ని పిల్లలు ఇష్టపడరు. ప్రాథమిక పాఠశాలల్లో వివిధ వాతావరణ పరిస్థితులు గృహ వాతావరణం నుండి రావడం వల్ల వారిలో రకరకాల మనస్తత్వం కలవారుంటారు. అలాగే ఉపాధ్యాయులు కూడా భిన్నమైన రీతిలో బోధన చేయడం, కొన్ని నిబంధనలు, క్రమశిక్షణ పేరుతో పిల్లలను శిక్షించడంలాంటివి కనిపిస్తూ ఉంటాయి. కానీ పిల్లలకు ఇలాంటి పరిస్థితులు ECCE కేంద్రాలలో కనిపించవు. ECCE కేంద్రాలలో సమవయస్కుల మధ్య ఇమిడిపోవడం, సాంఘికీకరణ చెందడం, ప్రజాస్వామ్యక విలువలు పెంపొందించడం, స్వేచ్ఛాయుత వాతావరణంలో పరిసరాల సమన్వయంతో అభ్యసన కొనసాగించడం వలన వారు ప్రాథమిక పాఠశాలల్లో ఏ ఇబ్బంది లేకుండా ప్రవేశించడానికి వీలవుతుంది. అంటే సామర్థ్యాలు, నైపుణ్యాలు అభివృద్ధి పంచుకోవడానికి, స్వయం సంసిద్ధులను చేయడం సంసిద్ధతగా చెప్పుకోవచ్చు.

**ప్రాథమిక పాఠశాలల్లో చేరడాన్ని పిల్లలకు అవసరమైన సంసిద్ధతలు**

**ఎ) వ్యక్తిగత సాంఘిక సంసిద్ధత:** పూర్వ బాల్యదశ విద్యా కేంద్రాలు పిల్లల్లో మంచి వ్యక్తిగత అలవాట్లు నేర్పిస్తాయి. పాఠశాల వాతావరణానికి అలవాటుపడేట్లు ఈ కేంద్రాలు భద్రతను కల్పిస్తాయి. ఆటలు, కథలు, సృజనాత్మక కృత్యాలు ద్వారా పిల్లలు గృహవాతావరణంలో పొందిన స్వేచ్ఛను ECCE కేంద్రాలలో కూడా పొందుతారు. ఫలితంగా అభ్యసనంకు

ప్రేరణ పొంది ఒక క్రమబద్ధమైన విధానానికి అలవాటు పడతారు. ఇవన్నీకాకుండా ప్రాథమిక పాఠశాల పిల్లలకు ప్రధాన భూమికగా ఉండి ప్రాథమిక విద్యకు ఏ రకమైన ఇబ్బంది లేకుండా కొనసాగించేటట్లు వీలు కల్పిస్తారు.

**బి) మనోచలనేంద్రియాల సంసిద్ధత :** వివిధ కృత్యాలు, కార్యక్రమాల నిర్వహణ ద్వారా పూర్వబాల్యదశ సంరక్షణ విద్యాకేంద్రాలలో పంచేంద్రియాలకు ప్రేరణలు కల్పించడం వలన వాటి మధ్య సమన్వయం జరుగుతుంది. ఈ దశలో పిల్లల అభివృద్ధిరేటు ఎక్కువ. ఈ కేంద్రాలలో ఆట, పాట, రంగులు, బొమ్మలువేయడం, నాటకాలు, పాటలు పాడడంలాంటి కృత్యాల ద్వారా శారీరకంగా, మానసికంగా పిల్లల్లో వృద్ధి జరిగి వారు ప్రాథమిక విద్యకు అనుకూలంగా తయారౌతారు.

**సి) విద్యాసంసిద్ధత :** పఠనం, లేఖనం, సంఖ్యాభావనల పరిచయం ఈ కేంద్రాలలో అమలు చేయడం, మరియు కృత్యాల ద్వారా నేర్పించడం వలన వీరు ప్రాథమిక పాఠశాలల్లో విద్యాభ్యాసాన్ని ఏ రకమైన ఇబ్బంది లేకుండా కొనసాగిస్తారు.

**డి) సాంఘికీకరణం :** జట్టు కార్యక్రమాల నిర్వహణ, ఇతరులను గౌరవించడం, వారి అభిప్రాయాలకు విలువనివ్వడం ECCE లో నేర్పించడం జరుగుతుంది. ఈ అలవాట్లను ప్రాథమిక పాఠశాలల్లో వారు కొనసాగించి ఏ రకమైన ఇబ్బంది లేకుండా అందరిలో ఇమిడిపోతారు.

## 1.6 ప్రభుత్వ, స్వచ్ఛంద మరియు ప్రవేటు నిర్వహణలోని పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్యాకేంద్రాల నిర్వహణ మరియు సమీక్ష

**(Critical appraisal of current practice in ECCE Centre of Government, NGO's private managements):**

**ఎ) ప్రభుత్వ రంగం – పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య:** ప్రభుత్వం రంగం ద్వారా 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లల్లో 19.64 శాతం పిల్లలకు మాత్రమే పూర్వప్రాథమిక విద్యను అందించగలుగుతున్నాము (MHRD – 2003) ఇటీవలి కాలంలో ECCE కేంద్రాల విస్తరణ, ICDS బలోపేతం కావడం DPEP, SSA పథకాల అమలు ద్వారా ఎక్కువ మంది పిల్లలకు ECCE విద్యను అందించగలుగుతున్నాము.

భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖల నాలుగు ప్రభుత్వ విభాగాలు ECCE కు సంబంధించి ఈ క్రింది విధంగా భాధ్యత వహిస్తున్నాయి. అవి:

| బాధ్యత వహించే అంశము | వయస్సు | ప్రభుత్వరంగ శాఖ |
|---|---|---|
| 1.పౌష్టికాహారం, ఆరోగ్యవిద్య మరియు పూర్వప్రాథమిక సంరక్షణ విద్య | 0–6 సం॥ | డిపార్టుమెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (మినిస్ట్రీ ఆఫ్ ఎం.హెచ్.ఆర్.డి) |
| 2.రోగనిరోధక టీకాలు | 3–6 సం॥ | డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ |
| 3.వైకల్యాల నిరోధక మరియు వాటిని ముందుగానే గుర్తించడం | గర్భస్థ శిశువు నుంచి 6 సం॥ల వరకు | సాంఘికన్యాయం (మినిస్ట్రీ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ & ఎమ్‌పవర్‌మెంట్ |
| 4.పూర్వప్రాథమిక విద్య | 3–6 సం॥ | డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ( మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ & డెవలప్‌మెంట్ |

పైరకమైన వివిధ కార్యక్రమాల రూపకల్పన మరియు అమలుకు సంబంధించి ఖర్చులను కేంద్ర ప్రభుత్వం భరిస్తుండగా రాష్ట్రప్రభుత్వాలు కార్యక్రమాల అమలుకు బాధ్యత వహిస్తున్నాయి.

0–6 సం॥ వయస్సు పిల్లలు దేశం మొత్తంలో సుమారుగా 158 మిలియన్లు ఉండగా వారిలో సుమారుగా 20 శాతం పిల్లలకు ప్రభుత్వరంగం ద్వారా నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా ECCE కార్యక్రమాలు అమలు అవుతున్నాయి. ECCE కార్యక్రమాలను ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ స్కీమ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్నాం. ఎక్కడైతే ఐ.సి.డి.ఎస్ కార్యక్రమాలు అమలు కాని ప్రాంతాలు ఉన్నాయో అక్కడ డి.పి.ఇ.పి. / ఎస్.ఎస్.ఎ ల ద్వారా ECCE కేంద్రాలను నిర్వహిస్తున్నాం. ఈ రెండు విభాగాల ద్వారా మన దేశంలో అతి తక్కువ శాతం మంది పిల్లల మాత్రమే అనగా సుమారు 20 శాతం మంది పిల్లలు లబ్ధి పొందుతున్నారు.

**ECCE కార్యక్రమాలు ICDS సేవలు**

- Health Checkups
- Immunization
- Growth promotion and supplemnetary feeding
- Referral services
- Early childhood care and pre-school education
- Nutrition and Health Education

**అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ECCE కేంద్రాల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం**

1. సమాజాన్ని భాగస్వామ్యం చేయడం
2. పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణ విద్య మొదలైన వాటి పట్ల అవగాహన కల్పించడం.
3. ఆట, పాట, మాట, కథ, సృజనాత్మకతల ద్వారా పిల్లల్లో ఉత్సాహభరితమైన అభ్యసన కొనసాగిస్తూ వారి శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడటం.
4. పూర్వబాల్యదశ విద్యా ప్రణాళిక అమలుకు అవసరమైన సామగ్రిని తయారు చేయడం.
5. జట్టు కార్యక్రమాలు, ఇచ్చి పుచ్చుకోవడం, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించి వారిలో సాంఘికీకరణం పెంపొందించవచ్చు.
6. ప్రాథమిక పాఠశాలలకు సంసిద్ధులను చేయడం

**బి) ప్రైవేట్ రంగం – పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య**

ప్రైవేట్ రంగంలో వివిధ రకాలైన పేర్లతో లాభాపేక్ష ప్రధాన ఉద్దేశ్యంతో పూర్వబాల్యదశ విద్యా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. డే కేర్ కేంద్రాలు , నర్సరీ కిండర్ గార్డెన్‌లు మొదలగు పేర్లతో ప్రైవేట్ రంగంలో ECCE కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి.

ప్రభుత్వరంగంలో నిర్వహిస్తున్న ECCE / అంగన్‌వాడీ కేంద్రాలలో కంటే ప్రైవేటు సెక్టార్‌లో నిర్వహిస్తున్న డే కేర్, నర్సరీ కిండర్ గార్టెన్ కేంద్రాలలో ఉన్న పిల్లల సంఖ్య చాలా ఎక్కువ. ప్రైవేటు రంగంలో ఈ కేంద్రాలు మహానగరాలు పట్టణాలు, చిన్న పట్టణాలు, గ్రామాలు, మురికివాడలలో సైతం నిర్వహించబడుతున్నాయి. ప్రైవేటురంగం వారు ఆంగ్లంను బోధనా భాషగా ఈ కేంద్రాలలో ఉంచడం వలన తల్లిదండ్రులు ఈ కేంద్రాలకు ఆకర్షితులౌతున్నారు. కాని ............

కేంద్రాలలో నిర్వహించబడుతున్న ECCE కేంద్రాలలో ఈ క్రింది ఇబ్బందులు ఉన్నాయి.

- పిల్లలను ECCE లో చేర్చుకునే సందర్భంలో ఇంటర్వ్యూ నిర్వహించడం.
- ప్రాథమిక స్థాయిలో అనుసరించే బోధన వ్యూహాలు వాటిపై రుద్దడం.
- నియత పద్ధతులను, సిలబస్‌ను కేంద్రాలలో అమలు చేయటం ద్వారా పిల్లలను ఎక్కువ వత్తిడికి, విసుగుకు గురిచేయడం.
- ఈ సమస్య పిల్లలకు ఇంటిపని / రాతపని ఇవ్వకూడదనే నియమం ఉన్నప్పటికి ప్రైవేటు పూర్వ బాల్యదశ కేంద్రాలలో వీటిని ఇవ్వడం ద్వారా పిల్లలు ఆడుకునే సమయాన్ని హరించివేస్తున్నారు.
- మాతృభాషలో కాకుండా ఆంగ్లమధ్యమంలో బోధన వికాసానికి అడ్డంకిగా మారుతుంది.

అదేవిధంగా విపరీతమైన హామీలతో ఎక్కువమంది పిల్లలను తమ కేంద్రాలలో చేర్చుకుంటున్నారు. సరైన వనరులు, బిల్డింగులు శిక్షణపొందిన ఉపాధ్యాయులు ఈ ప్రైవేటు రంగంలోని కేంద్రాలలో లేకపోవడం దీనితోపాటు పర్యవేక్షణ కూడా లేకపోవడం వలన నాణ్యమైన గుణాత్మకమైన విద్య ఇక్కడ కొరవడింది. పిల్లలకు ప్రాథమికస్థాయిలో నేర్పించే 3R లను ఈ కేంద్రాలలో నేర్పించడం, సరైన వసతులు, ఆటస్థలం లేకపోవడం, ఇంటిపనికి ప్రాధాన్యత ఇవ్వడం వలన పూర్వబాల్యదశలో పిల్లలు విసుగుకు లోనై ఒత్తిడికి గురౌతున్నారు.

**సి) స్వచ్ఛందసంస్థలు–పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య**

స్వచ్ఛంద సేవాసంస్థల ద్వారా నిర్వహించే పూర్వబాల్యదశ విద్యాకేంద్రాలు చాలా తక్కువగా ఉన్నప్పటికీ కొంతవరకు సమర్థవంతంగా ఇవి నిర్వహిస్తున్నాయి.

ఈ స్వచ్ఛంధ సంస్థలు క్రెచ్చర్స్, డే కేర్ సెంటర్స్, బాల్వాడి కేంద్రాల ద్వారా పూర్వబాలవిద్యను నిర్వహిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వరంగంలోని ఇ.సి.సి.ఇ కేంద్రాలను అనుకరిస్తూనే మరియొకవైపు తల్లిదండ్రుల ఒత్తిడి వలన ప్రైవేటు రంగంలోని సంస్థల లాగా నిర్వహణను కొనసాగిస్తున్నాయి.

## ముఖ్యాంశాలు

- కీలకమైన పూర్వబాల్య దశలో అవసరమైన సంరక్షణ, విద్యకు అనేక అంశాలను ఎందరో ప్రముఖ తత్వవేత్తలు, విద్యావేత్తలు, విజ్ఞానశాస్త్రవేత్తల ఆలోచనలు, అభిప్రాయాలతో సమగ్రమైన పూర్వప్రాథమిక విద్యావిధానాన్ని రూపొందించగలిగినాము.
- పూర్వబాల్యదశ సంరక్షణ, విద్యా కార్యక్రమాలకోసం వివిధ కమిటీల, కమీషన్‌ల పరిగణనలోనికి తీసికొని జాతీయ స్థాయిలో భారతదేశ అవసరాలకు తగ్గ పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను దృష్టిలో వుంచుకొని పూర్వప్రాథమిక విద్య లక్ష్యాలను రూపొందించడం జరిగింది.
- జీవితకాల అభ్యసనాన్ని, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని బాలల సమగ్రమైన వికాస కార్యక్రమాన్ని తయారుచేయడం జరిగింది. అందుకై ఈ కార్యక్రమాన్ని 8 సంవత్సరాలు కొనసాగించడం అవసరమని గుర్తించాము.
- తొలి అభ్యసనంలో పిల్లలు ఎదుర్కొనే సవాళ్ళు గుర్తించి వాటికి తగిన ప్రత్యామ్నాయాలతో సవాళ్ళను, ఎదుర్కొన్ని చక్కదిద్దే ఏర్పాటు చేయడం ద్వారా బాలల వికాస కార్యక్రమాలను బలోపేతం చేశాము.

- పూర్వప్రాథమిక విద్య, ప్రాథమిక విద్యను అనుసంధానించడం, బాలలను పాఠశాల సంసిద్ధతకు మార్గం సుగమమైంది. పూర్వ ప్రాథమిక విద్య ద్వారా వివిధ అంశాలతో బాలలను సంసిద్ధులను చేస్తూ అందరికి ప్రాథమిక విద్యను అందించగల్గుతున్నాం.
- అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా పూర్వ బాల్య సంరక్షణ, విద్యను కొనసాగిస్తూ బాలల వికాసానికి తోడ్పాటుకు చేయూతను ఇవ్వగలుగుతున్నాం.

## మూల్యాంకనం

**వ్యాసరూప ప్రశ్నలు :**

1. పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య యొక్క ముఖ్య లక్ష్యాలను వివరించి మనదేశంలో ఇ.సి.సి.యి ని ఎందుకు బలోపేతం చేయాలో తెలియచేయండి?
2. ప్రీస్కూల్ విద్యపై రూసో వెలుపరిచిన అభిప్రాయాలను వివరించండి.
3. ఆటల ద్వారా అభ్యసనం ఎందుకు ఆదర్శవంతమైన పద్ధతిగా పేర్కొంటారు?
4. పూర్వబాల్యదశ సంరక్షణ విద్యపై మేరియా మాంటిస్సోరి, ఫ్రోబెల్‌ల భావాలను వివరించండి.
5. గాంధీజీ ప్రీబేసిక్ ఎడ్యుకేషన్ విద్యాతత్త్వాన్ని, లక్ష్యాలను వివరించండి.
6. పూర్వప్రాథమిక విద్యలో ఫ్రోబెల్ యొక్క కిండర్‌గార్టెన్ విద్యావిధానం దాని ప్రాముఖ్యతను తెలియజేయండి.
7. జీవితాంత అభ్యసనం మరియు వికాసంలో పిల్లల పూర్వబాల్యదశ సంరక్షణవిద్య ఎంతో కీలకమైనది. చర్చించండి.

**సంక్షిప్త ప్రశ్నలు :**

1. ఠాగూర్ విద్యాతత్త్వాన్ని వివరించండి.
2. ECCE ని 0 నుండి 6 సం॥ ల వయస్సునుండి 8 సం॥ల వయస్సు వరకు పొడిగించుటలోగల ఔచిత్యం.
3. పూర్వప్రాథమిక విద్యపై గాంధీ భావనలను తెలియజేయండి.
4. ECCE లో ఎదుర్కొంటున్న సవాళ్ళను వివరించండి.
5. ECCE ప్రాథమిక పాఠశాల సంసిద్ధతకు ఎంతవరకు ఉపయుక్తంగా ఉంటుంది వివరించండి.

**ప్రాజెక్టుపని :**

1. వివిధ విద్యాతత్త్వవేత్తలు (ఈ పాఠ్యాంశములో వివరించినవారు కాకుండా) పూర్వప్రాథమిక విద్యపై వెలిబుచ్చిన అభిప్రాయాలను సేకరించండి.
2. వివిధ యాజమాన్యాలలో నిర్వహించబడుతున్న ECCE కేంద్రాలను సందర్శించి అమలు జరుగుతున్న కార్యక్రమాలపై సమగ్ర నివేదిక రూపొందించండి.
3. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం ఎదుర్కొంటున్న సమస్యలు (సవాళ్ళు)పై ఒక నివేదిక రూపొందించి, వాటి పరిష్కార మార్గాలను తయారుచేయండి.
4. వివిధ యాజమాన్యంలోని 1వ తరగతి ఉపాధ్యాయులను కలిసి, ఆ తరగతి పిల్లల వివిధ నేపథ్యాలను వారి అభ్యసనతీరు వివరాలను సేకరించి నివేదికను రూపొందించడి.

## రిఫరెన్స్ పుస్తకాలు


1. Excempler Guidelines for implimentation of Early Childhood Care and Education Curriculam, NCERT
2. What challenges exist for Early Childhood Care and Education? What should we do about them? - Nicholar Burnett (World Conference on ECCE, Sept 27 - 29, 2010 in Moscow)
3. National ECCE Policy 2012 (M.W.C.D. of India)
4. ECCE in India - Mid Decade Assessment - Venita Kaul, Deepa Sankar, National University of Education Planning and Administration, New Delhi)
5. Early Childhood Care and Education, M. Sen Gupta
6. Position Paper, NCERT
7. NCF - 2005
8. డి.ఇడి., సమ్మిళిత విద్య, తెలుగు అకాడమి – 2010
9. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యా దృక్పథాలు, తెలుగు అకాడమి 2001.
10. డి.ఎడ్. వర్ధమాన భారతదేశంలో విద్య – తెలుగు అకాడమి – 2010

# 2 పూర్వ బాల్యదశ సంరక్షణ విద్య

## విద్యా ప్రణాళిక నియమాలు మరియు పద్ధతులు

**లక్ష్యాలు :**

ఈ యూనిట్ చదవడం ద్వారా మీరు

1. పిల్లలు వివిధ దశలలో ఎలా నేర్చుకుంటారో అవగాహన చేసుకుంటారు.
2. పిల్లల అవసరాలు, వాటి స్వభావం, వాటిని తీర్చడానికి ఏవిధంగా కృషి చేయాలో తెలుసుకుంటారు.
3. ప్రారంభ సంవత్సరాల అభ్యసనంలో చురుకైన క్రీడా పద్ధతుల ప్రాధాన్యతను అవగాహన చేసుకుంటారు.
4. క్రీడా పద్ధతులైన మాంటిస్సోరి, కిండర్ గార్టెన్ మరియు పియాజే పద్ధతులను అవగాహన చేసుకుంటారు.
5. ECCE విద్యా ప్రణాళిక మార్గదర్శక సూత్రాలు అవగాహన చేసుకుంటారు.
6. వివిధ రంగాలలో పిల్లల వికాసం గురించి, అందుకోసం ECCE కేంద్రాలలో నిర్వహించే కార్యక్రమాల గురించి అవగాహన చేసుకుంటారు.
7. పూర్వ బాల్యదశలో పిల్లలలో అక్షరాస్యత మరియు సంఖ్యాభావనలు కలిగించుటకు ఏవిధంగా కృషి చేయాలో తెలుసుకుంటారు.
8. ECCE కేంద్రాలలో అంశాలైన విద్య, సంరక్షణ, పోషణ మరియు అలవాట్లు ఏర్పరచడంలో అమలు జరిగే కార్యక్రమాలను అవగాహన చేసుకుంటారు.

**ఉపశీర్షికలు (Sub Topics of the Unit)**

2.1. పిల్లలు ఎలా నేర్చుకుంటారు?
పూర్వ బాల్యదశ, ఉత్తర బాల్య దశల మధ్య భేదాలు.

2.2 పిల్లల అవసరాలు మరియు స్వభావము
1) స్వేచ్ఛ - భావవ్యక్తీకరణ ప్రయోగశీలత, ప్రోత్సాహం, సవాళ్లు
2) ఆనందం / సంతోషం - ఆసరా, రక్షణ మరియు భద్రత, అవకాశం, మార్గదర్శకత్వం
3) సర్దుబాటు - సమిష్టి సహకారం, వినటం, సహనం, పంచుకోవడం మరియు సహానుభూతి
4) ఆరోగ్యం, క్షేమం, ఆరోగ్య అలవాట్లు, పౌష్టికాహారం

2.3 ప్రారంభ అభ్యసనంలో చురుకైన క్రీడాపద్ధతుల ప్రాధాన్యత, మార్గదర్శక సూత్రాలు

2.4 మార్గదర్శక సూత్రాలు - అభ్యసనానికి ఆధారం క్రీడలు - కళలు. అనుభవము సాధించడమేగాని నిపుణత సాధించడం కాదు.

2.5 పిల్లల సమగ్రాభివృద్ధి రంగాలు - వాటికి సంబంధించిన కృత్యాలు

2.6 ప్రారంభ సంవత్సరాలలో అక్షరాస్యత మరియు సంఖ్యా భావన

2.7 ECCE లోని అంశాలు మరియు బోధనాభ్యసన ఉపగమాలు (విద్య, సంరక్షణ, పోషణ, అలవాట్లు ఏర్పడుట, సంరక్షకుడు)

**పరిచయము**:

పూర్వ బాల్యదశ సంరక్షణ మరియు విద్య ( ECCE ) విద్యా ప్రణాళిక అంటే ECCE కేంద్రాలలో నిర్వహించబడే మొత్తం కార్యక్రమాల సమాహారం అనగా పిల్లల సంరక్షణ, రోజువారీ కార్యక్రమాలు, పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, భావోద్వేగ వికాసానికి సంబంధించిన అంశాలన్నింటిని వివరించేది విద్యా ప్రణాళిక. ECCE విద్యా ప్రణాళిక స్వభావాన్ని బట్టి దీనిని విద్యా ప్రణాళిక బదులుగా విద్యా కార్యక్రమాలు అని వ్యవహరించటం జరుగుతుంది.

మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2013లో జాతీయ పూర్వ బాల్యదశ సంరక్షణ మరియు విద్యా విధానాన్ని (National Early Child Care and Education Policy 2013) రూపొందించింది. దీని ప్రకారం ECCE విద్యా ప్రణాళికను రూపొందించి అమలు చేయడం జరుగుతుంది. ఈ అధ్యాయంలో పిల్లల అభివృద్ధికి అనుగుణంగా ECCE విద్యా ప్రణాళిక సూత్రాలు మరియు పద్ధతులు, పిల్లల అవసరాలు మరియు పిల్లల సమగ్రాభివృద్ధి రంగాలు, వాటిని అభివృద్ధిపరచడానికి తగిన కృత్యాల గురించి తెలుసుకుందాం.

> "ECCE విద్యా ప్రణాళిక కార్యక్రమాలు, ప్రణాళికా బద్ధమైన అనుభవాలు. ఇవి తరగతి గదిలో సంభవిస్తాయి. తరచుగా పాఠశాల వెలుపల కూడా అంటే గృహం, సమాజంలోకి కూడా విస్తరిస్తాయి" **– మిలి ఆల్‌మి**.

## 2.1 పిల్లలు ఎలా నేర్చుకుంటారు? (How Children learn)

**పరిచయం:**

పిల్లలు పుట్టినప్పటి నుండి వయస్సు పెరిగే కొద్దీ వారిలో అభ్యసనం వివిధ రకాలుగా జరుగుతుందన్న విషయం మనందరికీ తెలుసు. అలాగే పిల్లల్లో అభ్యసనం కేవలం తరగతి గదిలో మాత్రమే జరగదు. గృహంలో, పిల్లలతో

ఆటలాడుకునేటప్పుడు, సామూహిక కార్యక్రమాలలో పాల్గొనేటప్పుడు మరియు ప్రత్యక్ష పరిశీలన జరుగుతున్నప్పుడు పిల్లలు నేర్చుకోవడం మనం గమనించవచ్చు.

పిల్లల్లో అభ్యసనానికి ఏ అంశాలు దోహదపడతాయి?

పిల్లలందరిలో అభ్యసనం ఒకే రకంగా వుంటుందా?

పిల్లలు ఏ పరిస్థితులలో బాగా నేర్చుకుంటారు?

పిల్లలు నేర్చుకోవడంలో తేడాలకు కారణాలు ఏమై వుంటాయి? వాటిని మనం సరిచేయగలమా?

**అభ్యసనం:**

వ్యక్తి పుట్టినప్పటి నుండి మరణించే వరకు నిరంతరం ఏదో ఒకటి నేర్చుకుంటూనే వుంటాడు. మామూలు పరిభాషలో వాడే ఈ నేర్చుకోవడాన్నే మనో విజ్ఞాన శాస్త్రంలో "అభ్యసనం" అంటారు.

వ్యక్తికి, పరిసరాలకు మధ్య జరిగే చర్య, ప్రతి చర్యల వల్ల వ్యక్తి ప్రవర్తనలో వచ్చే మార్పునే "అభ్యసనం" అంటారు. అభ్యసనం అంటే నూతన జ్ఞానాన్ని సంపాదించడం, అవసరమైనప్పుడు సందర్భానుసారంగా ఈ జ్ఞానాన్ని వినియోగించగలగడం.

ఉత్సాహంగా నేర్చుకోవడం అనేది పిల్లలందరికీ స్వాభావికంగానే వుంటుంది. అందరు పిల్లలు నేర్చుకొనే సామర్థ్యం కలిగి వుంటారు. ఆధునిక విద్యావేత్తలు పరిశోధనలు చేసి పిల్లలందరిలోను అభ్యసించే శక్తి ఉందని నిరూపించారు. పిల్లలు వారి పూర్వజ్ఞానం, స్వంత అనుభవాలతో స్వంతంగా జ్ఞానాన్ని నిర్మించుకోగలరు. పిల్లలు అనుకూలమైన వాతావరణంలో తమ అభిరుచులకనుగుణంగా నేర్చుకుంటారు. అవేంటో చూద్దాం.

**1. పిల్లలు చేయడం ద్వారా నేర్చుకుంటారు (Learning by doing)**

పిల్లలు ఒకరు చెప్పింది వినడం కాకుండా ప్రత్యక్షంగా ఆయా సందర్భాలలో పాల్గొని చేయడం ద్వారా ఒక నిర్ణయానికి వస్తారు. జాన్ డ్యూయీ (1940) అనుభవం మరియు చేయడం ద్వారా అభ్యసనానికి ప్రాధాన్యత ఇచ్చారు. విద్యార్థి యొక్క స్వీయ అభ్యాసనానికి అవకాశం ఇచ్చారు.

**2. పిల్లలు అనుకరణ ద్వారా నేర్చుకుంటారు (Immitation)**

పిల్లలు పెద్దలను, ఇతర వ్యక్తులను అనుకరించడం ద్వారా నేర్చుకుంటారు. ఉదాహరణకు పుస్తకాలు, వార్తా పత్రికలను పెద్దలు చదవడం చూసి పిల్లలు కూడా వాటిని చేతిలోకి తీసుకొని చదవడానికి ప్రయత్నిస్తారు.

**3. పిల్లలు ఆటల ద్వారా నేర్చుకుంటారు (Through play)**

పిల్లలు ఆనందంగా ఆడుకుంటారు. ఆడుకోవడం పిల్లల సహజ స్వభావం. పిల్లలకు ఆనందం కలిగించే ఏ పని అయినా పిల్లలకు ఆటే. ఆటల ద్వారా అనేక విషయాలు నేర్చుకుంటారు. ఆటల ద్వారా పిల్లల సమగ్రాభివృద్ధి జరుగుతుంది. ఆటలాడుకునేటప్పుడు పిల్లలు తమలో తాము మాట్లాడుకుంటారు. తద్వారా పిల్లల్లో భాషాజ్ఞానం పెరుగుతుంది. మాంటిస్సోరి, ఫ్రోబెల్, జాన్ డ్యూయి వంటి విద్యావేత్తలందరూ పిల్లలకు ఆటల ద్వారా విద్యనందించడాన్ని సమర్థించారు. ఆటల ద్వారా పిల్లల్లో సామాజిక, ఉద్వేగ వికాసము అభివృద్ధి చెందుతుంది. ఆటల ద్వారా శారీరకాభివృద్ధి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. ఆటల వలన పిల్లల్లో జ్ఞానాభివృద్ధి కలుగుతుందని, పిల్లలు జ్ఞాన నిర్మాణం చేసుకుంటారని పియాజే అభిప్రాయపడ్డాడు. జాన్‌డ్యూయి కూడా బోధనా పద్ధతులలో క్రీడా పద్ధతికి ప్రాధాన్యత వివరించాడు. వైగోట్స్కీ అభిప్రాయం

ప్రకారం పిల్లలు తమ తోటి వారితో ఆటలాడుకోవడం వలన వారిలో సామాజిక సంబంధాలు ఏర్పరచుకొనే నైపుణ్యం ఏర్పడుతుంది, పదజాలం అభివృద్ధి చెందుతుంది. ఆటల వలన పిల్లల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుంది.

**4) పిల్లలు ప్రయోగాలు చేయడం ద్వారా, కనుగొనడం ద్వారా నేర్చుకుంటారు (Experimentation)**

పిల్లలు అనేక ప్రయోగాలు చేస్తూ కనుగొనడం ద్వారా నేర్చుకుంటారు. ఇలా నేర్చుకున్న భావాలను, అనుభవాలను మాటలలో చెప్పడానికి ప్రయత్నిస్తారు. పరిశీలన ద్వారా చాలా విషయాలు తెలుసుకుంటారు. ప్రయోగాలు చేయడం ద్వారా పిల్లల్లో ఆసక్తి పెరుగుతుంది. ఉదాహరణకు నీళ్లలో రకరకాల వస్తువులను వేసినప్పుడు కొన్ని మునగడం, కొన్ని తేలడం చూసి అదే ప్రయోగాన్ని మరల మరల చేస్తారు. ఒక బకెట్‌లో చిన్న మగ్గుతో నీళ్ళు పోస్తూ బకెట్ నింపుతాడు.

**5) ప్రత్యక్ష అనుభవాలతో నేర్చుకుంటారు (Direct Experience)**

పిల్లలు, పెద్దలు లేదా ఇతరులు చెప్పే విషయాలను వినడం కంటే ప్రత్యక్షంగా ఆయా సన్నివేశాలలో పాల్గొని స్వయంగా తెలుసుకోవడం ద్వారా నేర్చుకుంటారు. రెండు వస్తువులలో ఏది పెద్దది అనేది ఒకదానిమీద ఒకటి పెట్టి లేదా ఒక దాని పక్కన మరొకటి పెట్టి చూడటం ద్వారా తెలుసుకుంటాడు.

**6) పునరావృతమయ్యే అనుభవాల ద్వారా నేర్చుకుంటారు**

పిల్లలు ఇసుకతో నిర్మాణాలు చేస్తారు. అవి కొంతసేపటికి పడిపోవటం గమనిస్తారు. మరల ఆకారాలు ఏర్పరచడం, అవి పడిపోవటం జరుగుతుంది. డబ్బాలో ఇసుక నింపడం, ఖాళీ చేయడం ద్వారా ఆకారాలు ఏర్పరచడం చేస్తారు. ఇలా అనేకసార్లు రకరకాల ఆకారాలు ఏర్పరుస్తూ భావనలు ఏర్పరచుకుంటారు. తద్వారా ఆనందం, సంతృప్తి పొంది, నూతన భావనలు ఏర్పరచుకుంటారు.

**7) భావనల ద్వారా నేర్చుకుంటారు (Through Concept)**

మానవుడు పరిసరాలతో స్పందించేటప్పుడు ఒక వస్తువు గురించి గానీ, ఒక విషయం గురించి గానీ ఏర్పరచుకొనే ఒక సామాన్య అర్థాన్ని లేదా అవగాహనను "భావన" అంటారు. "సామాన్య లక్షణాలు ఉన్న ఒక ఉద్దీపనా తరగతిని "భావన" అంటారు. ఉదా: బంతి, తెలుపు, మొదలగునవి. భావన అంటే మేథోపరంగా ఏర్పడే ఒక అవగాహన. ఉదాహరణకు పిల్లలకు చతురస్రం, దీర్ఘచతురస్రం, వృత్తం వంటి ఆకారాలపై భావన కలిగితే అలాంటి ఆకారాలు గల వస్తువులను చూస్తారు. ఆయా ఆకారాలకు వాటి పేర్లను జతపరుస్తారు.

**8) తెలిసిన వాటి నుండి తెలియని వాటిని నేర్చుకుంటారు (Known to unknown)**

పిల్లలు తమకు తెలిసిన విషయాలను, అలాంటి సందర్భాలలో కొంచెం తేడా వున్న విషయాలతో పోల్చుకుంటారు. ఉదాహరణకు : వర్షం వచ్చినప్పుడు ఆ నీరు ఆకాశం నుండి ఎలా వస్తుంది? ఆకాశంలో కుళాయి ఎవరు తిప్పారు? అని ఆలోచిస్తాడు. అంటే తనకు తెలిసిన విషయమైన కుళాయి త్రిప్పితే నీరు రావడాన్ని వర్షంతో పోల్చుకుంటారు.

**9) పిల్లల భావనలు వర్తులాకారంగా కొనసాగుతాయి**

పిల్లలు నిత్యం వారు ఏర్పరచుకున్న పాత భావనలు, క్రొత్త అంశాలు జోడించుకుంటారు. గతంలో ఏర్పడ్డ భావనలకు సంబంధించిన క్రొత్త విషయాలను కలుపుకుంటూ, పాత భావనలను సరిచేసుకుంటూ భావనలు విస్తరించుకోవడం జరుగుతుంది. పిల్లలు పెద్దలను ఏదైనా ప్రశ్న అడిగినప్పుడు దానికి లభించిన సమాధానంతో అప్పుడు సంతృప్తి చెందుతారు.

తరువాత అదే ప్రశ్నను వేరే సందర్భంలో అడిగినపుడు క్రొత్త సమాధానం వస్తుంది. ఆ విధంగా వారు నిజ జీవితంలోని పాత, క్రొత్త భావనలను జత చేస్తూ తార్కికంగా ఆలోచించి భావనలను విస్తృతపరచుకుంటారు. ఉదాహరణకు ఘన పదార్థాలు, ద్రవ పదార్థాల గురించి తెలుసుకున్నప్పుడు ఘన పదార్థాలకు ఆకారం వుంటుందని, ద్రవ పదార్థాలకు ఆకారం ఉండదని అవి ఎటువంటి ఆకారం గల పాత్రలలోనైనా ఇమిడిపోతాయని తెలుసుకొంటారు.

### 10) వైగోట్స్కీ ప్రకారం పిల్లలు సమూహాలలో నేర్చుకుంటారు (Group Learning)

9BGDDH

పిల్లలు చిన్న చిన్న సమూహాలుగా ఏర్పడి కృత్యాలలో పాల్గొనుట ద్వారా, ఆటలు ఆడుట ద్వారా అనేక విషయాలు నేర్చుకుంటారు. పిల్లలు పరస్పరం అభిప్రాయాలు, ఆలోచనలు, సామర్థ్యాలు పంచుకుంటారు. పరస్పర సహకారం, ఇతరులు చెప్పేది వినడం పరిగణనలోకి తీసుకోవడం నేర్చుకుంటారు. ఇతరుల ఆలోచనలకు, భావాలకు మద్ధతు ఇవ్వడం ద్వారా సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

**2.1.1 శైశవ, పూర్వబాల్యదశ, ఉత్తర బాల్యదశల వారీగా భేదాలు**

| 0–3 సం. శైశవ | 3–6 సం. పూర్వ బాల్యదశ | 6–8 సం. ఉత్తర బాల్యదశ |
|---|---|---|
| – వాస్తవ పునాది దశ<br>– వేగవంతమైన పెరుగుదల, మార్పు పొందే దశ<br>– చేతివాటం ప్రారంభదశ.<br>– ఆధారపడటం తగ్గి స్వతంత్రత పెంచుకొనే దశ<br>– వ్యక్తిత్వం ప్రారంభం దశ<br>– సంభాషణలను అర్థంచేసుకొని, కేరింతలు (రకరకాల పెద్ద శబ్ధాలు), ఇంగితాలు (బై, బై, టా, టా) ప్రాక్ భాష, ఏడ్వడం ద్వారా వ్యక్తీకరణ.<br>– సామాజికీకరణ ప్రారంభదశ ఆటల పట్ల అభిరుచి ప్రారంభం. చలన ఆటలు, అన్వేషాత్మక, అనుకరణ, నటించే, వినోదాత్మక ఆటలు ఆడుతారు.<br>– సృజనాత్మకత ప్రారంభదశ<br>– అపాయకరమైన దశ (ప్రమాధాల దశ) | – ప్రాక్ పాఠశాల దశ<br>– ప్రాక్ ముఠాదశ ప్రవర్తనా వికాసానికి పునాది.<br>– అన్వేషణ దశ పరిసరాలను తెలుసు కోవడానికి ప్రయత్నిస్తాడు.<br>– సమస్యాత్మక దశ. హటం, మొండి, మారాం చేయడం ఎక్కువగా కనిపిస్తుంది.<br>– ప్రమాదాలకు లోనయ్యే దశ.<br>– అన్ని వికాసాంశాలు శీఘ్రగతిలో వికాసం చెందుతాయి.<br>– పెరుగుదల నెమ్మదిగా, వికాసం వేగంగా అభివృద్ధి వుంటుంది.<br>– సామాజిక ప్రవర్తనను అభ్యసించే దశ<br>– ప్రశ్నించే వయస్సు కుతూహలం, జిజ్ఞాస ఎక్కువ.<br>– అనుకరణ వయస్సు, ఇతరుల మాటలు, చర్యలు అనుకరిస్తారు. | – పాఠశాల దశ<br>– ముఠాదశ<br>– వికాసాత్మక కృత్యాలైన ఆటలు, ఆరోగ్య వైఖరి, సర్దుబాటు, విద్యా కౌశలాలను అభ్యసిస్తారు.<br>– సంభాషణలో సామర్థ్యాలు వికాసం చెందుతాయి.<br>– శిశువు అవదాన నిదిని తక్కువ మూర్తభావనలతో అర్థం చేసుకుంటాడు.<br>– పెరుగుదల నెమ్మదిగా ఏక రూపకంగా వుంటుంది.<br>– సాంఘిక వికాసంలో భాగంగా సర్దుబాటు వీలుగా, తమ తమ ఆసక్తుల, అలవాట్లు కోరిక అనుగుణంగా జట్లుగా ఏర్పడుతారు.<br>– ఆత్మగౌరవం, స్వయం సమర్థత, తనను తాను అర్థంచేసుకొనే ప్రవర్తనా మార్పులు చోటు చేసుకుంటాయి. |

| 0–3 సం. శైశవ | 3–6 సం. పూర్వ బాల్యదశ | 6–8 సం. ఉత్తర బాల్యదశ |
|---|---|---|
| – మూర్తిమత్వ వికాసంలో క్లిష్టమైన దశ<br>– కుటుంబ సభ్యుల పరిచయం మాత్రమే గలవారు సిగ్గు, బిడియం, భయాన్ని ప్రదర్శిస్తారు.<br>– చేతి(కర) కౌశలాలు వేగంగా కాళ్ళ (చర) కౌశలాలు ఈ దశ చివరి భాగంలో వికాసం చెందుతాయి. | – సృజనాత్మక వయస్సు, తమ ఆటలతో, పనులతో సృజనను ప్రదర్శిస్తారు.<br>– నైపుణ్యాల అభివృద్ధి దశ, మళ్ళీ మళ్ళీ చేస్తూ సక్రమంగా, ఖచ్చితంగా చేసేవరకు ప్రయత్నాలు కొనసాగిస్తారు.<br>– భాషా శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుంది.<br>– ఉద్వేగాల తీవ్రత ఎక్కువ, ఉద్వేగాలు తర్వత్వరగా మారుతాయి.<br>– అర్థంచేసుకొనే సామర్థ్యం వికాసం చెందేదశ. | – వికాసానికి చెందిన స్వయం, సాంఘిక, పాఠశాల, ఆటలకు సంబంధించిన కౌశలాలు అభివృద్ధి చెందుతాయి.<br>– భాషా ఉచ్చారణ, అవగాహన, పదజాలాభివృద్ధి, వాక్యనిర్మాణ శక్తి వుంటుంది.<br>– ఉద్వేగాలు వ్యక్తపరచడం, వ్యక్తీకరించం, నియంత్రించడం, సర్దుబాటు చేసుకోగలడు. |

**(Stage wise distinctions from early to chilld to late childhoods)**

పై దశలలో బాలల లక్షణాలను అభ్యసించడంద్వారా ఆయా దశలలో పిల్లలు నేర్చుకొనే విధానాన్ని అధ్యయనం చేయడం తేలిక అవుతుంది.

పిల్లల్లో అభ్యసనం అన్ని దశలలో ఒకే రకంగా ఉండదు. వారి అభ్యసనంపై వారి వయస్సు ప్రభావం ఎక్కువగా వుంటుంది. ప్రారంభంలో అనుకరణలు, ప్రత్యక్ష పరిశీలన ద్వారా ఎక్కువగా నేర్చుకుంటే ఆ తరువాత సామూహిక కృత్యాలు వారి అభ్యసనంపై ఎక్కువ ప్రభావం చూపుతాయి. ఇది మనం తెలుసుకోవాలంటే పూర్వబాల్యదశ, ఉత్తర బాల్యదశల గురించి తెలుసుకోవలసిన అవసరం ఉంది. నిర్దిష్టంగా పూర్వ బాల్యదశను 0 నుండి 5 సంవత్సరాల వయస్సు వరకు, ఉత్తర బాల్యదశను 6 నుండి 10 సంవత్సరాల వయస్సు వరకు అని చెప్పవచ్చు (హోర్లాక్ ప్రకారం).

జాతీయ పూర్వ బాల్యదశ సంరక్షణ మరియు విద్యా ప్రణాళిక చట్రం2013 (NECCE 2013)ప్రకారం పూర్వ బాల్యదశను 0 నుండి 3 సం॥లు, 3 సం॥ల నుండి 6 సం॥ల వరకు రెండు దశలుగా విభజించారు. అయితే 0 నుండి 8 సంవత్సరముల వయస్సు పిల్లలు ECCE పరిధిలోకి వస్తారు. కనుక అభ్యసన అనుభవాల దృష్ట్యా బాల్యదశను పూర్వ బాల్యదశ, ఉత్తర బాల్యదశలుగా ఈ క్రింది విధంగా వివరించవచ్చు. ఆయా దశలలో పిల్లలు నేర్చుకునే విధానాలను వివరంగా తెలుసుకుందాం.

**పూర్వ బాల్యదశ:**

**ఎ) 0 నుండి 3 సంవత్సరాల పిల్లలు నేర్చుకునే విధానము**

ఈ దశలో పిల్లలు చుట్టూ ఉన్న పరిసరాలను ఆసక్తిగా పరిశీలిస్తారు. భాషను ఉపయోగించి మాట్లాడగలుగుతారు. శారీరకంగా వివిధ అవయవాలను ఉపయోగించడంలో నైపుణ్యం సాధిస్తారు. ఒంటరిగా ఆడుకుంటారు

1) ఈ దశలో పిల్లలు ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకుంటారు.

2) పరిసరాల నుండి, వారి గ్రహణ శక్తిని బట్టి, పంచేంద్రియాల ద్వారా విషయాలు గ్రహిస్తూ నేర్చుకుంటారు.

3) కుటుంబంలోని పెద్దల నుండి, పరిసరాల నుండి నేర్చుకుంటారు.

4) బొమ్మలతో ఆడుకుంటూ, మాట్లాడుతూ, పనులు చేస్తూ అనేక విషయాలు నేర్చుకుంటారు.

ఈ దశలో పిల్లలతో పరిసరాల గురించి మాట్లాడించటం, ఎన్నో విషయాలను మాట్లాడమని ప్రోత్సహించడం ద్వారా వారిలో అభ్యసనను పెంపొందించవచ్చు.

**బి) 3 నుండి 6 సం॥ల వయస్సు పిల్లలు నేర్చుకునే విధానము**

ఈ దశలో పిల్లలు 'అహంకేంద్రక' (ఇగో సెంట్రిక్) స్వభావం కలిగి వుంటారు. ప్రతి విషయాన్ని తమ దృష్టి కోణం నుండి చూస్తారు. క్రొత్త విషయాలు నేర్చుకోవాలనే కుతూహలంతో ఉంటారు. ఒకచోట స్థిరంగా ఎక్కువసేపు కూర్చోలేరు. పిల్లల ఎముకలు, కండరాలు ఇంకా అభివృద్ధి చెందుతూ ఉంటాయి. పిల్లల్లో తార్కిక ఆలోచన అభివృద్ధి చెందదు.

1) ఈ దశలో పిల్లలు మూర్త వస్తువులు మరియు ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకుంటారు.

2) విషయాన్ని పదే పదే వినడం, కథలు, పాటల పట్ల ఆసక్తి కలిగివుంటారు. కనుక వీటిద్వారా నేర్చుకుంటారు.

3) ఆటలాడుతూ, పరిగెత్తుతూ శారీరక నియంత్రణ చేసుకుంటారు.

4) పరిసరాలకనుగుణంగా తమ ఆలోచనలను అదుపులో పెట్టుకుంటారు.

5) చిన్న చిన్న సమూహాలలో ఆడటానికి ఇష్టపడతారు. కనుక సమూహాలలో ఆడటానికి ప్రోత్సహించాలి.

6) అనుకరణ ద్వారా నేర్చుకుంటారు. పెద్దలను, ఇతర పిల్లలను అనుకరించడం ద్వారా అనేక విషయాలు నేర్చుకుంటారు. ఉదాహరణకు తల్లి ఇంటి పని చేయడం చూసి చేయగల్గుతారు.

7) పిల్లలకు రకరకాల కృత్యాలు కల్పిస్తూ ఉత్సాహంగా పాల్గొనేలా చేయాలి.

8) బొమ్మలు, పజిల్స్, బ్లాకులు, మాస్కులు, తోలు బొమ్మలు ఉపయోగించి ఆడటానికి ప్రోత్సహించాలి.

9) ఈ దశలో పిల్లలు పొగడ్త మరియు విమర్శలకు వెంటనే ప్రతిస్పందిస్తారు. కనుక పిల్లలు చేసే పనులను మెచ్చుకోవడం, తప్పులను సవరించడం ద్వారా వారిని ప్రోత్సహించాలి.

10) కథలు, పాటలు వినిపించడం, అభినయ గేయాలు పాడించటం, సంఘటనలు, వస్తువుల గురించి మాట్లాడించడం ద్వారా పిల్లల్లో భాషను అభివృద్ధిపరచవచ్చు.

**సి) ఉత్తర బాల్య దశ: 6 నుండి 8 సం॥ల వయస్సు పిల్లలు నేర్చుకునే విధానము:**

ఈ దశలో పిల్లలు ప్రాథమిక పాఠశాలకు వెళ్ళి నియత విధానంలో విద్యను నేర్చుకుంటారు.

1) ఈ దశలో పిల్లలు చదవడం, వ్రాయటం, కారణాలు చెప్పటం చేయగలుగుతారు.

2) సమస్యా పరిష్కార నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది.

3) కండరాల చలనంలో నియంత్రణ సాధిస్తారు.

4) విషయాన్ని ఇతరుల దృష్టితో చూసి తదనుగుణంగా ప్రతిస్పందిస్తారు.

5) తోటి పిల్లలతో స్నేహానికి ప్రాధాన్యత ఇస్తారు.

6) నియమబద్ధమైన ఆటలు ఆడగలుగుతారు.

7) తమ భావాలను వ్యక్తపరచడంలో, ప్రయోగాలు చేయడంలో ఉత్సాహం కలిగి వుంటారు.

8) తార్కికంగా ఆలోచించి చిన్న సమస్యలు సాధించగలరు.

9) వర్గీకరణలు చేస్తారు.

10) భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

11) ఒకే విషయంపై ఎక్కువ సేపు దృష్టి నిలుపగలరు.

12) చేతి వేళ్లకు పట్టు, కంటికి చేతికి సమన్వయం ఏర్పడుతుంది.

13) రాయడం, గీయడం, బొమ్మలు వేయడం మొదలగు నైపుణ్యాలు పెంపొందుతాయి.

కృత్యాధార పద్ధతులు అభ్యసనానికి అనుకూలం. కనుక ఉపాధ్యాయులు కృత్యాధార పద్ధతులు ఉపయోగించి పిల్లల్లో అభ్యసనాన్ని పెంపొందించాలి.

## 2.2 పిల్లల అవసరాలు– వాని స్వభావము (Nature of the child needs)

### పరిచయం:

విద్యా ప్రణాళిక పిల్లల అవసరాలు మరియు అభిరుచులను తీర్చేదిగా వుండాలి. ప్రతి వ్యక్తికి అవసరాలు వుంటాయి. అవసరాలనేవి అందరికీ ఒకేరకంగా వుండవు. వారి వయస్సును బట్టి వ్యక్తిగత సామాజిక పరిస్థితిని బట్టి అవసరాలు మారుతూ ఉంటాయి. అవసరాలు ముఖ్యంగా రెండు రకాలు 1) ప్రాథమిక అవసరాలు 2) గౌణ అవసరాలు. ప్రాథమిక అవసరాలంటే ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా కావలసినవి. ఉదాహరణకు గాలి, నీరు, ఆహారం, దుస్తులు మొదలగునవి. గౌణ అవసరాలంటే ఇవి వ్యక్తిని బట్టి పరిస్థితిని బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు టి.వి, రేడియో, కంప్యూటర్, మోటారు సైకిల్, పుస్తకం మొ॥నవి. చిన్న పిల్లలు ప్రతీది నేర్చుకోవాలనే కుతూహలం కలిగి వుంటారు. పూర్వ బాల్యదశ పిల్లలు అనేక అవసరాలు కలిగి వుంటారు. వీరికి బోధించే ఉపాధ్యాయులు వారి అవసరాల గురించిన అవగాహన కలిగి వుండాలి. అవసరాన్ని సంతృప్తి పరిచినప్పుడు పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా, ఆనందంగా వుంటారు.

### 2.2.1 పిల్లల స్వభావం (Nature of the child)

**పిల్లలు ఎలా వుంటారు?**

- ప్రతీదీ తమ దృష్టితోనే చూస్తారు.

  ఉదా: ఒక ఆటలో పిల్లలందరినీ కళ్ళు మూసుకొండి అని చెబితే, వారిలో ఒకరైనా మరొకర్ని చూపించి "అదిగో వాడు కళ్ళు తెరిచే ఉన్నాడని" చెబుతారు. ఇలా చెపుతున్నప్పుడు తాను తెరిచే ఉన్నాడన్న సంగతి మర్చిపోతాడు. ఇలాగా తాను ఇతరుల దృష్టితో ఆలోచించలేడు.

- వీళ్ళకు అమూర్త ఆలోచనలు, హేతుబద్ధమైన ఆలోచనలు వృద్ధిచెందవు. వీళ్ళు వస్తువుల ద్వారా, ప్రత్యక్ష అనుభవాల ద్వారానే నేర్చుకుంటారు.

9QZ8ET

- ఒకే విషయంలో లేదా ఒకే పని మీద ఎక్కువ సమయం కేంద్రీకరించలేరు. కేవలం 7 నుంచి 10 నిముషాలు మాత్రమే కేంద్రీకరిస్తారు, అది కూడా వారికిష్టమైన పనుల్లో మాత్రమే.
- కొత్త విషయాల్లో చాలా కుతూహలం చూపిస్తారు. తక్షణమే నేర్చుకోవాలనే తపన కూడ కనిపిస్తుంది.
- పెద్ద, పెద్ద గుంపుల్లో ఆడుకోవడం కంటే ఒక్కరేకాని లేదా ఇద్దరు లేదా ముగ్గురు కలిసి ఆడడానికి ఇష్టపడతారు.
- ఈ వయస్సులో శరీరం వేగంగా పెరుగుతూ వుండటం మూలంగా ఒకేచోట ఎక్కువ సేపు కూర్చోలేరు.
- భావోద్వేగాలను ఆపుకోలేరు, వెంటనే వాటిని బయటికి ప్రదర్శిస్తారు.
- ఒకసారి విన్న పాటలను, కథలను మళ్ళీ మళ్ళీ వినడానికి ఇష్టపడతారు.
- సంగీతం, లయబద్ధమైన పాటలు, తాళానికి ప్రతిస్పందిస్తారు.

నేషనల్ కరికులమ్ ఫ్రేమ్ వర్క్ 2005 (Position paper Focus Group on ECCE) ప్రకారం పిల్లలు అభివృద్ధి చెందడానికి ఈ క్రింది అవసరాలు సంతృప్తి పరచవలసి వుంది.

**2.2.2 పిల్లల అవసరాలు (Needs of the child)**

1) **స్వేచ్ఛ** (Freedom) : పిల్లలు స్వేచ్ఛను కోరుకుంటారు. పెద్దల జోక్యంను సహించలేరు. పూర్వ బాల్యదశ పిల్లలు ఈ క్రింది అంశాలకు సంబంధించి స్వేచ్ఛను కోరుకుంటారు.

ఎ) **భావ వ్యక్తీకరణ** (Expression): పిల్లలు నిరంతరం ఏదో ఒకటి మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటారు. ఇంటి వద్ద, పాఠశాలలో కూడా పిల్లలకు మాట్లాడానికి అవకాశం ఇవ్వాలి. అప్పుడే పిల్లలు స్వేచ్ఛగా తమ ఆలోచనలు, అభిప్రాయాలు వ్యక్తపరచగలరు. తద్వారా భాషాభివృద్ధి చేసుకోగలుగుతారు. ECCE కేంద్రాలలో స్వేచ్ఛా సంభాషణల ద్వారా పిల్లలకు ఇతర పిల్లలతో మరియు కార్యకర్తలతో మంచి సంబంధాలు ఏర్పడతాయి. కనుక పిల్లలు తరగతి గదిలో మాట్లాడటానికి, ప్రశ్నించడానికి, సందేహాలు తీర్చుకోవడానికి అవకాశం కల్పించాలి.

బి) **ప్రయోగాత్మకత** (Experimentation): పిల్లలు ప్రయోగాలు చేసే స్వభావం కలిగివుంటారు. ప్రతిది పరిశీలిస్తూ ఏం జరుగుతుందీ, ఎలా జరుగుతుందీ తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ వుంటారు. ఉదాహరణకు చిన్న డబ్బాతో నీళ్లను పెద్ద డబ్బాలో పోస్తూ అది ఎప్పుడు నిండుతుందా అని చూస్తారు. నీళ్లలో రకరకాల వస్తువులను వేసి అవి మునగడం, తేలడం చూసి ఆలోచిస్తారు. పిల్లలకు ప్రమాదకరం కానంతవరకు వారికి ప్రయోగాలు చేసుకునే అవకాశం కల్పించాలి. వారిని ఒక కంట కనిపెడుతూ, అవసరమైనప్పుడు మాత్రమే పెద్దలు జోక్యం చేసుకోవాలి. ECCE కేంద్రంలో పిల్లలు ప్రయోగాలు చేస్తూ అనుభవ పూర్వక అభ్యసనం జరగడానికి అవకాశాలు కల్పించాలి. ఉదా: మ్యాజిక్ పౌడర్ డబ్బా, క్రొవ్వొత్తితో మ్యాజిక్ మొదలైనవి.

సి) **ప్రోత్సాహం** (Encouragement): పిల్లలు చిన్న పని చేసినా దానికి ప్రోత్సాహం కోరుకుంటారు. పిల్లలను ప్రోత్సాహిస్తే ఇంకా ఉత్సాహంగా నేర్చుకుంటారు. ఉదాహరణకు ఒక పాట కొంత తప్పులతో పాడినా బాగా పాడావని మెచ్చుకుంటూనే తప్పులను నెమ్మదిగా వివరించాలి. పిల్లలతో చప్పట్లు కొట్టించడం, బాగా చేశావని పొగడటం, తల్లిదండ్రులతో వారి గురించి చెప్పడం వలన పిల్లలు సంతోషించి ఇంకా బాగా నేర్చుకుంటారు. కనుక ECCE కేంద్రంలో పిల్లలకు ప్రోత్సాహకరమైన పరిసరాలను ఏర్పాటు చేయాలి.

డి) **సవాళ్ళు** (Challenges): అప్పటి వరకు ఇంటికి, ఇంటిలోని కుటుంబ సభ్యులతో మాత్రమే గడిపిన పిల్లలు మొదటి సారిగా పూర్వ ప్రాథమిక పాఠశాలకు రావడం, అక్కడ కొత్త పరిసరాలు, పద్ధతులకు అలవాటు పడటం వారికి ఒక సమస్య. వారితో స్నేహంగా మెలగుతూ వారిలో బిడియాన్ని పోగొట్టి పాఠశాల వాతావరణానికి, పద్ధతులకు అలవాటు పడేలా చేయాలి.

2) **ఆనందం** (Happiness): సంతోషం సగం బలం. పిల్లలు విషయాలను సంతోషంగా నేర్చుకుంటారు. క్రింది విషయాలను సాధించడం ద్వారా పిల్లలు సంతోషంగా వుంటారు.

ఎ) **ఆసరా** (Support): పిల్లలు ప్రతిది స్వంతంగా చేయాలనుకుంటారు. ఉదాహరణకు తమ బట్టలు తామే వేసుకోవాలనుకుంటారు. వారికి ఆ విషయంలో సహాయం చెయ్యాలే తప్ప వద్దని అడ్డు పడకూడదు. అభ్యసనలో కూడా స్వయంగా అభ్యసించుటకు పరిస్థితులు కల్పించి అవసరమైనప్పుడు సహాయం చెయ్యాలి.

బి) **రక్షణ మరియు భద్రత** (Security and Safety): పిల్లలు రక్షణ మరియు భద్రత కోరుకుంటారు. వాతావరణ పరిస్థితుల నుండి అనగా ఎండ, వాన చలి నుండి రక్షణ కల్పించేదిగా ECCE కేంద్రం వుండాలి. ఉపాధ్యాయులు, పిల్లలను భయపెట్టకుండా స్నేహాభావంతో మెలగాలి. అప్పుడే పిల్లలు బిడియం లేకుండా అందరితో కలిసి మెలిసి ఆట పాటలలో పాల్గొంటూ అభ్యసనం చేస్తారు. కనుక పిల్లలకు భద్రతా భావం కలిగించవలసిన బాధ్యత ECCE కార్యకర్తదే.

సి) **అవకాశం** (Opportunity): పిల్లలు ఆటలాడటానికి, మాట్లాడటానికి, పాటలు పాడటానికి, ఇతర కృత్యాలు చేయడానికి వీలైనంత ఎక్కువ అవకాశం కల్పిస్తే స్వేచ్ఛగా, ఆనందంగా నేర్చుకుంటారు.

డి) **మార్గదర్శకత్వం** (Guidance): పిల్లలు కృత్యాలు, ప్రయోగాలు చేసేటప్పుడు ఆటలు ఆడేటప్పుడు ఉపాధ్యాయుడు వారిని గమనిస్తూ తగు సూచనలివ్వాలి. వారు సరియైన దిశలో పురోగమించేలా చూడాలి.

**3)** **సర్దుబాటు** (Adoptability): ఇంటి నుండి పాఠశాలకు వచ్చిన పిల్లలకు పాఠశాల పరిసరాలు, పద్ధతులు, వ్యక్తులు అంతా క్రొత్తగా వుంటుంది. వీటన్నింటికి అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది. ECCE కార్యకర్త మంచి మాటలతో ప్రేమగా వ్యవహరిస్తూ పిల్లలు సర్దుబాటు చేసుకునేటట్లు సహకరించాలి.

ఎ) **సమిష్టి సహకారం** (Collective by Cooperation ): ఈ దశలో పిల్లలు ఒంటరిగా ఆడుకోవడానికి ఇష్టపడతారు. పిల్లలు రకరకాల సామాజిక, సాంస్కృతిక నేపథ్యం గల కుటుంబాల నుండి ECCE కేంద్రానికి వస్తారు. పిల్లలందరూ ఆట, పాటలతో కలిసిమెలిసి పాల్గొనడం, జట్టు కృత్యాలు చేయించడం ద్వారా వారి మధ్య స్నేహ భావం, సహకారం పెంపొందించాలి.

బి) **వినడం** (Listening):

మీరు చెప్పింది పిల్లలు వినాలనుకొంటే పిల్లలు చెప్పేది మీరువినడానికి సిద్ధపడండి. వాళ్ళకు బోధించవద్దు. వాళ్ళు నేర్చుకోవడానికి సాయపడండి. వాళ్ళ దగ్గర ఎప్పుడూ చిరునవ్వుతో వుండడం, వాళ్ళతో కలిసి నవ్వడం ముందుగా మీరు నేర్చుకోండి. అప్పుడే పిల్లలు మీకు విద్యార్థులుగా గాక మిత్రుల్లా వుంటారు. మీ దగ్గర నేర్చుకోవడానికి, మీతో ఆనందం పంచుకోవడానికి, కష్టాలు మీతో చెప్పుకోవడానికి ముందుకు వస్తారు. నా దృష్టిలో ఉపాధ్యాయుడి ప్రప్రథమ బాధ్యత ఇది.

**– కల్పాకం చావలి, భారతీయ విద్యా భవన్**

23U9Y8

పిల్లలు తాము చెప్పేది పెద్దలు, ఇతరులు వినాలని కోరుకుంటారు. కనుక పెద్దలు వారు మాట్లాడేది శ్రద్ధగా వినాలి. దానిలోని మంచి చెడులు వివరించాలి ఇతరులు చెప్పేది వినే అలవాటు చెయ్యాలి.

సి) **సహనం** (Patience): ఈ వయస్సులో పిల్లలు ఎక్కువసేపు ఒకేచోట ఉండలేరు. ఒకే విషయం మీద ఎక్కువ సమయం దృష్టి కేంద్రీకరించలేరు. వారికి కల్పించే కృత్యాలు తక్కువ సమయంలో పూర్తయ్యేలా రూపొందించాలి. ఆటలు, పాటలు, కథలు చెబుతూ వారికి ఆసక్తి కలిగించి వారి అవధానం పెంచటానికి కృషి చేయాలి. పిల్లలతో సహనంగా వుంటూ వారు ఇతరులతో సహనంగా వుండేలా అలవాటు చెయ్యాలి.

డి) **పంచుకోవడం** (Sharing): పిల్లల్లో స్వార్థం ఎక్కువగా ఉంటుంది. ప్రతిది తమ దృష్టితోనే చూస్తారు. అన్నీ తమకే కావాలని అన్నీ తామే చేయాలన్న భావన కలిగి వుంటారు. ఉదాహరణకు ఇంట్లో ఏదైనా ఒక పెద్ద పండు తీసుకు వచ్చినప్పుడు ముక్కలు చేసి పెడతామంటే పిల్లలు ఇష్టపడరు. మొత్తం తింటామని మారాం చేస్తారు. కొంత తిన్న తరువాత మిగతా వాళ్లకు ఇచ్చేస్తారు. జట్టు కృత్యాలు ఏర్పాటు చేసి వారిలో పంచుకునే అలవాటు పెంపొందించాలి.

ఇ) **సహానుభూతి** (Empathy): ఇతరుల సంతోషం లేదా బాధను తనదిగా భావించినప్పుడు తదనుగుణంగా ప్రవర్తించగలగడం. పిల్లల స్వభావమును వారి పరిస్థితిని సరిగ్గా అంచనా వేసి దానికి తగినట్లుగా స్పందించగలిగితే పిల్లలు బోధనాభ్యసన కృత్యాలలో పాల్గొనగలరు.

**4)** **ఆరోగ్యం క్షేమం** (Helath well being): 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నపుడే ఉత్సాహంగా నేర్చుకుంటారు. పిల్లలు ఆరోగ్యంగా క్షేమంగా ఉండేలా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులదే. ECCE / అంగన్ వాడీ కార్యకర్తలు పిల్లల ఆరోగ్య విషయంలో ఈ క్రింది విషయాలు పాటించాలి.

ఎ) పిల్లల్లో గల ఆరోగ్య సమస్యలు గుర్తించి తగిన వైద్య సహాయం అందేలా చూడటం, తల్లిదండ్రులకు తెలియచేయడం.

బి) పిల్లలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించటం.

సి) పిల్లల ఎత్తు, బరువు చూస్తూ పెరుగుదల సరిగ్గా లేని పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించడం

డి) పిల్లల్లో దృష్టిలోపం ఇంకా ఇతర లోపాలు గుర్తించి తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడం, ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ పథకాలను వినియోగించుకోవడం.

ఇ) క్రమం తప్పకుండా ఆయా సమయాలలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం.

1) **ఆరోగ్యకరమైన అలవాట్లు (Helath habits)**:

పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించాలి. పిల్లల్లో ఈ క్రింది అలవాట్లు పెంపొందిచాలి.

1) ప్రతిరోజు పండ్లు తోముకోవడం, స్నానం చేసి శుభ్రమైన బట్టలు ధరించడం.
2) భోజనం తినేముందు, తిన్న తరువాత చేతులు, కాళ్ళు శుభ్రంగా కడుక్కోవడం.
3) జలుబు, దగ్గు లాంటివి వచ్చినప్పుడు ఇతరులకు దూరంగా ఉండటం.
4) తల్లిండ్రులకు పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించాలి. పిల్లలకు పెట్టే ఆహారం పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయించాలి.

**2) పోషకాహారం** (Nutrition):

పిల్లలు ఎప్పుడూ ఆడుతూ, పాడుతూ చురుకుగా వుంటారు. వారికి శక్తి సామర్థ్యాల కోసం, శరీర నిర్మాణం జరగటానికి పోషకాహారం అవసరం. పోషకాహారం లభించనట్లైతే పిల్లల శారీరక, మానసిక పెరుగుదల సరిగా వుండదు. పిల్లలు అనేక జబ్బులకు గురయ్యే అవకాశం వుంటుంది. కనుకనే అంగన్ వాడీ కేంద్రాలలో పోషకాహారం అందిస్తున్నారు. తల్లిదండ్రులకు పోషకాహార ప్రాముఖ్యత తెలియజేసి, ఇంట్లో కూడా పోషకాహారం అందేలా చూడాలి.

## 2.3 చురుకైన మరియు క్రీడాపద్ధతుల ప్రాధాన్యత, మార్గదర్శక సూత్రాలు (Importance of play and active learning methods for early years learning)

1920, 1930 సంవత్సరాలలో పిల్లల క్రీడలపై అనేక అధ్యయనాలు జరిగాయి. వివిధ వయస్సులలో పిల్లలు ఎలా ఆడుకుంటారో, తద్వారా ఎలా నేర్చుకుంటారో ఈ అధ్యయనాలలో పరిశీలించడం జరిగింది.

వివర్తనా ప్రక్రియగా విద్య - ఫ్రోబెల్, మాంటిస్సోరి

పాశ్చాత్య విద్యావేత్తలైన రూసో, జాన్‌డ్యూయి, మాంటిస్సోరి, ఫ్రోబెల్ మొదలైన విద్యావేత్తలందరూ పూర్వ బాల్యదశ, విద్యా ప్రణాళిక, క్రీడలు, కృత్యాలు, ప్రయోగాలు మరియు అనుభవాలతో కూడి ఉండాలని అభిప్రాయపడ్డారు. భారతీయ విద్యా తత్వవేత్తలైన గాంధీ, ఠాగూర్, గిజుబాయి, తారాబాయి మోదక్ మొదలైన వారు చిన్నపిల్లలకు విద్యనందించుటలో శిశుకేంద్రీకృత విధానాల ప్రాధాన్యతను వివరించారు. వివిధ రకాల వస్తువులను ఉపయోగించి కృత్యాలు చేయడంలో పిల్లలు ఆసక్తి కలిగివుంటారని పరిశోధనలలో గమనించారు.

ఆధునిక మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలైన పియాజే, బ్రూనర్, వైగోట్స్కీలు కూడా పరిశోధనలు చేసి ఆటలు మరియు కృత్యాల ద్వారా పిల్లలు సహజంగా నేర్చుకుంటారని నిరూపించారు.

**2.3.1 క్రీడ నిర్వచనము :** ఇతర ప్రవర్తన అంతా వివరించిన తరువాత మిగిలివుండేదే క్రీడ.

పియాజే క్రీడను మనోవికాస ప్రక్రియగా పేర్కొన్నాడు. ఏ వ్యక్తి అయినా తన తీరిక సమయాల్లో తనకిష్టమైన ఏ పనిని చేస్తాడో దానినే క్రీడ లేదా సరదాకోసం చేసే పని అని గల్లిక్ నిర్వచించాడు. ఇతర ప్రవర్తన అంతా వివరించిన తరువాత మిగిలి వుండేది క్రీడ. క్రీడలలో ఇతరుల ప్రేరణ ప్రతిఫలాపేక్ష వుండవు. కొందరు బాల్య దశను నిర్దిష్టమైన ప్రక్రియగా క్రీడను నిర్వచించారు.

**2.3.2 క్రీడా పద్ధతులు** (Play methods):

క్రీడలను ముఖ్యంగా 3 రకాలుగా వర్గీకరిస్తారు.

**1) స్వేచ్ఛ లేదా ఆయత్న క్రీడా పద్ధతి** (Free play):

శిశువు జన్మించిన తొలిరోజుల్లో ఆడే ఆట. ఈ ఆట స్వేచ్ఛగా ఒంటరిగా తనంతట తాను, తన అభిరుచి ననుసరించి ఆడుకుంటారు. దీనికి సమయం నిబంధనలేమి ఉండవు. స్వేచ్ఛ పద్ధతిలో ఆడే ఆట అన్వేషణతో కూడుకొని వుంటుంది.

2) **వ్యవస్థాపిత లేదా నిర్మాణాత్మక క్రీడా పద్ధతి** (Constructive play):

6 సంవత్సరముల వయస్సు దాటిన పిల్లలు తాము సమకూర్చుకున్న వస్తువులతో ఆటలు ఆడతారు. ఉదాహరణకు అగ్గిపెట్టెలతో రైలు, అట్టముక్కలతో ఇల్లు, పాఠశాల నమూనా లాంటివి నిర్మించడానికి ప్రయత్నిస్తారు. నిర్మాణాత్మకంగా సాధించిన పనులతో ఆనందం, తృప్తి పొందుతారు. ఈ సమయంలో పిల్లలకు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం అవసరమౌతుంది.

3. **నాటకీకరణ క్రీడా పద్ధతి** (Role Play):

అధిక ప్రజ్ఞ గల పిల్లలు నాటకీకరణంలో తమ సృజనాత్మక, నిర్మాణాత్మకమైన శక్తులను ఉపయోగించి ఆనందం పొందుతారు. నాటకీకరణను పెద్ద పిల్లల ద్వారా, టీ.వి.లు, సినిమాలు చూడటం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుండి స్నేహితుల నుండి నేర్చుకుంటారు. పిల్లలు తల్లిదండ్రుల పాత్రలు, ఉపాధ్యాయ విద్యార్థి పాత్రలు, దొంగ పోలీసు పాత్రలు పోషించి ఆడుకుంటారు.

**2.3.3. క్రీడా పద్ధతుల ప్రాముఖ్యత** (Importance of Play):

పూర్వ బాల్యదశ విద్యలో క్రీడా పద్ధతికి చాలా ప్రాధాన్యత ఉంది. క్రీడా పద్ధతి శిశుకేంద్రీకృతమైనది. పిల్లలు ఆటలు కృత్యాల ద్వారా విద్య నేర్చుకుంటారు. క్రీడా పద్ధతిలో పిల్లలు ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకుంటారు. ఈ దశలో పిల్లలు ఏవిషయం మీద అయినా కేవలం 7 నుండి 15 ని॥లు మాత్రమే దృష్టి నిలపగలరు. శారీరకంగా, మానసికంగా లీనమయ్యే కథలు, కృత్యాలలో మాత్రమే ఎక్కువ సేపు దృష్టి నిలపగలరు. ఉదాహరణకు మట్టితో బొమ్మలు చేయడం, ఇసుకలో ఆటలాడటం, అగ్గిపెట్టెలతో ఇల్లు కట్టడం మొదలగు పనులలో ఎక్కువసేపు ఉండగలరు.

క్రీడా పద్ధతిలో పిల్లలు ఇతర పిల్లలతో కలిసి పనిచేయడం వల్ల ఆనందాన్ని, ప్రయోజనాన్ని పొందుతారు. నైపుణ్యాలను పెంపొందించుకోగలుగుతారు. ఈ పద్ధతిలో పిల్లలు అభ్యసనంలో చురుకుగా పాల్గొంటారు. క్రీడా పద్ధతి పూర్వ బాల్యదశ విద్యకు సమర్థవంతమైన మాధ్యమం. క్రీడా పద్ధతి పిల్లలలో చదువు పట్ల ప్రేరణను, ఆసక్తిని కలిగిస్తుంది. ఈ పద్ధతి పిల్లలను ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చేస్తుంది. క్రీడా పద్ధతి పిల్లల అభ్యసనా సామర్థ్యాన్ని, నైపుణ్యాభివృద్ధిని, అభిరుచి, వైఖరులను ఉపాధ్యాయులు అర్థం చేసుకోవడంలో ఉపయోగపడుతుంది. క్రీడా పద్ధతి ఆనందదాయక అభ్యసనంలో (joyful learning) ఓ మంచి బోధనా పద్ధతి.

**పూర్వ ప్రాథమిక విద్యా బోధన పద్ధతులు** (Active Learning methods):

యునెస్కో సంస్థ తరపున 1976లో గాస్టన్ మియలారెర్ పూర్వ పాఠశాల విద్యపై ప్రపంచ సర్వే నిర్వహించారు. వివిధ దేశాలలో ఆచరణలో ఉన్న పూర్వ పాఠశాల విద్య బోధనాపద్ధతులను కూడా అధ్యయనం చేశారు. అందులో ముఖ్యంగా

1. క్రీడాపద్ధతి
2. మాంటిస్సోరి పద్ధతి
3. కిండర్‌గార్డెన్ పద్ధతి
4. పియాజె పద్ధతి

పై బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులలో పూర్వ విద్యా నైపుణ్యాలను పెంపొందించవచ్చు. పై బోధన పద్ధతులను వివరంగా తెలుసుకొందాం.



**Figure 5.1 Suggested Play-Based Activities**

*Source:Play Activities for child Development: A Guide to Preschool Teachers, Mina Swaminathan and Prema Daniel National Book Trust, New Delhi. 2004*

**2.3.4 క్రీడాపద్ధతి** (Play way method)**:**

పూర్వ విద్యా నైపుణ్యాలను పెంపొందించడంలో క్రీడా పద్ధతి ప్రాముఖ్యం

పూర్వ బాల్య దశలో విద్యార్థి ఆటలు, కృత్యాలకు ప్రాధాన్యం ఇస్తాడు. వీటి ద్వారా పిల్లలను సంసిద్ధం చేసి అభ్యసన చేసేటట్లు చేయడమే క్రీడా పద్ధతి ముఖ్య ఉద్దేశ్యం. ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు విద్యార్థుల అభిరుచులకు తగిన విధంగా వారి వైఖరులలో మార్పు తీసుకొనివచ్చి అభ్యసనవైపుకు మరల్చే ప్రక్రియను వివిధ క్రీడాంశాలు, ఆటలు, కృత్యాల ద్వారా నిర్వహిస్తారు.

i) **పూర్వ పఠన సంసిద్ధత** (Pre-Reading)**:**

విద్యార్థిని పఠనానికి సంసిద్ధం చేయడంలో క్రీడ శక్తిమంతమైన మాధ్యమం. విద్యార్థి పాఠ్యాంశాలు చదివేటప్పుడు కొన్ని సంబంధాలను గుర్తించే ప్రక్రియలను క్రీడా పద్ధతి నేర్పుతుంది.

**ఎ) శబ్ద భేదాలను గుర్తించడం**

ఈ పద్ధతిలో విద్యార్థి తన సహ విద్యార్థులతో కలసి పనిచేయడం ద్వారా ఆనందాన్ని, ప్రయోజనాన్ని, నైపుణ్యాలను పొందుతాడు. ఈ పద్ధతిలో క్రీడకు, భాషకు సహసంబంధం ఉంటుంది. కారణం భాషలోని పదాలలోని శబ్దాలను గుర్తించి దానితో వేరొక పదం తయారుచేయడం.

అవి 1) శబ్దం జతపరిచే ఆటలు

2) అంత్యాక్షరి ఆటలు

3) ప్రాస కలిసే ఆటలు

4) వర్గీకరణ ఆటలు

**బి) దృశ్య భేదాలను గుర్తించడం**

1. వివిధ రకాల బొమ్మలు, వస్తువులను తీసుకొని ఒకేరకమైన వాటిని జతపరచడం. వాటి మధ్య ఉన్న భేదాన్ని చెప్పడం.
2. డోమినో చిత్రాలు, చుక్కలు, కత్తిరించిన అట్టముక్కలను జతపరచడం.
3. పూసల కడ్డీలలో వేరు వేరు పరిమాణాలలో పూసలను ఉంచి వాటిని గుర్తించి చెప్పడం.

**సి) శ్రవణ, దృశ్య సంబంధాలను గుర్తించడం**

1. అనేక బొమ్మలు ఇచ్చి, ఒక అక్షరం చెప్పి ఆ అక్షరం ద్వారా మొదలయ్యే బొమ్మలను వేరుచేయడం.
2. ఇచ్చిన బొమ్మల కార్డులలో చిత్రాన్ని చూసి దాని పక్క స్థలంలో దాని పేరు రాయాలి.

ii) **పూర్వ లేఖన సంసిద్ధత** (Pre-writing)**:**

క్రీడా పద్ధతి విద్యార్థికి కొన్ని పూర్వ లేకన నైపుణ్యాలను అభివృద్ధిచేయడానికి దోహదపడుతుంది.

1. రకరకాల బొమ్మలను ఇవ్వడం, వాటిని చూసి బొమ్మలను గీయమనడం.
2. చుక్కలను ఉంచి, వాటిని కలపడం ద్వారా వివిధ ఆకృతులను నిర్మింపజేయడం.

3. సుద్దముక్కలతో వివిధ ఆకృతులను వారి ఇష్టానుసారంగా గీయించడం. అందులో నుంచి అక్షరాలను, అంకెలను, చిత్రాలను గుర్తింపజేయడం.

iii) **గణితానికి సంబంధించిన ఆటలు**

1. పూసల కడ్డీల ద్వారా సంఖ్యా భావనను అందజేయడం. లేకపోతే గాజు గోళీకాయలు గులకరాళ్ళు తీసుకొని వాటి ద్వారా సంఖ్యా భావనను ఏర్పరచడం.
2. కాగితం చింపి వివిధ గణిత ఆకృతులను తయారుచేయించడం.
3. రంగు రంగుల కార్డులను పేర్చి అందులో ఏ రంగుకు ఎన్ని కార్డులు ఉన్నాయో లెక్కింపజేయడం.
4. సెల్‌ఫోన్‌లో ఏఏ నంబర్లు అడ్డు వరుసలో, నిలువు వరుసలో ఉన్నాయో నేర్పించడం.
5. వివిధ రకాల బంతులను తీసుకొని అందులో ఏ బంతి ఏ ఆటకు సంబంధించిందో గుర్తింపజేయడం (ఇందులో బంతి మీద గుర్తులు, ఆకారం ద్వారా కూడా గుర్తిస్తాడు.)
6. ఉపాధ్యాయుడు ఒక అంకె చెప్పిన తరవాతి అంకెలను విద్యార్థులు వరస క్రమంలో చెప్పడం.
7. డోమినో చిత్రాలలో ఉపాధ్యాయుడు చెప్పిన అంకెకు సరిపడ డోమినోను విద్యార్థి తీసి చూపించడం.

iv) **సాంఘిక, భావోద్వేగ అభివృద్ధిలో క్రీడాపద్ధతి ప్రాముఖ్యం**

క్రీడా పద్ధతిలో శిశువు తనలో నిగూఢమైన చలన కౌశలాలను బయటికి తీసుకొనిరావడం ద్వారా తన సామర్థ్యంపై నమ్మకాన్ని కుదుర్చుకొంటాడు. దాని ద్వారా అతనిలో ఉన్న సంకోచాన్ని తొలగించుకొంటాడు. దాని ద్వారా స్వయంగా క్రమశిక్షణ, సాంఘికాభివృద్ధిని అభివృద్ధి చేసుకోగలుగుతాడు. మానసికంగా ఉల్లాసంగా ఉంటాడు.

క్రీడా పద్ధతిలో ముఖ్యంగా పిల్లవాడికి ఈ కింది లక్షణాలు నేర్పించడం ద్వారా అతనిలో సాంఘిక, భావోద్వేగ అభివృద్ధిని సాధించవచ్చు.

1. సంఘంలో వ్యక్తులను గౌరవించడం, పరస్పర అవగాహన సామర్థ్యాన్ని కలిగి ఉండటం.
2. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం.
3. అనవసరంగా ఉద్వేగానికి లోనుకాకుండా ప్రేమ, వాత్సల్యం, దయ, జాలి, కరుణ లాంటి మంచి అలవాట్లను అలవరచుకొనేటట్లు చేయడం.
4. పిల్లలతో స్నేహపూర్వకంగా ఆటలాడుకోవడం, జటుట నాయుకుడిగా వ్యవహరింపచేస్తూ నాయకత్వ లక్షణాలను పెంపొందించడం.
5. వ్యక్తులను ఎలా సంబోధించాలి, ఎలా మాట్లాడాలి, సంభాషణను ఎంత కొనసాగించాలి అనే అంశాలలో తర్ఫీదునివ్వాలి.
6. వ్యక్తిగతమైన అవసరాలు, అభిరుచులను వేరొకరితో పోల్చుకొని కుంఠనంలోకి వెళ్ళకుండా తగిన సామర్థ్యాన్ని పెంపొందింపచేయాలి.

v) **శారరక, చలన కండరాల అభివృద్ధిలో క్రీడాపద్ధతి ప్రాముఖ్యం**

విద్యార్థిలో శారీరక ఉల్లాసాన్ని, కండరాల చలనాన్ని అభివృద్ధిపరచడంలో క్రీడాపద్ధతి ప్రముఖపాత్ర వహిస్తుంది.

1. విద్యార్థుల శారీరక, మానసిక స్థితిని గుర్తించి వారికి తగిన శారీరక క్రీడలను ఏర్పాటుచేయాలి. (పరుగెత్తడం, దూకడం, కుంటడం, లయబద్ధమైన కదలికలు మొదలైనవి).
2. సూక్ష్మ, స్థూల కండరాల అభివృద్ధికి చెందిన క్రీడలను విద్యార్థిచేత చేయించాలి. (నృత్యం, నటన, జిమ్నాస్టిక్, మ్యూజికల్ ఛైర్స్, రైలు ఆట, పిల్లి -ఎలుక ఆట).
3. యోగ, ధ్యానం లాంటి కృత్యాలు చేయడం ద్వారా పిల్లలు ఉత్తేజితులు అవుతారు.
4. కండరాల సమన్వయం కోసం రాయడం, చిత్రలేఖనం, రంగులు అద్దడం, కాగితాన్ని వివిధ ఆకారాలలో కత్తిరింపజేయడం, బంకమట్టితో బొమ్మలు చేయడం మొదలైన కృత్యాలను నిర్వహించాలి.
5. పాటలు, గేయాలు, నాటకీకరణలాంటి క్రీడాంశాల ద్వారా విద్యార్థి ముఖకవళికల ద్వారా కండరాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం.
6. విద్యార్థిలో ఆసక్తిని, ఉల్లాసాన్ని నైపుణ్యాల, ఆలోచనల, సృజనాత్మకతలకు అనుగుణంగా ఉపాధ్యాయుడు వివిధ క్రీడలను ఏర్పాటుచేసి వారి శారీరక, చలన కండరాల అభివృద్ధికి దోహదపడాలి.

### **2.3.5 మాంటిస్సోరి నమూనా** (Montessori Method)

ఇటలీ దేశస్థురాలైన డాక్టర్ మెరియా మాంటిస్సోరి (1870-1952) మతి స్థిమితం లేని రోగులకు వైద్యం చేసేది. వారికి విద్య నేర్పడానికి కొత్త కొత్త పద్ధతులను పాటించి విజయం సాధించింది. 3 సంవత్సరాల నుండి కౌమార దశ వరకు 4 దశలుగా విభజించి అమలు పరిచింది. ఆమె 1939లో భారతదేశానికి వచ్చి 1951 వరకు ఇక్కడ పూర్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితులు గమనించి చిన్న పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో పూర్వ ప్రాథమిక విద్యలో అనేక మార్పులు తీసుకువచ్చింది. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను సంపూర్ణంగా అందించుటకు చాలా కృషి చేసింది. ప్రపంచమంతటా మాంటిస్సోరి పాఠశాలలు స్థాపించడం జరిగింది.

**మాంటిస్సోరి విద్యా విధానం సూత్రాలు:**

1) పిల్లలకు సంపూర్ణమైన స్వేచ్ఛను ఇవ్వాలి. ఈ స్వేచ్ఛ పిల్లల్లో స్వీయ క్రమశిక్షణ, స్వీయ నిగ్రహం అభివృద్ధి చెందటానికి దారితీస్తుంది.
2) పిల్లలకు స్వంతంగా నేర్చుకునే సామర్థ్యం ఉంటుంది. కనుక పిల్లల స్వీయ అభ్యసనానికి అవకాశం కల్పించాలి.
3) పిల్లల సమగ్రమూర్తిమత్వాన్ని పెంపొందించడానికి శారీరక, మానసిక, సాంఘిక ఉద్వేగ అంశాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి.
4) జ్ఞానేంద్రియాల శిక్షణకు, చలన నాడుల సమర్ధతకు ప్రత్యేక పరికరాలు రూపొందించి అమలు పరచడం జరుగుతుంది.
5) జట్టు పని కంటే వ్యక్తిగత పనికి ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది.
6) పిల్లలు తమ చుట్టూ వున్న పరిసరాలను పరిశీలించి ప్రత్యక్ష అనుభవాల ద్వారా అవగాహన చేసుకోవడం నైపుణ్యాలు ఆర్జించడం అనేది ముఖ్యమైన అంశం.
7) ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత వుంటుంది.

8) పిల్లలు స్వయం నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం కల్పించడం.

9) స్వయంగా తప్పులను సవరించుకుంటూ బోధనా పరికరాలనుపయోగిస్తూ భావనలు అభ్యసించడం.

10) పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి ఆధారంగా విద్యా కార్యక్రమాలు ఇవ్వడం జరుగుతుంది.

మాంటిస్సోరి పాఠశాలలను (కాసాబాంమెన్స్) “పిల్లల గృహాలు” అని పిలుస్తారు. ఈ పాఠశాలలో ఒక పెద్దగది ఇతర చిన్న గదులు ఉంటాయి. పెద్దగదిలో పిల్లలు అభ్యసించడం కోసం కొన్ని ప్రజ్ఞానాత్మక పనులు నిర్వహిస్తారు. ఇతర చిన్న గదులు పిల్లల ఆటలకు, నిద్రపోవటానికి ఉపయోగిస్తారు. పిల్లలకు స్వీయ అభ్యసనం, నైపుణ్యాలు, జీవిత వాస్తవ విషయాలలో అభ్యసనం జరుపుతారు. ఇందుకోసం క్రింది పద్ధతులను ఉపయోగిస్తారు.

**ఎ) చలన విద్య** (Motor Eduction)

పిల్లల్లో చలన కౌశలాలు అభివృద్ధి పరచడానికి నడవడం, గెంతడం, కూర్చోవడం, పరుగెత్తడం, వస్తువులను ఎత్తడం, నీళ్లను పెద్ద పాత్రల నుండి చిన్న పాత్రలలోకి వంచడం, కాగితాలు కత్తిరించడం, మడత పెట్టడం, గుండీలు పెట్టుకోవడం వంటి కృత్యాల ద్వారా అవకాశం కల్పిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను కూడా నేర్పుతారు. గదులు ఊడ్చడం, వస్తువులన్నింటిని క్రమ పద్ధతిలో అమర్చుకోవడం, మంచి ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పుతారు.

**బి) జ్ఞానేంద్రియ పద్ధతి**:

జ్ఞానేంద్రియ విచక్షణకు చెందిన నైపుణ్యాలను రంగు, రూపం, పరిమాణం, బరువు, ఉష్ణోగ్రత భేదాలు (చల్లని, వేడి) మొదలైన భావాలను ప్రయోగాత్మకంగా చేసి తెలుసుకోవడం, అభివృద్ధి చేయడం జరిగింది. ఇందుకోసం రంగు రంగుల వస్తువులు, టచ్ బోర్డులు, అవుట్ లైన్ చిత్రాలు మొదలైన సామాగ్రి అవసరమవుతాయి.

**సి) విద్యా విషయాల అభ్యసనం**:

మాంటిస్సోరి పద్ధతిలో 4 సంవత్సరముల వయస్సు వచ్చేటప్పటికీ విద్యా విషయాలలో బోధన ప్రారంభిస్తారు. వస్తువుల పేర్లు పలికించడం ద్వారా భాషా బోధన, ఉచ్ఛారణ దోషాలు సవరించడం జరుగుతుంది. పఠనం, లేఖనం బోధిస్తారు. ట్రేసింగ్, బొమ్మలకు రంగులు అద్దడం మొదలగు కృత్యాలు చేయించడం ద్వారా రాతపని ప్రారంభిస్తారు దశాంశ పద్ధతిలో తయారుచేసిన ఎరుపు, నీలం కడ్డీల ద్వారా సంఖ్యలు పరిచయం చేస్తారు.

**మాంటిస్సోరి పద్ధతిలో ఉపాధ్యాయుడి పాత్ర** :

1) ఉపాధ్యాయుడు రిసోర్సు పర్సన్‌గా మాత్రమే వ్యవహరిస్తాడు.

2) విద్యార్థి కేంద్రీకృత పద్ధతిలో, ఆగమన పద్ధతిలో అభ్యసనం జరుగుతుంది.

3) పిల్లలకు ఉద్వేగ వికాస అభివృద్ధిలో సహాయకారిగా వుంటాడు.

4) క్రీడా పద్ధతి ప్రదర్శన పద్ధతులను ఉపయోగిస్తాడు

5) ప్రయోగాలు చేయడంలో, కృత్యాలు, ఆటలలో పిల్లలను ప్రోత్సహిస్తాడు.

6) విద్యార్థి అంతర్గత అభివృద్ధి, ప్రవర్తనలను గుర్తించి మార్గదర్శకత్వం చేస్తాడు.

### 2.3.6 కిండర్ గార్టెన్ నమూనా (Kinder Garten Method)

జర్మనీ దేశానికి చెందిన విద్యావేత్త హెడ్రిక్ ఫ్రోబెల్ 1837 సంవత్సరంలో బాడ్ బ్లాంకన్ బర్గ్‌లో స్థాపించిన "Play and Activity Institute"లో మొట్టమొదటి సారిగా కిండర్ గార్టెన్ అనే పదాన్ని ప్రవేశపెట్టాడు. కిండర్ గార్టెన్ అనగా "బాలోద్యానం" అని అర్థం. ఇందులో పిల్లలు ప్రకృతిని పరిశీలించడం, తమ చుట్టూ ఉన్న పరిసరాలను అవగాహన చేసుకోవడం ద్వారా తమంతటతామే ఈ ఉద్యానవనంలో పెరగడం అనేది ప్రధానమైన అంశం. పిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం, కలిసి ఆడుకోవడం ద్వారా వారిలో భావ ప్రకటన వ్యక్తమౌతుంది.

**పాఠ్య ప్రణాళిక** : భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సంగీతం, కళలు, ఆధ్యాత్మిక పరమైన బోధనకు అనువైన అంశాలు.

**కిండర్ గార్టెన్ విద్యలో ప్రధాన సూత్రాలు** :

1) పాఠశాల అనేది ఒక సాంఘిక ప్రయోగశాల.
2) శారీరక, మానసిక, నైతిక శక్తులను పెంపొందించే కార్యక్రమాలకు పని అనుభవం, స్వయంభావ ప్రకటనకు ప్రాధాన్యం
3) ఆటలతో పాటు కథలు, పాటలు, నిర్మాణపు కృత్యాలు అభ్యసనలో అంతర్భాగం కావడం
4) ప్రకృతి అధ్యయనం, పరిశీలన కేంద్రంగా వ్యాసక్తులు చేయడం
5) భావస్వేచ్ఛ, స్వయం క్రమశిక్షణకు, వివిధ మార్గాల ద్వారా అభ్యసనం చేయడానికి అవకాశం కల్పించడం
6) మూర్త వస్తువుల ద్వారా అభ్యసన, జ్ఞానేంద్రియాలకు శిక్షణ ఇవ్వడం.

ఫ్రోబెల్ ఆటలను ప్రధానంగా చేసుకుని, తన కిండర్ గార్టెన్ విద్యలో 20 బహుమతులు, వృత్తులు అభివృద్ధి పరచాడు.

### కిండర్‌గార్టెన్ విద్యా విధానం (Children's Garten)

ఫ్రోబెల్ ప్రకారం బాల్యవిద్య స్వయంకృత్యాలతో నిండిఉంటుంది. ఈ పాఠశాలలో పిల్లలను నియంత్రించే వారుండరు. వారికి విసుగు కల్గించే పాఠ్య ప్రణాళికలుండవు. పిల్లలకు కావాల్సిన ఇష్టమైన ఆట స్వేచ్ఛ, సంతోషం కిండర్‌గార్డెన్స్‌లో లభిస్తాయి.

**కిండర్‌గార్డెన్‌లో**

1. శారీరక పరమైన కృత్యాలు
2. ఇంద్రియాలపై అవగాహన
3. ఆటలు, క్రీడల ద్వారా అంతర్గత శక్తులను బహిర్గత పరచడం. సృజనాత్మకతను సిద్ధింపచేయడం.

ఈ క్రింది కృత్యాల ద్వారా విద్యా విధానం సాగుతుంది.

- కొత్త ఆలోచనలను, భావనలను కల్గింపచేయడం.
- ఇతరులతో కలసిమెలసి జీవించ కలిగేటట్లు చేయడం

- పాటలు – అనుకరణల ద్వారా ఆహ్లాదకరమైన అభ్యసనము కల్గించడం.
- విద్యాబోధన సరళ విషయాల నుండి సంక్లిష్ట విషయాలకు, మూర్త విషయాలనుంచి అమూర్త విషయాలకు సాగే విధంగా ఉంటుంది.

**బహుమతులు**:

బహుమతుల ద్వారా పిల్లలు ఆ బొమ్మల్లో వున్న వస్తువుల లక్షణాలను అన్వేషిస్తారు. ఉదాహరణకు రకరకాల బంతులు, ఘన రూపాలు, స్థూపము, త్రిభుజకార చెక్కముక్కలు, వలయాలు, మైనపు ఉండలు, కార్డుబోర్డు మొదలైనవి. ఈ బహుమతులను పిల్లలకు ఒక క్రమ పద్ధతిలో అందించడం జరుగుతుంది. తద్వారా పిల్లలు గణితపరంగా సంఖ్యాభావన, సమయం, వస్తువులను వివిధ రూపాల్లో అమర్చడం వంటి అంశాల పట్ల జ్ఞానం పొందుతారు.

**వృత్తులు**:

పై బహుమతులలోని వస్తువులను ఉపయోగించి నిర్వహించే కార్యక్రమాలనే వృత్తులు అంటారు. ఉదాహరణకు ఘనరూపాలు, ఉపరితలాలు, గీతలు, బిందువులతో కృత్యాలు నిర్వహించబడును. కార్డుబోర్డు, కాగితం, కర్ర మొదలైన వాటితో నిర్మాణ కృత్యాలు చేపట్టడం జరుగుతుంది. బహుమతులు, వృత్తులు అనేవి ఒక మనోవైజ్ఞానిక శిక్షణ, ఇవి జ్ఞానేంద్రియాలైన దృష్టి స్పర్శలతో పిల్లలకు తగిన శిక్షణనిస్తాయి.

ఈ పద్ధతిలో అభ్యసన క్రింది విధంగా జరుగుతుంది.

1) కథలు చెప్పడం  2) పాటలు పాడటం  3) ఆటలు ఆడటం  4) నిర్మాణం

1) **కథలు చెప్పడం** : కథలు వినడంలో పిల్లలకు ఏకాగ్రత, ఉత్సుకత, ఊహాత్మక ఆలోచనలు కలుగుతాయి.

2) **పాటలు పాడటం** : అభినయాల ద్వారా పిల్లలు తమ హావభావాలను వ్యక్తీకరణ చేస్తారు. ఇంద్రియాలు, కండరాలు, కాళ్లు చేతుల మధ్య సమన్వయం ఏర్పడుతుంది.

3) **ఆటలు ఆడటం** : ఆటల ద్వారా పిల్లల్లో భావ వ్యక్తీకరణతో పాటు కండరాలు, అవయవాలు బలపడటం, వీటి మధ్య సమన్వయంతో పాటు సాంఘికీకరణ జరుగుతుంది.

4) **నిర్మాణం** : నిర్మాణ కృత్యాలు ఇవ్వడం ద్వారా పిల్లలు చేతులతో నేర్పుగా పనిచేయడంతో పాటు సృజనాత్మకత అభివృద్ధి చెందుతుంది.

పై కృత్యాలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో స్వయం వివర్తన, స్వయంభావ ప్రకటన, స్వయం అధ్యయనం వంటి సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పద్ధతిలో పిల్లలు కంఠస్థం చేయరు. ఉపాధ్యాయుడు కేవలం సహాయకారిగా వుంటూ పిల్లలను వివిధ కృత్యాలలో పాల్గొనేటట్లు ప్రోత్సహిస్తాడు. అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచుతాడు.

### 2.3.7 పియాజే నమూనా (Piaget approach)):

ఫ్రెంచ్ దేశానికి చెందిన పియాజే పిల్లల జ్ఞానాత్మక వికాసంపై అనేక పరిశోధనలు చేశాడు. కనుక్కోవడం, జ్ఞప్తి యందుంచుకోవడం, వర్గీకరించడం, క్రోడీకరించడం, సాధారణీకరణ వంటి ప్రక్రియలన్నీ ప్రజ్ఞకు సంబంధించిన అంశాలుగా పేర్కొన్నాడు.

పియాజే అభిప్రాయంలో తాను సూచించిన ప్రధానమైన అంశాలను ప్రణాళిక రచించి, అమలుచేయడం ద్వారా, బాలల జ్ఞానాత్మక వికాసాన్ని పెంపొందించాలన్నవి. అవి

1) భౌతిక పరిజ్ఞానము (Physical Knowledge)
2) తార్కిక మరియు గణిత పరిజ్ఞానం (Logico Mathematical Knowledge)
3) సామాజిక పరిజ్ఞానం (School Knowledge)
4) ప్రాతినిధ్యపరచడం (Representation)

పూర్వ ప్రాథమిక విద్యా ప్రణాళికలో వీటిని తప్పక చర్చించవలసినవిగా సూచించాడు.

**1) భౌతిక పరిజ్ఞానము** (Physical Knowledge)

ఇవి ప్రధానంగా వస్తువు యొక్క భౌతిక లక్షణాలకు, దృగ్విషయాలకు సంబంధించినది. భౌతిక పరిజ్ఞానాభివృద్ధికి పరిసరాలలోని వస్తువులను పరిశీలించడానికి, వాటితో చర్యా ప్రతిచర్యలను జరిపి పరిశీలించడానికి, తద్వారా ప్రత్యక్ష పరిజ్ఞానం పొందడానికి పిల్లలకు అవకాశం కల్పించాలి. అనగా, వాటిని తాకడం, ఆడటం, ప్రయోగాలు చేసి పరిశీలించడం.

**2) తార్కిక మరియు గణిత పరిజ్ఞానం** (Logico Mathematical Knowledge)

ఎ) సారుప్యతలు – బేధాలను గుర్తించే సమర్థ్యాలను అభివృద్ధిపరచడం. ఉదా: వస్తువుల లక్షణాలను బట్టి, సమూహాలుగా, తరగతులుగా వేరుచేయగల సామర్థ్యాన్ని అభివృద్ధిపరచడం.

బి) వరుసక్రమంలో అమర్చే సామర్థ్యం – అభివృద్ధి ఉదా: వస్తువులను ఆకారాన్ని బట్టి, పరిమాణాన్ని బట్టి ఆరోహణ, అవరోహణ క్రమాలలో అమర్చడం.

సి) సంఖ్య మరియు పరిణామ భావన సామర్థ్యాల అభివృద్ధి

**3) సామాజిక పరిజ్ఞానం** (School Knowledge)

ఇది సామాజిక తలంపు, ప్రవర్తన, బాధ్యతలకు సామర్థ్యాల అభివృద్ధికి పిల్లలు మంచి అలవాట్లు, తగిన సామాజిక ప్రవర్తనకు సంబంధించినది.

**4) ప్రాతినిధ్యపరచడం** (Representation)

ఇది పిల్లల ఆలోచనలను, భావాలను, అనుభవాలను వ్యక్తపరచడానికి తగ్గ అవకాశాలను కల్పించి అభివృద్ధిపరిచే సామర్థ్యం ముఖ్యంగా, పాత్రాభినయం, సృజనాత్మ వ్యక్తీకరణ, కళాత్మక కృత్యాలు, భాష, పదవినియోగం, సంభాషణ మాధ్యమం మొదలగునవి ప్రాతినిధ్యపరిచే మార్గాలు.

చిన్న పిల్లల బోధనా పద్ధతులపై ఈ క్రింది మనో వైజ్ఞానిక సూత్రాలు సూచించాడు.

1) ఏదైనా ఒక వస్తువు గురించి తెలుసుకోవాలంటే దానితో చర్య జరపాలి. తమంతట తాము వస్తువులను నిర్వహించగల మార్గాలు కనుగొనాలి.
2) పిల్లలు ప్రయోగ పూర్వకంగా వస్తువులతో చర్య జరపాలి.
3) పిల్లలు ఏవిషయానికి ఎక్కువ ప్రేరణ పొందుతున్నారో గ్రహించాలి.

4) బోధనలో చురుకైన పద్ధతులు ప్రవేశపెట్టాలి. పిల్లలు స్వయంగా, స్వేచ్ఛగా అన్వేషించడం, ప్రశ్నించడం కనుగొనటం చేయాలి.

5) ఉపాధ్యాయుడు పిల్లల మేథస్సు, అభ్యసన తెలుసుకోవడానికి ప్రయోగాలు చెయ్యాలి.

**బోధనా పద్ధతులు** (Teaching Appraoch):

1) **అనేక రకాలైన అనుభవాలు కల్పించుట** : పిల్లలలో పరిశీలన, అనుభవాల ఆధారంగా వారిలో గ్రహణ శక్తి, జ్ఞానం భావనలు కలిగేలా రకరకాల కృత్యాలు వారితో చేయించాలి.

2) **భాషా నైపుణ్యాలకు ప్రాముఖ్యత** : స్వయం ప్రకటన, విచక్షణ, ఆలోచనలు, ఇతరులతో సంభాషించడం వంటివన్నీ భాష పైనే ఆధారపడి వుంటాయి. కనుక భాషా జ్ఞానాన్ని పెంచే కృత్యాలు మాట్లాడించడం, చదివించడం, తోటిపిల్లలతో కబుర్లు చెప్పడం వంటివి చేయించాలి.

3) **తెలివిని పెంచడానికి ప్రాముఖ్యత** : చర్చలలో పాల్గొనడం, ప్రశ్నలు వేయడం, ఆలోచింపచేయడం వంటి కృత్యాల ద్వారా తెలివిని పెంచడానికి కృషి చేయాలి.

4) **అభ్యసనకు అనుకూలమైన పరిసరాలు కల్పించుట** : పిల్లలకు ఆసక్తిని, ఆహ్లాదాన్ని కలిగించే పరిసరాలు ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలలో అభ్యసన బాగా జరుగుతుంది.

## 2.4. క్రీడలు – మార్గదర్శక సూత్రాలు (Play -Guiding Principles)

అభ్యసనానికి ఆధారంగా ఆట మరియు కళ అనుభవం పొందడమే గాని నిపుణత సాధించడం కాదు.

National Focus Group on ECCE ప్రకారం పూర్వ బాల్యదశ సంరక్షణ మరియు విద్య ప్రణాళిక ఈ క్రింది మార్గదర్శక సూత్రాలననుసరించి రూపొందించాలని అభిప్రాయపడింది. ECCE ఉపాధ్యాయులకు వీటిపై అవగాహన ఎంతైనా అవసరం.

**ఎ) అభ్యసనానికి ఆధారంగా ఆట** (Play as the basis of learning):

పాశ్చాత్య విద్యావేత్తలైన రూసో, జాన్‌డ్యూయీ, మాంటిస్సోరి, ఫ్రోబెల్ మొదలైన విద్యావేత్తలు పూర్వ బాల్యదశ విద్యలో క్రీడల ప్రాధాన్యతను గుర్తించారు. భారతీయ విద్యా వేత్తలైన గాంధీ, ఠాగూర్, గిజూబాయి మొదలైన వారు కూడా శిశుకేంద్రీకృత, క్రీడా పద్ధతుల ప్రాధాన్యతను వివరించారు. పియాజే, బ్రూనర్, వైగోట్స్కీ వంటి మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా ఆటలు మరియు కృత్యాల ద్వారా పిల్లలు సహజంగా నేర్చుకుంటారని నిరూపించారు.

ఆట సహజమైనది, ఆకర్షణీయమైనది మరియు పిల్లలు సహజంగా నేర్చుకోవడానికి ప్రేరేపిస్తుంది. పిల్లలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి ఆటలు తోడ్పడతాయి. ఉదాహరణకు శారీరక నియంత్రణపై పట్టు సాధించడం, సృజనాత్మక మరియు సామాజిక నైపుణ్యాలు పెంపొందించడం, ఉద్వేగ నియంత్రణ మరియు భాషా కౌశలాలు పెంపొందించుటకు ఆట ప్రేరేపిస్తుంది.

ఇసిసిఇ (ECCE) కేంద్రంలో వివిధ రకాల వస్తువులతో పిల్లలను పర్యవేక్షిస్తూ ఆటలు ఆడించాలి. ఉదాహరణకు బంతులు, ఇసుక పెట్టెలు, ఊయలలు, బొమ్మలు మొదలగునవి. ఈ దశలో పిల్లలు ఒకచోట ఎక్కువసేపు కూర్చోలేరు.

వారు నిత్యచైతన్య వంతులు. ఎగరడం, గంతులు వేయడం, పరుగెత్తడం, ఊగడం, నవ్వటం మొదలైన పనులు వారికెంతో ఉత్సాహం కలిగిస్తాయి. ఈ చర్యల వల్ల వీరి అవయవాలకు తగిన వ్యాయమం కలిగి పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడతాయి. ఆటల ద్వారా పిల్లలు అనేక విషయాలు నేర్చుకుంటారు. పిల్లలలో అణగారి వున్న ఉద్వేగాలు బయటికి నెట్టబడతాయి.

i) **బయటి ఆటలు** : పరుగెత్తడం, గెంతడం, తాడాట, ఒంటికాలిమీద గెంతడం, సైకిలు త్రొక్కడం, మొదలైన ఆటలు ఆడటం వలన పిల్లల్లో స్థూల కండరాల అభివృద్ధి జరుగుతుంది. కండర చలనం మీద నియంత్రణ ఏర్పడుతుంది.

ii) **లోపలి ఆటలు(ఇండోర్ గేమ్స్)** : తిన్నగా, వంకరగా వున్న గీతలపై నడుచుట, తాడు మీద నడవడం, తాడు క్రింద నుండి ప్రాకుట మొదలైన ఆటలు ఆడించుట వలన పిల్లల్లో చలన నైపుణ్యాలు పెంపొందుతాయి.

పిల్లలు సమూహాలలో ఆడుట వలన వారిలో సామాజిక వికాసం, ఉద్వేగ నియంత్రణ అలవడతాయి. డ్రాయింగ్, గీతలు గీయడం, రంగులు వేయడం, జతపరచడం వంటి ఆటల ద్వారా వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయి. ఆటలు పిల్లల సమగ్రాభివృద్ధి రంగాలన్నింటిలో తమ ప్రభావాన్ని చూపిస్తాయి.

**బి) అభ్యసనానికి ఆధారంగా కళ** (Art as the basis of learning)

అభ్యసనం పట్ల ఆసక్తిని కలిగించడానికి మరియు సానుకూల దృక్పథం ఏర్పరచుకోవడానికి పూర్వబాల్యదశ విద్య పునాది అవుతుంది. పిల్లలు సంతోషంగా అభ్యసించడానికి, తమ భావాలను వ్యక్తపరచడానికి కళలు ఉపయోగపడతాయి. కళలు సహజంగానే పిల్లలలోని అభిరుచుల్ని, సృజనాత్మకతను బహిర్గత పరుస్తాయి. ప్రతిరోజు ఆట, పాటలకు కళలకు సమయాన్ని కేటాయిస్తూ ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పరచవచ్చు.

సృజనాత్మక నాటికల ద్వారా పిల్లల పరిశీలనా శక్తిని పెంపొందించవచ్చు. పాటలు పాడటం, నృత్యం, పెయింటింగ్ రంగులద్దడం మొదలగు కృత్యాలు పిల్లల్లో చలన కౌశలలాలతో పాటు భాషా జ్ఞానము, సృజనాత్మకత పెంపొందించవచ్చు. తమ చుట్టూ వున్న వస్తువుల బొమ్మల గీయడం ద్వారా వారిలో పరిశీలనాశక్తి పెంపొందుతుంది.

పిల్లలకు పెద్దవాళ్లు ఉపయోగించే వస్తువులు ఉదాహరణకు కళ్లజోళ్లు, బూట్లు, కర్రలు, చెప్పులు, పర్సులు, బ్యాగులు మొదలగు ప్రమాదం లేని వస్తువులు ఇచ్చి వాటిని ధరించి పెద్దవాళ్లలాగా నటించమంటే వాళ్లు ఎంతో ఉత్సాహంగా చేస్తారు. ఇలాంటివి వారిలో ధైర్యాన్ని నమ్మకాన్ని కలిగిస్తాయి.

పరిసరాలలోని కళాకారులను కేంద్రానికి పిలిపించి వారితోపాటు పిల్లలు కలిసి పాడటం, నృత్యం చేయడం, నటించడం లాంటి అవకాశాలు కల్పిస్తే వారికి కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఈ విధంగా పిల్లల్లో కళల పట్ల ఆసక్తిని పెంపొందించి తద్వారా అభ్యసనాన్ని అభివృద్ధి పరచవచ్చు.

**సి. అనుభవం పొందడమే గాని నిపుణత సాధించడం కాదు** (Experiencing not experiting)

పూర్వబాల్యదశ పిల్లల్లో జ్ఞానాత్మక వికాసం కలిగించడానికి అనేక రకాలైన ఆసక్తికరమైన కృత్యాలు కల్పిస్తూ పిల్లలను ఉత్సాహంగా వుంచాలి. ఈ కృత్యాల ద్వారా పిల్లల్లో అనుభవాలు కలిగించడానికి ప్రయత్నించాలే గానీ ఆయా కృత్యాలలో పిల్లలు నైపుణ్యం సాధించాలని భావించకూడదు. ఉదాహరణకు ఎంబ్రాయిడరీ, సంప్రదాయ నృత్యం, చిత్రలేఖనం వంటి నైపుణ్యంతో కూడిన పనులు పిల్లలు చేయలేరు. కానీ ఆ బట్టల దారాల రంగులు, అల్లికలు, నాట్య భంగిమలు, వేషధారణ మొదలగు అంశాలపట్ల అవగాహన పొందుతారు ఆనందిస్తారు.

ఆటపాటలలో పాల్గొన్నప్పుడు అనుభవం పొందడం ముఖ్యం. వాటిలో బాగా నైపుణ్యం సంపాదించనవసరం లేదు. పిల్లలకు వివిధ రకాల వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు, వేడుకలు, వివిధ మతాల పండుగులు జరుపుకోవడం, జాతరలు, ఉత్సవాలు మొదలగునవి చూపించినచో వాటికి సంబంధించిన అనుభవాలు పొందుతారు. తరగతి గదిలోని వివిధ మతాల, భాషల, సంస్కృతుల పట్ల పిల్లలకు అనుభవాలు కలిగించి తద్వారా సమాజంలోని సామాజిక వైవిధ్యం పట్ల అవగాహన కలిగించవచ్చు.

## 2.5 పిల్లల సమగ్రాభివృద్ధి రంగాలు – వాటికి సంబంధించిన కృత్యాలు (Domains and activities for Holistic development of children)

ECCE విద్యాప్రణాళిక పిల్లల సమగ్రాభివృద్ధికి తోడ్పడేదిగా వుండాలి. కనుక పిల్లల సమగ్రాభివృద్ధి రంగాల గురించిన జ్ఞానం ఉపాధ్యాయునికి అవసరం. శిశువు అభివృద్ధి వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులు మరియు పెరిగే పరిసరాలపై ఆధారపడి వుంటుంది. కాబట్టి తగిన వాతావరణం కల్పించడం ద్వారా పిల్లలలో పూర్తి శక్తి సామర్థ్యాలు అభివృద్ధి చెందడానికి సరైన పునాదులు వేయవచ్చు. పూర్వ బాల్యదశ పిల్లలకు అతి కీలకమైనది. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం (NCF2005) ప్రకారం బాల్యారంభ దశలో అభివృద్ధి చెందే శారీరక, మానసిక వికాసం, భావోద్వేగ వికాసం, సామాజిక వికాసం మరియు భాషాభివృద్ధి వారు భావి జీవితంలో సాధించే విజయాలకు గట్టి పునాది వేస్తాయి. వ్యక్తి జీవితంలో 90% మెదడు అభివృద్ధి 5 సంవత్సరాల వయస్సు లోపే జరుగుతుందని అధ్యయనాల ద్వారా తెలుస్తుంది. కావున పిల్లల సమగ్రాభివృద్ధికి ఈ దశలో మనం కలిగించే అనుభవాలు అత్యంత కీలకమైనవి. పిల్లల సమగ్రాభివృద్ధి అనగా అన్ని రంగాలలో అభివృద్ధి మరియు వాటి వికాసానికి కలిగించవలసిన కృత్యాల గురించి తెలుసుకుందాం.

**పిల్లల సమగ్రాభివృద్ధి రంగాలు:**

1) చలన చాలక రంగం (Motor Domain)
2) జ్ఞానేంద్రియ రంగం (Sensory Domain)
3) జ్ఞానాభివృద్ధి రంగం (Cognitive Domain)
4) భాషాభివృద్ధి (Language Domain)
5) సామాజిక, ఉద్వేగ వికాసం (Social, Emotional Development)
6) వ్యక్తిగత రంగం (Personal Domain)
7) సృజనాత్మక మరియు భావాత్మక రంగం (Creative Aesthetic)

పిల్లల సమగ్రాభివృద్ధి అనగా పైన పేర్కొనబడిన అన్ని రంగాలలో అభివృద్ధి చెందడం ఒక రంగంలో అభివృద్ధి మరొక రంగంలో అభివృద్ధికి తోడ్పడుతుంది. ఆయా రంగాల ప్రభావం ఈ పక్క పటం ద్వారా తెలుసుకోవచ్చు.




Figure - 1: Domains of Development Page : 9 Exemplar Guidelines for implementation of Early child hood care and Educatioan Curriculum NCERT

**2.5.1 చలన చాలక రంగం:** (Motor Domain)

పిల్లల అభివృద్ధిలో శారీరక పెరుగుదల అత్యంత ప్రభావవంతమైనది అప్పుడే పుట్టిన శిశువుకు తన శారీరక చలనం మీద నియంత్రణ ఉండదు. క్రమంగా ఎముకల, కండరాల ఎదుగుదల, నరాల పరిపక్వత జరుగుతుంటే శారీరక చలనంలో వేగం, బలం, నిర్దిష్టత, సమన్వయం పెరిగి చేతులు, కాళ్లు ఇతర కండరాలను వినియోగించుగలుగుతాడు. ఇలా తన శరీర భాగాన్ని వినియోగించగలగడాన్ని "శారీరక నియంత్రణాభివృద్ధి"గా చెప్పవచ్చు.

నాడీ కేంద్రాలు, కండరాల సమన్వయం ద్వారా జరిగే శరీర చలనాన్ని "చలనాత్మక వికాసం" లేదా "శారీరక నియంత్రణాభివృద్ధి"గా నిర్వచించవచ్చు.

**శారీరక మరియు చలనకండరాల అభివృద్ధిపై ప్రభావం చూపే అంశాలు:**

శారీరక మరియు చలన కండరాల అభివృద్ధిపై ఈ క్రింది అంశాలు ప్రభావం చూపుతాయి.

- వంశపారం పర్యత
- శారీరక ఆరోగ్యం
- పోషణ
- లింగబేధం
- అభ్యసించే అవకాశాలు
- ఆరోగ్యకరమైన వాతావరణం
- వ్యాయామాన్ని కలిగించే ఆటలు, పాటలు మొదలగునవి.

శారీరక మరియు చలనాత్మక వికాసం, విద్యకోసమే కాకుండా వయస్సు పెరుగుతున్న కొద్దీ పాల్గొనాల్సిన అనేక రకాల కార్యక్రమాలకు కూడా అవసరం. చలనాత్మక వికాసాన్ని 2 రకాలుగా విభజించవచ్చు. అవి (1) స్థూల కండరాల అభివృద్ధి 2) సూక్ష్మ కండరాల అభివృద్ధి

**1) స్థూల కండరాల అభివృద్ధి :**

శరీరంలోని పెద్ద కండరాలైన చేతులు, కాళ్లు, తొడలు, ఛాతి వంటి వాటిపై నియంత్రణ సాధించడాన్ని 'స్థూల కండరాల సమన్వయాభివృద్ధి' అంటారు.

**2) సూక్ష్మ కండరాల అభివృద్ధి:**

చేతి వేళ్లు, మణికట్టు కండరాల కదలికలపై నియంత్రణ మరియు కన్ను- చేయి సమన్వయాన్ని సాధించడాన్ని "సూక్ష్మ కండరాల సమన్వయాభివృద్ధి అంటారు.

చలనాత్మక వికాసానికి ECCE కేంద్రాలలో నిర్వహించదగిన కృత్యాలు

| స్థూల కండరాలకు సంబంధించిన కృత్యాలు | సూక్ష్మ కండరాల అభివృద్ధికి కృత్యాలు |
|---|---|
| నడక | చించడం, అతికించడం |
| పరిగెత్తడం | కత్తిరించడం |
| ఎక్కడం, దూకడం, పాకడం | ఏరడం |
| గెంతడం | చిత్రలేఖనం, రంగులు వేయడం |
| పట్టుకోవడం | కుట్టడం, గుండీలు పెట్టడం |
| విసరడం, తన్నడం | నృత్యం చేయడం |
| ఈత | |
| తాడుతో గెంతడం | |
| ఒంటికాలిమీద గెంతడం | |
| సైకిల్ తొక్కడం | |

పిల్లల సమగ్రాభివృద్ధిలో చలనాత్మక వికాసం అత్యంత ప్రభావవంతమైనది. కనుక పై కృత్యాలను విద్యార్థులకు కలిగించి వారిలో చలనాత్మక నైపుణ్యాలను పెంపొందించుటకు కృషి చేయాలి.

### 2.5.2 జ్ఞానేంద్రియ వికాస రంగం (Sensory Domain)

శిశువు ఎదుగుదలతో పాటు జ్ఞానేంద్రియాల ప్రతిస్పందనల వికాసం జరుగుతుంది. విషయాలను నేర్చుకోవడానికి అవగాహన చేసుకోవడానికి, పంచేంద్రియాలు పునాది. రుచి, వాసన, వినికిడి, చూపు, స్పర్శ అను ఈ పంచేంద్రియాలు ఏ అనుభవానికైనా ద్వారం లాంటివి. వీటి ద్వారా పిల్లలు తమ పరిసరాల నుండి అనేక అనుభవాలు పొందుతారు. మేథోపరమైన నేర్పువల్ల, మానసిక సామర్థ్యం వల్ల ఈ అనుభవాలు జ్ఞానంగా రూపొందుతాయి. జ్ఞానేంద్రియాలకు సంబంధించి పిల్లలు ఈ క్రింది మానసిక సామర్థ్యాలు కలిగి వుంటారు.

| ఇంద్రియాలు | సామర్థ్యాలు |
|---|---|
| 1) చూపు | రంగు, రూపం పట్ల అవగాహన, (ఆకారాలు, ఆకృతులు) |
| 2) వాసన | మంచి, చెడు వాసనలు తెలుసుకోవడం, వాటి మధ్య భేదం గుర్తించుట |
| 3) వినికిడి | శబ్ద భేదాలను గుర్తించుట (శ్రవ్య, కఠోర) |
| 4) రుచి | రుచులలో రకాలు వాటి మధ్య భేదాలను గుర్తించుట (షడ్రుచులు) |
| 5) స్పర్శ | వస్తువుల స్వభావంలో తేడాలు గుర్తించుట |

పిల్లలో జ్ఞానేంద్రియ వికాసం కలిగించుటకు ECCE కేంద్రాలలో చేపట్టదగు కృత్యాలు

**చూపు :** వివిధ రంగులు, ఆకారాలలో గల వస్తువులు, బొమ్మలు చూపించి వాటిలోని భేదాలు, పోలికలు గుర్తింపచేయుట.

**వాసన:** పరిసరాలలోని పూలు, పండ్లు మరియు ఆహార పదార్థాలను పిల్లలతో వాసన చూపించి వాటి మధ్య భేదాలు గుర్తింపచేయుట సువాసన, దుర్వాసనల మధ్య బేధం తెలియచేయుట.

**వినికిడి:** రకరకాల వస్తువులను ఉపయోగించి శబ్దాలను గుర్తింపచేయుట. ఉదాహరణకు చప్పట్లు కొట్టడం, రేడియో, సెల్‌ఫోను, టి.వి. శబ్దాలు వినిపించడం, డబ్బాలో గులకరాళ్లు, ఇసుక మోగించడం మొదలగునవి.

**రుచి:** రకరకాల ఆహార పదార్థాలను పిల్లలకు రుచి చూపించి తీపి, పులుపు, ఉప్పు కారం మొదలగు రుచుల భేదాలను గుర్తింపు చేయుట

**స్పర్శ:** మెత్తని ఇసుక, బంకమట్టి, గుడ్డ ముక్కలు, చెక్క ముక్కలు, లోహపు ముక్కలు, వేడి, చల్లని నీరు గల పాత్రలు మొదలగు వానిని స్పృశింపజేయడం, కళ్లు మూసుకుని తాకి స్పర్శ ద్వారా గట్టిదనం, మెత్తదనం, నునుపుదనం, వేడి, చల్లదనం, మొదలగు వానిని గ్రహింపచేయడం.

ఈ విధంగా కృత్యాలు నిర్వహించడం ద్వారా బాలల్లో జ్ఞానేంద్రియ వికాసాన్ని కలిగించి పిల్లల సమగ్రాభివృద్ధికి దోహదం చేయవచ్చు.

### 2.5.3 జ్ఞానాభివృద్ధి రంగం (Cognitive Domain)

పిల్లల మానసిక కార్యకలాపాలైన ప్రత్యక్షం, స్మృతి, అవధానం, ఆలోచన, వివేచన, ప్రజ్ఞ, సృజనాత్మకత లాంటి అంశాలను ప్రభావితం చేసే మానసిక ప్రక్రియలలో జరిగే మార్పులను "జ్ఞానాత్మక వికాసం" అంటారు. పిల్లల్లో జ్ఞానాత్మక వికాసం భావనను ప్రవేశపెట్టింది. స్విట్జర్లాండ్‌కు చెందిన మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త జీన్ పియాజే (1896–1980) ఈయన పిల్లల జ్ఞానాత్మక వికాసం గురించి విస్తృతంగా పరిశోధన చేసి అది పిల్లల్లో 4 దశలలో జరుగుతుందని ప్రతిపాదించాడు.

1) ఇంద్రియ చాలకదశ (0–2 సం॥లు) Sensory Motor Stage
2) పూర్వ ప్రచాలక దశ (2–7 సం॥లు) Pre-Operational Stage
3) మూర్త ప్రచాలక దశ (7–12 సం॥లు) Concrete oparational Stage
4) అమూర్త ప్రచాలక దశ (12 సం॥లు పైన) Formal oparational Stage

పిల్లల వయస్సు ప్రకారం ఆయా దశల గుండా జ్ఞానాత్మక వికాసం అభివృద్ధి చెందుతుంది. వైయుక్తిక భేదాల వల్ల కొంతమంది పిల్లల్లో ఆయా దశలు దాటడంలో ఎక్కువ లేదా తక్కువ కాలం తీసుకోవచ్చు. కానీ ప్రతి ఒక్కరూ ఈ దశల గుండా వెళ్లాల్సిందే అని పియాజే వివరించాడు. తమ పరిసరాలను అర్థం చేసుకుని తమను తాము పరిసరాల కనుగుణంగా మలచుకోవడాన్ని "జ్ఞానాత్మక వికాసం" అంటారు.

> వ్యక్తి పుట్టినప్పటి నుండి తన పరిసరాలతో ప్రతి చర్యలను జరుపుతూ ప్రపంచానికి సంబంధించిన జ్ఞానాన్ని సంపాదించుకుంటాడు **– పియాజే**

పిల్లలందరిలో జ్ఞానాభివృద్ధి ఒకేలా కనిపించినా అభివృద్ధి వేగంలో తేడాలుంటాయి. ఈ తేడాలకు గల కారణాలు 2 రకాలు

**1) స్వాభావిక కారణాలు:** పుట్టుకతో స్వాభావికంగా వచ్చిన శక్తియుక్తులను బట్టి పిల్లల జ్ఞానస్థాయిని కొంతవరకు నిర్ణయించవచ్చు.

2) **పరిసర సంబంధ కారణాలు**:

ఎ) పెద్దల, పిల్లల పరస్పర సంబంధం

బి) తమ స్థాయి పిల్లలతో సంబంధం

సి) సామాజిక పరమైన తేడాలు

డి) సామాజిక భావోద్వేగం

52ZH57

## పిల్లల్లో జ్ఞానాత్మక వికాసం కలిగించడానికి నిర్వహించవలసిన కృత్యాలు :

పిల్లల్లో జ్ఞానాత్మక వికాసం కలిగించడానికి వారిలో జ్ఞాపకశక్తి, పరిశీలన, గ్రహించడం, క్రమబద్ధమైన ఆలోచన, వర్గీకరణ, సమస్యా పరిష్కార నైపుణ్యం మొదలగు శక్తులను పెంపొందించాలి. దీనికోసం ఈ క్రింది కృత్యాలు నిర్వహించాలి.

1) పిల్లలతో జ్ఞాపకానికి సంబంధించిన ఆటలు చిన్న సమూహాలలో ఆడించడం, ఉదాహరణకు పిల్లలకు 5 లేక 6 వస్తువులను చూపి తరువాత వాటిని దాచి, వాటి పేర్లు పిల్లలతో చెప్పించుట

2) వివిధ రంగులలో గల వస్తువుల బొమ్మలను చూపి వాటి రంగులను పిల్లలతో గుర్తింపచేయుట.

3) **జతపరచుట** : పరస్పర సంబంధం ఉన్న వస్తువులను ఒక సంచిలో వేసి వాటిని జతపరచమనుట
**ఉదా:** పెన్సిలు – రబ్బరు, పలక – బలపం, వస్తువులు – వాటి బొమ్మలు

4) **ఆకారాల పట్ల అవగాహన** : వృత్తం, చతురస్రం, దీర్ఘ చతురస్రం, త్రిభుజం లాంటి ఆకారాలను గుర్తింపచేయడం

5) **పరిసరాల అవగాహన** : పరిసరాలలో మొక్కలు, జంతువులు, పక్షులు, పూలు, పండ్ల గురించి అవగాహన కలిగించుట

6) **వర్గీకరణ** : ఆకారం, పరిమాణం లాంటి భావనలు పిల్లలు వర్గీకరణ చేయుటకు కృత్యాలు నిర్వహించాలి. ఉదాహరణకు వేర్వేరు ఆకారాలు, పరిమాణం గల వస్తువులు ఇచ్చి వాటిని వేరు చేయమనడం.

7) **క్రమ బద్ధమైన ఆలోచన** : మనం ప్రతిరోజు చేసే పనుల్లో వున్న క్రమాన్ని పిల్లలతో చర్చించడం. ఉదాహరణకు పిల్లల దైనందిన కార్యక్రమాలను ECCE కేంద్రంలో జరిగే కార్యక్రమాలను వరుస క్రమంలో చెప్పించుట

8) చిత్రాలు, ఫోటోలు, నమూనాలు చూపి నిజ వస్తువుల గురించి చెప్పించడం.

9) రంగులు వేయడం, చిత్రాలు గీయడం.

ఇలాంటి కృత్యాలు బాలల ప్రవర్తనల్లో జ్ఞానాత్మక వికాసాన్ని పెంపొందించవచ్చు.

### 2.5.4. భాషాభివృద్ధి రంగం (Language Development)

పిల్లల సమగ్రాభివృద్ధికి భాషాభ్యసనం తప్పనిసరి. తన అభిప్రాయాలు, ఆలోచనలు, భావనలు ఇతరులకు తెలియచేయడానికి, ఇతరుల భావనలు అవగాహన చేసుకోవడానికి, భాషాభ్యసనం అవసరం. అంతేకాకుండా జ్ఞాపకశక్తి, తార్కికశక్తి, సమస్యాభివృద్ధికి భాషాభ్యసనం అవసరం. భాష ద్వారా సంస్కృతి ఒక తరం నుండి మరొక తరానికి అందజేయబడుతుంది. పూర్వ బాల్యదశ పిల్లలు చిన్న చిన్న మాటలు, ఆ తర్వాత చిన్న చిన్న వాక్యాల ద్వారా తమ భావాలను వ్యక్తీకరిస్తారు.

పిల్లల భాషా వికాసానికి కావలసిన నైపుణ్యాలు ప్రధానంగా 4. అవి 1) వినడం, 2) మాట్లాడటం, 3) చదవడం 4) వ్రాయడం పిల్లల్లో భాషా నైపుణ్యాల అభివృద్ధికి ఈ క్రింది కృత్యాలు నిర్వహించాలి.

1) **వినడం** : పిల్లల్లో శబ్దగ్రహణ నైపుణ్య వికాసం, శబ్ద భేదాలను గుర్తించడం, విన్నది అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలు పెంపొందించాలి. పిల్లలకు వినడం పట్ల ఆసక్తి కలిగించే విధంగా కథలు, పాటలు, సంభాషణలు, సూచనలు విన్పించాలి. రేడియో, టేపురికార్డరు, సెల్‌ఫోనుల ద్వారా ఆసక్తిని కలిగించే పాటలు, కథలు, సంభాషణలు వినిపిస్తే పిల్లలు ఆసక్తిగా వింటారు. భాషాపరమైన ఆటలు ఆడించడం, మధ్యలో ప్రశ్నలు వేయడం ద్వారా విన్నది అవగాహన చేసుకున్నారా లేదా అని తెలుసుకోవడం ద్వారా పిల్లలు వినికిడి శక్తిని పెంచుకునేలా కృషి చేయాలి.

2) **మాట్లాడటం** : తమ భావాలను స్వేచ్ఛగా, ధారాళంగా, స్పష్టంగా వ్యక్తీకరించగలగడం, పూర్తి వాక్యాలలో మాట్లాడగలగడం, క్రమ పద్ధతిలో మాట్లాడగలగడాన్ని మాట్లాడే నైపుణ్యంగా భావించవచ్చు.

ఏదైనా వస్తువును గురించి, సంఘటన గురించి లేదా బొమ్మ, చార్టును ఉపయోగించి పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడటానికి ప్రోత్సహిస్తే పిల్లల్లో మాట్లాడే నైపుణ్యం పెరిగి భాషాభివృద్ధి జరుగుతుంది. కబుర్లు, కథలు, నాటకీయత, పద నిర్మాణ కార్యక్రమాలు, పద బంధాలు మరియు గొలుసు పదాలు మొదలగు కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించాలి.

**3)** **చదవడం** : ECCE కేంద్రాలలో పూర్వపఠన (పఠన సంసిద్ధత) కార్యక్రమాలే ఉండాలి. చదవడం పట్ల పిల్లలకు ఆసక్తి కలిగించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. పిల్లలు ముఖ కవళికలను, గుర్తులను, చిత్రాలను, కార్టూనులను పరిశీలిస్తారు. బొమ్మలు, చిత్రాలను చూసి చదవడం, మాటల పోటీలు, ఆటలు, ఆడించటం లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలను చదవడానికి సంసిద్ధులను చేయవచ్చు. అక్షరాల ఆకారం మరియు ఉచ్ఛారణలో భేదం అర్థం చేసుకుంటారు.

**4)** **రాయడం** : పూర్వ బాల్యదశలో పిల్లల్లో రాయడానికి కావలసిన పరిపక్వత ఉండదు. అనగా కళ్లకు, చేతికి సమన్వయం, ఆకారాలు, రూపాల్ని పోల్చగల శక్తి ఉండదు. ECCE కేంద్రాలలో పిల్లలకు పూర్వలేఖన సామర్థ్యాలు పెంపొందించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

మట్టి బొమ్మలు చేయడం, కత్తిరించడం, అంటించడం లాంటి సృజనాత్మక పనులు పిల్లలతో చేయించాలి. పూసలు గుచ్చటం, ఆకులు కుట్టడం, గళ్లలో రంగులు వేయడం, చుక్కల్ని గీతలుగా కలపడం, ట్రేసింగ్, ఆకారాలు, నమూనాలు గీయడం, అసంపూర్తి ఆకారాలను పూర్తి చెయ్యడం మొదలగు పనులు చేయించాలి. తద్వారా మంచి కండర సమన్వయం అభివృద్ధి చెంది లేఖనా సంసిద్ధత పొందుతారు.

**పిల్లల భాషాభివృద్ధికి ఈ క్రింది కార్యక్రమాలు నిర్వహించాలి.**

1) తల్లిదండ్రులు, పెద్దలు కథలు, కబుర్లు చెబుతూ పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.

2) పుస్తకాలు, పత్రికలు, బొమ్మలు పిల్లలకు అందుబాటులో ఉంచాలి.

3) దృశ్య శ్రవణ మాధ్యమాలు, తోలు బొమ్మలు, లఘు చిత్రాలు పిల్లల అనుభవంలోకి తేవాలి.

### 2.5.5 సామాజిక, ఉద్వేగ వికాసం (Social & Emotional Development)

సామాజిక అభివృద్ధి అంటే పిల్లల్లో స్వాభావికమైన ప్రవర్తన మెరుగుపడి పరిసరాలకు తగినట్లు ప్రవర్తించడం. సామాజిక, ఉద్వేగాభివృద్ధి రెండూ కలిసి పనిచేస్తాయి. కొంతమంది పిల్లలు, ఉత్సాహంగా, చొరవగా, స్వతంత్రంగా వుంటే మరికొందరు సిగ్గుగా, ఉదాసీనంగా ముడుచుకుపోయి వుంటారు. ఒకే పిల్లవాడు వేరు వేరు సందర్భాలలో వేర్వేరుగా వుంటాడు. చుట్టూ ఉన్న పరిస్థితులు, వ్యక్తులు దీనికి కారణం కావచ్చు. వారికి తగిన ప్రోత్సాహం లభిస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. అందుకే పిల్లల సమగ్ర వికాసంలో సామాజిక, ఉద్వేగాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

**పిల్లల్లో వివిధ రకాల సామాజిక ఉద్వేగ ప్రవర్తనలకు కారణాలు:**

ఎ) తల్లిదండ్రుల నమ్మకాలు, ప్రవర్తన, చుట్టూ ఉన్న సంస్కృతి, తను పెరిగే సమాజం. ఇవన్నీ పిల్లల ప్రవర్తనలో, ఉద్వేగాల్లో ప్రతిబింబిస్తాయి.

బి) తల్లిదండ్రులు పిల్లలపై కలిగించే ఒత్తిడి వలన పిల్లలు అసహనంగా తయారవుతారు.

సి) ఆప్యాయత, ప్రేమ వున్న వాతావరణంలో పిల్లలు సంతోషంగా, నలుగురితో కలిసిపోయి మంచి మానసిక ఆరోగ్యంతో పెరుగుతారు.

డి) తోటి వారి సాంగత్యం, పిల్లలను శిక్షించే విధానం, ప్రోత్సహించే తీరు పిల్లల ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది.

ఇ) విడిపోయిన తల్లిదండ్రులు, పిల్లల పట్ల అయిష్టత చూపించే తల్లిదండ్రులు గల పిల్లలు పోట్లాడటం, ముడుచుకుపోయే స్వభావం కలిగి వుంటాయి.

**పిల్లల్లో సామాజిక ఉద్వేగాభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమం**

పిల్లలు సమాజంలో ఎలా ప్రవర్తించాలో తెలియజేసే బాధ్యత తల్లిదండ్రులదే. వారితోపాటు ఉపాధ్యాయులు, సమ వయస్కులు, ప్రసార మాధ్యమాలు కూడా ప్రముఖ పాత్రవహిస్తున్నాయి. క్రింది కార్యక్రమాల ద్వారా పిల్లల్లో సామాజిక ఉద్వేగాభివృద్ధి పెంపొందించవచ్చు.

1) పిల్లలను పేరుతో పిలవడం, వారు చేసిన పనికి గుర్తింపు లభించేలా ప్రదర్శించడం, పుట్టినరోజులు జరపడం బాధ్యతలు అప్పచెప్పడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలి.

2) పిల్లలను ఇతరుల ముందు విమర్శించడం, కించపరచడం చేయరాదు.

3) సమూహాలలో ఆటలు ఆడించడం ద్వారా పిల్లలకు తోటి పిల్లలతో కలిసి మెలిసి వుండటం అలవరచాలి.

4) ఆటపాటల ద్వారా పిల్లల్లో సామాజిక, ఉద్వేగ వికాసాన్ని పెంపొందించవచ్చు.

### 2.5.6 వ్యక్తిగత రంగం (Personal Development)

పిల్లలందరూ ప్రత్యేకమైన వారే. ఎవరి వ్యక్తిత్వం వారిదే. వారి సామర్థ్యాలలో, లక్షణాలలో, ప్రవర్తనలో రకరకాల భేదాలుంటాయి. కొందరు బహిర్ వర్తనులుగా వుంటారు. మరికొందరు అంతర్ముఖులుగా వుంటారు. పిల్లల వికాసంపై సాంఘిక పరిస్థితులు, సంస్కృతి ప్రభావం చూపుతాయి. వ్యక్తి వికాసంపై అనువంశికత, పరిసరాల ప్రభావంపై అనేకమంది పరిశోధనలు చేశారు. కొన్ని పరిశోధనలు వ్యక్తి వికాసం అనువంశకత మీద ఆధారపడి నిర్ణయింపబడుతుందని రుజువు చేశాయి. మరికొన్ని పరిశోధనలు గృహ వాతావరణం, పరిసరాల మీద నిర్ణయింప బడుతుందని రుజువు చేశాయి.

825PB6

కులం, మతం, పండుగలు, ఉత్సవాలు, వృత్తులు మొదలైన మత, సాంస్కృతిక సంబంధాలు పిల్లల అభివృద్ధిపై ప్రభావం చూపుతాయి. పిల్లలకు సహజమైన ప్రేమ, వాత్సల్యం, లభించేది కుటుంబం నుండే. సమాజంలో ఎలా ప్రవర్తించాలి, ఎలా మాట్లాడాలి? ఎలాంటి దుస్తులు ధరించాలి వంటి అనేక విషయాలను పిల్లలు కుటుంబం నుండే నేర్చుకుంటారు.

**వ్యక్తిగత వికాసానికి నిర్వహించవలసిన కృత్యాలు**

1) పిల్లలు ఒంటరిగా వుండకుండా సమ వయస్కులతో స్నేహం చేసేలా ఆటలు, జట్టు కృత్యాలు ఏర్పాటు చేయాలి.

2) నాటకీకరణ, పాత్రపోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, బొమ్మలాట మొదలగు కృత్యాల ద్వారా పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించవచ్చు.

3) పిల్లలు వారి సామర్థ్యాల కనుగుణంగా నేర్చుకునేలా ప్రోత్సహించాలి.

**2.5.7 సృజనాత్మక మరియు భావాత్మక రంగం (Creative and Aesthetic Development)**

పిల్లలందరికీ సృజనాత్మక శక్తి ఉంటుంది. ఆ శక్తిని గుర్తించడం, పెంచి పోషించడం తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల బాధ్యత. పిల్లల్లో ఎవరి ప్రత్యేకత వారిదే. అదే వాళ్ళ సృజనాత్మకత వ్యక్తీకరణలో ఒకరి నుండి మరొకరు ఎంతో భిన్నంగా ఉంటారు. కొందరు కళల ద్వారా సృజనాత్మకతను వ్యక్తీకరిస్తే, మరికొందరు కొత్త ఆలోచనలు చెపుతూ, రకరకాల ఊహా పాత్రలలో కొత్త కథలు అల్లుతూ తమ సృజనాత్మకతను వ్యక్తీకరిస్తారు. పిల్లల్లోని ఈ సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమాలు రూపొందించాలి.

**సృజనాత్మకతను అభివృద్ధి పరచే కృత్యాలు**

1) బొమ్మలు వేయటం, రంగులు వేయటం, చించడం, కత్తిరించడం, అతికించి రూపాన్నివ్వడం, మట్టితో నమూనాలు చేయడం, కాగితాలు మడిచి వివిధ ఆకారాలు చేయడం

2) సృజనాత్మక కదలికలు: చిటికెలు వేయడం, చప్పట్లు, మోకాళ్ల మీద అరచేతులతో చప్పుడు చేయడం లయబద్ధంగా సాగే ఆటలు మొదలగునవి

3) సృజనాత్మక ఆలోచన : స్వేచ్ఛగా సాగే ఆటలు, అనేక చిత్రమైన ప్రశ్నలు వేయడం. ఉదా: నీకు రెక్కలు వచ్చి ఎగరగలిగితే, మీ నాన్నగారి కంటే నువ్వు పొడుగైతే? బొమ్మకు రంగు వేయాలని వుంది. రంగులున్నాయి. కానీ బ్రష్ లేదు ఏం చేస్తారు?

4) రసా స్వాదన – అభినందన : పిల్లల్ని ప్రకృతిలోకి నడిపించి ప్రకృతి సౌందర్యం మీద వారికి అభిమానం కలిగేలా చెయ్యాలి.

Blow painting, hand painting, thread painting మొదలగునవి

## 2.6. ప్రారంభ సంవత్సరాలలో అక్షరాస్యత, సంఖ్యాభావన (Emergent Literacy and Numeracy on Early Years)

అక్షరాస్యత అనగా చదవడానికి, రాయడానికి సామర్థ్యం కలిగివుండటం మరియు అవగాహన చేసుకోవడం. కానీ పిల్లలు చదవడం, రాయడం నేర్చుకోకముందే తల్లిదండ్రుల నుండి పరిసరాల నుండి అక్షరాస్యతకు సంబంధించి, సంఖ్యా భావనలకు సంబంధించి కొన్ని భావనలు ఏర్పరచుకొని వుంటారు. అక్షరాస్యత అనేది పుట్టినప్పటి నుండి ప్రారంభమవుతుంది.

ఉదాహరణకు పిల్లలు నవ్వటం, ముఖ కవళికలు మార్చటం, టి.విలో, కంప్యూటర్‌లో బొమ్మలు చూడటం, సెల్‌ఫోన్‌లో ఆటలాడటం మొదలైనవన్నీ అక్షరాస్యత పరిధిలోకి వస్తాయి.

ఈ దశలో పిల్లలకు చదవడం, వ్రాయటం వంటి ప్రక్రియలు చేసే పరిపక్వత రాదు. కనుక ఈ దశలో కేవలం పూర్వ పఠన, పూర్వ లేఖన మరియు పూర్వ సంఖ్యా భావనలు మాత్రమే పిల్లలకు కలిగించాలి. వీటిని పిల్లలు మూర్త వస్తువులు, ఆట పాటలతో రకరకాల కృత్యాల ద్వారా నేర్చుకుంటారు. పుట్టినప్పటి నుండి పిల్లలు భాషను నేర్చుకుంటారు. తల్లిదండ్రుల నుండి పరిసరాల నుండి భాషను నేర్చుకుంటారు. ఇది సహజంగా, సందర్భోచితంగా అర్థవంతంగా వుంటుంది.

**2.6.1. అక్షరాస్యతను అభివృద్ధి పరచడంలో ECCE కేంద్రంలో నిర్వహించదగు కృత్యాలు**

ECCE కేంద్రానికి రాకముందే పిల్లలు బొమ్మలు, గుర్తులు, కార్టూన్‌లు పరిశీలిస్తారు.

**1) అక్షరాస్యతలో పూర్వపఠన** (Pre-Reading),

పూర్వ పఠనంలో భాగంగా పిల్లలు శబ్దభేదాలు, దృశ్య భేదాలు గుర్తించడం, దృశ్య శ్రవణ అనుసంధానం చేయగలగాలి.

**ఎ) శబ్దభేదాలను గుర్తించుట**: ఒకే అక్షరంతో మొదలయ్యే వస్తువుల పేర్లు చెప్పమనటం, అంత్యాక్షరి ఆట, ప్రాస కలిపే ఆట మొదలగు కృత్యాల ద్వారా శబ్ద భేధాలు గుర్తిస్తారు.

**బి) దృశ్య భేదాలు గుర్తించుట**: అక్షరాల ఆకారాలను కత్తిరించి వాటి ఆకారాలలో భేదాన్ని గుర్తింపచేయడం, అక్షరాల ఆకారాలను ఆకులతో గింజలతో నింపడం మొదలగు కృత్యాల ద్వారా అక్షరాలను గుర్తింపచేయడం, చదివించడం.

**సి) దృశ్య శబ్ద సంబంధం తెలుసుకొనుట:** బొమ్మల కార్డులు, వాని పేర్లు రాసిన కార్డులు ఇచ్చి జతపరచడం ద్వారా దృశ్య – శబ్ద సంబంధాన్ని ఏర్పరచవచ్చు.

**డి) ఎడమ నుండి కుడి**: పిల్లలకు పుస్తకాలు అందుబాటులో వుంచి పేజీలు త్రిప్పడం ద్వారా ఎడమ నుండి కుడికి పై నుండి క్రిందకు చదవడం అలవరచవచ్చు.

చిత్రాలతో కూడిన పుస్తకాలు పిల్లలు ఉపయోగించుకునేలా చేయడం, కథలు చెప్పించడం, పదక్రీడలు, పాటలు, నాటకీకరణ మొదలగు కృత్యాల ద్వారా పిల్లల్లో పూర్వపఠన సామర్థ్యాలు పెంపొందించవచ్చు.

**2) పూర్వ లేఖనము** (Pre-Writing):

రాయడానికి తగిన కండర సమన్వయం ఏర్పరచడానికి పిల్లలతో రకరకాల కృత్యాలు చేయించాలి. క్రేయాన్లతో, సుద్ద ముక్కలతో గీతలు గీయడం, చుక్కలను కలపడం, ఆకారాలను ట్రేస్ చేయడం, ఆకారాలు గుర్తింపచేయడం, త్రిభుజం, వృత్తం, చతురస్త్రం వంటి ఆకారాలను గీయడం మొదలగు కృత్యాల ద్వారా కన్ను, చేయి సమన్వయం ఏర్పడుతుంది. తరువాత బలపం, పెన్సిలు ఉపయోగించి వ్రాయగలుగుతారు.

బంకమట్టిపై అక్షరాల ఆకారాలు వత్తడం, చుక్కలు కలిపి అక్షరాలు ఏర్పరచడం, అక్షరాల ఆకారంపై ఇసుక నింపడం మొదలగు కృత్యాల ద్వారా అక్షరాలు వ్రాయడం నేర్చుకుంటారు.

**3) సంఖ్యా భావన** (Number conept):

పూర్వబాల్య దశలో పిల్లలకు సంఖ్యలు నేర్పించుటకు ముందు కొన్ని మౌలిక భావనలు నేర్పించడం జరుగుతుంది. ఈ భావనలు తరువాత వారిలో సంఖ్యా భావనలు కలిగించుటకు దోహద పడతాయి. ఆ తరువాత 0 నుండి 9 వరకు అంకెలు పరిచయం చేయవచ్చు.

| మౌలిక భావనలు | నిర్వహించాల్సిన కృత్యాలు |
|---|---|
| 1) పెద్ద – చిన్న | ఒకే ఆకారం గల వస్తువులను వేరు వేరు సైజులలో ఇచ్చి, పెద్ద వాటిని, చిన్నవాటిని వేరు చేయమనుట **ఉదా:** అట్టముక్కలు, రింగులు, బొమ్మలు. |
| 2) పొడవు – పొట్టి | తరగతిలో పొడవైన విద్యార్థిని, పొట్టి విద్యార్థిని చూపించడం మరియు పెన్సిల్, చాక్‌పీస్‌లను చూపించి అడగటం. |
| 3) ఎక్కువ – తక్కువ | పెన్సిళ్లు, పుస్తకాలు, బలపాలు రాశులుగాపోసి ఏవి ఎక్కువ ఏవి తక్కువ చెప్పమనుట |
| 4) లావు – సన్నం | లావు మనిషి, సన్న మనిషి బొమ్మలు చూపించుట. |
| 5) బరువు – తేలిక | తరగతిలో వస్తువులను పైకిలేపి చూసి ఏది బరువు ఏది తేలిక చెప్పమనుట. ఉదాహరణకు పుస్తకాల సంచి, చాక్‌పీసు పెట్టె, పలక, పుస్తకం పుస్తకాల బ్యాగ్, ఖాళీ బ్యాగ్ మొదలగునవి. |
| 6) విశాలం – ఇరుకు | పాఠశాలలో పెద్దగది, చిన్న గది చూపించడం |

**సంఖ్యల అవగాహనను కలిగించుటకు కృత్యాలు**

1) సంఖ్యలపై ఆధారపడిన కథలు, పాటలు వినిపించడం. ఉదాహరణకు 10 చిలుకలు పాడుచుండగా మొదలైనవి.
2) గడియారం, క్యాలెండర్, క్యాలిక్యులేటర్ వంటి వస్తువుల ద్వారా సంఖ్యలను పరిచయం చేయడం
3) కార్డులపై అంకె, దానికి సరిపడ బొమ్మలు చిత్రీకరించి వాటిని జతపరిచే ఆట.
4) పరిసరాలలో దొరికే వస్తువులను ఉదాహరణకు రాళ్లు, ఆకులు, పూలు, పుల్లలు మొదలగు వానిని ఒకటికిఒకటి జతపరచడం, ఏవి ఎన్ని వున్నాయో లెక్కించడం ద్వారా పిల్లల్లో సంఖ్యాభావన కలిగించవచ్చు.

భాష, సంఖ్యా భావనల గురించి 4వ అధ్యాయంలో వివరంగా చర్చించబడింది.

## 2.7 ECCE లోని అంశాలు (విద్య, సంరక్షణ, పోషణ మరియు అలవాట్లు ఏర్పడుట) మరియు బోధనాభ్యసన విధానాలు (Components of ECCE and approach to teaching learning)

జాతీయ విద్యావిధానం (1986) పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య ప్రాధాన్యతను నొక్కి వక్కాణించింది. ECCE కేంద్రాలలో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. తద్వారా పిల్లలను ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చేయడం జరుగుతుంది. ECCE కేంద్రాలలో కార్యకర్తలు, ఆయాలు పిల్లల సంరక్షణ బాధ్యతను తీసుకుంటారు. ఈ కేంద్రాలలో పిల్లలకు పోషకాహారం అందించడం మరియు పిల్లల్లో మంచి అలవాట్లు ఏర్పరచడం జరుగుతుంది.

**ECCE కార్యక్రమాలు నిర్వహించడంలో ఈ క్రింది విభాగాలు కృషి చేస్తున్నాయి.**


1) సమగ్ర శిశు వికాసం సేవలు (ICDS)
2) స్వచ్ఛంద సంస్థలు (NGO) నిర్వహించే ECCE కేంద్రాలు
3) సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న ECCE కేంద్రాలు
4) బాల్వాడీలు, డేకేర్ సెంటర్
5) అంగన్‌వాడీలను ప్రాథమిక పాఠశాల ఆవరణలో నడపటం
6) మాతా శిశు ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో అనుసంధానం

**2.7.0** ECCE **లో నిర్వహించు కార్యక్రమాలు**

**పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు నిర్వహించే పద్ధతులు:**

పూర్వ ప్రాథమిక విద్యను నిర్వహించడానికి అంగన్‌వాడి కేంద్రాలు లేదా పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలకు పిల్లలతో చేయించబడిన కృత్యాల ప్రణాళికను పొందుపరచుకోవాలి. అందులోని కార్యక్రమాలు, నిర్వహించే పద్ధతులను ఈ కింది విధంగా విభజించారు. (కేంద్రాలలో లింగ వివక్షను చూపించకూడదు)

1) ఆట 2) మాట 3) మాట 4) కథ 5) సృజనాత్మకత 6) సంసిద్ధత కృత్యాలు




పై వాటిలో ఏ కృత్యాన్ని అయినా 30 నిమిషాలకు మించి చేయకూడదు. ఇవే కాకుండ ప్రతిరోజు శుభ్రత, మంచి ఆలవాట్లను నర్పించడానికి కూడా కొంత సమయం కేటాయించాలి. వీటన్నింటిని కలిపి కేంద్రం ప్రతిరోజు 2½ లేదా 3 గంటల వరకు వికాస కార్యక్రమాలు నిర్వహించాలి.

**1. ఆట కృత్యం:**

విద్యార్థికి కేంద్రాలలో వారిలోని నైపుణ్యాలను పెంపొందించడానికి బయటి / లోపలి ఆటలు, స్వేచ్ఛ ఆటలను నిర్వహించాలి.

బయటి / లోపలి ఆటలు / స్వేచ్ఛ ఆటలు / ప్రాంతీయ ఆటలు

**ఉద్దేశ్యాలు:** బయటి / లోపలి / స్వేచ్ఛ ఆటలలో ఈ కింది ఉద్దేశాలు సాధించవచ్చు.

1) పెద్ద కండరాల, చిన్న కండరాల అభివృద్ధి సమన్వయం, నియంత్రణ.
2) ఉద్వేగాల నియంత్రణ, భావాలను వ్యక్తీకరించడం.
3) పిల్లలను ఆనందింపజేయడం, స్వేచ్ఛగా ఆడుకోనివ్వడం.
4) కలసిమెలసి ఆడుకోవడం, వారి వంతు వచ్చే వరకు ఆగమనడం.

**2. పాట కృత్యం:**

విద్యార్థులకు ఆటలతోపాటు కొన్ని పాటలను కూడా నేర్పిచాలి. వాటిని ఈ కింది విధంగా నేర్పించాలి.

ఉద్దేశం

1) పాటలకు అనుగుణంగా లయబద్ధమైన శరీర కదలికలు, అభినయం చేయడాన్ని ప్రోత్సహించడం.

2) జ్ఞాపకశక్తిని పెంచడం.

3) పాటలను మళ్ళీ మళ్ళీ పాడించడం దాని ద్వారా ఆనందింపచేయడం.

విధానం

1) ప్రతిరోజు ఒక పాటను విద్యార్థులకు రాగయుక్తంగా నేర్పించాలి.

2) పాటతోపాటు అభినయాన్ని చేస్తూ ఉపాధ్యాయుడు(రాలు) ప్రోత్సహించాలి.

3) పిల్లలను గుండ్రంగా తన చుట్టూ నిలబెట్టి, మొదట టీచరు పాటను రాగయుక్తంగా పాడాలి, విద్యార్థులు ఆలకించేటట్లు చేయాలి.

4) ఒకసారి విద్యార్థులు పాడటానికి సిద్ధమైన వెంటనే లోపాలను సరిదిద్దుతూ చక్కగా నేర్పించాలి.

**3. మాట కృత్యం / సంభాషణ కృత్యం:**

విద్యార్థి ఆట, పాటలను శారీరక కదలికల ద్వారా చేసిన విద్యార్థిని పూర్తిగా అభ్యసనకు సిద్ధం చేయడానికి వారిచేత చిన్న చిన్న మాటలను పలికించాలి. దాని ద్వారా విద్యార్థి నేర్పుగా మాట్లాడటం నేర్చుకొంటారు.

ఉద్దేశం

1) వినడానికి అవకాశాన్ని కల్పిస్తూ వారి భావాలను వ్యక్తపరచనివ్వాలి.

2) మాట్లాడటం పదాల ప్రయోగం, ఆలోచనలకు అనుగుణంగా మాట్లాడటం నేర్పాలి.

**4. కథ కృత్యం:**

విద్యార్థులకు సంభాషణ నేర్పిన తరవాత టీచరు వారి జ్ఞానాభివృద్ధికోసం చిన్న చిన్న కథలను పరిచయం చేయాలి. దాని ద్వారా వారిలో భావ ప్రకటన, ఏకాగ్రత, సమస్య పరిష్కారం నేర్పించవచ్చు.

ఉద్దేశం

1) భాషాభివృద్ధిని పెంపొందించడం, శ్రవణ శక్తిని పెంచడం.

2) క్రమ పద్ధతిలో ఆలోచింపచేస్తూ ఏకాగ్రతను కలిగించడం.

3) నాటకీకరణను నేర్పుతూ కథను చెప్పించడం.

4) కథలలోని చిన్న చిన్న సమస్యలకు పరిష్కారాలను సూచించేటట్లు నేర్పించడం.

5) కథలలో వారికి ఇష్టమైన పాత్రను గురించి చెప్పమనడం, ఆ పాత్ర అభినయాన్ని చూపించమనడం.

6) కథలలోని విషయానికి సంబంధించిన చిన్న చిన్న ప్రశ్నలకు సమాధానం చెప్పగలగడం.

**5. సృజనాత్మకతను పెంచే కృత్యం:**

పిల్లల్లో ఆట – పాట – మాట – కథ కృత్యాలను నేర్పుతూ మరోపక్క వాటిలో కొంత సృజనాత్మక అంశాలను జోడిస్తే ఉపాధ్యాయుడు వారిలోని నిగూఢ అభ్యసనాన్ని, విభిన్న ఆలోచనలను వెలికి తీయడానికి ఆస్కారం ఉంది.

ఉద్దేశం

1) వ్యక్తిగతంగానూ, జట్టులోగాని కలిసి పనిచేయగలననే ధీమాను కలిగించడం.

2) ఇంద్రియ, చలన కౌశలాలను సమన్వయపరచడం.

3) పరిశీలన, అవధాన శక్తి పెంపొందించడం.

**2.7.1 విద్య (Education):**

పూర్వ ప్రాథమిక విద్యను 3 నుండి 6 సంవత్సరముల మధ్యనున్న పిల్లలకు అందించవచ్చని కొఠారి కమీషన్ (1964–64) పేర్కొంది.

పుట్టినప్పటి నుంచి మొదటి తరగతి చదివే వరకు పిల్లల అభివృద్ధిలో మార్పు తీసుకురావడానికి ఉద్దేశించిందే పూర్వ ప్రాథమిక విద్య **– కాట్జ్**

జాతీయ విద్యా విధానం (1986) ప్రకారం పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్య పుట్టిన దగ్గర నుండి 6 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు అందించాలి. కానీ జాతీయ పూర్వ బాల్యదశ సంరక్షణ విద్య కరికులమ్ ఫ్రేమ్ వర్క్ (NECCE 2013) ప్రకారం ప్రస్తుతం ECCE 3 నుండి 6 సం॥రాల పిల్లలకు మరియు 1, 2 తరగతుల పిల్లలకు అనగా 8 సం॥రాల వరకు విస్తరించబడింది. ECCE కేంద్రాలలో అమలు జరపవలసిన విద్యా ప్రణాళికల గురించి విద్యా కమీషన్‌లు, జాతీయ విద్యా ప్రణాళిక చట్టం 2005 మరియు ECCE పై జాతీయ విధానం (National Policy on ECCE) వివరించడం జరిగింది.

ECCE కేంద్రాలలో విద్య అనగా పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలతో కూడుకుని వుంటుంది.

1) ECCE కేంద్రాలలో పూర్వపఠన, పూర్వలేఖన మరియు పూర్వ సంఖ్యా భావనలు పెంపొందించే కార్యక్రమాలు అమలు జరుపుతారు. దీనికోసం ఆట పాటలు, కృత్యాలు ఏర్పాటు చేసి పిల్లల్లో ఈ నైపుణ్యాలు పెంపొందించడం జరుగుతుంది.

2) పిల్లల సమగ్రాభివృద్ధి రంగాలైన చలనాత్మక, జ్ఞాన, సామాజిక, ఉద్వేగ, వ్యక్తిగత మొదలగు రంగాలలో అభివృద్ధి చెందుటకు ఆట పాటలు కృత్యాలతో కూడిన కార్యక్రమాలు రూపొందించి అమలు జరపడం జరుగుతుంది.

3) పూర్వ ప్రాథమిక విద్య ద్వారా పిల్లలను ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చేయడం జరుగుతుంది. తద్వారా సారత్రిక ప్రాథమిక విద్యకు ECCE కేంద్రాలు తోడ్పడతాయి.

4) పిల్లల్లోని శారీరక లోపాలు, బుద్ధిమాంద్యం, అభ్యసనా లోపాలు ఈ దశలో గుర్తించడం వల్ల తగిన వైద్య సహాయం అందించి పిల్లల్లో లోపాలను సవరించడానికి ECCE కేంద్రాలు సహాయపడతాయి.

అంగన్‌వాడీలు, బాల్వాడీలు, నర్సరీలు, డేకేర్ సెంటర్‌లు కిండర్ గార్టెన్ లాంటి కేంద్రాలు పూర్వబాల్యదశలో విద్యనందిస్తున్నాయి.

### 2.7.2 సంరక్షణ మరియు సంరక్షణ (Care and Protection, Custodian)

పిల్లల సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులదే. చాలామంది తల్లిదండ్రులు వారి వారి వృత్తులలో తీరిక లేకుండా ఉంటున్నారు. గ్రామాలలో తల్లిదండ్రులు వ్యవసాయ పనులలో నిమగ్నమై వుండుట వలన పిల్లల సంరక్షణ వారికి కష్టంగా వుంది. పట్టణాలు, నగరాలలో తల్లిదండ్రులు జీవనాధారం కోసం వివిధ వృత్తులలో నిమగ్నమవుతున్నారు. అలాంటివారు పిల్లల సంరక్షణను చూసుకోలేకపోతున్నారు. ఈ పిల్లల బాధ్యత పెద్ద పిల్లలపై ముఖ్యంగా ఆడపిల్లలపై పడుట వలన బాలికలు విద్యకు దూరమవుతున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా పూర్వ బాల్యదశ సంరక్షణ విద్యా కేంద్రాలు బాగా ఉపయోగపడుతున్నాయి.

బాలల సంరక్షణకు డేకేర్ సెంటర్‌లు, క్రష్‌లు, బాల్వాడి, అంగన్‌వాడీ, ECCE కేంద్రాలు బాగా ఉపయోగ పడుతున్నాయి. ఈ కేంద్రాలలో కార్యకర్తలు, ఆయాలు, పిల్లల సంరక్షణ బాధ్యతను తీసుకుంటారు.

బాలల వికాసంలో సంరక్షణ చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. చిన్నతనంలో పిల్లలకు ఎంతమంచి సంరక్షణ లభిస్తుందో భవిష్యత్తులో వారు అంత బాగా అభివృద్ధి చెందుతారు. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఎంత ఎక్కువ సమయం పిల్లలతో గడిపితే పిల్లల వికాసం అంత బాగా వుంటుందని పరిశోధనలలో తేలింది.

జాతీయ విద్యావిధానం 1986 (NPE 1986) మానవ వనరుల అభివృద్ధిలో ECCE చాలా కీలకమైనదని తెలిపింది. సంరక్షణలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేయించడం, పోషకాహారం అందించడం, ధనుర్వాతం రాకుండా టీకాలు వేయించడం మరియు సురక్షితమైన ప్రసవం జరిగేలా చూడటం మొదలగు వానిని ఈ కార్యక్రమంలో చేర్చడం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పోషకాహారం అందించడం జరుగుతుంది.

### 2.7.3 పోషణ (Nutrition)

ECCE కేంద్రాలలో పోషకాహారం అందించడం కూడా ఒక ముఖ్యమైన అంశము. పూర్వబాల్యదశ పిల్లల్లో శారీరక, మానసిక వికాసం వేగంగా జరుగుతుంది. ఈ దశలో పిల్లలు ఆడుతూ, గెంతుతూ, చాలా చురుకుగా వుంటారు. ఈ సమయంలో పిల్లలకు సరియైన పోషకాహారం లభించకపోతే వారిలో శారీరక, మానసిక వికాసం తగినంత స్థాయిలో జరగదు. పిల్లల ఆరోగ్యం వారికి లభించే ఆహారం మీద ఆధారపడి ఉంటుంది. ECCE కేంద్రాలలో పిల్లలకు పోషకాహారం అందించడం జరుగుతుంది. మన రాష్ట్రంలో ICDS ఆధ్వర్యంలో అంగన్‌వాడీలలో పిల్లలకు పోషకాహారం అందించబడుతుంది. ప్రతినెలా పిల్లల ఎత్తు, బరువు తెలుసుకుంటూ పోషకాహార లోపం గల పిల్లలను గుర్తిస్తారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించి తగిన వైద్య సహాయం అందేలా చూస్తారు. టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచి వారిని రోగాల బారి నుండి కాపాడటం జరుగుతుంది.

**ECCE కేంద్రాలలో పిల్లలలో పెంపొందించే ఆహారపు అలవాట్లు**

1) పిల్లలు ఆహారం తినడానికి ముందు, తరువాత కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడం.

2) ఆహారాన్ని తయారుచేసే ప్రదేశం, పాత్రలు గ్లాసులు శుభ్రంగా ఉంచడం.

3) ఆహారాన్ని పిల్లలు బాగా నమిలి నిదానంగా మింగేటట్లు చూడడం, ఆహారం తినడానికి పిల్లలకు తగినంత సమయం ఇవ్వడం.

4) పుష్టికరమైన ఆహారం, అన్ని రకాల పండ్లు, కూరగాయలు పిల్లలు తినేటట్లు చూడడం.

5) ఆహారాన్ని వృథా చేయకుండా వుండటం.

| SL. నం | మెనూ వర్గం | కావలసినవి | రేటు (రూపాయలలో) సాధారణ పిల్లలు (500 కాల్) | | గర్భిణి మరియు నర్సింగ్ తల్లి (600 కాల్) | | బరువు (800 కాల్) | |
|---|---|---|---|---|---|---|---|---|
| నేను | ప్రధాన భోజనం | | మొత్తము | రేటు | మొత్తము | రేటు | మొత్తము | రేటు |
| ఎ) | పొంగల్ | రైస్ | 50 గ్రాములు | 0.30 | 60 గ్రాములు | 0.36 | 80 గ్రాములు | 0.48 |
| | | మూంగ్ దాల్ | 25 గ్రాములు | 1.90 | 30 గ్రాములు | 2.28 | 40 గ్రాములు | 2.71 |
| | | వంట నూనె | 3 గ్రాములు | 0.30 | 3.6 gm | 0.36 | 4.8 gm | 0.48 |
| | | Jagarry | 30 గ్రాములు | 1.50 | 36 గ్రాములు | 1.80 | 48 గ్రాములు | 2.40 |
| | | ఇంధన | | 1.00 | - | 1.00 | | 1.00 |
| | | రవాణా | | 0.10 | - | 0.10 | | 0.10 |
| | ఉదయం స్నాక్స్ | | | | | | | |
| బి) | Chatpatti | ముట్టేర్ | 50 గ్రాములు | 1.70 | 60 గ్రాములు | 2.04 | 80 గ్రాములు | 2.72 |
| | | ఆయిల్ | 3 గ్రాములు | 0.30 | 4 గ్రాములు | 0.40 | 5 గ్రాములు | 0.50 |
| | మొత్తం | | | 7.10 | | 8.34 | | 10.39 |
| II | ప్రధాన భోజనం | | | | | | | |
| ఎ) | కిచిడీ | మైసూర్ దాల్ | 25 గ్రాములు | 1.30 | 30 గ్రాములు | 1.56 | 40 గ్రాములు | 2.08 |
| | | రైస్ | 50 గ్రాములు | 0.28 | 60 గ్రాములు | 0.33 | 80 గ్రాములు | 0.44 |
| | | ఆయిల్ | 5 గ్రాములు | 0.475 | 6 గ్రాములు | 0.57 | 8 గ్రాములు | 0.76 |
| | | అరార్ దాల్ | 10 గ్రాములు | 0.60 | 12 గ్రాములు | 0.72 | 16 గ్రాములు | 0.96 |
| | | ఉల్లిపాయ | 5 గ్రాములు | 0.14 | 6 గ్రాములు | 0.17 | 8 గ్రాములు | 0.22 |
| | | బంగాళాదుంప | 10 గ్రాములు | 0.16 | 12 గ్రాములు | 0.19 | 16 గ్రాములు | 0.26 |
| | | ఇతరులు:- | | | | | | |
| | | పసుపు, జీలకర్ర సీడ్ ఎరుపు చల్లని, ఆవపిండి, ఉప్పు, డిటర్జెంట్ | | 0.20 | - | 0.20 | - | 0.20 |
| | | ఇంధన | | 1.00 | | 1.00 | - | 1.00 |
| | | రవాణా | | 0.10 | | 0.10 | | 0.10 |
| | ఉదయం స్నాక్స్ | | | | | | | |
| బి) | మొత్తం గ్రీమ్ | మొత్తం మూతి | 30 గ్రాములు | 2.25 | 36 గ్రాములు | 2,70 | 48 గ్రాములు | 3.60 |
| | | Jagarry | 15 గ్రాములు | 0.60 | 18 గ్రాములు | 0.72 | 24 గ్రాములు | 0.96 |
| | మొత్తం | | | 7.105 | | 8.26 | | 10.58 |
| III | ప్రధాన భోజనం | | | | | | | |
| ఎ) | రాజ్మా బియ్యం | Rajma | 30 గ్రాములు | 2.40 | 36 గ్రాములు | 2,88 | 48 గ్రాములు | 3.84 |
| | | రైస్ | 60 గ్రాములు | 0,34 | 72 గ్రాములు | 0.40 | 66 గ్రాములు | 0.37 |
| | | ఆయిల్ | 5 గ్రాములు | 0,475 | 6 గ్రాములు | 0.57 | 8 గ్రాములు | 0.76 |
| | | ఇతరులు:- | | | | | | |
| | | పసుపు, జీలకర్ర సీడ్ ఎరుపు చల్లని, ఆవపిండి, ఉప్పు, డిటర్జెంట్ | | 0.20 | - | 0.20 | - | 0.20 |
| | | ఇంధన | | 1.00 | - | 1.00 | - | 1.00 |
| | | రవాణా | | 0.10 | - | 0.10 | - | 0.10 |
| బి) | ఉదయం స్నాక్స్ | | | | | | - | |
| | ఎగ్ | ఎగ్ (వారం రెండు సార్లు) కాల్ విలువ - 173 k | ఎగ్ (వారం రెండుసార్లు) | 5.00 | | 5.00 | - | 5.00 |
| | మొత్తం | | | 9.50 | | 10.15 | | 11.27 |

B1AWH5

అంగన్‌వాడీ / ECCE కార్యకర్తలు పోషకాహారం ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించి పిల్లలకు ఇంటివద్ద కూడా పోషకాహారం అందేటట్లుగా చూడాలి.

### 2.7.4 అలవాట్లు ఏర్పడటం (Habit Formation):

ఈ వయస్సులో పిల్లల్లో ఏర్పడే అలవాట్లు జీవితాంతం స్థిరంగా ఉంటాయి. కనుక పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించవలసిన అవసరం ఉంది. తల్లిదండ్రులు మరియు ECCE / అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల్లో మంచి అలవాట్లు ఏర్పడటానికి కృషి చేయాలి. పిల్లల్లో స్వీయ క్రమశిక్షణను పెంపొందించాలి.

**ECCE కేంద్రంలో పిల్లల్లో పెంపొందించవలసిన అలవాట్లు**

1) ప్రతిరోజు స్నానం చేసి తల దువ్వుకుని రావడం
2) ప్రతిరోజు అంగన్‌వాడీకి రావడం, తోటివారితో స్నేహంగా మెలగడం
3) చెప్పులు వరుసలో పెట్టడం
4) ఇతరుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, ఇచ్చి పుచ్చుకోవడం, కలిసి మెలిసి ఆడుకోవడం
5) ఎక్కడ తీసిన వస్తువులు అక్కడ పెట్టడం
6) చెత్తబుట్టను ఉపయోగించడం
7) మరుగుదొడ్డి ఉపయోగించడం
8) దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు రుమాలు / చేతులు అడ్డుపెట్టుకోవడం
9) గుడ్ మార్నింగ్ / గుడ్ ఆఫ్టర్ నూన్, థ్యాంక్యూ, ప్లీజ్ మొదలగు వానిని సందర్భానుసారంగా చెప్పడం
10) తినేముందు, తిన్న తరువాత చేతులు సబ్బుతో కడుక్కోవడం
11) పుస్తకాలు, బొమ్మలు చూసి విషయాలు తెలుసుకునే అలవాటు చేయాలి.

**ముఖ్యాంశాలు**

1) అభ్యసనం నిరంతర ప్రక్రియ. ముఖ్యంగా వివిధ దశలు అనగా శైశవ, పూర్వ, ఉత్తర బాల్యదశల వికాసంలో అలాగే నేర్చుకొనే ప్రక్రియకు జీవితకాలం అభ్యసనానికి, వికాసానికి, ఉపయుక్తంగా వుంటుంది.
2) పిల్లల అవసరాలైన స్వేచ్ఛ, ఆనందం, సర్దుబాటు, ఆరోగ్యం క్షేమం వారి వికాసానికి తోడ్పడతాయి. అలాగే పిల్లల స్వభావము అర్థం చేసుకోవడం ద్వారా పిల్లలు నేర్చుకొనే తీరును, బోధనా పద్ధతులకు ఉపయోగించవచ్చు.
3) పూర్వ బాల్యదశలో క్రీడలు, క్రీడా ప్రాముఖ్యత అవి బాలల వికాసానికి ఎలా తోడ్పడతాయో గుర్తిస్తాము. వివిధ రకాలైన క్రీడలతో కూడిన బోధన పద్ధతులు మాంటిస్సోరి, కిండర్‌గార్టెన్, పియాజే నమూనా అనే విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగపడుతాయో గుర్తిస్తాము.
4) పిల్లల సమాగ్రాభివృద్ధి రంగాలైన చలన చాలక, జ్ఞానేంద్రియ, జ్ఞానాభివృద్ధి భాషాభివృద్ధి, సామాజిక ఉద్వేగ, వ్యక్తిగత, వికాస రంగాలు సృజనాత్మక ప్రాముఖ్యతను తెలుసుకున్నాము.
5) విద్యావిషయాలైన పూర్వపఠన, పూర్వలేఖన, సంఖ్యాభావనను అభివృద్ధిపరచడంలో ECCE కేంద్రాల ప్రాముఖ్యతను, నిర్వహించే కృత్యాలను తెలుసుకోవడంద్వారా ప్రారంభ అభ్యసన ప్రాముఖ్యతను అర్థంచేసుకోగలం.

6) ECCE అంశాలైన విద్య, సంరక్షణ, పోషణ మరియు మంచి అలవాట్ల పెంపులో విద్యాకార్యక్రమాలైన ఆట, పాట, మాట, కథ, సృజనాత్మక పాత్రను ప్రాధాన్యతను తెలుసుకున్నాం.

## మూల్యాంకనం

### 1) వ్యాసరూప ప్రశ్నలు

1) పిల్లలు ఏవిధంగా నేర్చుకుంటారో వివరించుము?
2) ECCE విద్యలో క్రీడాపద్ధతి ప్రాముఖ్యతను వివరించుము?
3) మాంటిస్సోరి, కిండర్ గార్టెన్ పద్ధతుల భేదాలు వివరించండి?
4) పిల్లలలో సామాజిక, ఉద్వేగ, వ్యక్తిగత వికాసము ECCE కేంద్రాలలో ఎలా పెంపొందిస్తారు.
5) పిల్లల్లో జ్ఞానేంద్రియ, సంజ్ఞానాత్మక వికాసముల గురించి వివరించుము?
6) ECCE లోని అంశాలు వివరించుము?

### 2) సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

1) ECCE పిల్లల అవసరాలలో స్వేచ్ఛ యొక్క ప్రాధాన్యత వివరించండి.
2) ECCE విద్యా ప్రణాళికలో క్రీడలు మరియు కళల ప్రాధాన్యత వివరించుము.
3) ECCE పిల్లల్లో భాషా వికాసమును వివరించుము?
4) ECCE పిల్లల్లో చలనాత్మక వికాసం గురించి వివరించుము?
5) ప్రారంభ సంవత్సరాలలో పిల్లల్లో అక్షరాస్యత ఎలా పెంపొందిస్తారు?
6) ECCE పిల్లల్లో పూర్వ సంఖ్యా భావనలు ఎలా కలిగిస్తారు?
7) పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించుటలో ECCE కార్యకర్త పాత్ర వివరించుము?
8) పూర్వ బాల్యదశ పిల్లల లక్షణాలు వివరించుము?

### 3) లఘు సమాధాన ప్రశ్నలు

1) చలన కండరాలపై ప్రభావం చూపే అంశాలేవి?
2) క్రీడా పద్ధతులలోని రకాలను పేర్కొనుము
3) పియాజే సంజ్ఞానాత్మక వికాస దశలను వివరించుము
4) అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందించే పోషకాహారం గురించి రాయండి.
5) ECCE కేంద్రాలలో పిల్లలకు ఏవిధంగా మంచి అలవాట్లు పెంపొందిస్తారు?
6) పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలలోని రకాలను పేర్కొనుము.
7) పిల్లల్లో పూర్వలేఖన సామర్థ్యాలనెట్లు పెంపొందించవచ్చు.

### ప్రాజెక్టులు

1) మీ దగ్గరలోని ECCE కేంద్రాన్ని సందర్శించి అచ్చట 3 సంవత్సరాల నుండి 6సంవత్సరాల వయస్సుగల పిల్లలు నేర్చుకునే విధానాలను పరిశీలించి నివేదిక రూపొందించండి.

2) అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల సమగ్ర వికాసానికి ఏవిధమైన కార్యక్రమాలు అమలు జరుపుతున్నారో పరిశీలించి నివేదిక రూపొందించండి.

## సంప్రదింపు గ్రంథాలు


1) Exempler guidelines for implementation of early childhood care and education (ECCE) curriculum, NCERT

2) NCERT (2006) position paper, National Focus Group on ECE, New Delhi

3) Encyclopedia of Early Childhood Care and Education Volume - 1 & Volume -2 written by Prof. K.C. Panda and Dr. P.K. :Tripathy, Neelkamal Publications Pvt. Ltd.

4) Early Childhood Education - An Introduction - Romila Soni, Rajendra Kapoor and Krishna Kanth Vashishta, NCERT

5) Play Activities for Child Development a guide to pre school teachers, Mina Swaminadhan and Prema Dani, National Book Trust, New Delhi.

6) డి.ఎడ్ అధ్యాపన శాస్త్రం పూర్వప్రాథమిక, ప్రాథమిక విద్యా దృక్పథాలు, తెలుగు అకాడమి

7) డి.ఎడ్ విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం, తెలుగు అకాడమి

8) చిన్నారుల వికాస కేంద్రం, ఇ.సి.ఇ / అంగన్‌వాడీ కార్యక్రమ శిక్షణా దీపిక, సర్వశిక్షా అభియాన్ ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

9) D.Ed. సమ్మిళిత విద్య – తెలుగు ఆకాడమి – 2010.

10) B.Ed. బోధన, అభ్యసన మనోవిజ్ఞానశాస్త్రం – తెలుగు అకాడమి–2014.

11) D.Ed. విద్యా మనోవిజ్ఞానశాస్త్రం – తెలుగు అకాడమి – 2001, 2010.

12) NCERT, Early Childhood Education Programme by Venitakant - 2009.

13) B.A. 3rd year Telugu Academy " బాల, కౌమార మనోవిజ్ఞానశాస్త్రం – 2012.

# 3 బాల్యారంభవిద్య - విద్యాప్రణాళిక యాజమాన్యం

**చిన్నారినే చేయనివ్వండి.**

బుల్లి జేబురుమాలును బాబునే వుతుక్కోనివ్వండి గ్లాసులో నీళ్ళు పాపనే పోసుకోనివ్వండి. పువ్వులు సర్దనివ్వండి. పళ్ళెం కడగ నివ్వండి. గింజలు వలవనివ్వండి. అన్నం వడ్డించనివ్వండి. చిన్నారినే చేయనివ్వండి. తన పద్ధతిలో తనను చేయనివ్వండి. తాను కోరుకున్నట్టు తనను చేయనివ్వండి.

- గిజూబాయి

**లక్ష్యాలు:**

ఈ పాఠ్యాంశం చదవడం ద్వారా ఛాత్రోపాధ్యాయులు కింది లక్ష్యాలను సాధిస్తారు.

1. సమతుల్య సందర్భోచిత విద్యాప్రణాళిక సూత్రాలు, వాటి యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.
2. ECCE నిర్వహణకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాల యొక్క ప్రాముఖ్యతను మరియు వాటిని సాధించటానికి చేయవలసిన కృత్యాలను తెలుసుకుంటారు.
3. ఉపాధ్యాయ విద్యార్థులు ECCE. కేంద్రాల్లో పిల్లలకు ఉపయోగించే పరికల్పనా పద్ధతి మరియు నేపథ్యాధార పద్ధతులను గురించి తెలుసుకుంటారు.
4. సమ్మిళిత / విలీన (Inclusive Education) విద్యా విధానం ద్వారా అంగవైకల్యం గల పిల్లలు సాధారణ పిల్లలతో కలిసి విద్యనేర్చుకునే అవకాశం గలదని తెలుసుకుంటారు.
5. ECCE కేంద్రాల్లో అవసరమయ్యే వనరుల గురించి మరియు వాటిని ఎంపిక చేసుకునే విధానాలగురించి తెలుసుకుంటారు.
6. ECCE కేంద్రాల్లో ఉపాధ్యాయుని పాత్ర మరియు విధుల నిర్వహణ గురించి తెలుసుకుంటారు.

**ECCE విద్యాప్రణాళిక, యాజమాన్యం**

3.1 సమతుల్య సందర్భోచిత విద్యాప్రణాళిక సూత్రాలు
3.1.0 ఉపోద్ఘాతం (Introduction)
3.1.1 పూర్వ ప్రాథమిక విద్యాప్రాముఖ్యం
3.1.2 సమతుల్య మరియు సందర్భోచిత పాఠ్యప్రణాళిక రచనకు సూత్రాలు
3.2 దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలు మరియు ప్రణాళిక
3.2.0 ఉపోద్ఘాతం (Introduction)
3.2.1 దీర్ఘకాలిక లక్ష్యాలు
3.2.2 స్వల్పకాలిక లక్ష్యాలు
3.2.3 ప్రణాళిక
3.3 ప్రకల్పనా పద్ధతి మరియు నేపథ్యాధార ఉపగమనం
3.3.1 ప్రకల్పనా పద్ధతి
3.3.2 అంశపద్ధతి
3.4 అభివృద్ధి అనుకూల, విలీన తరగతి వాతావరణం నెలకొల్పడం/నిర్వహించడం
3.4.0 ఉపోద్ఘాతం (Introduction)
3.4.1 సమ్మిళిత విద్య(విలీన విద్య)
3.4.2 ECCE తరగతి గది నిర్వహణ
3.5 ECCE సక్రమ నిర్వహణకు అవసరమైన వనరులు
3.5.0 ఉపోద్ఘాతం (Introduction)
3.5.1 పూర్వప్రాథమిక విద్యా కేంద్రాలలో ప్రధానంగా ఉండాల్సిన కనీస అవసరాలు
3.6 పూర్వప్రాథమిక ఉపాధ్యాయుల పాత్ర – విధులు
3.6.0 ఉపోద్ఘాతం (Introduction)
3.6.1 పూర్వప్రాథమిక విద్యా కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యాయుల పాత్ర
3.6.2 పూర్వప్రాథమిక విద్యా పాఠశాలలో ఉపాధ్యాయుల విధులు

## 3.1 సమతుల్య సందర్భోచిత విద్యా ప్రణాళిక నియమాలు
## ( Principles of Planning a balanced and contextualised curriculum )

**3.1.0 ఉపోద్ఘాతం** (Introduction):

శిశువు యొక్క సంపూర్ణమైన శారీరక మానసిక వికాసానికి పూర్వ బాల్యదశ సంరక్షణ మరియు విద్య (ECCE) అత్యంత ప్రధానమైనది. పాఠశాలకు వెళ్ళడానికి పూర్వం శిశువును శారీరకంగాను, మానసికంగాను సంసిద్ధులను చేయడమే ECCE యొక్క ముఖ్య ఉద్దేశ్యము. పూర్వ బాల్యదశను పూర్వ పాఠశాల దశ అని కూడా అంటారు. పుట్టినప్పటి నుండి 8 సం॥ వయస్సు వరకు పూర్వబాల్యదశగా పరిగణిస్తారు. పూర్వ బాల్యదశ అభ్యసనం, పూర్వ బాల్యదశ సంరక్షణ మరియు పూర్వబాల్యదశ విద్య అనునవి ECCE యొక్క ప్రధాన లక్ష్యాలు.

అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక మరియు సాంస్కృతిక సంస్థ (యునెస్కో)
"United Nations Educational Scientific & Cultural Organisation(UNESCO)"
ప్రకారం పూర్వ బాల్యదశ శిశువు యొక్క సమగ్ర అభ్యసనానికి, వికాసానికి పునాది.

**3.1.1 పూర్వ ప్రాథమిక విద్యా ప్రాముఖ్యం:**

ఈ క్రింది విషయాల అవగాహన మరియు అభివృద్ధి కొరకు పూర్వ ప్రాథమిక విద్య అత్యంత ఆవశ్యకము.

- శారీరకాభివృద్ధి
- బౌద్ధికాభివృద్ధి
- సామాజిక, నైతికాభివృద్ధి
- మానసికాభివృద్ధి
- పఠనం, లేఖనం, సంఖ్యాపరమైన నైపుణ్యాలు
- ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేయడం
- సార్వత్రిక ప్రాథమిక విద్యకు తోడ్పాటు.

**పూర్వప్రాథమిక విద్య ఉద్ధేశ్యాలు – లక్ష్యాలు:**

మానవ వికాసానికి విద్య అత్యంత ప్రధానమైనదని మనకు తెలుసు. విద్య యొక్క ఫలితాలు ఫలవంతంగా, ఉపయోగకరంగా ఉండాలంటే, దానికి పునాది పూర్వ ప్రాథమిక విద్య. పూర్వ ప్రాథమిక విద్యను సమర్ధవంతంగా నిర్వహించగలిగిననాడు విద్యా ప్రమాణాలు మిగిలిన అన్ని స్థాయిలలోను ఉన్నతంగా ఉంటాయి. ఈ దిశగా ఎందరో విద్యావేత్తలు అనేక లక్ష్యాలను పూర్వ ప్రాథమిక విద్యకు సూచించారు. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాము.

**1) బ్రిటిష్ విద్యావేత్త, మిస్‌గ్రేస్ ఒవెన్ (Miss Grace Owven) ప్రకారం పూర్వ ప్రాథమిక విద్యా లక్ష్యాలు:**

- పిల్లలకు విశాల ప్రదేశం, గాలి, వెలుతురు, ఆహ్లాదకరమైన వాతావరణము కల్పించాలి.
- పిల్లలకు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన, క్రమమైన జీవితాన్ని అందించాలి. ఆటలాడేటప్పుడు కూడా సంఘీభావాన్ని చూపేటట్లుగా శిక్షణ ఇవ్వాలి.
- సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి వివిధ ఆసక్తులు, నైపుణ్యాలకు పదును పెట్టేటట్లుగా అవకాశాలు కల్పించాలి.
- నిరంతర వైద్య పర్యవేక్షణ ఉండాలి.
- బాహ్య పరిసరాలకు, గృహవాతావరణానికి సిసలైన ఏకీకృతమైన అంశాలను పిల్లల్లో ఏర్పరచాలి.

**2) కొఠారి కమిషన్ (1964–66) సూచించిన ప్రాథమిక విద్యా లక్ష్యాలు:**

స్వాతంత్ర్యానంతరం భారతీయ విద్యావ్యవస్థ యొక్క సమగ్రమైన విధానాన్ని రూపొందించి సంతృప్తికరమైన ప్రగతిని సాధించుటయే ముఖ్య ఉద్ధేశ్యంగా ఏర్పాటు చేయబడిందే 'కొఠారి కమీషన్'.

కొఠారి కమీషన్ (భారతీయ విద్యాకమిషన్ (1964–66) డా॥ డి.ఎస్.కొఠారి అధ్యక్షతన 17మంది సభ్యులతో ఏర్పాటు చేయబడి, భారతీయ విద్యావ్యవస్థలో అనేక నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది.

పూర్వబాల్య విద్యలో మాతృభాష/ప్రాంతీయ భాషను తప్పనిసరిగా అభ్యసించాలని ప్రతిపాదించింది. ప్రాథమిక విద్యను ఏకీకృతం చేయడంలో కొఠారి కమీషన్ ప్రతిపాదనలు కీలక పాత్రవహించాయి. ప్రతి పిల్లవానికి మాతృభాషలో పూర్వప్రాథమిక మరియు ప్రాథమిక విద్యను గడిపే హక్కు భారతరాజ్యాంగంలో ఉందని పేర్కొంది..

కొఠారి కమీషన్ సూచించిన ఈ క్రింది లక్ష్యాల ద్వారా పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకత ఎంతగానో ఉందని తెలుస్తుంది.

- శిశువులో మంచి శరీర, కండర, చలన నైపుణ్యాలను (కర, చర కౌశలాలు) అభివృద్ధి పరచడం
- పిల్లలకు భావవ్యక్తీకరణ, శారీరక కండర చలన నైపుణ్యాల అభివృద్ధి, ఉత్సుకత, ఉద్వేగాలను అదుపులో ఉంచుకొనడం ప్రదర్శించడం లాంటి విషయాలకు తగిన మార్గదర్శకం చేయాలి.
- పరిసరాల అవగాహన, సాంఘిక వైఖరులను పెంపొందించడం.
- స్వేచ్ఛ, సృజనాత్మకత, భావప్రకటనలను ప్రోత్సహించడం.
- వ్యక్తిగతమైన సర్దుబాటు, స్వతహాగ తమ పనులనుతామే చేసుకోవడం లాంటి మంచి అలవాట్లను, నైపుణ్యాలను నేర్పడం
- ప్రకృతి గురించి తెలుసుకోవడం, అందులో భాగస్వామ్యం పొందేటట్లు పురికొల్పడం.
- పిల్లల సమగ్ర వికాసానికి అవకాశాలు కల్పించడం
- ఆట, పాటల ద్వారా ఒత్తిడి లేని కార్యక్రమాలు నిర్వహించడం

**3) జాతీయ విద్యా విధానం (National Policy of Education) 1986 ప్రకారం " శిశువు యొక్క శారీరక, ఛాలక, జ్ఞాన, భాష, ఉద్వేగ, సాంఘిక మరియు నైతిక అభివృద్ధికి దోహదపడేదే ECCE.**

CALKJG

ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం మరియు సమాజంలో బడుగు, బలహీన వర్గాలలో పని చేయు స్త్రీలు, శిశువుల పోషణ, సంరక్షణ మరియు విద్య అనేవి పూర్వ బాల్య దశ సంరక్షణ మరియు విద్య యొక్క ప్రధాన ఉద్ధేశ్యాలు. పూర్వ బాల్య దశ సంరక్షణ మరియు విద్య నిర్వహించడానికి ప్రత్యేక పాఠ్యప్రణాళిక మరియు నిర్వహణ అవసరం. పూర్వ బాల్య దశ సంరక్షణ మరియు విద్య పాఠ్యప్రణాళిక 'శిశు' కేంద్రీకృతంగా మరియు శిశువు యొక్క సమగ్ర వికాసానికి (శారీరక, చాలక, జ్ఞాన, భాష, ఉద్వేగ, సాంఘిక మరియు నైతిక వికాసానికి) దోహద పడేలా ఉండాలి. పూర్వ బాల్య దశ సంరక్షణ మరియు విద్య పాఠ్యప్రణాళిక పిల్లల్లో ఉండే వైయుక్తిక భేదాలు, వారి ఇష్టాలు, అభిరుచులకు సరిపడే విధంగా శిశు కేంద్రీకృతంగా మరియు కృత్యాధార బోధనకు దోహదపడే విధంగా ఉండాలి. (పూర్వ బాల్య దశ సంరక్షణ మరియు విద్య యొక్క పాఠ్యప్రణాళిక శిశువు యొక్క శారీరక, చాలక, జ్ఞాన, మానసిక, భాష, ఉద్వేగ, సాంఘిక, నైతిక రంగాలలో పరిపూర్ణ వికాసం)

**1) శారీరక మరియు చాలక రంగాలలో అభివృద్ధి:**

ఈ విద్య కండరాల అభివృద్ధికి, సమన్వయానికి, హస్త నైపుణ్యానికి, కంటి సమన్వయానికి మరియు ఆరోగ్యపు అలవాట్లు, పోషణ మొదలైన రంగాలలో అభివృద్ధికి దోహదపడాలి.

**2) భాషాభివృద్ధి:**

వినడం, నేర్చుకోవడం, మాట్లాడడం, మరియు మంచి పదజాలాన్ని ఉపయోగించి సమాచార ప్రసారం మరియు సమగ్రమైన విషయ అవగాహన, అక్షరాలను గుర్తించడం, పలకడం, పదాల అమరిక మొదలైన విషయాలలో అభివృద్ధికి దోహదపడాలి.

**3) జ్ఞానాభివృద్ధి:**

విషయ అవగాహన వర్గీకరణ, సారూప్యకత, పరిమాణం, అంచనా వేయటం, విశాల దృక్పథం విశ్లేషణాత్మక ఆలోచన, పరిశీలించడం, సమస్యసాధన, పరిసరాల అవగాహన మొదలైన విషయాలలో జ్ఞానాన్ని అందించడం ద్వారా జ్ఞానాభివృద్ధికి తోడ్పడాలి.

**4) సాంఘిక మరియు ఉద్వేగ వికాసం:**

తన గురించి తాను తెలుసుకోవడం, తనపై తనకి నియంత్రణ, జీవన నైపుణ్యాలు, మంచి అలవాట్లు ఏర్పరచుకోవడం, సాంఘిక బంధాల సర్దుబాట్లు, సమూహాలలో సర్ధుబాట్లు, సహకరించుకోవడం, భావవ్యక్తీకరణ మొదలైన వాటి అభివృద్ధికి తోడ్పడాలి.

**5) జ్ఞానేంద్రియాల అభివృద్ధి:**

వివిధ రకాల ప్రయోగాలు, పరిశీలన అనుభవాల ద్వారా జ్ఞానేంద్రియాల అభివృద్ధికి తోడ్పడాలి.

**6) సృజనాత్మక మరియు సౌందర్యాత్మక అభివృద్ధి:**

వివిధ రంగాలలో సృజనాత్మకతను, సౌందర్యాత్మకతను అన్వేషించేలా ప్రోత్సహించడానికి తోడ్పడాలి.

**ఆటపాటలతో కూడిన కొన్ని విద్యా కార్యక్రమాలు:**

**i) జ్ఞానాత్మక కృత్యాలు:** సాంఘిక మరియు జీవశాస్త్ర అనుభవం, సహజ నడక, గణిత అంశాలు, జతపరచడం, పేర్లు పెట్టడం, వర్గీకరించడం, గుర్తించడం, వేరుచేయడం, చర్చ , పజిల్స్, ఆటలు, పండుగలు మొదలైనవి.

**ii) భాషా మరియు సమాచార ప్రసారం:** గేయాలు, పద్యాలు, కథలు, సంభాషణలు, పుస్తకాలు శరీర భాగాలు గుర్తించడం, తోలుబొమ్మలాట, శబ్దక్రీడలు, జ్ఞప్తికి తెచ్చుకునే కృత్యాలు.

**iii) ఉద్వేగ మరియు సౌందర్యాత్మకత:** సంగీతం, నాట్యం, సృజనాత్మక కౌశలాలు, మట్టితో బొమ్మలు చేయడం, జంతువులు, ఉద్యానవన సంరక్షణ మొదలగునవి.

**iv) వ్యక్తిగత కృత్యాలు:** నాటకీకరణం, పాత్రపోషణ, బొమ్మలతో క్రీడలు, భోజనసమయ కృత్యాలు, శారీరక పరిశుభ్రత, కేశ సంరక్షణ, ఆరోగ్యపు అలవాట్లు మొదలగునవి.

**v) సాంఘిక కృత్యాలు:** కథలు, గేయాలు, పద్యాలు, తోలుబొమ్మలాటలు, నాటకాలు, క్రీడలు, పండుగలు, పుట్టినరోజులు, దైనందిన కార్యక్రమాలలో పాత్రపోషణ మొదలగునవి.

**vi) భౌతిక సామూహిక చాలక కృత్యాలు:** పరుగుపందెం, ఆటలు, వ్యాయామాలు, తోయడం, లాగడం, సాగదీయడం, జారడం, విసరడం, పట్టుకోవడం, తన్నడం, ఊపడం, గెంతడం, దుమకడం, సైకిల్ తొక్కడం మొదలగునవి.

**vii) సునిశితచాలక కృత్యాలు:** అంగుళీయ క్రీడలు, బ్లాకులతో నిర్మాణాలు కట్టడం, కత్తిరించడం, అంటించడం, బొమ్మలు గీయడం, రంగులు వేయడం మొదలగునవి.

**viii) జ్ఞానేంద్రియ కృత్యాలు :** వినడం, వాసన చూడడం, రుచి చూడడం, కళ్ళతో చూడడం, అనుభూతి చెందడం, నీటితో ఆడటం, ఇసుకతో ఆడటం, సృజనాత్మక కళలు ప్రదర్శించడం, హస్తలాఘవం మొదలైనవి.

(దీనికి సంబంధించిన పూర్తి వివరణ 2వ అధ్యాయంలో చర్చించడమైనది)

వివిధ రంగాలలో సృజనాత్మకతను, సౌందర్యాత్మకతను అన్వేషించేలా ప్రోత్సహించడానికి తోడ్పడాలి.

పైన పేర్కొన్న విధంగా ఆయా రంగాలన్నింటిలోను శిశువు యొక్క సమగ్ర అభివృద్ధి సాధించడం కొరకు సమతుల్య మరియు సందర్భోచితమైన (అనుకూల) పాఠ్యప్రణాళిక రూపొందించుటకు నిర్దేశించబడిన నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (NCF-2005) సూత్రాల ఆధారంగా ECCE పాఠ్యప్రణాళిక రూపొందించాలి.

### 3.1.2 సమతుల్య మరియు సందర్భోచిత పాఠ్య ప్రణాళిక రచనకు సూత్రాలు:

పూర్వ ప్రాథమిక విద్యా లక్ష్యాలు ఫలవంతం కావాలంటే దానికి పటిష్ఠమైన పాఠ్యప్రణాళిక అత్యంత ఆవశ్యకం. దానిని తయారుచేయడానికి ఈ క్రింది కొన్ని ముఖ్యమైన అంశాలను అవగాహన చేసుకోవాలి.

1. సమగ్ర అభ్యసనం మరియు వికాసం (Holistic learning and development)
2. క్రియాశీల అభ్యసనం (Active learning )
3. పరస్పర అభ్యసనం (Interactive learning)
4. సమగ్ర అభ్యసనం (Integrated learning)
5. క్రీడల ద్వారా అభ్యసనం (Learning through play)
6. భాగ స్వామ్య అభ్యసనం (Partnership for learning)
7. కళల ద్వారా అభ్యసనం (Art as the basis for learning)
8. సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం మరియు ఆరోగ్యకర అలవాట్లు (Integration of health and well-being based on healthy habits)
9. ప్రామాణిక మదింపు (Authentic Assessment)

DZG4N4

**1) సమగ్ర అభ్యసనం మరియు వికాసం (Holistic learning and development):**

- శిశువు యొక్క సమగ్రాభివృద్ధికి దోహద పడే అన్ని రంగాలలో అభివృద్ధిని ప్రతిబింబించేవిధంగా (సాంఘిక, మానసిక, ఉద్వేగ, శారీరక, జ్ఞాన, ఆధ్యాత్మిక మరియు నైతిక) ECCE యొక్క పాఠ్య ప్రణాళికను రూపొందించాలి.
- ECCE ఉపాధ్యాయులు ఎంపిక చేసుకునే బోధన ఉపగమం శిశువు యొక్క పరిపూర్ణ అభ్యసన మరియు వికాసం పై వారి అవగాహనను ప్రతిబింబించేదిగా ఉండాలి.
- జ్ఞానం, నైపుణ్యం, గుణములు మరియు ఆలోచనా దృక్పథముల ఆధారంగా గమ్యాలతో కూడి శిశువు యొక్క పరిపూర్ణ అభివృద్ధికి ఈసీసీఈ పాఠ్యప్రణాళికలో ఏర్పాట్లు ఉండాలి.

**2) క్రియాశీల అభ్యసనం (Active learning):**

- క్రియాశీల అభ్యసనం శిశువు పరిశీలింపదగినదిగా, ప్రయోగాలు చేయడానికి అనువుగా, చర్చకు తావిచ్చేదిగా, ఆలోచన రేకెత్తించేదిగా మరియు శిశువు ప్రతిస్పందించేదిగా ఉండాలి.
- 3-4 సం॥ పిల్లల్లో వారి పరిసరాలలో జరిగే దృగ్విషయాలను గూర్చి మనుష్యులలో పరస్పర అవగాహన, వస్తువుల ప్రాతినిధ్యం గురించిన జ్ఞానం, నైపుణ్యాలను అభివృద్ధి చేసేదిగా ఉండాలి.


**పిల్లల్లో క్రియాశీల అభ్యసనాన్ని మెరుగుపరచడానికి ఈ క్రింది మూలకాలు తప్పనిసరిగా ఉండాలి.**

| | |
|---|---|
| ముఖ్యమైన/మూల వస్తువులు/ | • శోధనాత్మక పరికరాలు ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఊహాశక్తిని పెంపొందించవచ్చు |
| పరికరాలు (Materials) | • పిల్లలను ఆకర్షించేవిగా, అన్వేషించదగినవిగా, నైపుణ్యాలను మెరుగుపరచేవిగా ఉండాలి. |
| హస్తలాఘవం / నైపుణ్యాలు / (Manipulation) | • సృజనాత్మకతను పెంపొందించేలా ఉండాలి.<br>• వస్తువులను అనేకరకాలుగా మార్పుచేయడం ద్వారా, కలుపుట ద్వారా వారి కండరాల కదలికలను నియంత్రించగలుగుతారు.<br>• ఆలోచన రేకెత్తించేవిధంగా ఉండాలి.<br>• అన్వేషణ ద్వారా వస్తువుల గుణగణాలను ప్రత్యక్ష అనుభవాల ద్వారా తెలుసుకోవాలి. |
| కోరిక/ఇష్టం/ (Choice) | • పిల్లల ఇష్టాలు ప్రతిబింబించేలా ఉండాలి.<br>• పిల్లల అవసరాలను తీర్చాలి.<br>• వారు సొంతంగా చేసుకోవడానికి వీలుగా ఉండాలి.<br>• పిల్లలను ఆకర్షించేవిగా ఉండాలి. |

| | |
|---|---|
| పిల్లల భాష (Language for Children) | • పిల్లల అభ్యసనానికి, అభివృద్ధికి భాష ప్రధాన దోహదకారి<br>• భాషాభివృద్ధికి ఏకపాత్ర,నాటకాలు,పాటలు,గేయాలు,కథలు,చర్చలు, మాట్లాడడం, వినడం, చదవడం, రాయడం అవసరం. |
| సహాయం (Support) | • పిల్లల పరిసరాలు పరిశుభ్రంగా, రక్షణ కల్పించేవిగా ఉండాలి.<br>• పరిసరాల ద్వారా నేర్చుకునే వీలుండాలి.<br>• సంరక్షిత పరిసరాలు మరియు జ్ఞానానికి, నైపుణ్యాలకు, గుణాలకు, ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడానికి సహకరించే అనుభవాలను ఏర్పాటు చేయడం ద్వారా పెద్దలు సహకరించాలి.<br>• సాహసోపేత కృత్యాలు కూడా తగిన పర్యవేక్షణలో చేయడానికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. |

**3. పరస్పర అభ్యసనం** (Interactive learning) :


- జీవితపు ప్రారంభదశలో పిల్లల మధ్య పరస్పర చర్య ఒక ప్రాథమిక అనుభవం (Malaguzzi-1993)
- Dahlderg, Moss, Pence (2003) ప్రకారం పరస్పర అభ్యసనం అనేది ఒక బోధనా వ్యూహం.
- పరస్పర అభ్యసనం ద్వారా పిల్లలు వారి తోటి పిల్లలను చూసి మాట్లాడడం, వినడం ద్వారా నేర్చుకుంటారు.
- ఉపాధ్యాయులు పిల్లలను సమూహాలుగా ఏర్పరచి వారి మధ్య అభ్యసన జరిగేలా ప్రోత్సహించవచ్చు.
- పరస్పర అభ్యసనం సాధారణంగా, పిల్లలు–పిల్లలు, పిల్లలు–ఉపాధ్యాయుడు, పిల్లలు–ఉపాధ్యాయుడు మరియు సిబ్బంది, పిల్లలు–కుటుంబం మరియు పిల్లలు – అభ్యసనా సామాగ్రి మధ్య జరుగుతుంది.




- పిల్లలు తమ దైనందిన జీవితంలో పరస్పర చర్యలు మరియు అనుభవాల ద్వారా వారి ఆలోచనలను, నైపుణ్యాలను, అలవాట్లను మెరుగుపరచుకుంటారు.

**4. సమగ్ర అభ్యసనం** (Integrated learning) :

- పిల్లలు అభ్యసించే అంశాలన్నీ పరస్పర సంబంధాన్ని కలిగి ఉండాలి.
- సమగ్ర పాఠ్యప్రణాళిక పిల్లల యొక్క సంపూర్ణ వికాసానికి తోడ్పడాలి.





- పిల్లల యొక్క శారీరక వికాసం, బౌద్ధిక వికాసం, సృజనాత్మకత, సాంఘిక మరియు ఉద్వేగ వికాసం, నైతిక మరియు ఆధ్యాత్మిక వికాసం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటాయి.

**5. క్రీడల ద్వారా అభ్యసనం** (Learning through play) **:**

- పిల్లల యొక్క శారీరక, మానసిక, ఉద్వేగ, సాంఘిక అభివృద్ధికి క్రీడలు దోహదపడతాయి. క్రీడల ద్వారా పిల్లల సామర్థ్యాలు మెరుగుపడతాయి. ఆలోచనా ధోరణి, సమస్యా పరిష్కారం, న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవడం, శాంతియుత వాతావరణాన్ని ప్రేరేపించడం మొదలైన లక్షణాలు అలవడతాయి.
- క్రీడాస్ఫూర్తి అలవడుతుంది.
- పిల్లల యొక్క సహజ సామర్థ్యాలను, అభిరుచులను అనుసరించి వారికి తగిన క్రీడలను ఎంపిక చేసే బాధ్యత ECCE ఉపాధ్యాయులది.

**6. భాగస్వామ్య అభ్యసనం/సహకార అభ్యసనం** (Partnership in learning)**:**

భాగస్వామ్య అభ్యసనం ద్వారా పిల్లల్లో అభ్యసనాన్ని మెరుగుపరచవచ్చు. అభిరుచులు, ఆసక్తులు, వైఖరులను అనుసరించి పిల్లలు సమూహాలుగా ఏర్పడి అభ్యసనం సాగిస్తారు. సమూహాలలో అనుకరించడం ద్వారా ఒకరికొకరు ప్రేరేపింపబడడం ద్వారా నేర్చుకుంటారు.




పిల్లల్లో నైపుణ్యాలను మెరుగుపరచడానికి, ప్రవర్తనలో మార్పులు, అలవాట్లు చేయడానికి భాగస్వామ్య అభ్యసనం ఉపయోగపడుతుంది.

**7. కళల ద్వారా అభ్యసనం** (Art as the basis of learning) :

- పిల్లల్లో ప్రతిస్పందించే గుణం ఎక్కువగా ఉంటుంది. కళల ద్వారా వారి ప్రతిస్పందనలు పెంపొందించవచ్చు. పాటలు, నాటకాలు, ఏకపాత్రాభినయం మొదలైన వాటి వలన వారిలో సృజనాత్మకతను, దేశభక్తిని,నైపుణ్యాలను పెంపొందింపవచ్చు.
- ECCE ఉపాధ్యాయుడు కొన్ని ఆసక్తికరమైన బోధన ఉపగమాల ద్వారా పిల్లల్లో ఉత్సాహాన్ని పెంపొందించవచ్చు.

**8. సంపూర్ణ శారీరక – మానసిక ఆరోగ్యం మరియు ఆరోగ్యకర అలవాట్లు**
(Integration of health and well being based on healthy habits) :

- పిల్లల్లో సంపూర్ణ శారీరక వికాసానికి సరైన పోషణ చాలా కీలకమైనది. ECCE విద్యా విధానంలో పోషణ అందించే బాధ్యత కూడా ఉపాధ్యాయులదే మంచి శారీరక ఆరోగ్యం, ఉత్సాహంగా అన్ని విషయాలలో పాల్గొనడం అభివృద్ధికి దోహద పడుతుంది.
- మానసిక ఆరోగ్యానికి ఆటలు–పాటలు మొదలైనవి తోడ్పడతాయి.
- పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు అలవడేటట్లు చేసే బాధ్యత ఉపాధ్యాయులదే
- వారికి అర్థం అయ్యేరీతిలో ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యాన్ని, పరిసరాల పరిశుభ్రత మరియు పరిరక్షణ, మంచి అలవాట్ల గురించి పాఠ్యాంశాలలో చేర్చి అవగాహన కల్పించాలి.

**9. ప్రామాణికమైన మదింపు** (Authentic Assessment) :

- పిల్లల యొక్క అభ్యసనాభివృద్ధిని అంచనా వేయుట ECCE ప్రణాళికలో ముఖ్యమైనదిగా, యదార్థమైన మూల్యాంకనగా పేర్కొన వచ్చును. పిల్లల్లో వచ్చిన గుణాత్మక మార్పును అంచనా వేయడం మరియు మూల్యాంకనం చేయడం వారి అభివృద్ధికి సహాయపడుతుంది.
- ECCE ఉపాధ్యాయులు పిల్లల యొక్క అభ్యసనాభివృద్ధిని నమోదుచేసి, పరిశీలించి, విశ్లేషించడం, వాటి ఆధారాలను పట్టికలో పొందుపరచడం ద్వారా వారి అభివృద్ధిని గమనించవచ్చును.
- చెక్‌లిస్ట్‌లు, తల్లిదండ్రుల ఇంటర్వ్యూలు, ఆడియో లేదా వీడియో టేపులు/ ఎనెక్‌డోటల్ రికార్డ్స్ ద్వారా పిల్లల అభ్యసనాన్ని పరిశీలించి నమోదు చేయవచ్చు. వీటి గురించి 5వ అధ్యాయంలో వివరించబడింది.

**పిల్లల అభివృద్ధిని నమోదుచేయుట** (Recording Childrens Progress) :

పిల్లల అభివృద్ధిని నమోదుచేయుట అనేది పిల్లల ప్రగతికి మొదటిమెట్టు. పిల్లల యొక్క ప్రగతిని పరిశీలించాలంటే రికార్డు నమోదు అనేది ఎంతో అవసరం. దాని ద్వారా పాఠ్యప్రణాళికలోను, బోధనా వ్యూహాలలోను, బోధనా ఉపగమాలలోను మార్పు తీసుకువచ్చి మరింత ఆసక్తికరమైన పాఠ్యాంశాలను బోధించడానికి వీలుపడుతుంది.

## 3.2 దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలు మరియు ప్రణాళిక (Long and short term objectives and planning):

### 3.2.0 ఉపోద్ఘాతం (Introduction):

Kwin Tsue (Chinese) ఈయన ప్రణాళిక రచన గురించి క్రింది విధంగా వివరించారు.

" ఎవరైనా ఒక సంవత్సరానికి ప్రణాళిక వేస్తే జొన్నలు నాటాలి, 10 సంతవ్సరాలకు ప్రణాళిక వేస్తే చెట్లు నాటాలి.

కాని జీవితకాలానికి ప్రణాళిక వేస్తే స్త్రీ, పురుషులకు శిక్షణ మరియు విద్యను అందించాలి. దీనిని బట్టి విద్యకు కూడా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను, ఆయా లక్ష్యాలను చేరుకోవడానికి తయారుచేయాలి అని స్పష్టమవుతోంది.

జాతీయ ఉపాధ్యాయ విద్య మండలి (NCTE), జాతీయ విద్య విధానము (NPE-1986), నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) మరియు ఎడ్యుకేషన్ కమీషన్స్ అంగీకరించిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

### 3.2.1 దీర్ఘకాలిక లక్ష్యాలు:

ఇవి సుదీర్ఘకాలంలో సాధింపబడే లక్ష్యాలు, ఇవి ఒక వార్షిక కాలంలో లేదా ఒక విద్యా సంవత్సర కాలంలో సాధించడానికి, సంవత్సర ప్రారంభంలో తయారుచేస్తారు. దీర్ఘకాలిక లక్ష్యాల సాధన అంత తేలికగా మూల్యాంకనం చేయలేము. దీని కొరకు అనేక ఇతర విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

**దీర్ఘకాలిక లక్ష్యాలు – పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలు:**

- పిల్లల యొక్క సహజ సామర్థ్యం మేరకు వారి సమగ్రాభివృద్ధికి గట్టిపునాదిని ఏర్పరచడం
- పోషక విలువలున్న పౌష్టిక ఆహారాన్ని పిల్లలకు అందించే ఏర్పాటు చేయడం
- సాంఘిక, మానసిక, భావోద్వేగ వికాసాలలో పిల్లలకు తగిన శిక్షణ ఇవ్వడం
- పిల్లలలో ఫలవంతమైన భావ వ్యక్తీకరణ మరియు గౌరవప్రదమైన, భావయుక్తమైన భాషను వినియోగించేలా చేయడం
- పిల్లల సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధికి పటిష్ఠమైన ప్రణాళికను రచించడం.
- పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక విద్యతో అనుసంధానం చేయడం ద్వారా ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం.
- పిల్లల సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధికి పటిష్ఠమైన ప్రణాళిక రచించడం.

### 3.2.2 స్వల్పకాలిక లక్ష్యాలు:

స్వలకాలంలో సాధించబడే లక్ష్యాలు. ఇవి రోజువారి, వారం రోజులు, నెలవారి కాలంలో నిర్దేశించబడే లక్ష్యాలు. వీటిని నెల ప్రారంభంలో తయారుచేస్తాం. స్వల్పకాలిక లక్ష్యాలు సాధించబడుతున్నాయా లేదా అని గమనిస్తూ (మదింపు చేస్తూ) ఉండాలి. అవసరమనుకుంటే ప్రణాళికలో మార్పుచేసుకుంటూ ఆయా నెలలోని లక్ష్యాలను సాధించేలా ప్రయత్నించాలి.

**స్వల్పకాలిక లక్ష్యాలు – పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలు:**

- ప్రతి పిల్లవానికి తరగతిగదిలో తాను ముఖ్యమైన వానిననే గుర్తింపు, తనకు గౌరవం ఉందనే భావనను కల్పించడం.
- పిల్లల్లో ఇంద్రియాల సమన్వయం మరియు అభివృద్ధిని ప్రోత్సహించడం.
- ఆరోగ్యకరమైన అలవాట్లను పిల్లల్లో అభివృద్ధి పరచడం.

- ముఖ్యమైన (అవసరమైన) నైపుణ్యాలు మరియు వ్యక్తిగత సర్దుబాటు చేసుకొనుటకు పిల్లలను ప్రోత్సహించడం
- మంచి సాంఘిక వైఖరులను ఏర్పరచడం ద్వారా మిగిలిన పిల్లలతో కలిసి అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేటట్లు చూడడం
- ప్రతి పిల్లవానిలో వారి భావాల వ్యక్తీకరణకు, అవగాహన అంగీకారానికి సహాయ పడాలి.
- పిల్లలకు అందుబాటులో ఉన్న పరిసరాల పట్ల అవగాహన కల్గించడం
- పిల్లలకు వారి భావాలను వ్యక్తపరిచేందుకు, వారిని స్వతంత్రులుగా మరియు సృజనశీలురుగా ఎదిగేందుకు ప్రేరేపించడం.
- తోటి పిల్లలతో స్నేహశీలురుగా మెలిగేందుకు సహాయపడడం
- ఇంటి వాతావారణానికి, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్ర వాతావరణానికి మరియు పాఠశాల వాతావరణానికి అలవాటు పడడానికి సహకరించడం.

### 3.2.3 ప్రణాళిక (Planning):

**పరిచయం:**

దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక లక్ష్యాలు చేరుకోవడానికి ఏర్పరిచే కృత్యాలకు ఆధారమైనది ప్రణాళిక. దీర్ఘకాలిక అనగా ఒక సంవత్సర కాలానికి, స్వల్పకాలిక అనగా ఒక వారంలోని ప్రతీరోజుకు తగినవిధంగా ప్రణాళికను రూపొందించుట. ఈ ప్రణాళిక ద్వారానే విశేషమైన, నిర్దేశించిన లక్ష్యాలు మరియు కృత్యాలు సాధించబడతాయి. ప్రతి సంవత్సరం ప్రారంభంలోనే పూర్తి వార్షిక ప్రణాళికను రూపొందించుకోవాలి. ప్రతీవారం చివరి రోజున ఆ తరువాత వారం యొక్క వార ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలి. ఈవిధంగా క్రమం తప్పకుండా క్రమ పద్ధతిలో చేయడం ద్వారా ఆశించిన లక్ష్యాలను సాధించవచ్చు.

**ప్రతిరోజు కార్యక్రమ పట్టికలో తప్పని సరిగా ఈ క్రింది విషయాలను పొందుపరచాలి.**

- వ్యక్తిగత మరియు సామూహిక కృత్యాలు
- తరగతి గదిలోనూ, వెలుపల ఏర్పాటు చేసే కృత్యాలు
- క్రియాత్మక మరియు నిష్క్రియాత్మక కృత్యాలు
- స్వతంత్ర మరియు తరగతి గది కృత్యాలు
- పిల్లల యొక్క సమగ్రాభివృద్ధికి సంబంధించిన కృత్యాలు
- వార ప్రణాళిక ఒక డైరీలా నిర్వహించాలి. వారం చివరిలో వారి లక్ష్యాలను నిర్ధారణ చేసుకోవాలి. తదుపరి వారం యొక్క వార ప్రణాళిక ఈ మూల్యాంకనం మీదే ఆధారపడి ఉంటుంది.
- వార ప్రణాళికలో ఏదో ఒక అంశానికి ప్రాముఖ్యతనిస్తూ రూపొందించుకోవాలి.

**ఉదాహరణకు నమూనా జాబితా (ఒకరోజు ప్రణాళిక) 3గం॥ (9am - 12pm)**

| | |
|---|---|
| 9am - 9.20am | ప్రార్థన |
| 9.20am - 9.30am | సంభాషణ (తోటి పిల్లలతో) |
| 9.30 am - 9.50am | సమూహ సంబంధిత కృత్యాలు |
| 9.50am - 10.10am | తరగతి గదిలో స్వేచ్ఛగా పాడుకోవడం |
| 10.10 am - 10.25am | తరగతి గది వెలుపల ఆడుకోవడం |

10.25 am - 10.55am చేతులు కడుక్కోవడం, ఫలహారం తీసుకోవడం, విశ్రాంతి

10.55 am - 11.20am సృజనాత్మక కృత్యాలు

11.20 am - 11.35am భాషాసంబంధ కృత్యాలు

11.35 am - 11.55am కథలు/పద్యాలు/మౌఖిక డ్రిల్లింగ్

11.55 am - 12.00pm ముగింపు

రూపొందించే ప్రణాళిక, ECCE ఆధారంగా పిల్లవాని సమీప అవసరాలు, స్థితిగతులను గూర్చి సంసిద్ధుడిని చేయుటకు వీలుగా ఉండాలి. ఉదాహరణకు ఉపాధ్యాయులు ఏదైనా అంశం మీద కృత్యాలు జరుపుటకు ప్రణాళిక వేసుకుంటే, పిల్లలు కథ చెప్పమని అడిగితే, ఆ ఉపాధ్యాయులు తన ప్రణాళికకు సంబంధించిన లక్ష్యాలను ఆ కథ ద్వారా సాధించగలగాలి.

**3.2.3** (i) **వార ప్రణాళిక** (Transport)**:**

ఉదాహరణకు "రవాణా" (Transport)అనే విషయాన్ని ఈ క్రిందివిధంగా సంభాషణా కృత్యంతో పరిచయం చేయవచ్చు.

మొదటిరోజు : సాధారణ రవాణా ప్రక్రియలు (పిల్లలు చుట్టూ ఉన్న వాతావరణంలోనివి)

రెండవరోజు : భూరవాణా, జలరవాణా, వాయురవాణా

మూడవరోజు : రవాణా వాహనాలు నడిపే వ్యక్తులు – డ్రైవర్, బోట్‌మెన్, పైలట్

నాల్గవరోజు : భిన్నమైన రవాణా ప్రక్రియలు

అయిదవరోజు : రవాణ ఉపయోగాలు

ఆరవరోజు : పునఃశ్చరణ (Recapitulation) ఈవిధంగా ప్రణాళిక అమలుకు, లక్ష్యాల అమలుకు, లక్ష్యాల సాధనకు ECCE యొక్క కృత్యాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ కృత్యాలన్నీ ఆటపాటల (playway) ద్వారా బోధించుటకు వీలుగా ఉంటాయి. ఉదాహరణకు,

1. కథలు చెప్పడం, కథలు అల్లడం
2. నాటకాలు వేయడం
3. పాటలు, పద్యాలు
4. సంగీతం మరియు నాట్యం
5. భాషాభివృద్ధికి కృత్యాలు
6. తరగతి గది లోపల, వెలుపల ఆటలు
7. సమూహాలుగా ఆటలాడడం
8. పూసలు, బ్లాకులు, పజిల్స్
9. లెక్కించడం, వేరు చేయడం
10. ఇసుకలో, నీటిలో ఆటలాడడం
11. పప్పెట్స్‌తో ఆడడం, కథలు చెప్పడం
12. క్షేత్ర పర్యటనలు, విహారయాత్రలు, ప్రకృతిలో పాదయాత్ర మొదలైనవి.

ఆటపాటల విధానం (Playway), కృత్యాల సహకారంగా ఉంటుంది. కృత్యాలు చేసేటప్పుడు కొన్ని పెద్ద సమూహాలలో, మరికొన్ని చిన్నచిన్న సమూహాలలో నిర్వహించాలి. సమూహాలలో పిల్లలు సాంఘీకరణ నేర్చుకుంటారు. ప్రతి పిల్లవాని యొక్క స్వభావానికి వైయుక్తిక భేదాలను అనుసరించి ECCE ప్రణాళిక రచన మరియు అమలు ఉండాలి.

**3.2.3 (ii) నెలవారి వార్షిక ప్రణాళిక**

**నెలవారీ ఇ.సి.ఇ. సెంటరులో చేపట్టే కీలకాంశాలు:**

**మొదటి నెల**

1. నేను
2. నా శరీరం
3. నేను తినే ఆహారం
4. మంచి ఆలవాట్లు

**రెండవ నెల**

5. ఇల్లు
6. పెంపుడు జంతువులు కుక్క, పిల్లి, చిలుక
7. మొక్కలు – చెట్లు
8. వాహనాలు

**మూడవ నెల**

9. సంఘ సహాయకులు–డాక్టరు, టీచరు
10. శరీర భాగాలు – చెవి, ముక్కు
11. అడవి జంతువులు – పులి, సింహం, ఏనుగు, నక్క
12. పండుగలు– దసరా, వినాయక చవితి

**నాల్గవ నెల**

13. వాహనాలు – నేలపైన వెళ్ళేవి
14. కూరగాయలు – వంకాయ బెండకాయ టమాట
15. శరీర భాగాలు – నాలుక, చర్మం
16. సంఘసహాయకులు– చాకలి, మంగలి

**ఐదవ నెల**

17. కూరగాయలు – బంగాళదుంప, కారట్, దోసకాయ
18. సంత
19. వాహనాలు – నీటిపై వెళ్ళేవి
20. సంఘ సహాయకులు –పోలీసు, దర్జీ

**ఆరవ నెల**

21. పండ్లు–అరటిపండు, జామపండు, ద్రాక్ష
22. మన ఊరు
23. పెంపుడు జంతువులు –ఆవు, మేక, కోడి, బాతు
24. ఆహారం–మంచి ఆహారపు అలవాట్లు

**ఏడవ నెల**

25. మనం ధరించే దుస్తులు
26. పండుగలు – క్రిస్మస్, సంక్రాంతి
27. మొక్కలు – వాటి నుంచి లభించేవి
28. పక్షులు – కాకి, పిచ్చుక, చిలుక, నెమలి

**ఎనిమిదవ నెల**

29. గాలిలో వెళ్ళే వాహనాలు– విమానం
30. నీరు – వనరులు
31. పూర్వపఠన – 2 కృత్యాలు
32. పూర్వ లేఖన – 2 కృత్యాలు
33. పూర్వ సంఖ్య – 2 కృత్యాలు
34. ఆకాశం – సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు
35. రంగులు గుర్తించడం, పేర్లు చెప్పడం

**తొమ్మిదవ నెల**

36. కాలాలు – చలికాలం, వేసవికాలం, వర్షాకాలం
37. నీరు ఉపయోగాలు
38. పండ్లు – సాధారణంగా లభించే ఏవైన 3 రకాలు
39. దృశ్య, శ్రవణ శక్తికి సంబంధించిన 3 కృత్యాలు
40. పూర్వ పఠన – 3 కృత్యాలు
41. పూర్వ లేఖన – 3 కృత్యాలు
42. పూర్వ సంఖ్య – 3 కృత్యాలు

**పదవ నెల**

43. గాలి లక్షణాలు / ఉపయోగాలు
44. అడవులు
45. పక్షులు – రకాలు(3)
46. పూర్వ లేఖన – 3 కృత్యాలు
47. పూర్వ పఠన – 3 కృత్యాలు
48. పూర్వ సంఖ్య – 3 కృత్యాలు

**సూచన:**

పైన ఇచ్చిన అంశాలు ఇ.సి.ఇ. అంశాలు. ఇ.సి.ఇ. కార్యకర్తల మార్గదర్శకత్వానికి మాత్రమే. పిల్లలు అవసరాన్ని బట్టి, కాలానుగుణంగా ఇంకా ఎన్ని అంశాలైనా చేపట్టవచ్చు.

## 3.3 ప్రకల్పనా పద్ధతి మరియు నేపద్యాధార ఉపగమనం (Project Approach Method and Thematic Approach) :

### 3.3.1 ప్రకల్పనా పద్ధతి (Project Method) "చేసి, చేస్తూ నేర్చుకొనే పద్ధతి"

విలియం హెర్ట్ కిల్‌పాట్రిక్ ప్రకల్పనా పద్ధతిని ఒక విద్యా విధానంగా విస్తృత పరిచారు. ఈ పద్ధతిలో ఉపాధ్యాయులు జ్ఞానాన్ని, సమాచారాన్ని అందించే వారుగా కాక ఒక సహాయకునిగా ఉంటాడు. కిల్‌పాట్రిక్ ప్రకల్పనా పద్ధతిని సాంఘిక వాతావరణంలో మనస్ఫూర్తిగా చేయు ఒక ఉపయోగకరమైన కృత్యంగా నిర్వచించారు. ప్రకల్పనా పద్ధతి తరగతి గది వాతావరణంలో పిల్లలు తమ జ్ఞానేంద్రియాల ద్వారా తమ పరిసరాలను అన్వేషించి, అనుభవంలోకి తెచ్చుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. పూర్వ ప్రాథమిక విద్యలో ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా పిల్లలకు అత్యంత ఉల్లాసంగా ఉండే వాతావరణంలో విద్య జరుపవచ్చు.

పూర్వ బాల్య దశ మానవజీవితంలో అన్వేషించే దశ. కుతూహలం, ఉత్సాహం నిండిన దశ. వివిధ చలనాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి అనువైన దశ. ఈ దశలో పిల్లలు ఏదైనా నైపుణ్యాన్ని పూర్తిగా నేర్చుకునే వరకు ఎన్నిసార్లు చేయించినా సంతోషంగా చేస్తారు. ఈ దశలో చలనాత్మక నైపుణ్యాలు నేర్చుకోవడానికి సహజ సంసిద్ధత వస్తుంది. కావున వారిలో ఈ నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలు ECCE ఉపాధ్యాయులు కల్పించాలి. అటువంటి అవకాశాలు కల్పించబడడానికి ఉద్దేశింపబడినదే ఈ ప్రకల్పనా పద్ధతి ఈ కింది 6 సోపానాల క్రమమంలో పూర్తవుతుంది. అవి:

**ప్రకల్పనా పద్ధతి సోపానాలు (Steps in Proejct Method)**

1) పరిస్థితులను కల్పించడం (reating situation)
2) ప్రాజెక్ట్‌ను ఎంచుకొని లక్ష్యాన్ని వివరించడం (Selection of the problem)
3) వ్యూహరచన (Planning)
4) అమలుపరచడం (Executing)
5) మూల్యాంకనం (Evaluation)
6) నివేదిక తయారుచేయడం (Reporting and Recording)

CQ5FKS

1. **పరిస్థితులను కల్పించడం:** సమస్యను గుర్తించేలా, పరిష్కారంపట్ల ఆసక్తిని, సంసిద్ధతలను ప్రేరేపించేలా సన్నివేశాన్ని కల్పించడం.
2. **ప్రాజెక్ట్‌ను ఎంచుకొని లక్ష్యాన్ని వివరించడం:** ఎంచుకొనే ప్రాజెక్ట్ వారి అవసరాలకు తగినదిగా వుండాలి. ప్రాజెక్ట్‌ను కూలంకుషంగా చర్చించి ఉద్దేశాలు, లక్ష్యాలు తెలియజేయాలి.
3. **వ్యూహరచన:** ప్రాజెక్ట్ ఫలితం వ్యూహరచనపై ఆధారపడి ఉంటుంది. రెండు లేదా మూడు వ్యూహాలను దృష్టిలో వుంచుకొని, మంచి వ్యూహాన్ని ఎంచుకోవాలి.
4. **అమలుపరచడం:** అభిరుచులు, సామర్థ్యాలు దృష్టిలో వుంచుకొని, తగిన సూచనలు ఇస్తూ, తగిన సమయంలో ప్రాజెక్ట్ పూర్తి అయ్యేలా చూడటం.

5. **మూల్యాంకనం:** పిదప ప్రాజెక్ట్‌ను సమీక్షించి, పొరపాట్లు లోపాలను తెలియపరచి తగిన సూచన మార్గాలను తెలిపి మూల్యాంకనం చేయాలి.

6. **నివేదిక తయారుచేయడం:** ప్రాజెక్ట్ ఎందుకు, ఎలా ఎన్నుకొన్నది, అమలు విధానాలు, మూల్యాంకనంలోని గుణదోషాలను సంపూర్ణంగా రికార్డ్‌చేసి ఒక నివేదికను రూపొందించి తరగతిలో చర్చించాలి.

**ఉపయోగాలు:**

- పిల్లల్లో శాస్త్రీయదృక్పథం అలవడుతుంది.
- పిల్లల్లో పరిశీలనా, విశ్లేషణా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.
- సహకార / భాగస్వామ్య అభ్యసనం జరుగుతుంది.
- సృజనాత్మక, సౌందర్యాత్మకత అభివృద్ధి చెందుతుంది.

**నష్టాలు:**

- సమయం ఎక్కువ కేటాయించాలి.
- పిల్లలు విసుగు చెందుతారు
- అందరూ ఉత్సాహంగా పాల్గొనలేరు

**ప్రకల్పనా పద్ధతి ఉదాహరణ:** నీటిలో తేలే, మునిగే వస్తువులను గూర్చి తెలుసుకోవడం.

1. **పరిస్థితులను కల్పించడం:** పరిసరాలలో వుండే ఏ ఏ వస్తువులు నీటిలో తేలుతాయి. ఏ ఏ వస్తువులు మునుగుతాయో చర్చించడం, దానిని తెలుసుకోవడానికి పిల్లలను సంసిద్ధులను చేయడం తగిన సంసిద్ధతలను కల్పించాలి.

2. **ప్రాజెక్ట్ ఎంచుకొని లక్ష్యాన్ని వివరించడం:** తేలిక వస్తువులు నీటిలో తెలతాయని ఉదా: కాగితం, ప్లాస్టిక్ వస్తువులు, పువ్వులు, ఆటలు, చెక్కబొమ్మలు, ఖాళీ డబ్బాలు మొదలైనవి. అలాగే బరువైె వస్తువులు నీటిలో మునుగుతాయని ఉదా: స్టీల్ చెంచాలు, రాళ్ళు, ఇనుప మేకులు, చింతగింజలు మొదలైన ఉద్దేశ్యాన్ని తెలియజేయడం.

3. **వ్యూహరచన:** నీటిలో తేలే వస్తువులు, నీటిలో మునిగే వస్తువుల జాబితాను తయారుచేసి, సేకరించాలి. నీటితో నిండిన పాత్రలో పరీక్షించవలసిన విధానాన్ని ముందుగానే ఉపాధ్యాయుడు పిల్లలతో చర్చించాలి.

4. **అమలుపరచడం:** ప్రణాళిక ప్రకారం నీటితో నిండిన పాత్రలో క్రమంగా వస్తువులను జారవిడుస్తూ ఏ ఏ వస్తువులు నీటిలో తేలుతున్నవి ఎందుకు? ఏ ఏ వస్తువులు నీటిలో మునుగుతున్నవో ఎందుకు గమనించడం. తేలిక / బరువు అనే విషయాన్ని అవగాహన చేసుకుంటారు.

5. **మూల్యాంకనం:** ప్రాజెక్ట్ మొదటి నుంచి సమీక్షిస్తూ, లోటుపాటులను సరిచేస్తూ, ప్రాజెక్ట్ ఉద్దేశ్యాన్ని, ఫలితాన్ని నిర్ధారించాలి. తేలే వస్తువులు మునిగే వస్తువులను నిర్ధారించాలి.

6. **నివేదిక తయారుచేయడం:** ప్రాజెక్ట్ ఉద్దేశ్యము, దానిని ఎలా నిర్వహించాము. ఫలితాలను పట్టికలో నమోదుచేసి, పిల్లలందరితో చర్చించడం.

### 3.3.2 అంశపద్ధతి (Thematic Approach)

**పరిచయం:**


"ఒక నిర్దిష్టమైన అంశాన్ని ఎంపిక చేసుకొని దాని ఆధారంగా బోధన జరిపే ఒక బోధనా పద్ధతియే అంశపద్ధతి." వైయుక్తిక అభ్యాసకుల అభిరుచులు మరియు సామర్థ్యాలకు అనుగుణంగా బోధన జరుపుటకు అవకాశం కల్పిస్తూ నేపథ్యాధారిత వ్యూహంలోని బోధనాభ్యసన ప్రక్రియ విద్యాప్రణాళికలోని అన్ని విషయాల మధ్య సహసంబంధమేర్పరచే విధంగా ఉంటుంది. పదాల అనుసంధానం, అక్షర క్రమము, ఉచ్చారణ, వాక్యలేఖనం వంటి సామర్థ్యాలను తరచూ పరిపుష్టి చేయడం ద్వారా వారి అభ్యసనం పురోగమించడానికి తోడ్పడుతుంది.

**అంశపద్ధతి:**

పూర్వప్రాథమిక పాఠశాల పిల్లలకు, తమ పరిసరాలలో అనుదినం తమకు పరిచయంలోగల వివిధ అంశాలను (ఉదా: ఇళ్ళు, పక్షులు, జంతువులు మొదలైనవి) ఎన్నుకొని వాటిని వివిధ కార్యక్రమాల ద్వారా క్షుణ్ణంగా విద్యార్థులకు అర్థవంతంగా నేర్పడం జరుగుతుంది. ఒకే అంశాన్ని వివిధ విషయాలను పలు కార్యక్రమాల రూపంలో వివరించడం.

- ఎంపిక చేసుకున్న అంశాన్ని, వివిధ కృత్యాల ఆధారంగా విద్యార్థికి పరిచయం చేసే విధానం అంశపద్ధతి.
- ఒక అంశాన్ని వివిధ రకాలైన కృత్యం / కార్యక్రమాల ద్వారా పిల్లల్లో వాటికి సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధిపరచడం.

  ఉదా: నీరు అంశాన్ని పరిచయం చేసే విధానం.




'నీరు' అనే అంశాన్ని వివిధ రూపాలలో గేయం / పాట, చర్చ / సంభాషణలు, కథా, చిత్రాల, ఆట / రోల్‌ప్లే, కళా, సృజనాత్మక రూపంలో నీరు అందులోని అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడం.


**లక్ష్యాలు:**

1. భాషాభివృద్ధిని పెంపొందించడం
2. క్రమపద్ధతిలో ఆలోచిస్తూ ఏకాగ్రతను కలిగించడం
3. నాటకీకరణ నేర్పుతూ కథను చెప్పడం
4. కథలలోని చిన్న చిన్న సమస్యలకు పరిష్కారాలను సూచించేటట్లు నేర్పించడం
5. కథలో వారికి ఇష్టమైన పాత్రను చెప్పించడం, అభినయింపచేయడం
6. కథలోని విషయాలకు సంబంధించి చిన్నచిన్న ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగేటట్లు చేయడం
7. నాటకాలు, నాటికలు ఏకపాత్రాభినయాలు మొదలైనవాటి ద్వారా పాఠ్యాంశాన్ని బోధించడం.
8. నేపథ్యాధార ఉపగమనం ద్వారా ఆసక్తిగా నేర్చుకోవడం.
9. పిల్లలలో ఏకాగ్రతను అభివృద్ధి చేయడం.
10. వినడం, మాట్లాడడం, చూడడం, నేర్చుకోవడం అనే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
11. క్రమశిక్షణ అలవరచడం
12. సృజనాత్మకత, ఊహావిశ్లేషణాశక్తిని పెంచడం.
13. నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ 2005 ప్రకారం ఈసీసీఈ కొరకు సూచించిన మార్గదర్శక సూచనలను అమలుపరచడం.
14. నేపథ్యానికి ఎన్నుకున్న అంశం పిల్లలకు ఆసక్తిని రేకెత్తించేదిగా చూడడం.
15. ఎన్నుకోబడిన విషయం ఏదైనా సరే అది పిల్లల చుట్టూ ఉన్న వాతావరణం నుండి గ్రహించడం.
16. ఎన్నుకున్న అంశం వారికి ఇష్టాన్ని కలిగించేదిగా చూడడం. అటువంటి కొన్ని విషయాలు క్రింద ఉదహరించబడ్డాయి. అంశపద్ధతిలో 23 అంశాలను పేర్కొన్నారు.

ఉదా:

- నా గురించి
- నా కుటుంబం
- జంతువులు
- పక్షులు
- పండ్లు
- కూరగాయలు
- ఇళ్ళు
- చెట్లు
- పరిశుభ్రత
- రవాణా
- ఋతువులు
- పండుగలు
- శరీర అవయవాలు
- పండుగలు, ప్రత్యేక సందర్భాలు

**వెబ్ చార్ట్**




**ఉదా: 1) పండుగలు**

అందరికి తెలిసిన పండుగ వాతావరణాన్ని సృష్టించడానికి కావలసిన సామగ్రి సేకరించి, అకర్షణీయంగా అమర్చాలి. పిల్లలను ప్రశ్నలు అడగడం ద్వారా ఆ పండుగ ఏమిటో, దాని ప్రాముఖ్యత ఏమిటో చెప్పమనాలి. వారికి తెలిసిన విషయాలు చెప్పించడం ద్వారా తెలియని విషయాలను ఉపాధ్యాయులు బోధించవచ్చు.

**ఉదా: 2) సముద్రతీరం (బీచ్)**

ఇసుక, రాళ్లు, గువ్వలు, నమూనా బోటులు, చిన్నచిన్న ఓడలు, ప్లాస్టిక్ నీటి జంతువుల బొమ్మలు మొదలైన వాటి సహాయంతో సముద్రతీర (బీచ్) వాతావరణాన్ని సృష్టించి, పిల్లలను ప్రశ్నలు అడగడం ద్వారా పాఠ్యాంశాన్ని బోధించవచ్చును.

## 3.4 అభివృద్ధి అనుకూల, విలీన తరగతి వాతావరణం నెలకొల్పడం/నిర్వహించడం (Maintaining a developmentally appropriate and inclusive class environment) :

### 3.4.0 ఉపోద్ఘాతం (Introduction):

సమ్మిళిత/విలీన విద్యలో అభ్యసన లోపాలు కలిగిన మరియు అభ్యసన లోపాలు లేని పిల్లలకు ఒకే తరగతి గదిలో విద్య అందించడం జరుగుతుంది. ఈవిధంగా పిల్లలందరికి ఒకే తరగతి గదిలో బోధన చేయడం వల్ల విద్యాపరంగా, సాంఘికంగా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అందరు పిల్లలకు సమానమైన అవకాశాలు మరియు అనుభవాలు కల్పించబడతాయి. సమ్మిళిత విద్య పిల్లలకు కల్పించే ప్రత్యేక అవకాశం కాదు. అది వారి హక్కు. పూర్వ ప్రాథమిక విద్యలో సమ్మిళిత విద్య ద్వారా పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపొందించవచ్చు.

ప్రస్తుత విద్యా విధానంలో సమ్మిళిత/విలీన విద్య ఒక ప్రధాన అంశం. పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ ఏక్ట్ (PWD Act, 1995 (National Trust Act) ప్రకారం ప్రతి పాఠశాలలో అంగవైకల్యం ఉన్న పిల్లలను సమ్మిళితం చేయడం జరుగుతుంది. " అందరితో విద్య" అనే నినాదాన్ని అమలు పరచాలంటే పిల్లల్లో గల అనేక భేదాలను గుర్తించి వారికి తగిన విద్యను బోధించాలి.

### 3.4.1 ప్రత్యేక అవసరతగల బాలలు – శీఘ్రంగా గుర్తించడం (Early Identification of children with the special needs)

ప్రతి పిల్లవాడు ఒక ప్రత్యేకం. ఆ పిల్లల అవసరాలే వారి అభ్యసనానికి మార్గనిర్దేశం చేస్తాయి. అందువల్ల పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలలో పిల్లలు పూర్తి స్థాయిలో ప్రతిభను ప్రదర్శించలేరు. ఇలాంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ అవసరమవుతుంది. ముఖ్యంగా విద్యా, విద్యేతర అంశాలలో పిల్లల్లోని అల్లరి, దుడుకుతనం వల్ల తరగతి నిర్వహణ కష్టంగా మారవచ్చు. అలా అని ఉదాసీనంగా వదిలివేయలేము. ఇటువంటి పిల్లలను సత్వరం గుర్తించాలి. వారిని తప్పక, జాగ్రత్తగా గమనిస్తూ, అవసరతనుబట్టి తగిన ప్రమేయ కార్యక్రమాలు (Intervention Programmes) రూపొందించి అమలుపరచాలి.

**పూర్వబాల్యదశ – ప్రత్యేక అవసరతలు – రకాలు**

ECCE కేంద్రంలోని కార్యకర్త వివిధ రకాలైన ప్రత్యేక అవసరాలుగల బాలలను అర్థంచేసుకొని శీగ్రంగా గుర్తించవలసిన అవసరత కలదు.

ప్రత్యేక అవసరతలు – రకాలు

1. దృష్టి లోపము (Visual Impairment)
2. శ్రవణ లోపము (Hearing Impairment)
3. చలనశక్తి సంబంధ అసామర్థ్యాలు (Locomotor Disability)

F9RSQF

4. బుద్ధిమాంద్యత (Mental Retardation)
5. భాషణ లోపము (Speach Impairment)
6. అభ్యసన లోపం (Learning disability)

మొదటి దశలో పై లోపాలను చెక్‌లిస్ట్ ఆధారంగా గుర్తించవచ్చు, రెండవ దశలో నిపుణులచే నిర్ధారణ చేయవచ్చు.

**శీఘ్రంగా గుర్తించడంలోని ప్రయోజనాలు** (Benefits of Early Identification)**:**

FPAMRR

1. చికిత్స ద్వారా లోప తీవ్రతను తగ్గించవచ్చు.
2. శిక్షణ ద్వారావీరి స్థితిని మెరుగుపరచవచ్చు.
3. గృహము పాఠశాలలో తగిన సహాయ సహకారాలు అందించవచ్చు.
4. తగిన సమ్మిళిత విద్యా కార్యక్రమాలను రూపొందించి అమలుచేయవచ్చు,
5. తగిన ఉపకరణాలు, ప్రమేయ కార్యక్రమాల ద్వారా వారికి ప్రత్యేక సహాయం అందించవచ్చు.

### 3.4.2 సమ్మిళిత విద్య (విలీన విద్య) (Inclusion Education)

" తరగతి గదిలోని పిల్లలందరిని ఏ రంగంలోనైనా వారి బలాలు, బలహీనతలతో సంబంధం లేకుండా ఒక పాఠశాలలోని పిల్లలందరూ పాఠశాల సముదాయంగా ఉంచడమే సమ్మిళిత విద్య." మంచి బోధనకు దారి తీసే అన్ని రకాల ఆచరణలతో కూడి ఉండేదే సమ్మిళిత విద్య అవుతుంది. పిల్లల గురించి లోతుగా ఆలోచించేవారు, అందరి పిల్లలకూ నేర్చుకునే మార్గాలను అభివృద్ధి పరిచే వారే ఆదర్శ ఉపాధ్యాయులు. అదే సమ్మిళిత విద్యలో కీలకాంశం.

**సమ్మిళిత విద్య అంశాలు:**

- సాధారణ తరగతి గదులలో విద్యను సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగులకు(New Word for Physically Challenged) కూడా అభ్యసింపచేయుట
- ఈసీసీఈ విధానంలో తరగతి గది నిర్మాణం దివ్యాంగులైన పిల్లల అవసరాలకు తగినట్లు ఉంచడం
- దివ్యాంగులైన పిల్లలు పాల్గొనేలా కృత్యాలు రూపొందించడం
- ప్రతి పిల్లవాడు వ్యక్తిగత విద్యాగమ్యాలు సాధించడం
- సమ్మిళిత విద్యలో పిల్లలందరిని స్వాగతించడం, వారి బలహీనతల తీవ్రతతో సంబంధం లేకుండా అందరికి మంచి విద్యను అందించటం.
- ప్రతి పిల్లవాని అవసరానికి తగినట్లుగా విద్యను అందించడం, వారిని దివ్యాంగులనే ముద్రలేకుండా చూడడం.

### 3.4.2 సమ్మిళిత విద్యా ప్రణాళిక (IEP):

వ్యక్తిగత బోధన ఒక పథకం ద్వారా క్రమరీతిలో జరుగుతుంది. ఈ బోధన పిల్లల ప్రగతి, ప్రమాణాలు, మానసిక స్థితి, పరిస్థితిలాంటివి పరిగణనలోనికి తీసుకొని చేయడం జరుగుతుంది. పిల్లల సమర్థత ఒకసారి తెలుసుకుంటే అందుకు తగిన వ్యక్తిగత విద్యాపథకం రూపొందించడం సులభం. వ్యక్తిగత విద్యాపథకానికి ప్రత్యేకమైన

లక్ష్యాలను పరిగణించి బోధనా ప్రణాళికను రూపకల్పన చేస్తారు.

**సమ్మిళితవిద్య – తరగతి గది నిర్వహణ కార్యక్రమము (Classroom Management):**

పూర్వబాల్యదశలో మానసిక వైకల్యం ఉన్న పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం తక్కువగా ఉంటుంది. విషయాలను త్వరగా మర్చిపోతారు. వారికి విద్యాబోధన చిత్రాల ద్వారా (Picture description) చేయడం వలన త్వరగా నేర్చుకుని, ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంచుకుంటారు. అనేకసార్లు బోధించడం ద్వారా వారి జ్ఞాపకశక్తిని పెంచవచ్చు. చిత్రాల ద్వారానే కాకుండా బొమ్మలు, వస్తువుల ద్వారా వారి జ్ఞాపకశక్తిని పెంచవచ్చు.

ఈ విద్యావిధానంలో జరిగే విద్యాబోధనలో వారు సాధించే ప్రతిపనికి బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తూ శిక్షణ ఇవ్వాలి. అప్పుడు వారు విద్య పై ఆసక్తి చూపుతారు. వారికి తమ ఉత్సాహాన్ని, ఆనందాన్ని నియంత్రించుకునే శక్తి తక్కువగా ఉంటుంది. ఏకాగ్రత, తెలివితేటలు తక్కువగా ఉంటాయి. కాబట్టి అవి పెంపొందించేటట్లు శిక్షణ ఇవ్వాలి. శిశు కేంద్రీకృత కృత్యాధార బోధనా పద్ధతిలో అభ్యసనం జరపాలి.

**ఈసీసీఈ సమ్మిళిత విద్యావిధానంలో ఉపాధ్యాయుల పాత్ర (Role of the Teacher - Inclusie Education):**

- సమ్మిళిత విద్యావిధానంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యమైనది.
- మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు జ్ఞానేంద్రియాల ద్వారా అభ్యసనం చేయించాలి. కాబట్టి వారికి చూడడం, వినడం, చెప్పడం వంటి పనులకు సంపూర్ణ అవకాశం ఇవ్వాలి.
- పిల్లలు వారి పనులు వారు స్వయంగా చేసుకోవడానికి సహనంతో తోడ్పడాలి.
- లక్ష్యం కోసం పిల్లవాడు చేసే ప్రతి ప్రయత్నాన్ని మనఃపూర్వకంగా ప్రశంసించాలి.
- కొత్త లక్ష్యం కోసం ప్రయత్నించేటప్పుడు గతంలో నేర్చుకున్న పనులు గుర్తుచెయ్యాలి. ఎందుకంటే మానసిక వైకల్యం ఉన్న పిల్లలు తొందరగా మర్చిపోతారు.
- వివిధ వాతావరణాలలో నేర్చుకున్న నైపుణ్యాలు ప్రదర్శించే అవకాశం కల్పించాలి.
- ఇతర పిల్లలను, ఉపాధ్యాయులను అనుకరించే అవకాశం కల్పించాలి.
- చిన్న చిన్న పాటలు, పద్యాలు పాడటం, నటించడం నేర్పించాలి, ప్రోత్సహించాలి. దానివల్ల సంఘీభావం, ఐక్యతాభావం, భాషాభివృద్ధి, సామాజిక స్పృహ మొదలగునవి ఏర్పడతాయి.
- కథలు చెప్పేటప్పుడు నటనను జోడించాలి. దానివల్ల వారికి సామాజిక స్పృహ, అవగాహన, శ్రద్ధ ఏర్పడతాయి.
- సన్నివేశాలు ఉన్న చిత్రాలు ఉపయోగించి వారి సంభాషణను అభివృద్ధి పరచాలి. చిత్రంలో ఉన్న విషయాలను ఉపయోగించి వివరించేటట్లు ప్రోత్సహించాలి. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టాలి.
- చిన్న చిన్న పజిల్స్, ఆటలు, ఫ్లాష్‌కార్డులు జత చేయడం లాంటివి చేయించాలి. దాని ద్వారా నియమాలు అర్థమవుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి.
- వారు ఏ రంగంలో బలహీనులో గుర్తించి వారివెంట ఉండి చక్కగా సహాయపడుతూ ఉండాలి. అప్పుడు సాధారణ పిల్లలతో సమానంగా పాఠశాలలో చదువుకోగలుగుతారు.

### 3.4.3 ఆటంకాలులేని వాతావరణం ఏర్పాటు (Barrier free Environment):

ఈసీసీఈ విధానమందు ప్రత్యేక అవసరతగల పిల్లలకు ఆటంకాలులేని మంచి వాతావరణం కల్పించడం ఎంతో అవసరం. సాధారణ పిల్లలతో కలిసి పాఠశాలకు వెళ్ళడానికి, రావడానికి, పాఠాశాలలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండాలి. ప్రత్యేక అవసరత ఉన్న పిల్లలు సాధారణ పాఠశాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా, తోటి పిల్లలు వారిని అవహేళన చేయకుండా విద్యనభ్యసించడానికి ఈ క్రింది అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి.

- పాఠశాల లోపలకు, బయటకు వెళ్ళేమార్గం అనుకూలంగా ఉండాలి.
- నడిచేటప్పుడు చేతులతో పట్టుకుని నడవడానికి వీలుగా తగిన ఏర్పాట్లు చేయాలి (కేంప్స్‌లాంటివి)
- తలుపులు,వాకిలి అందరికీ అనువుగా ఉండాలి.
- జారుడుగా లేకుండా ఉండే నేలలు (Anti-skid) ఉండాలి.
- సమాచార బల్లలు (Information boards), చిహ్నాలు ఉండాలి.
- గాలి, వెలుతురు తరగతి గదిలోనికి మెండుగా వచ్చే ఏర్పాట్లు చేయాలి.
- పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన మూత్రశాల ఉండాలి.
- పిల్లలు క్రిందపడినా దెబ్బలుతగలని రీతిలో ఏర్పాట్లు చేయబడిన ఆటస్థలాలు ఉండాలి.
- స్వచ్ఛమైన త్రాగునీటి సదుపాయం కల్పించాలి.
- అత్యవసర సమయంలో తప్పించుకోవడానికి కనీసము రెండు మార్గాలు ఏర్పాటు చేయాలి.

...పై అంశాలు దృష్టిలో ఉంచుకున్నట్లు అయితే మానసిక వికలాంగులకు కూడా సాధారణ పాఠశాలలో చదువుకోవడానికి అవకాశం కల్పించినవారమవుతాము.

### 3.4.4 ఈసీసీఈ తరగతి గది నిర్వహణ:

సాధారణ తరగతి గదిలో పిల్లలందరూ ఒకేవిధమైన శారీరక, మానసిక, ఉద్వేగ పరిపక్వత స్థాయిలను కలిగి ఉండరు. ఇక సాధారణ పాఠశాలలో సమైక్య విద్యావిధానంలో అభ్యసనా సమస్యలు ఉన్న పిల్లలు, విద్యను అభ్యసించడానికి పాఠ్యప్రణాళికలోను, బోధనలోను, అవసరమైన మార్పులు చేయడం, తగిన బోధనోపకారణాలను సమకూర్చడం ఎంతో అవసరం. అంతేకాకుండా ఉపాధ్యాయులకు కొంత శిక్షణ, వ్యవస్థాపరమైన వసతులు కల్పించడం వల్ల అభ్యసనా వైకల్యం ఉన్న పిల్లల నైపుణ్యాలను మెరుగుపరచవచ్చు. ఇవన్నీ తరగతి గదిలో భిన్న సామర్థ్యాలు ఉన్న పిల్లలకు నిర్వహించడానికి ఉపాధ్యాయులకు ఎంతో అవసరం. దీనితోపాటు సాధారణ పిల్లలు తోటి దివ్యాంగులను స్నేహపూర్వకంగా ఆదరించేలా ప్రోత్సహించాలి.

### ECCE ఈ వ్యక్తిగత విద్యాపథకం (IEP - Individual Educaiton Plan):

వైకల్యం ఉన్న పిల్లల తరగతి గది సామర్థ్యాలు, ప్రవర్తనాశైలి అంచనావేసి, వారికి తగ్గ వ్యక్తిగత విద్యా పథకం రూపొందించడం, అమలు పరచడం ఉపాధ్యాయుల బాధ్యత. అంటే తరగతి గదిలో వైకల్యం ఉన్న పిల్లలకు ప్రత్యేకమైన లక్ష్యాలను, వాటికి తగిన బోధనా ప్రణాళికను రూపొందించడమే. “వ్యక్తిగత విద్యాపథకం.” ఈ పథకం సఫలీకృతం కావడానికి ఉపాధ్యాయులు ఎంతో నిబద్ధతతో కృషిచేయాలి.

**వ్యక్తిగత విద్యా పథకంలోని అంశాలు:**

1) వైకల్యం ఉన్నవారి సమగ్ర సమాచారం
2) పిల్లల స్థాయి
3) లక్ష్యాలు
4) శిక్షణా పద్ధతులు
5) మూల్యాంకనం

**1. వైకల్యం ఉన్నవారి సమగ్ర సమాచారం:**

వైకల్యం ఉన్న పిల్లల శక్తి సామర్థ్యాలు, అవసరాలు, బలహీనతలు ఏ ఇద్దరిలోను సమానంగా ఉండవు. పిల్లల కుటుంబ చరిత్ర, సామాజిక, ఆర్థికస్థాయి, నివాసప్రాంత పరిస్థితులు, విద్య, పరీక్షల సమాచారం, వ్యక్తిగత కార్యక్రమ పథకాన్ని రూపొందించడంలో ఎంతో దోహదపడతాయి.

**2. పిల్లల స్థాయి:**

వ్యక్తిగత కార్యక్రమ పథకంలో బోధనాలక్ష్యాలను నిర్ణయించడానికి పిల్లల ప్రస్తుత స్థాయి అంటే శక్తి సామర్థ్యాలు, ప్రవర్తనా సమస్యలు అభ్యసనంలో ముఖ్యపాత్ర వహిస్తాయి. జ్ఞానేంద్రియాల గురించి అంచనావేయడం అత్యంత కీలకం. ఉపాధ్యాయులు తరగతిలోని అభ్యసన వైకల్యం ఉన్న పిల్లల్ని స్వయంగా అంచనావేసి తగిన విద్యాకార్యక్రమాన్ని రూపకల్పన చేస్తారు.

**3. లక్ష్యాలు:**

అభ్యసన వైకల్యం ఉన్న పిల్లవాని యొక్క సమగ్ర సమాచారం పిల్లవాని స్థాయిని అనుసరించి, లక్ష్యాలను దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలుగా నిర్దేశించాలి. ఈ లక్ష్యాలను ప్రాధాన్యతా క్రమంలో రూపొందించి నిర్ధేశించిన కాలపరిమితిలో సాధించాలి.

**4. శిక్షణా పద్ధతులు:**

లక్ష్యాలను అనుసరించి ఉపాధ్యాయులు పిల్లలకు అవసరమైన, ప్రయోజనకరమైన శిక్షణ, బోధనా పద్ధతులను నిర్ణయిస్తారు. శిక్షణలో ప్రతి అభ్యాసాన్ని అనేకసార్లు సాధన చేయించాలి. పిల్లల ప్రయత్నాన్ని అభినందించి చిన్న విషయాలకు కూడా పునర్బలనం అందించాలి.

**5. మూల్యాంకనం:**

పిల్లల స్థాయిని సమగ్రంగా అంచనా వెయ్యాలి.

**ఈసీసీఈ సమ్మిళిత తరగతి గది నిర్వహణలో బోధనాభ్యసన సామాగ్రి:**

సమ్మిళిత తరగతి గది నిర్వహణలో బోధనాభ్యసన సామగ్రి అత్యంత ప్రధానమైనది. సాధారణ పిల్లల కంటే అభ్యసన వైకల్యం ఉన్నవారిలో అవగాహనాసామర్థ్యం తక్కువగా ఉంటుంది. అందువల్ల బోధనాభ్యసన సామాగ్రి వారిని ఆకర్షించేదిగా ఉండాలి.

1. బోధనాభ్యసన సామాగ్రి పిల్లల వయస్సుకు సరిపోయేటట్లుగా ఉండాలి.
2. రకరకాల బొమ్మలు(రంగురంగులవి) ఉండాలి.

3. బంకమట్టి నమూనాలు తయారుచేయడం, రంగులు వేయడం, పూసలు లెక్కించడం మొదలైనవి.
4. చిన్న, పెద్ద బొమ్మలు, బంతులు మొదలైనవి
5. వివిధ వస్తువులు, బొమ్మలు, చిత్రపటాలు, ఫ్లాష్‌కార్డులు ఆధారంగా తెలపమనడం, రాయమనడం, వర్గీకరించమనడం లాంటి అంశాల ద్వారా వర్ణనాశక్తి, భావ వ్యక్తీకరణ, భాషానైపుణ్యం, లేఖనా నైపుణ్యం పెంపొందించవచ్చు.
6. సంఖ్యలు బోధించడానికి, పూసలు, చింతగింజలు ఉపయోగించాలి.
7. రంగు రంగుల చాక్‌పీస్‌లు ఉపయోగించాలి.
8. పాటలు, పద్యాలు, కథలు, నాటకాలు, ఏకపాత్రాభినయాల ద్వారా విద్యాబోధన చేయాలి.

**ఈసీసీఈ విద్యా అవసరాలు:**

- సమ్మిళిత విద్యాగమ్యాలకు అనుగుణంగా పిల్లల విద్యా అవసరాలు ఏర్పరచాలి.
- ప్రత్యేక గదిని లేదా తరగతిలోనే అనుకూలమైన కొంత భాగాన్ని కేటాయించాలి.
- చికిత్సాలయాన్ని అందుబాటులో ఉండేటట్లు చూడాలి. వైద్యులను అప్పుడప్పుడు పాఠశాలకు రప్పించి, పిల్లల ప్రవర్తన, మానసిక, సాంఘిక స్థాయిని అంచనావేయించాలి.
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలి.
- స్నేహితుల ద్వారా అభ్యసనం జరిగేలా చూడాలి.

## 3.5 ఈసీసీఈ సక్రమ నిర్వహణకు అవసరమైన వనరులు (Resources for effective functions of ECCE)

### 3.5.0

బాల్యారంభదశలో పిల్లలు ప్రధానంగా పర్యావరణంలో మమేకమవడం ద్వారా అభ్యసిస్తారు. వారు అభ్యసన కొనసాగించడానికి మరియు వారిలో తెలుసుకోవాలనే ఆసక్తి, కుతూహలం పెంచుటకుగాను వివిధరకాలైన పరికరాలతో కూడిన వాతావరణాన్ని వారికి కల్పించాలి.

పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలను (ఈసీసీఈ) పిల్లలకు సులభంగా అందుబాటులో ఉన్న ఆరోగ్యకరమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలి. మరియు అవి కాలుష్యానికి, చెరువులకు తవ్విన కాలువలకు, భారీ వాహనాలు పోయే రోడ్లకు దూరంగా ఉండాలి. ఈ దశలో పిల్లలు చాలా చురుకుగా ఉంటారు. వారు ఎల్లప్పుడూ పరిగెత్తుతూ, గెంతుతూ ఉంటారు. ఈవిధంగా వారు సదా చలనంలో ఉంటారు. అందువలన కేంద్రాలలో పిల్లలు స్వేచ్ఛగా ఆడుకోవడానికి తగినంత స్థలము అందుబాటులో ఉంచడమేకాక వారి సంపూర్ణ అభివృద్ధికి తోడ్పడే ఆసక్తికరమైన అభ్యసనానుభవాలు కలిగించుటకు వివిధ రకములైన పరికరాలు, వస్తువులు, సామాగ్రి కూడా ఈ కేంద్రాలకు అందించాలి.

ఉపాధ్యాయులు ఎటువంటి పరికరాలు ఎంచుకోవాలి మరియు వాటిని ఎలా ఉపయోగించుకోవాలి? అనేవి పూర్వప్రాథమిక విద్యా లక్ష్యాలు నిర్ణయిస్తాయి. అందువలన ఉపాధ్యాయులు పరికరాలను ఎంచుకోవడంలోనూ వస్తువులను తయారుచేయడంలోనూ అత్యధికమైన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

### 3.5.1 పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలలో కనీసంగా ఉండాల్సిన ప్రధానమైన అవసరాలు:

1. సురక్షితమైన, ఆరోగ్యకరమైన, సరిపోయినంత స్థలం.
2. బాలల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల మరియు సంరక్షకుల నియామకం.
3. స్వచ్ఛమైన త్రాగునీరు.
4. శుభ్రమైన మరుగుదొడ్లు (టాయిలెట్స్).
5. అందుబాటులో అనుబంధ పోషకాహార సరఫరా.
6. వైద్య పర్యవేక్షణలో పారామెడికల్ సిబ్బంది.
7. బొమ్మలు మరియు ఆట వస్తువులు.
8. పని చేసేవారికి నిరంతర వృత్యంతర శిక్షణ మరియు పటిష్ఠమైన పర్యవేక్షణ.

### 3.5.2 పిల్లల పరికరాలు, ఆటవస్తువులు, బొమ్మలు, పుస్తకాలు మరియు ఇతర సామాగ్రి ఎంపిక చేసుకోవడంలో గమనించవలసిన విషయాలు:

1. పరికరాలు మరియు సామాగ్రి పిల్లల అభివృద్ధికి దోహదపడేలా ఉండాలి మరియు నిర్ధిష్ట విద్యా లక్ష్యాలను చేరుకునేలా ఉండాలి.
2. బహుముఖ ప్రయోజనాలకోసం ఉపయోగించడానికి అవసరమైన సామాగ్రి కలిగి ఉండడం మంచిది.
3. కావలసిన పరికరాల సరఫరా లేకపోతే ఉపాధ్యాయులు స్వయంగా రూపొందించుకునే సామర్థ్యం కలిగి ఉండాలి.
4. పరిసరాలు మరియు వస్తువులు రెండు రకాలుగా ఉండాలి. అవి 1) తీవ్రమైన పని మరియు ఆటలకొరకు 2) సులభమైన పని మరియు ఆటల కొరకు
5. పిల్లలు ఎవరికి వారు ఆడుకోవటానికి, సమూహంగా ఆడుకోవటానికి, ఒకే వయసు పిల్లలు సమాంతరంగా ఆడుకోవటానికి వివిధ రకాలైన పరికరాలు మరియు సామాగ్రి ఉండాలి.
6. చిన్న పిల్లల వినియోగం ఎక్కువగా ఉంటుంది కాబట్టి దానికి అనుకూలంగాను మరియు పిల్లల ఒత్తిడిని తట్టుకునేవిధంగాను ఆటవస్తువులు తయారు కాబడాలి.
7. బొమ్మలు సురక్షితమైనవిగా, ప్రమాదం కలిగించనివిగా ఉండాలి.
8. పిల్లలు మింగేసే ప్రమాదం ఉంటుంది కాబట్టి చిన్న చిన్న ముక్కలుగా విరిగిపోయే, ఊడిపోయే బొమ్మలు వారికి ఇవ్వకూడదు.
9. గట్టిగా లేని దారాలు, తాళ్ళు, రబ్బర్లు, రింగులు ఉండే బొమ్మలు ఇవ్వకూడదు
10. సూదిగా, కొనగా ఉండే బొమ్మలు, మూలల వల్ల కోసుకునే ప్రమాదం ఉన్న బొమ్మలు ఇవ్వకూడదు
11. పెద్ద చప్పుళ్ళు, మోతలు వచ్చే బొమ్మల వల్ల పిల్లలు భయపడతారు. అది వారి వయస్సు పై చెడు ప్రభావం చూపిస్తుంది. అటువంటివి ఇవ్వకూడదు.
12. రసాయనాలు లేని బొమ్మలను ఇవ్వాలి.
13. ప్రమాదం కలిగించే వస్తువులు (అగ్గిపెట్టె, కత్తి, బ్లేడు) మొదలైనవి ఇవ్వకూడదు.

14. బొమ్మలు పిల్లల ఉత్సాహాన్ని, సృజనాత్మకతనూ పెంచేలా మరియు వారికి విజ్ఞానదాయకంగా, వారి అభివృద్ధికి తోడ్పడేలా ఉండాలి.
15. బొమ్మలకు తరుచుగా దుమ్ము,ధూళి,తుప్పు చేరే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి.
16. పిల్లలు ఎంచుకోవడానికి బొమ్మలు వివిధ రకాలుగా ఉండాలి. ఉదాహరణకు స్థిరమైన బొమ్మలు, శాస్త్రీయ బొమ్మలు మొదలగునవి.
17. టి.వి, కంప్యూటర్‌లు కేటాయించి అందుబాటులో ఉంచాలి.
18. ఉపాధ్యాయులు వారికి అందుబాటులో దొరికే గ్రీటింగ్ కార్డులు, ఆహ్వానపత్రికలు, వార్తాపత్రికలు, పాత పుస్తకాలు, కూరగాయలు, ఖాళీ డబ్బాలు, కవర్లు, పప్పుధాన్యాలు, చెక్కముక్కలు, అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు, గాజులు, టైలర్ వద్ద లభించే బట్టముక్కలు ఉపయోగించి ఆటవస్తువులు తయారుచేసే నైపుణ్యాన్ని కల్గి ఉండాలి.
19. పిల్లల పుస్తకాలలో అక్షరాలు పెద్దవిగానూ మరియు చిత్రాలు వారికంటికి ఇంపుగా కనిపించే రంగులతోనూ ఉండాలి. పుస్తకం పట్టుకోవడానికి వీలుగా ఉండాలి.
20. పిల్లల పుస్తకాలలో కాగితాలు మందంగా మరియు దృఢంగా ఉండాలి.
21. పుస్తకాల పరిమాణం పెద్దగా ఉండాలి మరియు ఆహ్లాదకరమైన దృశ్య ప్రభావం కలిగి ఉండాలి.

### 3.5.3 ECCE సామగ్రి

**1) సరఫరా చేసేవి:**

బ్లాకులు, పూసలు, కార్డులు, సంభాషణ చిత్రపటాలు, రంగుల ఆకారాల నమూనాలు, గుచ్చడానికి ఉపయోగించే బోర్డులు, క్యాసెట్లు సంబంధిత చిత్రపటాలు.

**2) సమకూర్చుకోవలసినవి:**

బంతులు, తాళ్ళు, అద్దం, చిన్నచిన్న ప్లాస్టిక్ వస్తువులు, బొమ్మరిల్లు, టైరులు, బొమ్మరిల్లుకు పనికి వచ్చే మనుషుల బొమ్మలు మొదలగునవి.

**3) తయారు చేసుకోవలసినవి – వనరుల నిధి:**

ఈసీసీఈ కేంద్రాలలో కార్యక్రమ నిర్వహణకు, వివిధ విషయాలకు సంబంధించిన వస్తు సామాగ్రిని ముందుగా వనరుల నిధిగా సమకూర్చుకోవాలి. తరగతిలో అందుబాటులో వుంచుకోవాలి.

**4) వనరుల నిధి : (నిత్యం వాడే వస్తువులు, వీరి పరిసరాలలో తేలికగా దొరికేవి)**

ఉదా: ప్లాస్టిక్ డబ్బాలు, ఖాళీ అగ్గిపెట్టెలు, చెక్కముక్కలు, రంగురంగుల బట్ట ముక్కలు, రకరకాల గింజలు(పెద్దవి), బెండు ముక్కలు, పాత వార్తాపత్రికలు, బొమ్మల పుస్తకాలు (పిల్లలకు ఉపయోగపడేవి మాత్రమే).వీటిని సేకరించి జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. వనరుల నిధి గురించి పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, తల్లిదండ్రులకు వివరించి తగిన వస్తువులను సమకూర్చుకోవడానికి వారి సహాయం తీసుకోవచ్చు.

**వస్తువులను ఎలా ఉపయోగించాలి?**

1. ఏ వస్తువు (సామాగ్రి) అయినా ఏదో ఒక్క అంశం నిర్వహించడానికి మాత్రమే పరిమితం కాదు.
2. ఒకే వస్తువును అనేక విధాల వేరువేరు అంశాలను పరిచయం చేయడానికి ఉపయోగించవచ్చు.
3. పిల్లలు స్వేచ్ఛగా ఆడుకోవడానికి ఇచ్చే వస్తువులను వారికి అందుబాటులో ఉంచాలి.
4. చిరిగిన, విరిగిన వస్తువులను పిల్లలకు ఇవ్వకూడదు. వాటిని బాగుచేసిన తర్వాతనే తిరిగి ఇవ్వాలి.
5. వస్తువులను ఉపయోగించిన తరువాత వాటిని వాటిస్థానంలో పదిలపరిచే అలవాటు వారిలో పెంపొందించాలి.

**5) రంగులు:**

సరఫరా చేసిన రంగులే కాకుండా ప్రాంతీయంగా దొరికే పూలు, ఆకులు, పుచ్చకాయలు (హాని చేయనివి) తీసుకుని వాటిని నలిపి కొన్ని చుక్కల నీళ్ళువేసి రంగులు తయారు చేసుకోవచ్చు.

**6) బొమ్మలు చేయడం:**

వార్తా పత్రికలు, పేపరు బ్యాగులు, స్పాంజిముక్కలు, పురికోస మొదలగునవి ఉపయోగించి బొమ్మలు తయారు చేసుకోవచ్చు.

**వస్తువుల్ని ఎలా జాగ్రత్త పరచుకోవాలి మరియు వాడాలి?**

1. ప్రతిరోజూ కేంద్రంలోని వస్తువులన్నింటిని సహాయకురాలి సహాయంతో శుభ్రపరచుకోవాలి.
2. చిరిగిన, విరిగిన వస్తువుల్ని వెంటనే సరిచేసుకోవాలి
3. వస్తువుల్ని పిల్లలకు అందుబాటులో ఉంచాలి. వస్తువుల్ని ఎలా వాడాలి? ఎలా భద్రపరచాలి? మొదలగు విషయాలు పిల్లలకు అర్థమయ్యేటట్లుగా చెప్పాలి.
4. పిల్లలకు హానికలిగించే వస్తువుల్ని కేంద్రాలలో ఉంచకూడదు. ఎప్పటికప్పుడు కొత్త వస్తువుల్ని కేంద్రాలలో తయారుచేయాలి.
5. పిల్లలు చేసిన వస్తువుల్ని భద్రపరచి కేంద్రాలలో ప్రదర్శించి వారిని ఉత్సాహపరచాలి. వారు మరింత పనిని చేయడానికి ప్రోత్సహించాలి.

**చిన్న పిల్లలకి ఎటువంటి ఆటబొమ్మలు ఇవ్వాలి:**

1. ఎటువంటి ఆటైనా పిల్లలకి ఆనందమే. ఆటలు ఆనందాన్నే కాదు, పిల్లలకు శారీరక బలాన్ని, ఎదుగుదలని, ఉత్సాహాన్నిస్తాయి. తన మాటల్ని, తనని ఇతరులు గుర్తించాలి, అలా గుర్తించి మెచ్చుకుంటే తనకి ఇంకా బావుంటుందన్న సాంఘిక బంధాన్ని ఆటలు పెంపొందిస్తాయి.
2. ఆటల ద్వారా పిల్లల్లో జరిగే అభివృద్ధి ఎంతో సహజమైంది. స్వాభావికమైంది.
3. పిల్లలు తమంతట తాముగా నేర్చుకున్నది బలీయంగా ఉంటుంది.
4. ఆటలకు కావల్సిన వాటిలో ఆటవస్తువులు, బొమ్మలు ముఖ్యమైనవి. అవి పిల్లల్ని పెద్ద వారికి దగ్గరచేస్తూ అనుబంధాన్ని పెంచుతాయి.

5. పిల్లలకు ఇచ్చే ఆటవస్తువులు, బొమ్మలు వారికి ఏవిధంగానూ కష్టం, నష్టం కలిగించేవిగా ఉండకూడదు. ఈ అంశానికి ఉపాధ్యాయులు, విధులు నిర్వహించువారు, పనిచేసేవారు ప్రాముఖ్యతనివ్వాలి. పిల్లల వయసుకి తగిన వాటినే ఇవ్వాలి. ఈసీసీఈ కేంద్రాలలో పిల్లల సమతౌల్యానికి, సృజనాత్మకత, స్వీయ వ్యక్తీకరణకు, అవసరమయ్యే పరికరాలు మరియు వస్తువులు సమకూర్చుకోవాలి.

### 3.5.4 ECCE సౌకర్యవంతమైన సదుపాయాలు

1. పిల్లల సామర్థ్యాలను తెలిపే కళాత్మక వస్తువులు, నేపథ్యప్రదర్శనలు, వారి సేకరణలు, వారి పనితనాన్ని ప్రదర్శించడానికి ఉపయోగపడే ప్రదర్శనా బోర్డులు ఉండాలి.
2. పిల్లల్లో క్రమబద్ధమైన పని అలవాట్లు పెంచేందుకు సంరక్షణా స్థలము, అలమార్లు, అరలు ఉపయోగపడతాయి. వాటివలన వారు ఆడుకున్న బొమ్మలు, వస్తువులను వాటి వాటి యథాస్థానాలలో పెడతారు. ఆనందంగా ప్రతి పిల్లవాడు తనకు సంబంధించిన వస్తువులు, పుస్తకాలు పెట్టుకోవడానికి తనకంటూ, సొంత స్థలాన్ని ఉపాధ్యాయులు కల్పించాలి.
3. పిల్లలకు కల్పించే సౌకర్యాలు వారికి సులభంగా అందుబాటులో ఉండాలి మరియు ఉపయోగపడేలా ఉండాలి.
4. పరికరాలు, వస్తువులు, సామాగ్రి ఎల్లప్పుడూ ఒక క్రమపద్ధతిలో ఉండేటట్లు చేసుకోవాలి.
5. పనికిరాని వస్తువులను, సామాగ్రిని ఎప్పటికప్పుడు తనిఖీలు మరియు మరమత్తులు చేయడాన్ని నిరంతర ప్రక్రియగా నిర్వహించాలి.
6. కేంద్రంలోని ప్రతి గదిని తగినంత గాలి, వెలుతురు ప్రసరణమునకు వీలుగా ఉండేటట్లు నిర్మించాలి.
7. స్వచ్ఛమైన త్రాగునీటి సౌకర్యం తప్పనిసరిగా ఉండాలి.
8. నీటి ద్వారా సంభవించే వ్యాధులను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
9. నిత్యం ప్రవహించే నీటి సరఫరా, స్నానస్థలము, శుభ్రమైన టాయిలెట్లు, దుస్తులు ధరించుటకు గదులు, చేతులు శుభ్రపరచుకోవడం కోసం సౌకర్యాలు మొదలగునవి కూడా(కేంద్రాలలో) సులభంగా అందుబాటులో ఉండాలి. వీలైతే ఎగ్జాస్ట్ ఫ్యానులు కూడా అమర్చాలి.
10. ప్రథమ చికిత్సా పరికరాలు కూడా తప్పనిసరిగా ఉండాలి.

## 3.6 పూర్వప్రాథమిక ఉపాధ్యాయుల పాత్ర – విధులు (The Role and Functions of Instructors):

### 3.6.0 ఉపోద్ఘాతం:


ఆరు సంవత్సరాలలోపు పిల్లల మానసిక స్థితి అత్యంత సున్నితంగా ఉంటుంది. వారి వ్యక్తిత్వపు మొలకలు ఆరంభమయ్యే రోజులు ఇవి. ఈ పూర్వప్రాథమిక దశలోని పిల్లల అవసరాలు తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, అలాగే వారి శక్తిసామర్థ్యాలు అవగాహన చేసుకోవడం పూర్వప్రాథమిక విద్యా ఉపాధ్యాయులకు అంతకన్నా ముఖ్యం. ఈ అవగాహనా బలంతోటే పిల్లల సమగ్ర అభివృద్ధి మరింత వేగంగా సాధించవచ్చును.

తమ నిర్మాణాత్మక సంవత్సరాల సమయంలో పిల్లల మేథో మరియు సామాజిక అభివృద్ధిని పెంచడంలో పూర్వప్రాథమిక విద్యా ఉపాధ్యాయులు ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. వారు అందించే విద్య పిల్లల భవిష్యత్తును నిర్ణయించడానికి కీలక పాత్ర పోషిస్తుంది. వారు అందించే విద్య పిల్లలు భవిష్యత్తు అభివృద్ధి చెందడానికి దోహదపడుతుంది. వారు దీని కొరకు తగిన పరిసరాలను మరియు తగిన పరికరాలను ఏర్పాటుచేస్తారు. వీరు పిల్లల భాషాభివృద్ధికి, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రధానమైన విజ్ఞానం, గణితాంశాలు తెలుసుకోవడానికి ఆటలు, కథలు, ఇతర కార్యక్రమాలు ఉపయోగించవచ్చు.

ఉపాధ్యాయులు పూర్వప్రాథమిక విద్యా సంబంధిత రంగంలో విజయం సాధించడానికి వృత్తి నైపుణ్యాలు మరియు లక్షణాలను అభివృద్ధి చెసుకోడానికి అవసరం.

**పూర్వ ప్రాథమిక విద్యా ఉపాధ్యాయుల లక్షణాలు:**

1. పూర్వప్రాథమిక విద్యా పాఠశాలలకు చెందిన మంచి ఉపాధ్యాయులు పిల్లలను ఎంతో ఇష్టపడతారు.
2. పిల్లలు నేర్చుకోవడానికి అవసరమైన కోరికను వారిలో దృఢ పరుస్తారు.
3. నిష్కపటంగా పిల్లల్ని స్వతంత్ర అభ్యాసకులుగా చేయడానికి ప్రయత్నిస్తారు.
4. పిల్లలు వారి యొక్క అభిప్రాయాలను వ్యక్తపరచటానికి అవకాశాలు కల్పిస్తారు మరియు వారిని ప్రోత్సహిస్తారు.
5. వారిలో ఆసక్తిని రేకెత్తిస్తారు.
6. పిల్లల అంతస్తుతో సంబంధం లేకుండా వారి సామర్థ్యాలను తెలుసుకోవటంలో ఆప్యాయతను, మద్ధతును మరియు మార్గదర్శకత్వాన్ని అందిస్తారు.
7. తమ సామర్థ్యాల మీద నమ్మకం కలిగి ఉంటారు.
8. సవాళ్ళను, బాధ్యతలను స్వీకరిస్తారు మరియు వాటిని తమ యొక్క సామర్థ్యాలతో ఉత్తమమైనరీతిలో నెరవేరుస్తారు.
9. తమ బాధ్యతను (బోధనను) వారు మనస్ఫూర్తిగా నిర్వహిస్తారు. అలా చేయడం ద్వారా పిల్లల మంచి భవిష్యత్తుకు పునాదిగా నిలబడతారు.
10. వారిని అందరు పిల్లలు, తల్లిదండ్రులు మరియు సహచరులు ఇష్టపడతారు.
11. వారు ఎప్పుడూ సంతోషంగా ఉంటూ, ఇతరులు కూడా అలా ఉండేటట్లుగా ప్రోత్సహిస్తారు.
12. ఓర్పు మరియు సహనం కలిగి ఉంటారు.
13. తల్లిదండ్రులందరూ ప్రధానంగా ఉపాధ్యాయులు మంచివారని మరియు ప్రతి ఒక్క పిల్లవాడు వారివద్ద అభ్యసించవచ్చని నమ్ముతారు.
14. కఠినమైన భావనలను కూడా వారు చాలా అందంగా మరియు సులభంగా వివరిస్తారు.
15. పిల్లల పెరుగుదల మరియు అభివృద్ధి గురించి వారు నిరంతరం మూల్యాంకనం చేస్తుంటారు.
16. పూర్వ ప్రాథమిక విద్యా పాఠశాల పద్ధతులను వారు కూలంకుషంగా తెలుసుకుంటారు.
17. పూర్వప్రాథమిక విద్యలో వచ్చే కొత్త పరిణామాలను వారు నిత్యం అధ్యయనం చేస్తుంటారు.




I8WZWE

**3.6.1 పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యాయులపాత్ర:**

1. పిల్లలకంటే ముందుగా కేంద్రానికి వచ్చి పిల్లల్ని ఆహ్వానించాలి.
2. పిల్లల్ని ఎప్పుడూ చిరునవ్వుతో పలకరించాలి.
3. ప్రతి ఒక్కరిని పేరుతోనే పలకరించాలి / పిలవాలి.
4. ఈ వయసు పిల్లలు పెద్దవాళ్ళతో సన్నిహిత సంబంధాన్ని కోరుకుంటారు కాబట్టి ఉపాధ్యాయులు పిల్లల చేయి పట్టుకోవడం, భుజం తట్టడం వంటివి చేయడం ద్వారా సాన్నిహిత్యాన్ని పెంపొందించాలి.
5. ప్రతి ఒక్కరిలోని సామర్థ్యాలను గుర్తించి అందరిలో పొగడాలి.
6. అందరికీ కార్యక్రమాలలో పాల్గొనడానికి సమాన అవకాశాలు కల్పించాలి.
7. నేను సాధించగలను అనే భావన పిల్లల్లో పెంపొందించడానికి తగిన అవకాశాలు కల్పించాలి.
8. పిల్లల్ని కొట్టకూడదు, దూషించకూడదు మరియు హేళన చేయకూడదు
9. పిల్లల్ని ఒకరితో ఇంకొకరిని పోల్చకూడదు, కించపరచకూడదు.

**1) పిల్లల శారీరకాభివృద్ధి – ఉపాధ్యాయుని పాత్ర:**

1. ఆటలకు అవసరమయ్యే అన్ని వస్తువులు సరైన స్థితిలో ఉండేలా ముందే జాగ్రత్త పడాలి.
2. పిల్లలు లోపల / బయట ఆడుకునేటప్పుడు వారికి దెబ్బలు తగలకుండా పరిసరాలను ఉంచాలి.
3. చిన్న పిల్లల్ని / పెద్ద పిల్లల్ని కలిపి ఆడించినప్పుడు కూడా పిల్లల స్థాయి/సామర్థ్యాలకు అనుగుణంగానే ఆడించాలి.
4. పిల్లలు పొడవు, బరువు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నమోదు చేయాలి. ఎత్తు, బరువులలో పెరుగుదల లేనట్లు గుర్తించినట్లయితే వెంటనే ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలి.
5. పిల్లలు స్వేచ్ఛగా ఆడుకునేటప్పుడు మధ్యలో జోక్యం చేసుకోకూడదు. దీని ద్వారా వారిని నిరోధించినట్లవుతుంది.
6. ఆటల్లో పాల్గొనని పిల్లలను బలవంతపెట్టకూడదు. మిగతా పిల్లలు ఆడుకునేటప్పుడు వారిని గమనింపజేయాలి. అలాగే ప్రతీసారి వీరిని కూడా ఆడుకోవడానికి ఆహ్వానించాలి. ఇలా చేస్తే కొంత కాలానికి వారంతటవారే ఆటల్లో పాల్గొనడానికి ఉత్సాహం కనబరుస్తారు.
7. చిరిగిపోయిన, పగిలిపోయిన పాడైపోయిన వస్తువుల్ని పిల్లలకు ఇవ్వకూడదు.

**2) సృజనాత్మకత పెంపొందింపు – ఉపాధ్యాయుని పాత్ర:**

1. స్వేచ్ఛగా ఆడుకోవడానికి అవకాశాలు కల్పించాలి.
2. తయారు చేసిన బొమ్మలను చూపించి అదేవిధంగా చేయమని అనకూడదు. దీని వలన పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతింటుంది. వారికి స్వేచ్ఛనిచ్చి సొంతంగా తయారుచేసేటట్లు ప్రోత్సహించాలి.
3. పిల్లలు చేసిన సృజనాత్మకత పనులను ఉపాధ్యాయులు ప్రశంసించాలి.
4. ఎలా చేసినా ఆ పనిని గుర్తించి పొగడాలి.
5. పరిసరాలలో దొరికే వివిధ వస్తువులను పిల్లలకు అందించాలి.

**3) గ్రహణశక్తి వికాసం – ఉపాధ్యాయుని పాత్ర:**

1. ఉపాధ్యాయులు వస్తువులతో పిల్లలను స్వేచ్ఛగా ఆడనివ్వాలి.
2. సృజనాత్మకంగా ఆలోచించడానికి, సమస్యలు పరిష్కరించడానికి పిల్లలకు తగినన్ని అవకాశాలు కల్పించాలి.
3. ఆలోచించడానికి పిల్లలకు సమయం ఇవ్వాలి.
4. పిల్లల్లో నేర్చుకునే నైపుణ్యం పెంపొందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.
5. అక్షరాలు,అంకెలు నేర్చుకోవడానికి తగిన సంసిద్ధత, కావలసిన నైపుణ్యాలు పిల్లల్లో పెంపొందించాలి కాని అక్షరాలు, అంకెలు మాత్రమే నేర్పకూడదు.

**4) భాషాభివృద్ధి – ఉపాధ్యాయుని పాత్ర:**

1. పిల్లలు వారి భావాలను వ్యక్తపరచడానికి ఉపాధ్యాయులు అవకాశాలు కల్పించాలి.
2. పూర్తి వాక్యాలలో మాట్లాడడానికి ప్రోత్సహించాలి.
3. మాట్లాడని పిల్లల్ని అలాగే వదిలేయకూడదు. ప్రేమ, వ్యక్తిగతశ్రద్ధ, ప్రశంస కనపరచడం ద్వారా వాళ్ళను ప్రోత్సహించాలి.
4. పిల్లలు చెప్పేది ఓపిగ్గా వినాలి. వారి ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలి.
5. పిల్లలు కలిసిమెలిసి బృందాలలో ఆడుకోవడానికి, కృత్యాలలో పాల్గొనడానికి తగినన్ని అవకాశాలు కల్పించాలి.
6. చిత్రపటాలు చూపించి, వాటి గురించి మాట్లాడటానికి అవకాశాలు ఇవ్వాలి మరియు కల్పించాలి.
7. చిన్న చిన్న ప్రశ్నల ద్వారా చూసింది చెప్పడానికి, ఊహించి చెప్పడానికి మరియు కారణాలు చెప్పడానికి అవకాశాలు కల్పించాలి.
8. మర్యాదగా, మెల్లగా, సరళమైన భాషను ఉపయోగిస్తూ పిల్లలతో మాట్లాడాలి.
9. పిల్లలు ఏమైనా తప్పుమాట్లాడితే వాళ్ళని ఎగతాళి చేయకూడదు. అలాచేస్తే పిల్లలు తమ భావాలను వ్యక్తీకరించడానికి భయపడతారు. సరియైన మాట ప్రేమగా చెప్పి తప్పును సరిదిద్దాలి.

**3.6.2 పూర్వప్రాథమిక విద్యా పాఠశాలలో ఉపాధ్యాయుల విధులు:**

1. **సురక్షిత మరియు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడం:** ఉపాధ్యాయులు పిల్లల క్షేమం కొరకు పరికరాలు మరియు పదార్థాలను ముందుగా పరీక్షిస్తారు. పిల్లలకు హాని కలిగించే అంశాలను వారు తొలగిస్తారు. లేదా మరమత్తు చేస్తారు.

2. **పర్యవేక్షణ మరియు క్రమశిక్షణ అందించడం**: పిల్లల అల్పాహారం మరియు భోజన సమయంలో, ఆటస్థలంలో, క్షేత్రపర్యటనల్లో వారిని జాగరూకతతో పర్యవేక్షించడం ఉపాధ్యాయుల మరో ముఖ్యకర్తవ్యం.

   పిల్లలు తప్పుగా ప్రవర్తించినప్పుడు లేదా నియమాలను అతిక్రమించినప్పుడు వారిని ఉపాధ్యాయులు సున్నితమైన మాటలతో చక్కని క్రమశిక్షణలో పెట్టాలి. పిల్లలను శారీరకంగా, మౌఖికంగా లేక మానసికంగా బాధపెట్టే పద్ధతులను అనుసరించకూడదు.

3. **పిల్లల ప్రగతిని గమనించడం, తల్లిదండ్రులతో చర్చించడం**: పిల్లల ప్రవర్తనను గమనించడం మరియు దానిపై వివరణ ఇవ్వడం ఉపాధ్యాయుల ముఖ్యమైన విధి. కాబట్టి వారు తమ పిల్లల అభివృద్ధి పెరుగుదలను అంచనావేస్తారు. పిల్లలపై చేసిన పరిశీలనలను ఎప్పటికప్పుడు వారి తల్లిదండ్రులకు అందిస్తారు.

4. **శిశు కేంద్రిత విధానాన్ని అమలు పరచడం**: పాఠం యొక్క రకాన్ని బట్టి మరియు పిల్లల అవసరాలను బట్టి, ఉపాధ్యాయులు పిల్లల సమూహంతోనూ లేక ఒక్కొక్కరితోనూ పనిచేస్తారు. ఉపాధ్యాయులు ఎన్నుకున్న పాఠ్యాంశాన్ని ఎలా ప్రారంభించాలో ముందుగా వారు నిర్ణయించుకోవాలి. పిల్లల్ని ప్రశ్నలు అడగడం ద్వారా లేక వారు ఎంచుకున్న నేపథ్యం (కథలు, పాటలు, మొదలైనవి) ద్వారా పాఠ్యబోధన జరగాలి.

5. **పిల్లల ప్రత్యేక అవసరాలను పరిగణనలోకి తీసుకోవడం**: ఉపాధ్యాయులు తమ పిల్లల ప్రత్యేక అవసరాలను (శారీరక, మానసిక, విద్యా సంబంధమైన) పరిష్కరించేందుకు ప్రయత్నిస్తూ ఉండాలి. ఉదాహరణకు, పిల్లలకు ఆహారపు అలర్జీ ఉన్నట్లయితే వారు తీసుకునే ఆహారం పట్ల వారు శ్రద్ధ వహించాలి మరియు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**ముఖ్యాంశాలు:**

1. ప్రతి శిశువు యొక్క సంపూర్ణమైన శారీరక, మానసిక వికాసానికి పూర్వ ప్రాథమిక విద్య (ఈసీసీఈ) అత్యంత ప్రధానమైనది.
2. పాఠశాలకు వెళ్లడానికి ముందు శిశువును శారీరకంగా, మానసికంగాను సంసిద్ధులను చేయడమే ఈసీసీఈ యొక్క ముఖ్య ఉద్దేశ్యము
3. పూర్వబాల్య విద్యలో మాతృభాషను తప్పనిసరిగా అభ్యసించాలి అని కొఠారి కమీషన్ ప్రతిపాదించింది.
4. దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక లక్ష్యాలు చేరుకోవడానికి మరియు ఏర్పరిచే కృత్యాలకు ఆధారమైనదీ ప్రణాళిక.
5. దీర్ఘకాలిక అనగా ఒక సంవత్సర కాలానికి, స్వల్పకాలిక అనగా ఒక వారంలోని ప్రతిరోజుకు తగినవిధంగా ప్రణాళికను రూపొందించుట
6. ప్రతి పిల్లవాని యొక్క స్వభావానికి వైయుక్తిక భేదాలను అనుసరించి ఈసీసీఈ ప్రణాళిక రచన మరియు అమలు ఉండాలి.
7. ప్రకల్పనా పద్ధతి తరగతి గది వాతావరణంలో పిల్లలు తమ జ్ఞానేంద్రియాల ద్వారా తమ పరిసరాలను అన్వేషించి, అనుభవంలోకి తెచ్చుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

8. పిల్లల్లో నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలు కల్పించబడడానికి ఉద్దేశింపబడినది ప్రకల్పనా పద్ధతి
9. నేపథ్యాధార ఉపగమనం వైయుక్తిక అభ్యాసకుల అభిరుచులు మరియు సామర్థ్యాలకు అనుగుణంగా బోధన జరుపుటకు అవకాశం కల్పిస్తుంది.
10. సమ్మిళిత విద్యలో అభ్యసన లోపాలు కలిగిన మరియు అభ్యసన లోపాలులేని పిల్లలకు ఒకే తరగతి గదిలో విద్య అందించడం జరుగుతుంది.
11. ఈసీసీఈ విధానమందు మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు ఆటంకాలులేని మంచి వాతావరణ కల్పించడం ఎంతో అవసరం.
12. ఈసీసీఈ తరగతి గది నిర్వహణలో ఉపాధ్యాయులకు కొంత శిక్షణ, వ్యవస్థాపరమైన వసతులు కల్పించడం వల్ల అభ్యసనావైకల్యం ఉన్న పిల్లల నైపుణ్యాలను మెరుగు పరచవచ్చు.
13. పిల్లల్లో సంపూర్ణమైన అభివృద్ధికి తోడ్పడే ఆసక్తికరమైన అభ్యసనా అనుభవాలు కలిగించుటకు వివిధ రకములైన పరికరాలు, వస్తువులు, సామాగ్రి ఈసీసీఈ కేంద్రాలలో సరఫరా చేయాలి.
14. ఈసీసీఈ కేంద్రాల్లో కార్యక్రమ నిర్వహణకు వివిధ విషయాలకు సంబంధించిన వస్తుసామాగ్రిని ముందుగా సమకూర్చుకోవాలి.
15. తమ నిర్మాణాత్మక సంవత్సరాల సమయంలో పిల్లల మేథో మరియు సామాజిక అభివృద్ధిని పెంచడంలో పూర్వప్రాథమిక విద్యా ఉపాధ్యాయులు ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారు.
16. ఉపాధ్యాయులు పూర్వప్రాథమిక విద్యా సంబంధింత రంగంలో విజయం సాధించటానికి వృత్తి నైపుణ్యాలు మరియు లక్షణాలను అభివృద్ధి చెందించడానికిగాను శిక్షణ అవసరం.

## 4 పదకోశం (Glossary) :

| | | |
|---|---|---|
| సమతుల్యం | = | సరిసమానమైనది |
| వైయుక్తిక బేధాలు | = | వ్యక్తిగత తేడాలు |
| ఉత్సుకత | = | కుతూహలం, ఉత్సాహము |
| పరికల్పన | = | ఊహ, ఆలోచన |
| నేపథ్యం | = | ఒక సంఘటన లేదా పరిస్థితికి కారణమైనదాన్ని ప్రభావితం చేసే పూర్వ సంఘటన |
| విలీన/సమ్మిళిత | = | కలుపుకొన్న |
| మమేకమవడం | = | కలసిపోవడం |
| పారామెడికల్ | = | వైద్యానుబంధ విధులు |
| నిర్దిష్ట | = | నిర్దేశింపబడిన |
| బహుముఖ | = | ఎక్కువ దృక్కోణంగల |
| స్వాభావికమైన | = | సహజమైన |
| జాగరూకత | = | జాగ్రత్త, అప్రమత్తంగా ఉండటం |

# మూల్యాంకనం

**వ్యాసరూప ప్రశ్నలు (Essay Type)**

1. క్రియాశీల అభ్యసనం అనగానేమి? దానికి కావలసిన మూలకాలు ఏమిటి?
2. ఈసీసీఈ యొక్క దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలు ఏమిటి?
3. ప్రకల్పనా పద్ధతిని ఒక ఉదాహరణలో వివరింపుము.
4. విలీన/సమ్మిళిత విద్య అనగా ఏమి? దానిలో ఉపాధ్యాయుని పాత్ర గురించి వివరింపుము.
5. ఈసీసీఈ సక్రమ నిర్వహణకు అవసరమైన వనరులు గురించి రాయండి?
6. పూర్వప్రాథమిక విద్యా కార్యక్రమ నిర్వహణలో ఉపాధ్యాయుని విధులు ఏమిటి?

**సంక్షిప్త సమాధాన ప్రశ్నలు (Short Answer Type)**

1. సమతుల్య సందర్భహిత విద్యా ప్రణాళిక రచనకు కావలసిన సూత్రాలు ఏమిటి? వాటిలో ఒకదానిని వివరింపుము.
2. వార ప్రణాళిక అంటే ఏమిటి? ఒక ఉదాహరణతో వివరింపుము?
3. నేపథ్యాధార ఉపగమమును ఒక ఉదాహరణతో వివరించండి.
4. వ్యక్తిగత విద్యాపథకం అంటే ఏమిటి? దానిలో ఉండే అంశాలు ఏమిటి?
5. ఈసీసీఈ కేంద్రాలలో పరికరాల మరియు ఇతర సామాగ్రి ఎంపిక చేసుకోవటంలో గమనించవలసిన విషయాలు ఏమిటి?
6. ఈసీసీఈ కేంద్రాల్లో ఉండాల్సిన స్వాభావికమైన సౌకర్యాలు ఏమిటి?
7. పూర్వప్రాథమిక విద్యా ఉపాధ్యాయుడికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి?

**లఘు సమాధాన ప్రశ్నలు (Very short Answer Type)**

1. ఈసీసీఈ కేంద్రాల్లో పిల్లల్లో భాషాభివృద్ధికి ఉపాధ్యాయుడు చేయవలసిన ప్రక్రియలు ఏమిటి?
2. ఈసీసీఈ విద్యావిధానంలో ఎక్కువగా ఉపయోగించే కృత్యాలు ఏమిటి?
3. ప్రకల్పనా పద్ధతి వల్ల కలిగే ఉపయోగాలు ఏమిటి?
4. విలీన/సమ్మిళిత విద్యావిధానంలో పాఠశాల నిర్మాణం ఏ విధంగా ఉండాలి?
5. ఈసీసీఈ కేంద్రాల్లో ఉండాల్సిన కనీస అవసరాలు ఏమిటి?
6. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించడానికి ఉపాధ్యాయుడు ఏమి చేయాలి?

**6. ఖాళీలను పూరించండి**

1. పూర్వబాల్య దశను ........................ అని కూడా అంటారు.
2. పుట్టినప్పటి నుండి 8 సం॥ వరకు ............. గా పరిగణిస్తారు.
3. విద్య యొక్క ఫలితాలు ఫలవంతంగా ఉండాలంటే దానికి ........ పునాది
4. భారతీయ విద్యా కమిషన్ యొక్క అధ్యక్షులు ............
5. కొఠారి కమిషన్ పూర్వ బాల్య విద్యలో ........ ను తప్పనిసరిగా అభ్యసించవలెనని ప్రతిపాదించింది.
6. NPE ప్రకారం ECCE యొక్క పాఠ్యప్రణాళిక శిశువు యొక్క ....... కు దోహద పడేలా ఉండాలి.
7. పిల్లల యొక్క ప్రగతిని పరిశీలించాలంటే ....... అనేది ఎంతో అవసరం
8. దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక లక్ష్యాలు చేసుకోవడానికి మరియు ఏర్పరచే కృత్యాలకు ఆధారమైనది ...
9. పరికల్పనా పద్ధతిని సాంఘిక వాతావరణలో మన:స్ఫూర్తిగా చేయు ఒక ఉపయోగకరమైన కృత్యంగా .... నిర్వచించారు.
10. పరికల్పనా పద్ధతిలో ....... దశలు ఉంటాయి
11. ఒక నిర్దిష్టమైన నేపథ్యాన్ని ఎంపిక చేసుకొని దాని ఆధారంగా బోధన జరిపే పద్ధతి .......
12. పూర్వప్రాథమిక విద్యలో సమ్మిళిత విద్య ద్వారా పిల్లల్లో ...... పెంపొందించవచ్చు
13. వ్యక్తిగత విద్యా పథకానికి ప్రత్యేకమైన లక్ష్యాలను పరిగణించి ......... ను రూపకల్పన చేస్తారు.
14. ఈసీసీఈ విధానమందు మానసిక వైకల్యం ఉన్న పిల్లలను ఆటంకాలు లేని ........ కల్పించడం ఎంతో అవసరం.
15. తరగతి గదిలో వైకల్యం ఉన్న పిల్లలకి ప్రత్యేకమైన లక్ష్యాలను, వాటికి తగిన బోధనా ప్రణాళికను రూపొందించడమే .............
16. ఈసీసీఈ ఉపాధ్యాయులు ఎటువంటి పరికరాలు ఎంచుకోవాలి అనేది .......... నిర్ణయిస్తాయి.
17. ఈసీసీఈ కేంద్రాల్లో పలు ప్రయోజనాల కోసం ఉపయోగించడానికి ....... సామాగ్రి ఉండడం మంచిది
18. ఈసీసీఈ కేంద్రాల్లో కార్యక్రమ నిర్వహణకు వివిధ విషయాలకు సంబంధించిన వస్తు సామాగ్రిని ......... సమకూర్చుకోవాలి.
19. పిల్లల్లో ఎత్తు,బరువులతో పెరుగుదల లేనట్లు గుర్తించినట్టయితే వెంటనే ..... ను సంప్రదించాలి.

**ఉప ప్రణామములు (References):**


1. www.irspirational teaching using limited resources
2. www.krishna.org
3. Pedagogy of leanring - volume2 - sanka prasad mahanthy
4. A Horstic curricular and pedagogical approach to early childhood care and education

   - Sankar Prasad Mohanty
5. B.Ed విద్యా ఆధారాలు – తెలుగు అకాడమి
6. NCERT Text Book - Early Childhood care and Education
7. B.Ed - సమ్మిళిత విద్య – తెలుగు అకాడమి
8. D.E.D - సమ్మిళిత విద్య – తెలుగు అకాడమి – 2010
9. D.E.D - "పూర్వప్రాథమిక ప్రాథమిక విద్యా దృక్పథాలు" – తెలుగు అకాడమి – 2001
10. NCERT - Trainer's Handbook in Early Childhood Care and Education by Romila Soni-2009

# 4 పూర్వ ప్రాథమిక విద్య
## 3–6 సం॥ల వయస్సు వారికి విద్యా ప్రణాళిక

పాఠశాల అంటే కేవలం ఒక భౌతిక ప్రదేశం కాదు. అది పిల్లల ఆకాంక్షలకు, అభివృద్ధికి సంగమం. వారికిష్టమైన ప్రతి ప్రాణితో, ప్రతి వస్తువుతో, ప్రతి వాస్తవికాంశముతో సాన్నిహిత్యం నెర్పుకొనగల ఒక బహిరంగ ప్రపంచం. పాఠశాలకు కావలసింది బోధకులూ, మహోపాధ్యాయులూ కాదు. కోరినప్పుడు స్నేహహస్తం అందించగల మంచి మిత్రులు.

**– అరవిందుడు**

**లక్ష్యాలు:**

1. ఇ.సి.సి.ఇ. 3–6 సం॥ వయస్సు వారికి విద్యా ప్రణాళిక యొక్క ఆవశ్యకత మరియు అవసరాన్ని గుర్తిస్తారు.
2. భాష మరియు భావ ప్రసారమంటే ఏమిటో తెలుసుకొంటారు.
3. పిల్లల భాషాభివృద్ధిపై దృష్టి సారించవలసిన అంశాలను గురించి వివరంగా అవగాహన చేసుకుంటారు. భాషాభివృద్ధికి నిర్వహించవలసిన వివిధ కృత్యాలను గురించి తెలుసుకొంటారు.
4. గణిత భావనలను, గణిత సంసిద్ధత కొరకు నిర్వహించవలసిన కృత్యాలను అవగాహన చేసుకొంటారు.
5. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుటలో ఉపాధ్యాయుల పాత్రను తెలుసుకొంటారు.

**ఉప శీర్షికలు**

4.1 భాష మరియు భావప్రసారం (Language and Communication)

4.2 గణిత భావనలు (Mathematical Concepts)

4.3 శాస్త్రీయ ఆలోచనలు (Scientific Thinking)

INFUXQ

### 4.1 పరిచయం :

3 సం॥ల వయసున్న పిల్లల్లో వివిధ వికాసాలకు చెందిన సంధానాలు ఏర్పడటం ప్రారంభం అవుతాయి. అందువలన వివిధ వికాసాలకు అంటే శారీరక వికాసం, మానసిక వికాసం, ఉద్వేగ వికాసం, సాంఘిక వికాసం, నైతిక వికాసం మరియు భాషా వికాసాలకు పునాది వేయబడుతుందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు మరియు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

ఈ వయస్సు విద్యనభ్యసించుటకు అనువైనదిగా పేర్కొన్నారు. 3 సం॥ల నుండి 6 సం॥ల వరకు వుండే దశను పూర్వబాల్య దశ అని అంటారు. దీనినే పాఠశాల పూర్వదశ అని కూడా అంటారు. అందువలన ఉపాధ్యాయులు పిల్లలను పరిశీలించడం, అవగాహన చేసుకొని వారి అభివృద్ధికి తోడ్పడటం, కొత్తదారులు చూపించి సార్వజనీకంగా అంగీకరించబడే శిశుకేంద్రీకృత పద్ధతిని ప్రతిపాదించారు.

విద్యార్థులకు అందించే విద్యా అనుభవాల సముదాయమే విద్యా ప్రణాళిక.

పాఠశాలలో విద్యార్థుల పురోభివృద్ధికి కల్పించే కృత్యాలన్నింటిని విద్యా ప్రణాళిక అంటారు – ఆల్‌బర్ట్

పియాజే సంజ్ఞానాత్మక సిద్ధాంతం ప్రకారం పిల్లలు తమ పరిసరాలతో స్వతఃసిద్ధంగా జరిపే ప్రతిచర్యల వల్ల విషయాలు కనుక్కొంటారు. అంటే తయారుగా ఉన్న జ్ఞానాన్ని మాటల ద్వారా అందించడం కంటే పిల్లల్లో అన్వేషణా కాంక్షను, నైపుణ్యాన్ని పెంపొందించడానికి కళ / క్రాఫ్ట్ సామాగ్రి, పజిల్స్, ఆటలు, బిల్డింగ్ బ్లాకులు, పుస్తకాలు, సంగీత సంబంధ పరికరాలు మొదలైన వాటిని ఉపయోగించి విస్తృతమైన వివిధ కృత్యాలను ప్రణాళిక వేసి అందించాలి.

ఇ.సి.సి.ఇ. విద్యా ప్రణాళిక విద్యార్థుల వయస్సుకు, మానసిక స్థాయికి తగినట్లుగా రూపుదిద్దబడాలి. పూర్వబాల్య దశ విద్య గురించి విశేషంగా కృషి చేసిన వారిలో ముఖ్యులు రూసో, ఫ్రోబెల్, డ్యూయీ లాంటి వారిని పేర్కొనవచ్చును. గాంధీ, ఠాగూర్, గిజూభాయి, తారాబాయి లాంటి భారతీయ విద్యావేత్తలు కూడా విద్యా ప్రణాళిక శిశుకేంద్రీకృతంగా ఉండాలని సూచించారు.

## 4.1 భాష మరియు భావ ప్రసారం (Language and Communication)

భాష అనేది ఆలోచనకు, సమాచార పంపిణీకి (Communication), అభ్యసనానికి తోడ్పడుతుంది.

**హాలిడే (Haliday) అనే శాస్త్రవేత్త ప్రకారం**

- భాష వల్ల శిశువు తన కోరికలను వ్యక్తపరిచి, అవసరాలను తీర్చుకొంటాడు.
- ఇతరుల ప్రవర్తనను నియంత్రణ చేసుకొంటాడు, వారితో ప్రతిచర్య (Interaction) చేస్తాడు.
- తన అభిప్రాయాలను, వైఖరులను, అనుభూతులను భాష ద్వారా వ్యక్తపరుస్తాడు.
- పిల్లలు కొత్త విషయాలను భాష ద్వారా ఇతరులకు తెలుపుతారు.

పిల్లలు భాషను (భాషణంలో) నేర్చుకోవడంలో తేడాలు వుంటాయి. కొంతమంది త్వరగా మాట్లాడటం నేర్చుకొంటే మరి కొంతమంది చాలా ఆలస్యంగా నేర్చుకొంటారు. కొంతమంది అవలీలగా మాట్లాడగల్గితే మరికొందరు స్తబ్ధంగా వుంటారు. దీనికి కారణం కొంతవరకు వారసత్వం అయితే చాలావరకు వారు పెరిగినటువంటి పరిసరాలు కావచ్చు. పిల్లలందరిలో ఒకే వేగంతో భాషా వికాసం జరుగదు. కాబట్టి ఒక శిశువు భాషా వికాసాన్ని ఇంకొక శిశువు భాషా వికాసంతో పోల్చడం సరికాదు. పిల్లలు పూర్వ శిశు కేంద్రానికి వచ్చేలోపే ముందుగానే ఇంటిదగ్గరే కొంత భాషా వికాసాన్ని పొందగల్గి వుంటారు. అందువలన తగిన అనుభవం, పరిసరాల వలన వారి పదజాలాభివృద్ధి వేగవంతమవుతుంది. విద్యావంతులైన తల్లిదండ్రులు ఇంటి వద్ద తమ పిల్లలకు ఆటబొమ్మలు, పత్రికలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంచడం, వారితో కలసిమెలసి కబుర్లు, కథలు చెపుతూ గడపడం, వివిధ రకాల స్థలాలకు, వినోద యాత్రలకు తీసుకెళ్ళడం, వారితో ముచ్చటించడం జరుగుతుంది. అంతేకాకుండా టి.వి., సినిమా ఇతర దృశ్య, శ్రవణ సౌకర్యాలు, బొమ్మలాటలు

సమకూర్చడంతో పాటు తమ ఈడు వారితో కలసి ఉత్తేజభరితమైన ఆటలు ఆడడం, పాటలు పాడటం మొదలైన అవకాశాలు కల్పిస్తారు. అదే అననుకూల (Disadvantaged groups) వర్గాలలో అయితే తల్లిదండ్రులు తమ పిల్లలతో కలసి గడిపే సమయం లేక భాషా అనుభవాలను కూడా కల్పించలేకపోతారు. అందువలన ఈ తేడాలను అర్థవంతమైన ఇ.సి.సి.ఇ. కార్యక్రమాల ద్వారా పూరించవలసిన అవసరం ఎంతైనా వుంది.

పూర్వ ప్రాథమిక విద్యలో మాతృభాష లేదా ప్రాంతీయ భాష మాధ్యమముగా ఉపయోగించవలసి వుంటుంది.

పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రానికి వచ్చేసరికి పిల్లలు ఎంతో కొంత భాషను ఉపయోగిస్తూ వుంటారు. కేంద్రంలో వారి భాషా జిజ్ఞాస, సామర్థ్యంను పెంపొందించి ఆశించే రీతిలో భాషాభివృద్ధిని సాధించవలసి వుంటుంది.

**4.1.0 భాషాభివృద్ధిపై దృష్టి సారించవలసిన అంశాలు:**

- శ్రవణ నైపుణ్యాలను పెంపొందించుట / అభివృద్ధిపరుచుట.
- భాషణా నైపుణ్యాలను అభివృద్ధిపరచుట.
- పూర్వపఠన సంసిద్ధత
- పూర్వ లేఖన సంసిద్ధత

**4.1.1 శ్రవణ నైపుణ్యాలను పెంపొందించుట – వికాస కృత్యాలు (Development of Listening Skills):**

పిల్లలు తమ భావాలను ఎదుటి వారికి అర్థమయ్యేటట్లుగా చెప్పగలగాలి, ఎదుటివారు చెప్పేది అర్థం చేసుకోగలగాలి. దీనికై వినడంలో నైపుణ్యాలను పెంపొందించుటకు క్రింద సూచించిన కృత్యాలను చేయవలసి వుంటుంది.

**శ్రవణ నైపుణ్యాభివృద్ధి కృత్యాలు:**

1. పరిసరాలలోని వివిధ శబ్దాలను విని, ఆ శబ్దాల్లోని పోలికలను, తేడాలను గుర్తించేటట్లు ప్రోత్సహించడం.
2. పనులను సూచించు పదాలను బట్టి వాటిని చేయమనాలి.
3. తోటి పిల్లల (సమవయస్కుల) స్వరమును గుర్తించే విధంగా (కళ్ళకు గంతలను కట్టడం, టెలిఫోన్ ఆటలను ఆడించడం).
4. కథలు, పాటలు, గేయాలు విన్పించి మళ్ళీ పిల్లలతో చెప్పించడం.
5. సంగీత వాయిద్యాల ధ్వని విని అది ఏ వాయిద్యమో చెప్పగల్గడం. (ఫ్లూట్, హార్మోనియం, తబల మొ॥వి) వీటి శబ్దాలను మొదట పిల్లలకు వినిపించాలి.
6. పిల్లలచే తమ పేర్లను చెప్పించడం, వారి కుటుంబంలోని సభ్యుల పేర్లను చెప్పించి, వారి గురించి మాట్లాడించడం.
7. పెంపుడు జంతువుల పేర్లను, ఇతర జంతువుల పేర్లను చెప్పించడం.
8. పిల్లల స్నేహితుల పేర్లు, వారి ఇరుగు పొరుగు వారి పేర్లను చెప్పించి వారి గురించి మాట్లాడించడం.
9. పండ్లు, కాయలు, పూలు, జంతువులు, ఆకులు, పూసలు, చీపురుకట్ట మొదలగు వాటిని చూపించి వాటి పేర్లు చెప్పించడం.
10. రంగులను, రుచులను, వాసనలను, ఆకారాలను గుర్తించటం.

### 4.1.2 భాషణా నైపుణ్యంను అభివృద్ధిపరచుట – వికాస కృత్యాలు (Development of Speaking Skills)::

పిల్లలు కేంద్రంలో ప్రవేశించినపుడు సిగ్గుగా, బిడియంగా సందేహాలతో అడుగుపెడతారు. కొత్త వాతావరణం వారికి బొత్తిగా పరిచయం లేనిది. తత్ఫలితంగా వారిలో అభద్రతాభావం అధికంగా వుంటుంది. అందువలన పిల్లల్లో ధైర్యాన్ని, భద్రతా భావాన్ని కల్గించడానికి ఉపాధ్యాయులు వారితో ఆత్మీయంగా మెలగాలి. పిల్లల్ని అర్ధచంద్రాకారంగా కూర్చోబెట్టి వారితో చనువుగా మాట్లాడాలి. వారిలో భాషణా నైపుణ్యం కోసం క్రింది కృత్యాలను నిర్వహించాలి.

**భాషా నైపుణ్యాభివృద్ధి కృత్యాలు:**

1. వస్తువులు, పూలు, జంతువుల పేర్లు చెప్పించడం, వాటిని గూర్చి సంభాషించడం.
2. పిల్లలు బడికి వచ్చేదారిలో జరిగిన విషయాలు / సంఘటనలను గూర్చి లేదా ఇంట్లో జరిగిన విషయాలు / పండుగలు జరుపుకొనే విధానం గూర్చి చిన్న చిన్న ప్రశ్నల ద్వారా మాట్లాడించడం.
3. దినచర్య / బడిలో జరిగిన కార్యక్రమాలను గూర్చి చెప్పించడం.
4. పిల్లలను జట్లుగా విభజించి క్విజ్ నిర్వహించడం.
5. చిన్న చిన్న సూచనలనిచ్చి పేర్లు చెప్పించడం (పొడుపు కథలు)


JXRJ12

### 4.1.3 పూర్వ పఠన సంసిద్ధత – వికాస కృత్యాలు (Pre-Reading Readiness):

పరిపక్వతపరంగా పిల్లలకు చదివే ప్రక్రియను ప్రాథమిక విద్యా స్థాయిలోనే ఆరంభించాలి. చదవడమనే సామర్థ్యానికి దోహదపడే కార్యక్రమాలు పూర్వ ప్రాథమిక విద్యలోనే ఉండాలి. చదువు పట్ల వారికి ఆసక్తిని కల్గించాలంటే అందుకు వాళ్ళను సంసిద్ధులను చేయాలి. ఇందుకు దోహదపడే క్రింది కార్యక్రమాలను నిర్వహించగల్గితే వారిలో పఠనా నైపుణ్యం పెంపొందుతుంది.

**పూర్వ నైపుణ్యాభివృద్ధికి కార్యక్రమాలు:**

1. **చిత్ర పఠనం :** చిత్ర పటాలను చూపిస్తూ మాట్లాడించాలి, ప్రశ్నలు వేసి పటాన్ని పరిశీలించి జవాబులు చెప్పమనాలి.
2. **పజిల్స్ :** పిల్లల స్థాయికి తగ్గట్లుగా చిన్న చిన్న పజిల్స్ ఇచ్చి సూచనలతో వాటిని పూర్తి చేయించాలి.
3. **అక్షరాలను జతపరచడం :** అక్షరాలన్నింటిని కలిపివేసి రాసిన చార్ట్ ముక్కలను దానిని పిల్లలకిచ్చి వారితో విడివిడిగా అక్షరాలు వ్రాసి వున్న అట్టముక్కలను చార్టు పేపరుపై రాసిన అక్షరాలతో జతపరచమని చెప్పాలి.



4. **బొమ్మల పుస్తకాలు :** బొమ్మల పుస్తకాల సాయంతో కథ చెప్పడం, ఎడమ నుండి కుడి వైపునకు చదవమనడం. పుస్తకాన్ని సరియైన పద్ధతిలో పట్టుకోవడం నేర్చుకొంటారు.

5. **నాటకీకరణ :** నాటకీకరణ అంటే పిల్లలకు చాలా ఇష్టం. దీని ద్వారా భావవ్యక్తీకరణ నేర్చుకొంటారు.

6. **క్రమబద్ధమైన ఆలోచన :** ఎదుటివారికి తమను తాము స్పష్టంగా అర్థం అయ్యేలా చెప్పడానికి మాటలు సరియైన పద్ధతిలో వ్యక్తం చేయాలి. మొదట చెప్పాల్సింది మొదట, చివర చెప్పాల్సింది చివరిగా చెప్పాలి. ఈ నైపుణ్యం అలవరుచుకోవడానికి పిల్లలకు క్రమ పద్ధతిలో ఆలోచించడం నేర్పాలి.

### 4.1.4 పూర్వ లేఖన సంసిద్ధత – వికాస కృత్యాలు (Pre-Writing Readiness):

L8383D

రాయడం అనేది పిల్లలకు మొదట చాలా కష్టంగా ఉంటుంది. రాయడం మొదలు పెట్టకముందు కొంత సంసిద్ధత అవసరం. రాయడం మొదలు పెట్టినప్పుడు పిల్లలు పెన్సిల్ / బలపంను సరిగా పట్టుకోలేరు. దానికి కారణం చేతులు మరియు వేళ్ళ కండరాలు సమన్వయంగా పనిచేయలేకపోవడం. వివిధ సృజనాత్మక కార్యకలాపాల వలన కండరాల సమన్వయమును సాధించవచ్చును.

**పూర్వలేఖన నైపుణ్యాభివృద్ధికి కార్యక్రమాలు :**

రాయడం ఒక ప్రక్రియ. దీనిని ఒకటవ తరగతిలో ప్రారంభించడం మంచిది. కాని పరిపక్వతపరంగా సంసిద్ధత చేకూరేవరకు పూర్వ విద్యా కార్యక్రమం ద్వారా వారిలో కండర సమన్వయం చేయగల్గితే లేఖన నైపుణ్యానికి సంసిద్ధులవుతారు. కాబట్టి నిశితమైన, నిర్దిష్టమైన కండర సమన్వయం కోసం ఈ క్రింది కార్యక్రమాలను నిర్వహించగల్గితే సరైన లేఖనా నైపుణ్యాలను అభివృద్ధి చేయవచ్చును.

1. **బంకమట్టితో ఆడటం :**బంకమట్టితో ఆడటం పిల్లలకు చాలా ఇష్టం. పిల్లలు మట్టిని కొట్టి, నలిపి ఆనందిస్తారు. తర్వాత వారు చిన్న చిన్న వుండలు, వివిధ ఆకారాలు చేయడం మొదలు పెడతారు. ఉపాధ్యాయులు వారితో సంభాషిస్తూ ఆ మట్టితో ఏమి చేయవచ్చునో సూచనలను, సలహాలను ఇవ్వవచ్చు. పిల్లలు స్వతహాగా చేసినపుడు వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

2. **ఇసుకతో ఆట :** పిల్లలు ఇసుకతో సరదాగా ఆడుకొంటారు. ప్లాస్టిక్ మూతలు, కొబ్బరి చిప్పలు మొ॥ వాటిని తీసుకొని తడి ఇసుకతో నింపి బోర్లిస్తే అదే ఆకారంలో ఇసుక ఏర్పడటం చూసి పిల్లలు ఆనందిస్తారు. కొంచెం పెద్ద ప్లాస్టిక్ మూతలనుపయోగించి దారముతో కట్టె త్రాసును తయారు చేయిస్తే పిల్లలు ఎంతో ఆనందపడతారు.

3. **కాగితాలను చిన్న చిన్న ముక్కలుగా చింపి అతికించడం :** దీని కోసం పిల్లలను రంగు రంగుల పేపర్లను తీసుకొని వాటి చిన్న చిన్న ముక్కలుగా చించి / కత్తిరించి తెల్లకాగితం పై ఏదైనా బొమ్మ రూపాన్ని గాని, ఆకారాన్ని గాని గీయిస్తే వారు దానిపై రంగు కాగితాలను గమ్ లేదా ఫెవికాల్‌తో అతికిస్తారు.

4. **చుక్కలను, గీతలను కలపడం :** చుక్కలను కలపడం ద్వారా చిత్రాన్ని తయారు చేయడం, చుక్కలను కలుపుతూ దీర్ఘచతురస్రం, చతురస్రం మొ॥ ఆకారాలను తయారు చేయడం. ఇటీవల అన్ని రకాల న్యూస్ పేపర్లలో ఆదివారం అనుబంధాలలో ఇలాంటి వాటిని గమనించవచ్చు. పిల్లలకు తగిన సూచనలిస్తే వాటిని సేకరించి ఉత్సాహంగా చూపగల్గుతారు.

5. **జ్ఞాపకశక్తి ఆట :** చిన్న ఆకారాలను బోర్డుపై గీసి పిల్లల్ని గమనించమని చెప్పి, తర్వాత చెరిపేసి పలకపై అదే ఆకారాన్ని గీయమని చెప్పాలి.

పైన కనపరచినటువంటి కృత్యాలను చేయించడం ద్వారా పిల్లల్లో రాత సంసిద్ధతను పెంపొందించవచ్చు. అవేకాకుండా ఇలాంటి కృత్యాలను చేయించడం వల్ల కూడా రాత సంసిద్ధత ఏర్పడుతుంది.

- బొమ్మలనిచ్చి రంగులు వేయమని చెప్పడం.
- సున్నాలను చుట్టమని చెప్పడం.
- గీతలు గీయమనడం.
- పిల్లలకు వచ్చినట్లుగా బొమ్మలను గీయించడం.
- నాణేలను పేపరు క్రింద ఉంచి పైన పెన్సిల్‌తో రుద్ది వాటి అచ్చులను తయారు చేయించడం.
- గింజలతో ఏవైనా ఆకారాలను పేర్పించడం.

## 4.2 పూర్వ గణిత భావనలు – వికాస కృత్యాలు (Pre-Arthematic Concepts) :

అంకెలను నేర్పే ముందు పిల్లల్ని సంసిద్ధులను చేయాలి. ఈ సంసిద్ధత కోసం కొన్ని ఆటలు / కృత్యాలు చేయటం చాలా ముఖ్యం. పిల్లలకు అంకెల కంటే ముందు ఎక్కువ, తక్కువ పదాల అర్థం, అలాగే అంకెలకు, లెక్కలకు సంబంధించిన చాలా పదాలు ఉదా: పొడుగు / పొట్టి, చిన్న / పెద్ద, దూరం / దగ్గర లాంటి వాటి అవగాహన ఉండాలి. పిల్లలకు క్రమంగా ఒక దాని తర్వాత ఒకటి జాగ్రత్తగా నేర్పించాలి. లెక్కలను స్వంతంగా చేయడానికి పిల్లలను సంసిద్ధపరచాలి. అందుకు ఈ క్రింది కార్యక్రమాలను చేయించాలి.

**ప్రాథమిక భావన అభివృద్ధి కార్యక్రమాలు**

1. **చిన్న – పెద్ద తేడా :**

**ఎ) ఏవైనా రెండు సైజుల్లో:** దీని కోసం అన్నింటిలో చాలా పొడవుగా వున్న పుల్లల్ని మరియు చాలా పొట్టిగా వున్న పుల్లల్ని తీసుకొని అవగాహన కల్పించాలి.

**బి) మూడు సైజుల్లో తేడా:** మూడు సైజుల్లో ఉన్న పుల్లల్ని ఎన్నుకొని అన్నింటి కంటే పెద్దది, దాని కంటే కొంచెం చిన్నది, అన్నింటి కంటే చాలా చిన్నది అనే భావనను అవగాహన పరచవచ్చు.

2. **చుట్టుకొలతను పోల్చడం :**

**ఎ) రెండు సైజులు:** గుండ్రని ప్లాస్టిక్ ప్లేట్లను రెండింటిని తీసుకొని దీనిలో ఏది పెద్దది? ఏది చిన్నది? అని అడగడం ద్వారా చుట్టుకొలత అనే భావనను అర్థం చేసుకొంటారు.

**బి) మూడు సైజులు:** మూడు వేర్వేరు సైజులలో వున్న ప్లేట్లను తీసుకొని అన్నింటి కంటే పెద్దదేది? అన్నింటి కంటే చిన్నదేది? పెద్దదాని కంటే కొంచెం చిన్నదేది? అని ప్రశ్నించడం ద్వారా, దానిని ఎలా చెప్పగలిగారు అని అడగడం ద్వారా చుట్టుకొలతపై అవగాహనను కల్పించవచ్చు.

3. **ఘనపరిమాణంలో తేడా:** ఒకే సైజులో ఉన్న రెండు గాజు గ్లాసులను / ప్లాస్టిక్ సీసాలను తీసుకొని ఒక దానిలో నిండా నీరు పోసి, రెండవ దానిలో సగం వరకు మాత్రమే నీరు పోసి, ఏ గ్లాసులో ఎక్కువ నీరు ఉన్నది? అని ప్రశ్నించి ఘనపరిమాణంపై సులభంగా అవగాహనను కల్పించవచ్చు.

4. **బరువుల్లో తేడా:** ఒకే సైజులో ఉండే రెండు డబ్బాలను తీసుకొని ఒక డబ్బాను పూర్తిగా ఇసుకతో నింపి, రెండవ డబ్బాను ఖాళీగా వుంచి సీలు చేయాలి. తర్వాత ఒకేసారి రెండు చేతులతో రెండు డబ్బాలను పైకెత్తమని పిల్లలకు చెప్పడం వలన బరువులలో గల తేడాలను అర్థం చేసుకోగల్గుతారు.

5. **దూరం – దగ్గర తెలుసుకోవడం:** ఏదైనా వస్తువును కేంద్రంగా తీసుకొని ఇద్దరు పిల్లల్ని పిలచి ఒకర్ని కేంద్రకానికి దగ్గరగా మరొకర్ని దూరంగా నిలబెట్టి ఎవరు దగ్గరగా ఉన్నారు? ఎవరు దూరంగా ఉన్నారు? అని ప్రశ్నించడం ద్వారా పిల్లలు దూరం – దగ్గర భావనలను తెలుసుకోగలరు.

6. **ఎక్కువ – తక్కువల్లో తేడా:** 10 ఎర్రటి ఘనాలు (cubes), 5 నీలి రంగు ఘనాలు (cubes) తీసుకొని పిల్లలకు వాటిని రెండు రాశులుగా చూపించి, ఈ రెండింటిలో ఏ రాశిలో ఎక్కువ ఘనాలున్నాయి? అని అడగాలి. పిల్లలు ఏ రాశి ఎక్కువ, ఏ రాశి తక్కువ అని చెప్పగలరు. అదేవిధంగా ఇతర సామగ్రిని ఉపయోగించి కూడా ఈ కృత్యాన్ని నిర్వహించవచ్చు.

7. **తేడా బట్టి వేరు చేయడం:**
వివిధ రంగుల క్యూబులను కలిపివేయాలి. అందులో ఒక రంగు క్యూబును తీసి ఇలాంటి రంగు క్యూబులను వేరు చేయమని చెప్పడం ద్వారా తేడాను బట్టి వేరు చేయడం అనే భావనను పెంపొందించవచ్చును. ఇదేవిధంగా ఇతర సామగ్రితో కూడా ఈ కృత్యమును నిర్వహించవచ్చును.

8. **అర్థాలకు సంబంధించిన అవగాహన :**

   ఎ) **ఒకదానితో ఒకటి జతపరచడం:** గులకరాళ్ళను ఒకటి, రెండు,మూడు..... సమూహాలుగా ఏర్పరచి వాటి అంకెలకు తగిన విధంగా ఆకులు, పూసలు మొదలగు వాటిని జతపరచడం ద్వారా అంకెలకు సంబంధించిన భావనలను ఏర్పరచవచ్చు.

   బి) **సంఖ్య – వస్తువుకు మధ్య సంబంధం :**

   - సంఖ్యకు ముందుగా తమ శరీరంలోని భాగాలకు, సంఖ్యలకు మధ్య గల సంబంధాన్ని గుర్తింపచేయాలి. ఉదా: ఒక ముక్కు, రెండు చెవులు మొ॥వి.
   - పిల్లలకు ఒక గిన్నెలో పూసలు / విత్తనాలు ఇచ్చి ఒక్కొక్క సారి ఒక్కొక్క సంఖ్య చెపుతూ గిన్నెలోని అన్నింటిని వేయమని చెప్పాలి. ఉదా : 3 పూసలు / 2 పూసలు / 4 పూసలు

ఇలా తదుపరి ఇతర వస్తువులను కూడా ఉపయోగించి అవగాహన కల్పించవచ్చు.

9. **స్థలానికి సంబంధించిన అవగాహన :**

   ✳ పిల్లల్ని చేతులు పట్టుకోమని గుండ్రంగా నుంచోబెట్టి ఆటలు ఆడించవచ్చు. వాళ్ళతోపాటు టీచరు పాట పాడుతూ అందుకు అనుగుణంగా కదలమని చెప్పాలి.

- లోపలికి, లోపలికి నడుద్దాం ఇప్పుడు గుండ్రంగా, గుండ్రంగా తిరుగుదాం, క్రిందికి క్రిందికి దూకుదాం.

✳ విభిన్న స్థానాలను తెలియచేసేలా బొమ్మల కార్డులు తయారు చేయాలి. ఉదా:

- పంజరం లోపల చిలుక ఉన్న బొమ్మ, పంజరం బయట చిలుక ఉన్న మరొక బొమ్మ.
- బల్ల మీద గ్లాసు ఉన్న బొమ్మ, బల్ల కింద గ్లాసు ఉన్న మరొక బొమ్మ.
- నాటకాలు వేయడం : సృజనాత్మక నాటకాలు స్థలానికి సంబంధించిన అవగాహన పెంపొందించడానికి ఎంతైనా తోడ్పడుతాయి.
- ఆదేశాలను పాటించడం
  - మేకులు, రబ్బరు బ్యాండుతో పెగ్‌బోర్డ్ తయారు చేయించడం
  - కుడి, ఎడమలకు సంబంధించిన భావన. పిల్లలు తమ కుడివైపు ఉన్న వాళ్ళ పేరు, ఎడమవైపు వున్న వాళ్ళ పేర్లు చెప్పమనడం.
  - కుడి, ఎడమ వైపు ఉన్న వస్తువుల పేర్లు కూడా చెప్పవచ్చును.

**10. సమయానికి సంబంధించిన అవగాహన :**

- పిల్లల దినచర్య గురించి వారితో స్వేచ్ఛా సంభాషణ ద్వారా చర్చించడం.
- ప్రొద్దున / సాయంత్రం / రాత్రి వేళల్లో చేసే పనులను అభినయం చేసి చూపమనడం
- కాలానికి సంబంధించిన అవగాహన పెంపొందించడానికి దినచర్యను, వివిధ సంఘటనలను తెలియచేసే పాటలు, బొమ్మల పుస్తకాలను ఉపయోగించడం.
- పిల్లల్ని గడియారం తయారు చేయమని చెప్పి / ప్రతి ఒక్కరికి గుండ్రని అట్టముక్కను కత్తిరించి ఇచ్చి పాత క్యాలెండర్‌లో 1 నుండి 12 వరకు అంకెలు కత్తిరించి అతికించి అట్టముక్కలతో గంటల ముల్లు, నిమిషాల ముల్లు మధ్యలో మేకుతో గుచ్చి సమయంపై అవగాహనను కల్గించవచ్చు.

**11. ఉష్ణోగ్రతకు సంబంధించిన అవగాహన**

- వేడి, చల్లని నీళ్ళను పిల్లలు తాకి చూచి వాటిని స్పర్శ లక్షణాలతో పోల్చడం.
- చల్లని నీళ్ళు వేడిగా మారటం గమనించగలగడం.
- కాలాలు మారుతున్నప్పుడు వాతావరణంలోని ఉష్ణోగ్రత తేడాలను (వేసవికాలం, శీతాకాలం) గుర్తించగలగడం.
- వేడిగానున్న పాలను చల్లబరచడం, వేడి పదార్థాలను చల్లబరచడం అనే సృజనాత్మక ప్రయోగాలు.

పై కృత్యాలే కాకుండా దినపత్రికలలో వెలువడే ఈ క్రింది కృత్యాలను పిల్లలతో చేయించి విద్య పట్ల ఆసక్తి, జిజ్ఞాసను కల్గించవచ్చును. ప్రత్యేకించి ఆదివారం అనుబంధాలలో ఇవి ఎక్కువగా అందుబాటులో ఉంటాయి.

- చుక్కలు కలపండి, పరిశోధన, సుడోకు, ప్లే టైమ్
- దారి కనుక్కోండి, ఇంగ్లీషు నేర్చుకోండి, బొమ్మల సుడోకు
- రంగులు వేయండి, సిసింద్రీ కథలు, ప్రపంచ శాస్త్రవేత్తలు

- మీకు తెలుసా!, తేడాలు కనుక్కోండి, చింటూ, జతచేయండి
- క్రియేటివ్ 'థ్రిల్'
- పూరణం
- హెల్త్ కార్నర్
- మైథోగ్రఫీ

LML34P

## 4.3 శాస్త్రీయ ఆలోచనలు – వికాసకృత్యాలు (Scientific Thinking):

పిల్లల్లో శాస్త్రీయమైన, హేతుబద్ధమైన వైఖరులను, విలువలను పెంపొందించుటకు అన్వేషణ, ప్రశ్నించేతత్వం, విషయ నిష్టత మొదలగు లక్షణాలను పెంపొందించవలసి వుంటుంది.

శాస్త్రీయ వైఖరిని రూపొందించుటకు విశాల మనస్తత్వం, స్వేచ్ఛాయుత అన్వేషణ, నిర్ధారణలకు వచ్చే ముందు సరియైన సమాచారాన్ని సేకరించడం మరియు తాజాగా లభించిన ఆధారాల మేరకు పరికల్పనలను సవరించుకొనుటకు సంసిద్ధతను కల్గివుండాలి.

పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రపు వాతావరణం విద్యార్థులకు అపార అనుభవాలను, సంవేదనలను మరియు నైపుణ్యాలను కల్పించవలసి వుంటుంది. వికాసం నిరంతరం కొనసాగే ప్రక్రియ. కావున పిల్లల్లో నిశితంగా ఆలోచించే సామర్థ్యం మరియు చిన్న చిన్న సమస్యలను పరిష్కరించే విధంగా ఆదర్శవంతమైన విద్యా కార్యక్రమాన్ని రూపొందించవలసి వుంటుంది.

పిల్లల్లో ఆసక్తి మరియు కుతూహలాన్ని ప్రేరేపించుటకు పూర్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వారికి శాస్త్రీయ పరిజ్ఞానంతో వినూత్నమైన కృత్యాలను రూపొందించవలెను. ఉదాహరణకు వివిధ రకాలైన వస్తువులను సునిశితంగా, ఖచ్చితంగా పరిశీలించేందుకు అవకాశాలను కల్పించి వాటి మధ్య ఉన్న పోలికలను, భేదాలను మరియు సంబంధాలను స్వయంగా గుర్తించే విధంగా చేయాలి.

S6DMFB

పిల్లలు కృత్యాలను నిర్వహించినపుడు తోటి పిల్లలతో మరియు ఉపాధ్యాయులతో స్వేచ్ఛగా చర్చించుటకు ప్రోత్సహించాలి. వారి ఫలితాలను ఇతరులతో పంచుకొనేవిధంగా, పోల్చుకొనేవిధంగా చూడాలి. ఈ కృత్యాలు నిర్వహించడానికి ముందు ఉపాధ్యాయులు విద్యార్థుల స్వభావము, వైజ్ఞానిక పద్ధతి పై అవగాహనను కల్గివుండాలి. ఈ క్రింది కొన్ని కృత్యాలు శాస్త్రీయ దృక్పథానికి సంబంధించిన కొన్ని నైపుణ్యాలను పెంపొందించుటకు సూచించడమైనది.

**శాస్త్రీయ ఆలోచనాభివృద్ధికి కృత్యాలు:**

1. **పరిశీలనా నైపుణ్యం:** చూపు, వినికిడి, స్పర్శ, వాసన, రుచిని పంచేంద్రియాల ద్వారా వివిధ వస్తువులను పరీక్షించుట.
2. **హేతుబద్ధీకరణ నైపుణ్యం:** ఇంకా ఎక్కువ సమాచారాన్ని సేకరించి వివరించడం.
3. **వర్గీకరణ నైపుణ్యాలు:** వస్తువులను వాటి లక్షణాలు / అంశాలు అనగా రంగు, గట్టితనం, పరిమాణం, ఆకారం ఆధారంగా వేరుచేయడం.

4. **సమాచార ప్రసార నైపుణ్యాలు:** ఇతరులకు తాను ఏమి పరిశీలించాను? ఎలా పరిశీలించాను? చెప్పగల్గడం. ఇది శిశువు ఆలోచనలను స్పష్టపరిచి ఇతరులతో స్పందించే నైపుణ్యాన్ని పెంపొందించుటకు దోహదపడుతుంది.

పిల్లల్లో గల అంతర్గత శక్తులు (తార్కిక ఆలోచన, పరిశీలన, వర్గీకరణ ఊహించటం, సృజనాత్మకత) వివిధ పరిస్థితులలో ఉత్తేజం పొందుతాయి. ఫలితంగా వారిలో శాస్త్రీయ దృక్పథం ఏర్పడటానికి వీలు కలుగుతుంది.

**ముఖ్యాంశాలు:**

1. 3–6 సంవత్సరాల బాలల పూర్వప్రాథమిక విద్యలోగల ప్రణాళిక అంశాలైన భాష మరియు భావప్రసారం, గణిత భావనలు, శాస్త్రీయ ఆలోచనలు గూర్చి అధ్యయనం చేయడం ద్వారా విద్యాప్రణాళిక ఆవశ్యకతను, అవసరాన్ని గుర్తించగలము.
2. భావప్రసారం అనగానేమి, భావప్రసారాంశాలైన శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలను గూర్చి, షవి అభివృద్ధిపరచడానికి నిర్వహించవలసిన కృత్యాలను గూర్చిన అవగాహనను గుర్తించాము.
3. గణిత భావనలు పూర్వబాల్యదశలో గణిత సంసిద్ధత కొరకు నిర్వహించగల కృత్యాలను, ప్రాధాన్యతను అవగాహన చేసుకున్నాము.
4. శాస్త్రీయ ఆలోచనలు అనగానేమి, శాస్త్రీయ ఆలోచనాభివృద్ధికి నిర్వహించవలసిన కృత్యాల ప్రాముఖ్యతను తెలుసుకున్నాము.

## మూల్యాంకనం

**ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. ఇ.సి.సి.ఇ.లో 3–6 సం॥ వయస్సు ప్రాముఖ్యతను తెల్పండి.
2. భాష, భావప్రసారముల భావనలను పేర్కొనండి?
3. భాషాభివృద్ధికై దృష్టి సారించవలసిన అంశాలను తెల్పి, ఒక్కొక్క దానిని గురించి క్లుప్తంగా వివరించండి?
4. గణిత భావనలను తెల్పి, ఆ గణిత భావనలను పెంపొందించుటకు నిర్వహించవలసిన కృత్యాలను తెలుపండి?
5. శాస్త్రీయ ఆలోచన అంటే ఏమిటి? మీ పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించు ఒక ఉపాధ్యాయునిగా ఎలాంటి కార్యక్రమాలను రూపొందిస్తావు?

## ప్రాజెక్టు - పనులు

MWWR71

సమీపములోని అంగన్‌వాడి లేదా ఇ.సి.సి.ఇ. కేంద్రాన్ని సందర్శించి, అక్కడి పాఠ్య ప్రణాళికను అధ్యయనం చేసి ఆ లక్ష్యాలను సాధించుటకు ఉపాధ్యాయులు నిర్వహించు వివిధ కృత్యాలను పరిశీలించి ఒక నివేదిక తయారు చేసి సమర్పించండి.

## ఆధార గ్రంథాలు


1. 'Early Childhood Care and Education' M. Sen Gupta, Published by PHI Learning Pvt. Ltd., New Delhi.
2. 'Examplar Guidelines for Implementation of Early Childhood Care and Education (E.C.C.E.) Curriculum' Published by NCERT, New Delhi.
3. 'Early Childhood Education An Introduction', Romilasoni, Rajendra Kapoor, K.K. Vashistha, Published by NCERT, New Delhi.
4. Study material of 'Dipin.ECCE', NCERT, New Delhi.
5. 'చిన్నారుల వికాస కేంద్రం ఇ.సి.ఇ. / అంగన్‌వాడి కార్యక్రమ శిక్షణా దీపిక', జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం / సర్వశిక్షా అభియాన్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.
6. 'డి.ఎడ్. విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం', ప్రచురణ తెలుగు అకాడమి, హైదరాబాదు.
7. 'బి.ఎడ్. విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం' ప్రచురణ తెలుగు అకాడమి, హైదరాబాదు.
8. బి.ఏ. మూడవ సంవత్సరం 'బాల, కౌమార మనోవిజ్ఞాన శాస్త్రం' ప్రచురణ తెలుగు అకాడమి, హైదరాబాదు.
9. బి.ఎడ్. పూర్వ ప్రాథమిక, ప్రాథమిక విద్యా దృక్పథాలు – తెలుగు అకాడమి–2001

# 5 పిల్లల ప్రగతి మదింపు

పిల్లలకు బోధించాలంటే మీరు వాళ్ళంటే ఇష్టపడాలి. అప్పుడే పిల్లలలో శ్రమను, సంతోషాన్ని, స్నేహపూరిత భావాన్ని, మానవత్వాన్ని మనం తీర్చిదిద్దగలం. ఉపాధ్యాయుడు ప్రతి పిల్లవాడి హృదయాన్ని అన్వేషించాలి, అభిమానించాలి. పిల్లల అనురాగంలో తానే ఒక పసివాడైపోవాలి. పిల్లల్ని ప్రేమించడం అంటే పిల్లలతో కలిసి మాట్లాడటం, చర్చించడం, కార్యకలాపాలలో పాల్గొనడం, పిల్లల్లో పిల్లలుగా మారడం. అప్పుడు మాత్రమే పిల్లలు తమ కుటుంబాలను, తమ పాఠశాలను, పనిని, జ్ఞానాన్ని ప్రేమించేటట్లు చేయగలం. ఉపాధ్యాయుడు పిల్లవాడి కుటుంబంలో ఒక సభ్యునిగా, ఒక తల్లిగా ఉండి తీరాలి.

– సుహుమ్లీన్ స్కీ

**ఉప శీర్షికలు:**

5.0 లక్ష్యాలు

5.1 ప్రారంభ అభ్యసనం మరియు అభివృద్ధిప్రమాణాలు

5.2 పిల్లల ప్రగతిపరిశీలన మరియు నమోదు

5.3 పిల్లల ప్రగతినివేదిక

5.4 పాఠశాల / ECCE కేంద్రం మరియు కుటుంబం మధ్యసంబంధం

## 5.0 లక్ష్యాలు

ఈ పాఠ్యాంశం చదవటం ద్వారా ఛాత్రోపాధ్యాయులు క్రింది లక్ష్యాలను సాధించగలరు.

1. ప్రారంభ అభ్యసనం, అభివృద్ధి ప్రమాణాలు మరియు సూచికల గురించి అవగాహన చేసుకుంటారు.
2. పిల్లల ప్రగతిని ఏవిధంగా మదింపు చేయవచ్చో తెలుసుకుంటారు.
3. పూర్వప్రాథమిక విద్య ప్రణాళికాంశాలన్నింటిలో పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించి వారి స్థాయిని నిర్ధారించడానికి తదానుగుణంగా బోధనాభ్యసనలో మార్పులు చేసుకునేలా అవగాహన పొందుతారు.
4. పిల్లల ప్రగతిని మదింపు చేయుటలో ఉపయోగించే వివిధ సాధనాలను గురించి తెలుసుకుంటారు. అలాగే వారి ప్రగతిని ఏవిధంగా నమోదుచేయాలో అవగాహన పొందుతారు.

5. పిల్లలు పాఠశాలకు రాకముందు, ఇంటివద్ద పొందే అనుభవాలను మరియు జ్ఞానాన్ని ECCE కేంద్రంలో వారు నేర్చుకునే అంశాలకు అనుసంధానం చేసే విధానాన్ని తెలుసుకుంటారు.
6. పాఠశాల మరియు గృహం మధ్య సంబంధాన్ని అర్థంచేసుకొని పిల్లల ప్రగతిపై ఈ రెండూ చూపే ప్రభావాన్ని అవగాహన చేసుకుంటారు.

## 5.1. ప్రారంభ అభ్యసనం మరియు అభివృద్ధి ప్రమాణాలు

**పరిచయం:**

వివిధ సాధనాలను ఉపయోగించి విద్యాప్రణాళిక అంశాలన్నింటిలో పిల్లల ప్రగతిని, సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, అంచనావేయటానికి ఉపయోగించే ప్రక్రియే మదింపు. పిల్లలకు తమను పరీక్షిస్తున్నామనే స్పృహ లేకుండానే సహజ, ఆహ్లాదకరమైన వాతావరణంలో మదింపు జరుగుతుంది. పూర్వబాల్యదశ విద్యలో పేపర్, పెన్సిల్ పరీక్షలకు తావు లేదు. వీటిని పూర్తిగా నిషేధించడమైనది (NCF-2005 Position Paper on ECCE). వివిధ అంశాలలో పిల్లల అభిరుచులను మరియు వారి ప్రగతిని అంచనా వేయడానికి అలాగే వారు అభ్యసనంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి అవసరమయ్యే సమాచారాన్ని "మదింపు" చేయడం ద్వారా ఉపాధ్యాయులు తెలుసుకోవచ్చు. ECCE కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశం పిల్లలలో సమగ్ర అభివృద్ధిని సాధించడం. ఇక్కడ పాఠ్యాంశాలు పూర్తిచేయడమనేది ఉండదు. వివిధ కృత్యాల ద్వారా పిల్లలు సమగ్ర అభివృద్ధిని సాధించడానికి వీలు కల్పించబడుతుంది.

### 5.1.0 ప్రారంభ అభ్యసనం

విద్యాలక్ష్యం విద్యార్థి సంపూర్ణ వికాసమే. అభ్యసనం అనేది ఆ లక్ష్యాన్ని సాధించే సాధనంగా వుండాలి. పిల్లలు అభ్యసన సన్నివేశాలలో పాల్గొనటం ద్వారా, చర్య ప్రతిచర్యల ద్వారా అనుభవాన్ని సపాధిస్తూ, తనదైన శైలిలో తెలుసుకోవడం, అవసరమైన సందర్భంలో వినియోగిస్తూ ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను కనుగొనడం. ప్రారంభంలో అభ్యాసకులు ఆటల ద్వారా ఆనందిస్తూ, ఆయా వికాస రంగాలలో ప్రగతి సామర్థ్యాలను అభివృద్ధిపరచుకొనే మార్గంగా అడుగులువేస్తారు.

**మదింపు (అంచనా):**

పిల్లలు పాఠశాలలో నిర్వహించే వివిధ అభ్యసన సన్నివేశాలలో పాల్గొనడం ద్వారా, నేర్చుకొనే క్రమాన్ని తద్వారా వారిలో కలిగే చైతన్యాన్ని పరిశీలించే ప్రక్రియ మదింపు.

మదింపు ఎందుకు?

- అభ్యసనాన్ని వేగవంతం చేయడానికి
- జ్ఞాననిర్మాణానికి
- నిర్మాణాత్మక అభ్యసనానికి
- సహజ అభ్యసనాభివృద్ధికి

**మూల్యాంకనం:**
నిర్దేశించిన సామర్థ్యాలను ఒక విద్యార్థి సాధించడాన్ని లేదా సాధించబడలేదు గాని నిర్ధారించడం, లేదా నిర్ణయాన్ని ప్రకటించడంగా భావించవచ్చు.

బోధనా లక్ష్యాలను, విద్యార్థి తను అభ్యసన తీరుకుగల సంబంధాన్ని తెలుసుకొనడానికి ఉపయోగించే ప్రక్రియ మూల్యాంకనం.

బోధనా లక్ష్యాల సాధన, బోధనాభ్యసన నిర్ధారణ లేదా తీర్పు మూల్యాంకనం

### 5.1.1 పిల్లల ప్రగతి మదింపుకు (సామర్థ్యాల అంచనా) సూత్రాలు:

జాతీయ బాలల సంరక్షణ విద్యా ప్రణాళికా చట్రం (NECCEF-2013) ను అనుసరించి పిల్లల ప్రగతి మదింపులో క్రింది సూత్రాలను దృష్టిలో ఉంచుకోవాలి.

- పూర్వబాల్యదశ సంరక్షణ మరియు విద్యలో పిల్లల ప్రగతి మదింపు పిల్లల కేంద్రీకృతంగా జరగాలి.
- ఇది నిర్మాణాత్మకమైనది మరియు నిరంతరం జరిగే ప్రక్రియ.
- పిల్లలు ఎవరికి వారు కొన్ని ప్రత్యేకతలు కలిగిఉంటారు. ఆయా ప్రత్యేకతలకనుగుణంగా మదింపు ఉండాలి.
- మదింపు సరళంగా, మార్పులు, చేర్పులకు వీలుగా ఉండాలి.
- ఉపాధ్యాయుడు పిల్లల ప్రగతి మదింపుకు నిరంతరం వారి ప్రవర్తనలను పరిశీలించటం. వారు తయారుచేసిన నమూనాలను, గీసిన బొమ్మలను, సామూహిక కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యం, అనెక్డోటల్ రికార్డులు, చెక్‌లిస్ట్‌లు, పోర్టుఫోలియోలను పరిశీలించటం మరియు పిల్లలతో సంభాషించడం ద్వారా వారి ప్రగతిని మదింపుచేయాలి.
- పిల్లలతో ప్రతిరోజు సాన్నిహిత్యంగా ఉంటూ శారీరక, మానసిక, భావోద్వేగ అంశాలతో మదింపును గుణాత్మకంగా చేయాలి.
- జ్ఞానాత్మక, మానసిక, చలనాత్మక, భావావేశ రంగాల నైపుణ్యతను పిల్లలలో పెంపొందించేదిగా మదింపు ఉండాలి.
- ప్రతి పిల్లవాడిని ప్రత్యేకంగా మదింపు చేసినతర్వాత, ఆ సమాచారాన్ని రికార్డుల రూపంలో భద్రపరచాలి. ఈ సమాచారం ఉపాధ్యాయుల బాధ్యతను పెంచడానికి, పిల్లలు ఏయే సామర్థ్యాలలో వెనుకబడి ఉన్నారో గుర్తించడానికి, వారికి అభ్యసనంలో సహాయపడేదిగా ఉండాలి.
- తల్లిదండ్రులను మదింపులో భాగస్వామ్యులను చేస్తూ, గృహఆధారిత పరిశీలన నిర్వహించడం ద్వారా పిల్లల ప్రగతికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి మదింపుచేయాలి.
- విద్యాప్రణాళికలోని అంశాలను బృంద పద్ధతిలో నిర్వహిస్తూ వారి ప్రగతిని మదింపుచేయాలి.

ప్రతీది మనం నేర్పితేనే పిల్లలు నేర్చుకుంటారని అనుకోవద్దు. వారికై వారే ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. పెద్దల్ని, స్నేహితుల్ని, తనచుట్టూ ఉండే చెట్టూ చేమల్ని చూస్తూ, పరిశీలిస్తూ ఎన్నో నేర్చుకుంటారు.

**– మేరియా మాంటిస్సోరి**

### 5.1.2 ప్రారంభ అభ్యసన - అభివృద్ధి ప్రమాణాలు :

పాఠశాల సంసిద్ధతకుగాను పూర్వబాల్యదశలో ప్రతిపిల్లవాడు తప్పనిసరిగా వివిధ వికాస రంగాలలో సాధించ వలసినవే అభివృద్ధి ప్రమాణాలు. ఈ ప్రమాణాలు ప్రారంభ అభ్యసనమునకు ఎంతో సహకరించటమే కాకుండా జీవితకాల అభ్యసనంలో ఎంతో ఉపయోగపడతాయి. Rhode Island Development of Education - 2013 ప్రకారం అభివృద్ధి ప్రమాణాలను క్రింది విధంగా చెప్పవచ్చు.

1. శారీరక ఆరోగ్యం-చలన వికాస అభివృద్ధి ప్రమాణాలు (Physical Health &Motor skills Development)
2. సాంఘిక మరియు భావోద్వేగ అభివృద్ధి వికాసం (Social & Emotional Development)
3. భాషాభివృద్ధి (Learning Development)
4. అక్షరజ్ఞాన అభివృద్ధి (Litarary) (L)
5. జ్ఞానాత్మక అభివృద్ధి (Cognitive Development)
6. గణిత, శాస్త్రీయ, సాంఘిక మరియు సృజనాత్మక అభివృద్ధి
   (M, SC, SS & CA) (Maths, Science, Social Studies and Creative Development)

**1. శారీరక ఆరోగ్యం - చలన వికాస అభివృద్ధి ప్రమాణాలు** (PH)

పిల్లల సమగ్ర అభివృద్ధిలో ఇది అంతర్భాగం. ఆరోగ్యంగాఉన్న పిల్లలలో స్థూల మరియు సూక్ష్మ కండరాలలో సమన్వయం ఉండి, వారెల్లప్పుడు వారిచుట్టూ ఉన్న పరిసరాలతో ప్రేరేపించబడుతూ, కొత్త కొత్త అనుభవాలను పొందుతారు. ఇది ఇతర వికాసరంగాల అభివృద్ధికి కూడా తోడ్పడుతుంది.

- ఎత్తుకు తగిన బరువును కలిగి ఉండడం
- ఆరోగ్యవంతంగా ఉండడం
- స్థూలకండరాల వికాసం మరియు సమన్వయం
  ఉదా : పరిగెత్తుట, ఎగురుట, దూకుట, విసురుట మొదలైనవి.
- సూక్ష్మకండరాల వికాసం మరియు సమన్వయం.
  ఉదా : కంటిచూపు - చేతిసమన్వయం, చేయి-నోటి సమన్వయం, బొమ్మలు గీయడం, రంగులు వేయడం, మట్టిలో, ఇసుకలో ఆడడం మొదలైనవి.
- శారీరక సంబంధమైన కృత్యాలలో చురుకుగా పాల్గొనడం
- స్పర్శజ్ఞానం, గ్రహణశక్తి పెరగడం
- తమ అవసరాలను తామే తీర్చుకోగలగడం.
- ఎంతో ఇష్టంగా పాఠశాలకు హాజరుకావడం

P78F9C

**2. సాంఘిక మరియు భావోద్వేగ అభివృద్ధి ప్రమాణాలు :**

పూర్వబాల్యదశలోని పిల్లలు వారిచుట్టూ ఉన్న పరిసరాలను అవగాహన చేసుకోవడం, సమవయస్కులు, వారికంటే పెద్దవారితో అనుకూల లేదా వ్యతిరేక ఉద్వేగాలను ప్రదర్శించడం ఈ వికాస అభివృద్ధిలో కన్పిస్తుంది.

- పెద్దలను గౌరవించడం
- ఇతరులతో కలిసిపోవడం, ఇతరుల అభిప్రాయాన్ని గౌరవించడం
- ఆత్మస్థైర్యం కలిగి ఉండడం
- ఇతరుల పనిని మెచ్చుకోవడం, ప్రశంసించడం
- తన ఉద్వేగాలపై నియంత్రణ కలిగిఉండడం
- సామూహిక కార్యక్రమాలలో పాల్గొనడం
- వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక శుభ్రత పాటించటం
- సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోవడం
- స్వీయ ఆలోచనలు కలిగిఉండడం
- సానుభూతి, సహానుభూతిని ప్రదర్శించడం

**3. భాషాభివృద్ధికి ప్రమాణాలు :**

ఈ దశలో ఏర్పడే భాషాభివృద్ధి భవిష్యత్‌లో విద్యాపరమైన అభివృద్ధికి తోడ్పడుతుంది. విన్నదాన్ని అర్థం చేసుకోవడం మరియు అర్థవంతంగా మాట్లాడటం సంక్లిష్టమైన భాషను అర్థంచేసుకోవడం ఈ వికాసరంగం అభివృద్ధిలో జరుగుతుంది.

- వినగలగడం, విన్నదాన్ని అర్థం చేసుకోవడం
- సంక్లిష్టమైన పదాలను సైతం అర్థం చేసుకోడం, తిరిగి వాటిని ఉపయోగించడం
- తన అవసరాలను, ఆలోచనలను వ్యక్తపరచడం, అర్థవంతంగా చెప్పగలగడం
- వ్రాయటంలో నైపుణ్యాలను కలిగిఉండడం

**4. అక్షర జ్ఞానం** (Litarary)**:**

చదవడం, వ్రాయడంలో నైపుణ్యాలు ఈ ప్రమాణ సూచికలు. ఇంటిలో మాట్లాడే భాష (మాతృభాష) ECCE కేంద్రంలో ఉపయోగిస్తున్న భాష రెండూ ఒకటిగా ఉన్నప్పుడు, పిల్లలలో అక్షర (Litaracy) ప్రమాణాలు ఎక్కువగా ఉంటాయి. అలాకాకుండా ఇంటిభాష, ECCE కేంద్రంలో ఉపయోగించే భాష వేరువేరుగా ఉంటే అక్షరజ్ఞాన ప్రమాణాల సాధనకు కొంత ఎక్కువ సమయం పడుతుంది.

- పదజాల వినియోగం
- సృజనాత్మక స్వీయ వ్యక్తీకరణ
- పూర్తి వాక్యాలతో మాట్లాడడం

- స్వేచ్ఛగా వ్యక్తపరచగలగడం
- దృశ్య మరియు శబ్ద అనుసంధానత
- దృశ్య మరియు శబ్ద వివేకత
- చేతికండరాలను మరియు సూక్ష్మకండరాలను ఉపయోగించే నైపుణ్యత
- బొమ్మలు గీయడం, చుక్కలు కలపడం, రంగులు దిద్దడం

**5. జ్ఞానాత్మక అభివృద్ధి ప్రమాణం :**

ఆలోచించడం, అర్థంచేసుకోవడం, అభ్యసించడం మరియు గుర్తుంచుకోవడం అనేవి జ్ఞానాత్మక అభివృద్ధికి ప్రమాణాలుగా చెప్పవచ్చు.

- చూడగలగడం, వినగలగడం, రుచి, వాసన, స్పర్శలను గుర్తించగలగడం
- గమనించిన విషయాలను గుర్తుకు తెచ్చుకోవడం
- పరిసరాలను, వ్యక్తులను వివేచనతో పరిశీలించడం, వాటితో సహసంబంధాలను ఏర్పరచుకోవడం
- వస్తువులను వర్గీకరించగలగడం
- సమస్య పరిష్కార నైపుణ్యాన్ని కలిగిఉండడం, భిన్నమైన అనేక పరిష్కారాలను చెప్పగల సామర్థ్యాన్ని కలిగి ఉండడం.

**6. గణిత, శాస్త్రీయ, సాంఘిక మరియు సృజనాత్మక ప్రమాణాలు :**

గణిత, శాస్త్రీయ, సాంఘిక మరియు సృజనాత్మక అంశాలలో సాధించే ప్రమాణాలు పాఠశాల సంసిద్ధతకు అవసరమయ్యే ముఖ్య పునాదులుగా చెప్పవచ్చు. రోజూ వారు ఎదుర్కొనే సమస్యలకు భిన్నమైన తీరులో పరిష్కారాలను కనుక్కొనే సామర్థ్యాలుగా ఈ ప్రమాణాలన్నీ చెప్పవచ్చు.

- పెద్ద–చిన్న, పొడవు–పొట్టి, బరువు–తేలిక, లావు–సన్నం, వెడల్పు–ఇరుకు, దూరము–దగ్గర మొదలగునవి చెప్పగలగడం.
- అంకెలను గుర్తించడం, లెక్కించడం
- స్థల, కాల భావనలను కలిగిఉండడం. ఉదా : ముందు–వెనుక, లోపల–బయట, మధ్యాహ్నం – సాయంత్రం మొదలగునవి.
- పరిసరాలను పరిశీలించడం. జంతువుల ఆహారపు అలవాట్లను చెప్పగలగడం.
- కుటుంబం, బంధువులు, రవాణా సాధనాలు మొ॥వి చెప్పగలగడం. పాటలు పాడడం, ఆటలు ఆడడం, బొమ్మలు గీయడం, రంగులు వేయడం, ముగ్గులు వేయడం.

**పిల్లల అభివృద్ధి మైలురాళ్ళు (సూచికలు)**

| 3 సం॥ రాల పిల్లలు | 4 సం॥ రాల పిల్లలు | 5 సం॥ రాల పిల్లలు |
|---|---|---|
| • సులభంగా నడవడం, పరిగెత్తడం, ఎక్కడం మరియు గెంతడం. | • ఒంటికాలుపై నిలబడడం | • కలిసి ఆడడం |
| • రెండు లేక మూడు పదాల వాక్యాన్ని మాట్లాడడం, వారి పేరు మరియు వయస్సు తెలుసుకొని ఉండడం. | • చిన్న చిన్న ప్రశ్నలు వేయడం, చిన్న చిన్న సమాధానాలు చెప్పడం | • రకరకాల పదాలను వాక్యాలను వాడడం, చిన్న కథలు చెప్పడం |
| • రంగుల పేర్లు చెప్పడం | • తనంతట తాను చేతులు కడుక్కోవడం | • వ్యతిరేక పదాలను అర్థం చేసుకోవడం |
| • అంకెలను గుర్తించడం | • వివిధ భావాలను చూపించడం | • తన బట్టలను తానే వేసుకోవడం |
| • తనంతట తాను తినడం | • స్నేహితుల్ని పేర్లతో చూపించడం | • 5 నుండి 10 అంకెలను లెక్కించడం |
| • గుండ్రంగా గీయడం | • చతురస్రాన్ని గీయడం | • త్రిభుజాన్ని గీయడం |

## 5.2 పిల్లల ప్రగతి పరిశీలన మరియు నమోదు (Observing and Recording Children's Progress)

చిన్నపిల్లల ప్రపంచం ఎంతో చిన్నది. వాళ్ళ ఆనందం; ఆసక్తి; ఆకాంక్ష కూడా ఎంతో చిన్నవి. ఎంత చిన్నదైతేనేం ఆ ప్రపంచం వాళ్ళకు అద్భుతమైనది, సంపూర్ణమైనది. మనం పెద్దలం తెలిసి తెలియక వాళ్ళను ప్రపంచం నుంచి దూరం చేస్తుంటాం. వాళ్ళ లోకాన్ని చులకనగా చూస్తుంటాం. మనం మన ఇంతపెద్ద ప్రపంచ భవిష్యత్ వాళ్ళ ఇంత చిన్న ప్రపంచంమీదే ఆధారపడి ఉందని మనం మరచిపోతుంటాం. వాళ్ళ ప్రపంచంలో అడుగుపెట్టి వాళ్ళతో కలిసిపోవడంలో అనుభూతి పొందడంలో ఎంత ఆనందముందో అంత పరమార్థముందని పెద్దలుగా మనం గుర్తుంచుకుంటే ఎంతో బాగుంటుంది.

**– రవీంద్రనాథ్ ఠాగూర్**

పిల్లల ప్రగతిని సమగ్ర మదింపు విధానాల ద్వారా పరిశీలిస్తూ, నమోదుచేయాలి. ఇది నిరంతరం జరగాలి. ఉపాధ్యాయుడు తరగతి లోపల, బయట పిల్లలను పరిశీలిస్తూ క్రమానుగతంగా నిర్ణీత కాలవ్యవధులలో మదింపు కొనసాగించాలి. పిల్లల జ్ఞానం, శారీరక, మానసిక పెరుగుదల, అవగాహన, వినియోగ నైపుణ్యాలు, అభిరుచులు, వైఖరులు, ఉద్వేగాలు, ఆసక్తులు మొదలైన అంశాలను నిశితంగా పరిశీలించి మదింపుచేయాలి. ECCE కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడానికి, ఉపాధ్యాయుడు సవరణాత్మక బోధనా వ్యూహాలను రచించుకోవడానికి, లోపనిర్ధారణ మాపనములు రూపొందించుకోవడానికి వీలుగా పిల్లల ప్రగతి పరిశీలన నమోదు ఉండాలి. ఇందుకోసం ఉపాధ్యాయునికి వివిధరకాల మదింపు సాధనాలు అవసరమవుతాయి. అవి :

**5.2.0** ECCE **బాలల మదింపు:**

Why? When? How?

- ECCE లో బాలల ప్రగతిని మదింపుచేయడం ఆవశ్యము. ఇది బాలల ప్రణాళిక ఆధారితం కాకుండా వికాస ఆదారితంగా, అనియత విధానంలో నిరంతరంగా అన్ని వికాస రంగాలను స్పృసిస్తూ మదింపు చేయవలసి వున్నది.
- వ్యక్తిగతంగా ప్రతి బాలుని, అన్ని వికాస రంగాల (శారీరక, మానసిక, ఉద్వేగ, భాష, జ్ఞానాత్మక, సామాజిక) అభివృద్ధిని పరిగణనలోనికి తీసుకొని మదింపు నిర్వహించాలి.
- బాలలు పాల్గోని వివిధ కృత్యాలు, క్రీడలను పరిశీలించడం ద్వారా వారి ప్రవర్తన, స్పందించే తీరును నిరంతరం గమనిస్తూ నమోదుచేయడం 4½ సంవత్సరాలకు పైబడ్డ వారికి తగిన వర్క్‌షీట్స్ ద్వారా గూడా ప్రగతిని పరిశీలించవచ్చు.
- బాలల నిరంతర ప్రగతి అధ్యయనంలో బృందాలుగా నిర్వహించి, చర్చించి ఒక నివేదికను తయారుచేసి, బాలల తల్లిదండ్రులతో పంచుకోవచ్చు.
- నిరంతర ప్రగతి అధ్యయనంలో భాగంగా చిన్న సమూహాలను ఏర్పరచి పరిశీలించడం ద్వారా బాలల ప్రత్యేక అవసరతలను గుర్తించవచ్చు. తదునుగుణంగా వారి ప్రగతికై ప్రత్యేక దృష్టిని సాధించడం సాధ్యమవుతుంది.

**5.2.1 పిల్లల ప్రగతి మదింపు (సామర్థ్యాల అంచనా) సాధనాలు:**

1. చెక్‌లిస్ట్
2. రేటింగ్ స్కేలు
3. ప్రొఫైల్
4. పోర్ట్‌ఫోలియో
5. టీచర్స్ డైరీ
6. అనెక్డోటల్ రికార్డ్

**1. చెక్‌లిస్ట్ :**

'పూర్వబాల్యదశలో పిల్లల సామర్థ్యాన్ని అంచనా వేయటానికి చెక్‌లిస్ట్ ఒక సాధనం. ఉపాధ్యాయుడు నిర్వహించిన వివిధ కార్యక్రమాలను / పనులను మదింపు చేసుకోవడానికి ఉపయోగపడేదే చెక్‌లిస్ట్. చెక్‌లిస్ట్ తయారుచేసేటప్పుడు ఉపాధ్యాయులు విషయంపట్ల పూర్తి అవగాహనతో ఉండి ఆశించే లక్ష్యము నిర్ధిష్టమైనదిగా ఉంచుకోవాలి. ఒక అంశం పట్ల పిల్లల ప్రవర్తన ధనాత్మకంగా ఉందా? లేదా ఋణాత్మకంగా ఉందా? అనేది తెలుసుకోవడానికి చెక్‌లిస్ట్ ఉపయోగపడుతుంది. (చెక్‌లిస్ట్ నమూనాను పరిశీలించండి)

## అభివృద్ధి స్థాయిలను తెలియజేసే చెక్‌లిస్ట్

### చెక్‌లిస్ట్ నమూనా

బాలిక / బాలుని పేరు: పుట్టిన తేది: వయస్సు:

| అంశం | పూర్వపరిశీలన | | | మధ్యస్థాయి పరిశీలన | | | అంత్యస్థాయి పరిశీలన | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఉదా: భాషా సంసిద్ధత, భావవ్యక్తీకరణ | సాధారణంగా | ఎల్లప్పుడు | ఎప్పుడు లేదు | సాధారణంగా | ఎల్లప్పుడు | ఎప్పుడు లేదు | సాధారణంగా | ఎల్లప్పుడు | ఎప్పుడు లేదు |
| 1. తన పేరు పిలిచినప్పుడు బదులు చెప్పగలగడం | | | | | | | | | |
| 2. చిన్న చిన్న ఆదేశాలను యాదృచ్ఛికంగా అమలుపరచ గలగలడం | | | | | | | | | |
| 3. పూర్తి వాక్యాల్లో సమాధానాలు చెప్పగలగడం. | | | | | | | | | |
| 4. తన అవసరాలను మాటల్లో తెలియపరచడం. | | | | | | | | | |
| 5. బహువచనాలు మరియు లింగభేదాలను గుర్తించి మాటల్లో ఉపయోగించగలగడం. | | | | | | | | | |
| 6. సంఘటనలను జరిగిన క్రమంలో చెప్పగలగడం | | | | | | | | | |
| 7. ఎప్పుడు, ఏమిటి, ఎలా అని ప్రశ్నించగలగడం. | | | | | | | | | |
| 8. సమాన వ్యతిరేకాలను అర్థం చేసుకోగలగడం. | | | | | | | | | |
| 9. కథా విషయాలను చెప్పగలగడం. | | | | | | | | | |
| 10. పూర్వపఠన, పూర్వలేఖన నైపుణ్యాలను ప్రదర్శించడం | | | | | | | | | |

**2. రేటింగ్ స్కేల్** (Early Learners Observation Rating Scale) (ELORS) :

పిల్లల సామర్థ్యాన్ని అంచనావేయటానికి రేటింగ్ స్కేల్ ఉపయోగిస్తారు. రేటింగ్ స్కేల్‌లో 5 పాయింట్‌స్కేలు, 3 పాయింట్‌స్కేలు ఉంటాయి. వీటిద్వారా పిల్లల స్థాయిని అంచనావేసి ఉపాధ్యాయుడు పిల్లల సామర్థ్యాల ప్రగతి స్థాయిని బట్టి ఏమేమి చేయాలో నిర్ణయించుకోవడానికి అవకాశముంటుంది. ఉదాహరణకు పిల్లల గ్రహణశక్తిని రేటింగ్ స్కేల్ ద్వారా అంచనావేయుటకు క్రింది విధంగా మదింపు చేయాలి.

**రేటింగ్ స్కేలు నమూనా**

విద్యార్థి పేరు : పరిశీలించిన తేది :

| క్ర.సం. | అంశం: గ్రహణశక్తి | Excellent | Very good | Good | Average | Dull |
|---|---|---|---|---|---|---|
| 1. | జతపరచడం | | | | | |
| 2. | గ్రూపులుగా చేయగలగడం | | | | | |
| 3. | వరుసక్రమంలో అమర్చడం | | | | | |
| 4. | స్థానాలను గుర్తించగలగడం | | | | | |
| 5. | బొమ్మలను గీయగలగడం | | | | | |
| 6. | కాలాన్ని గుర్తించగలగడం | | | | | |
| 7. | ఒక పనిమీద దృష్టిని కేంద్రీకరించగలగడం | | | | | |
| 8. | అంకెలను గుర్తించగలగడం | | | | | |

**3. సంఘటన రచన** (Anecdotal Record) :

పిల్లలకు సంబంధించి ఒక సంఘటన లేదా సన్నివేశం గురించి రికార్డు చేయడాన్నే సంఘటన రచన అంటారు. పిల్లలు కొన్ని సందర్భాలలో ఆశ్చర్యపరిచే రీతిలో ప్రవర్తిస్తారు. అది అనుకూలంగానైనా లేదా ప్రతికూలంగానైనా ఉండవచ్చు. ఇలాంటి విశేష ప్రతిభ కనబరిచే సంభాషణ లేదా సందర్భాన్ని రికార్డు చేసి ఆ ప్రతిస్పందన తీరును పరిశీలించడానికి అనెక్టోడల్ రికార్డ్ సహాయపడుతుంది.

ఉదా : Anecdotal Record

Date:......................

Time: ................ ....

Place: ....................

Name of the student : Class :

| Occassion & Place | A factual account of the incident (or) situation | Teacher Comment |
|---|---|---|
| సందర్భం & స్థలం | | |
| | | |

**సంఘటన రచన నమోదులో గమనించాల్సిన అంశాలు:**

- సందర్భానికి కనీసం 15 నిమిషాల నుంచి 20 నిమిషాలపాటు గమనించి నమోదుచేయాలి.
- నమోదు చేయగల అంశాలను వెంటనే నమోదు పొందుపరచాలి.
- ఏకాంతంగా వున్నప్పుడు, సమూహంలోను, జట్టుగాను, తరగతి గదిలో, తరగతి బయట, విద్యార్థి తీరును పరిశీలించి నమోదుచేయాలి.
- అన్ని అభివృద్ధి రంగాల (శారీరక, మానసిక, ఉద్వేగ, సామాజిక, జ్ఞానాత్మక) నైపుణ్యాలను, స్థాయిలను గమనించి నమోదుచేయాలి.
- నమోదు చేసిన అంశాలను భద్రపరచాలి, వాటిని అందుబాటులో వుంచాలి.
- సాధ్యమైనంతవరకు సహజ వాతావరణంలో పరిశీలనాంశాలను గమనించి నమోదు చేయాలి.
- పరిశీలించిన అంశాలకు తగిన ఆధారాలను, వాటి ఆధారంగా నిర్ధారించిన విధానాన్ని నమోదు చేయాలి.

**4. పోర్ట్ ఫోలియో :**

విద్యార్థులు చేసిన కృత్యాలను, పనితీరు వివరాలను సేకరించి సంకలనం చేసి భద్రపరుచుటయే పోర్ట్‌ఫోలియో.

- ఇందులో పిల్లవాడి పేరు వ్యక్తిగత వివరాలుంటాయి.
- పిల్లలు సాధించిన అసాధారణమైన ప్రగతి నమోదు చేయబడుతుంది.
- ప్రత్యేక సంఘటనలు, కళలు, బొమ్మలు గీయటం, సామూహిక కృత్యాలు, పాటలు, ఆటలు మొదలైన సందర్భాలలో విశేషమైన ప్రగతిని ఆశ్చర్యం కలిగించే రీతిలో ప్రదర్శించినపుడు పోర్ట్‌ఫోలియోలో రికార్డు చేయాలి.

**5. టీచర్ డైరీ :**

ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా డైరీ రాయాలి. ఉపాధ్యాయుడు తరగతిగదిలో లేదా తరగతి బయట కృత్యాలను నిర్వహించిన తర్వాత విద్యార్థుల ప్రతిస్పందనను, కొందరు పిల్లల విశేష ప్రతిస్పందనను, అలాగే కొందరి పిల్లల అవగాహనా లోపాలను నమోదుచేయాలి. పిల్లల సామర్థ్యాలను మదింపుచేసి నమోదు చేసుకోవటానికి, అందుకనుగుణంగా ఉపాధ్యాయుడు తన బోధనా వ్యూహాలను మార్చుకోవటానికి టీచర్ డైరీ ఉపాధ్యాయునికి రోజువారీగా ఉపయోగపడే సాధనం.

**టీచర్ డైరీలో నమోదు చేయాల్సిన అంశాలు**

ఉదా: ఉపాధ్యాయులు తమ స్వీయ మూల్యాంకనంలో పిల్లల ప్రగతి నమోదుకై గమనించాల్సిన అంశాలు

1. ఏ ఏ కృత్యాలలో పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు? ఎందుకు?
2. ఏ ఏ కృత్యాలలో పిల్లలు చురుగ్గా పాల్గొనలేదు? ఎందుకు?

3. ఎంతమంది పిల్లలు నేర్చుకోగలిగారు?
4. ఎంతమంది పిల్లలు మీ సహాయం అవసరమైంది?
5. బోధనాభ్యసన ఉపకరణాల ప్రభావం ఎలావుంది?

**6. ప్రొఫైల్ :**

పిల్లలు సాధించిన ప్రగతిని ప్రదర్శించే నివేదిక ప్రొఫైల్. పిల్లల ప్రొఫైల్ ప్రతి పిల్లవాడికి ప్రత్యేకంగా నిర్వహించబడుతుంది. ఇందులో పిల్లవాడి ఫోటోతోపాటు వ్యక్తిగత సమాచారం, ఆసక్తులు, అభిరుచులు, అలవాట్లు ఉంటాయి.

**ప్రొఫైల్‌లోని అంశాలు:**

- పిల్లల వ్యక్తిగత సమాచారం / కుటుంబ సమాచారం
- ఆహారపు, ఆరోగ్య విషయాలు, అభిరుచులు, ఆసక్తులు, వైఖరులు
- ఉద్వేగపరమైన ప్రవర్తన విషయాలు, కుటుంబ ఆర్థికపరిస్థితి, సామాజిక నేపథ్యం, కుటుంబంలో అందుబాటులో ఉండే సౌకర్యాలు.
- విశేష ప్రతిభ కనబరచిన సందర్భాలు
- జట్టుపనిలో పాల్గొనే తీరు మొదలైనవి.

## 5.3 పిల్లల ప్రగతి నమోదు (Reporting Children's Progress):

పిల్లల సమగ్ర మదింపు (సంకల్పిత మరియు సహజ) ద్వారా వచ్చిన ఫలితాలను ప్రతి ఉపాధ్యాయుడు నమోదుచేసి నివేదిక తయారుచేయవలసి ఉంటుంది. పిల్లల శారీరక, మానసిక, సాంఘిక ఉద్వేగాలను, వికాసాలను మదింపు చేయాలి. వివిధ మదింపు సాధనాలను అనగా చెక్‌లిస్ట్, రేటింగ్ స్కేల్, ప్రొఫైల్, టీచర్ డైరీ, అనెక్డోటల్ రికార్డులను పరిశీలించి సమాచారం సేకరించి ఒక క్రమపద్ధతిలో ప్రతి పిల్లవాడికి ప్రత్యేకంగా నివేదికలు తయారు చేసుకోవాలి. ఈ నివేదికలు ఉపాధ్యాయులకు, ముఖ్యంగా తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడతాయి. విద్యార్థుల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలను వివిధ సాధనాల ద్వారా మదింపు చేసి సేకరించిన సమాచారాన్ని ప్రగతిపత్రంలో నమోదుచేయాలి (Progress Report). ఉపాధ్యాయులు, పిల్లలు నేర్చుకొనేటప్పుడు, జట్టుపనిలో పాల్గొనేటప్పుడు, చర్చల్లో పాల్గొనేటప్పుడు వివిధ విషయాలపై వారు కనబరిచే ప్రతిభ, ప్రగతులను మదింపుచేసి ప్రగతిపత్రంలో నమోదుచేయాలి.

**పిల్లల ప్రగతి నివేదిక:**

ఒక సంవత్సర కాలంలో ప్రగతిని నిర్దిష్ట కాల వ్యవధిలో ఆయా రంగాలలోని నైపుణ్యాలను మదింపుచేసి, వాటిని నమోదుచేసి ఆ వివరాలన్నింటిని ఒకచోట చేర్చి రికార్డు రూపంలో నిలువ వుంచుతూ భద్రపరచే నివేదిక "ప్రగతి పత్రం" (Progress Card) అని చెప్పవచ్చు.

**5.3.1 పిల్లల ప్రగతిపత్రాన్ని నిర్వహించుటలో పాటించవలసిన అంశాలు :**

1. విద్యాప్రణాళిక అంశాలన్నింటిలోనూ విద్యార్థుల స్థాయిని, నిర్ధారించి ప్రగతిపత్రంలో నమోదుచేయాలి.
2. పిల్లల ప్రగతిపత్రాన్ని తరగతి ఉపాధ్యాయుడు నిర్వహించాలి.
3. ప్రగతిపత్రంలో పిల్లల సమగ్ర సమాచారము అనగా శారీరక పెరుగుదల, మానసిక పెరుగుదల, ఉద్వేగాల పరిణతి, ఆరోగ్యవిషయాలు, పిల్లల హాజరు మొదలైన అంశాలు నమోదుచేయాలి.
4. ప్రగతిపత్రాలను తల్లిదండ్రుల పరిశీలన నిమిత్తం పంపాలి.
5. తల్లిదండ్రుల సమావేశంలో ఈ ప్రగతిపత్ర సమాచారం ద్వారా, పిల్లల వికాసాభివృద్ధిని వివరించాలి.
6. ఉపాధ్యాయులు Progress Report ల ఆధారంగా పిల్లలను అంచనావేసుకొని అందుకనుగుణంగా సవరణాత్మక బోధనవ్యూహాలు రచించుకోవాలి.
7. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రగతిని విశ్లేషించుకొని ఏయే సామర్థ్యాలలో తమ సహకారం అవసరమో తెలుసుకొని ఉపాధ్యాయులకు సహకరించాలి.
8. ఉపాధ్యాయులు పిల్లల ప్రగతిపై తమ అభిప్రాయాన్ని ధనాత్మకం (Positive) గా రాయాలి. మరింత మెరుగుకు సూచనలు చేయుటకు సమావేశాలకు రావాలని తల్లిదండ్రులను కోరాలి. ఎట్టి పరిస్థితులలోను ఋణాత్మక (Negative) అర్థం వచ్చేలా నివేదికలో పేర్కొనరాదు.
9. పిల్లల ప్రగతిని తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యక్షంగా ప్రదర్శించాలి, చర్చించాలి. తల్లిదండ్రులచే మాట్లాడింప జేయాలి. అవగాహన కొరకు నమూనా ప్రగతి పత్రాన్ని పొందుపరచాలి.

**Sample Report Card**

(3-4 Years)

Name of the Child ______________________________ Sex ________

Age ______________________ Number of days present ________________________

**Physical and Motor Development**

- Large muscle coordination — Good / Average / Poor
- Fine muscle coordination — Good / Average / Poor
- Activity level — Very active / Active / Not so active
- Personal cleanliness — Good / Average / Poor
- Gain in height ____________________________
- Gain in weight ____________________________

**Personality Trails**

Self-reliant _____________ Confident ____________ Friendly and cooperative__________

Aggressive _______________ Timid ______________ Negative ______________________

**Language Development**

- Speaks clearly Yes / No
- Speaks correctly Yes / No
- Speaks fluently Yes / No
- Mixes language Yes / No
- Vocabulary Good / Average / Poor
- Follow instructions correctly Yes / No

**Intellectual Development**

- Pre-number concepts Good / Average / Poor
- Concept of colour Good / Average / Poor
- Concept of shape Good / Average / Poor
- Knowledge or environment Good / Average / Poor

**General Remarks**

- Child's special abilities ____________________

  ____________________
- Areas that need more attention ____________________

  ____________________

Date: Signatutre of the Teacher / ECE Worker

**Sample Report Card**

(4-6 Years)

Name of the Child____________________________________ Sex ________

Age ______________________ Number of days present ________________________

**Physical and Motor Development**

- Large muscle coordination Good / Average / Poor
- Fine muscle coordination Good / Average / Poor
- Activity level Very active / Active / Not so active
- Personal cleanliness Good / Average / Poor
- Gain in height ____________________
- Gain in weight ____________________

**Personality Trails**

Self-reliant ______________ Confident _____________ Friendly and cooperative___________

Aggressive _________________ Timid ______________ Negative ______________________

**Language Development**

- Speaks clearly Yes / No
- Speaks correctly Yes / No
- Speaks fluently Yes / No
- Mixes language Yes / No
- Vocabulary Good / Average / Poor
- Listening Comprehension Good / Average / Poor
- Reading readiness Good / Average / Poor
- Writing readiness Good / Average / Poor

**Intellectual Development**

- Memory Good / Average / Poor
- Sequential thinking Good / Average / Poor
- Concept of number Good / Average / Poor
- Order of numbers Good / Average / Poor
- Recognition of number symbols Good / Average / Poor
- Concept of colour Good / Average / Poor
- Concept of shape Good / Average / Poor
- Concept of Space Good / Average / Poor
- Knowledge of environment Good / Average / Poor
- Creativity Good / Average / Poor

**General Remarks**

- Child's special abilities ___________________________

___________________________

- Areas that need more attention ___________________________

___________________________

Date: Signatutre of the Teacher / ECE Worker

## 5.4 పాఠశాల మరియు గృహం మధ్య సంబంధాన్ని ఏర్పరచటం
## (Ensuring home and school linkage)

గృహానికి, పాఠశాలకు మధ్య అవినాభావ సంబంధమున్నది. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనది. పిల్లలకు మొదటి గురువులు తల్లిదండ్రులే. కుటుంబం ద్వారానే పిల్లల్లో నైతిక, సాంఘిక, సాంస్కృతిక విలువలు పెంపొందించబడతాయి. తల్లిదండ్రుల యొక్క వైఖరులు, సంభాషణలు, వ్యక్తిత్వం పిల్లలపై చెరగని ముద్ర వేస్తాయనటంలో సందేహం లేదు. సమవయస్కులతో, సమాజంతో సర్దుబాటు చేసుకొనే విధానాలు కుటుంబంనుంచే పిల్లలు నేర్చుకుంటారు. పిల్లల్లో శారీరక, మానసిక, భావోద్వేగ అంశాలలో దేనిలోనైనా పరిణతి సాధించలేకపోతే అది వారి తర్వాత భవిష్యత్‌పై సమస్యలకు దారితీస్తుంది. ఈవిధమైన లోటును భర్తీచేయుటకు ECCE కార్యక్రమాలు సహకరిస్తాయి. ECCE లో నిర్వహించే కార్యక్రమాలను, అనుకొన్న విద్యాలక్ష్యాలను సాధించాలంటే తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరిగా వుండాలి.

ECCE కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతంగా అమలుకావటానికి గృహంతో సత్సంబంధాలను కొనసాగించటానికి జాతీయ బాలుర సంరక్షణ విద్యాప్రణాళిక ((NECCECF-2013) క్రింది సూచనలు చేసింది.

**NECEF-2013 సూచనలు**

- పిల్లలను ప్రేమగా చూడాలి. వారికి భద్రతను కల్పించాలి. తద్వారా వారి నుండి ప్రేమను పొందాలి.
- పిల్లలను ఇతర పిల్లలతో పోల్చరాదు.
- వారికున్న ప్రతిభను గుర్తించాలి.
- పిల్లల శారీరక, ఆరోగ్యవంతమైన అవసరాలు తీర్చుట, పౌష్టికాహారం అందించడం, మంచి ఆరోగ్య, ఆహారపు అలవాట్లు పెంపొందించాలి. వివిధ కృత్యాల నిర్వహణ ద్వారా వారిని పాఠశాలకు సంసిద్ధుల్ని చేయాలి. ఆటలు, పాటలు, కథలు మొదలైనవాటిద్వారా వారిలో ఉత్సాహాన్ని నింపాలి.
- వారి వయస్సు, సామర్థ్య స్థాయిలను బట్టి ఆటవస్తువులు, బొమ్మలు, పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.
- వారు చెప్పేది ఓపికగా వినడం, వారితో ఓపికతో సంభాషించడం చేయాలి.
- వారడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం ద్వారా వారిలో తెలుసుకోవాలనే కుతూహలం పెంపొందించాలి.
- పరిసరాలతో ప్రేరేపించబడుతూ స్వేచ్ఛగా, ఏవిధమైన భయం లేకుండా అభ్యసన కొనసాగించేలా చేయాలి.
- గృహంలో/పాఠశాలలో వస్తువుల అమరికలో, చిన్నచిన్న పనులలో పిల్లలను భాగస్వామ్యులను చేయాలి.
- కథలు, చారిత్రక సంఘటనలు, పాటలు పాడించడం ద్వారా వారిలో నైతికవిలువలు, సాంస్కృతిక, సాంప్రదాయాలు అలవర్చుకొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయాలి.

- తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో వివిధ సందర్భాలలో సంభాషించడం ద్వారా పిల్లల ప్రగతిని, వారి సమస్యలను తెలుసుకోవాలి.
- ECCE నిర్వహించే కార్యక్రమాలలో తల్లిదండ్రులు విధిగా పాల్గొనాలి.
- ECCE కేంద్రాల నిర్వహణలో తల్లుల కమిటీ కొంత సమయాన్ని కేటాయించాలి. అనగా మధ్యాహ్న భోజన సమయం, పౌష్టికాహారం ఇచ్చేటప్పుడు, టీకా మరియు ఇతర మందులు వేసేటప్పుడు తల్లిదండ్రులు పిల్లలకు చేరువలో ఉండాలి.
- ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు మరియు పిల్లలు నిర్ణయాలు తీసుకొనేలా కొన్ని అవకాశాలు కల్పించాలి.
- తల్లిదండ్రులు తాము చేయని పనులు పిల్లలు చేయాలని వారిపై ఒత్తిడి చేయరాదు.
  ఉదా : రాత్రి సమయంలో తల్లిదండ్రులు బ్రష్ చేసుకోకుండా పిల్లలు బ్రష్ చేసుకోవాలని చెప్పకూడదు.
- ఉపాధ్యాయులు పిల్లల ప్రగతిని మరియు భవిష్యత్‌లో ECCE కేంద్రంలో నిర్వహించబోయే కార్యక్రమాల వివరాలను తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి.

### 5.4.1 గృహము - పాఠశాల సంబంధమును ఏవిధంగా పెంపొందించవచ్చు?

(Relationship in between time and school)

- తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం.
- తల్లిదండ్రులను పాఠశాల / ECCE లో జరిగే కార్యక్రమాలకు, సెమినార్లకు, విజ్ఞాన, విహారయాత్రలకు, జాతీయ కార్యక్రమాలకు ఆహ్వానించడం.
- తల్లిదండ్రులు ఆహ్వానించే వివిధ కార్యక్రమాలకు ఉపాధ్యాయులు హాజరుకావడం.
- బాలమేళ, బాలోత్సవ్ పాఠశాలలో నిర్వహించడం. ఈ కార్యక్రమాలకు తల్లిదండ్రులను ఆహ్వానించడం.
- ECCE విద్యాప్రణాళిక రూపకల్పనలో తల్లిదండ్రులను ఆహ్వానించడం, వారి సూచనలను స్వీకరించడం.
- పిల్లల, తల్లిదండ్రుల సమీక్ష సమావేశాలలో పిల్లల ప్రగతిని చర్చించడం.
- కేంద్రంలో నిర్వహించే కౌన్సిలింగ్, ఆరోగ్య కేంద్రాలకు తల్లిదండ్రులను ఆహ్వానించడం.
- ECCE ద్వారా నిర్వహించే సామాజికసేవా కార్యక్రమాల్లో తల్లిదండ్రులను భాగస్వాముల్ని చేయడం.
- గృహ సందర్శనాల ద్వారా కుటుంబ అంతర్గత అవసరాలను గుర్తించి అవగాహన చేసుకోవడం.

### 5.4.2 గృహము - పాఠశాల సంబంధాలు ప్రయోజనాలు (Benefits of home and school relation) :

గృహము, పాఠశాల మధ్య సహసంబంధం ద్వారా పాఠశాల అభివృద్ధి వీలుపడుతుంది. ఉపాధ్యాయులు తమ విద్యాపరమైన ప్రగతిని (Academic Performance) ప్రదర్శించటానికి, ఇంకా మెరుగుపరచటానికి దోహదపడుతుంది.

**ప్రయోజనాలు :**

- తల్లిదండ్రులకు తమ పిల్లల గురించి ఇతరులకంటే ఎక్కువగా తెలుస్తుంది. పాఠశాలతో ఉన్న సంబంధం ద్వారా తమ పిల్లల గురించిన సమాచారాన్ని ఉపాధ్యాయులకు ఇవ్వగలరు. ఇది తమ పిల్లల అభివృద్ధికి తోడ్పడుతుంది.

- తల్లిదండ్రులకు పాఠశాలపై సదాభిప్రాయం ఏర్పడటానికి ఉపయోగపడుతుంది.
- పాఠశాల గురించి తల్లిదండ్రులు, అలాగే తల్లిదండ్రుల గురించి పాఠశాల తెలుసుకోవటానికి ఉపయోగపడుతుంది.
- స్థానికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి వీలవుతుంది.
- పాఠశాలలో వసతుల పెంపుకు తల్లిదండ్రుల సహకారం కోరవచ్చు.
- పిల్లలకు నాణ్యమైన విద్యను అందించుటకు, ఉపాధ్యాయులపై మరింత బాధ్యతను పెంచుటకు వీలుపడుతుంది.

**ముఖ్యాంశాలు:**

1. ప్రారంభ అభ్యసనం అనగా మదింపు, మదింపు ఎందుకు, మదింపు ప్రక్రియలో అనుసరించాల్సిన మార్గదర్శక సూత్రాలను అవగాహన చేసుకున్నాము.
2. ప్రారంభ అభ్యసనంలోని ప్రగతిని మదింపు చేయడానికి వివిధ వికాంశాలైన శారీరక ఆరోగ్యం – చలన వికాసాభివృద్ధి, సాంఘిక మరియు భావోద్వేగ, భాషాభివృద్ధి, అక్షరజ్ఞాన, జ్ఞానాత్మక, గణిత, శాస్త్రీయ, సాంఘిక మరియు సృజనాత్మక అభివృద్ధి ప్రమాణాలను అధ్యయన ప్రాముఖ్యతను గుర్తించాము.
3. బాలల వికాసాభివృద్ధి ప్రమాణాల మేరకు, వారి ప్రగతిని మదింపు చేయడానికి తగిన మదింపు సాధనాలైన, చెక్‌లిస్ట్, రేటింగ్‌స్కేల్, ప్రొఫైల్, పోర్ట్‌ఫోలియో, టీచర్స్‌డైరీ, అనెక్టోడల్ రికార్డ్ వాటి నమూనాలను గూర్చి తెలుసుకున్నాం.
4. బాలల ప్రగతి నమోదు, నమోదు చేయడంలో పాటించాల్సిన అంశాలను గుర్తించాము.
5. పాఠశాల – గృహ సంబంధ ప్రాముఖ్యతను, ఎన్.ఇ.సి.సి.ఇ.–2013 ప్రతిపాదించిన సూచనల అవసరతను తెలుసుకున్నాము.
6. గృహము పాఠశాల సంబంధమును ఏవిధంగా పెంపొందించవచ్చు. అవి బాలల వికాసానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చుతాయో అర్థంచేసుకున్నాము.

QW2YCZ

## మూల్యాంకనం

### వ్యాసరూప ప్రశ్నలు

1. మదింపు అనగానేమి? పిల్లల ప్రగతిని ఎందుకు మదింపు చేయాలి?
2. వివిధ వికాస రంగాలలో పిల్లలు తప్పనిసరిగా సాధించవలసిన ప్రమాణాలేవి?
3. పిల్లల ప్రగతి పరిశీలనకు ఉపయోగించే వివిధ మదింపు సాధనాలను వివరించండి.
4. పిల్లల ప్రగతి నివేదిక అంటే ఏమిటి? ప్రగతిపత్రంలో పాటించాల్సిన నియమాలేమిటి?
5. పాఠశాల / ECCE గృహం మధ్య గల సంబంధమేమిటి? పిల్లల ప్రగతికి ఇది ఏవిధంగా ఉపయోగపడుతుంది?
6. "పాఠశాల మరియు గృహం మధ్య సంబంధం అవసరం. ఈ సంబంధాన్ని కొనసాగించడానికి ఎన్.ఇ.సి.సి.ఇ.-2013 సూచించిన సూచనలను వివరించండి.

### లఘు సమాధాన ప్రశ్నలు

6. అనెక్డోటల్ రికార్డు అంటే ఏమిటి? పిల్లల ప్రగతి మదింపులో ఇది ఏవిధంగా ఉపయోగపడుతుంది?
7. పిల్లల ప్రగతి పెంపుదలకు గృహం-పాఠశాల సంబంధాలు ఏవిధంగా ఉపయోగపడతాయి?
8. గృహము-పాఠశాల / ECCE కేంద్రాల మధ్య సంబంధాలు మెరుగుపరచడానికి నీవు చేసే సూచనలు ఏమిటి?

### ప్రాజెక్టు పని

1. మీ దగ్గరలోని ECCE కేంద్రాన్ని సందర్శించి పిల్లల ప్రగతిని మదింపుచేసి ఒక నివేదికను తయారుచేయండి.
2. తల్లిదండ్రుల సమావేశాలు జరుగుతున్నపుడు ECCE కేంద్రాన్ని సందర్శించి ఆ సమావేశంనందు చర్చించిన, తీసుకున్న నిర్ణయాలపై ఒక నివేదికను తయారుచేయండి.

**Reference Books :**


1. Examples Guidelines for implementation of ECCE Curriculum - NCERT
2. Position Paper on ECCE - NCERT, 2006
3. చిన్నారుల వికాస కేంద్రం ECE / అంగన్‌వాడి కార్యక్రమ శిక్షణా దీపిక, SSA , A.P, Hyderabad.
4. NCERT - Early Childhood Education Programme by Venita Kaul - 2009.